
పత్రికలు - ప్రసార మాధ్యమాలు

తెలుగు

డా. జె. చెన్నయ్య



1

పత్రికలు-ప్రసార మాధ్యమాలు

తెలుగు

డా॥ జె.చెన్నయ్య

2

పత్రికలు-ప్రసార మాధ్యమాలు
తెలుగు

డా॥ జె.చెన్నయ్య

ప్రథమ ముద్రణ : 2010

ప్రతులు : 1000

ముఖచిత్రం : **చంద్ర**

వెల : రూ.100/-

ప్రతులకు:

జె. వసంత్, ప్లాట్ నం. 92, జయభేరి విజయలక్ష్మిహోమ్స్,


మోతీనగర్, సనత్‌నగర్, హైదరాబాద్ - 18

ఫోన్ : 040-23831035, సెల్ : 9642048932

విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో

3

అంకితం



కూతురు, అల్లుడు, మనవరాలు
చైతన్య, మహేశ్, సంస్కృతిలకు

విషయసూచిక

నా ఆలోచనలు పంచుకుందామనే....

భాష ఎప్పుడు పుట్టిందోగాని ఈనాడు ఇంత విస్తృతరూపం ధరించి ప్రజాసామాన్యానికి ఇంతగా అనుభవంలోకి రావడం, వారి సమాచార, వినోదావసరాలు తీర్చడం మాత్రం విప్లవమే. గడచిన పాతికేళ్ళలో ప్రపంచీకరణతోపాటే ఈ విప్లవం పుట్టి పెరిగింది. చాలా మంచి పరిణామం కూడా. అయితే భాషను ప్రజాప్రయోజనం కోసం ఉపయోగించాల్సిన కర్తవ్యం కూడా మన మీద ఉంది. భాష అవసరం అనేక రెట్లుగా పెరుగుతూ, ఆ వేగాన్ని అందుకోవలసిన బాధ్యతను రచయితలపై ముఖ్యంగా పత్రిక, ప్రసార మాధ్యమాలలోని వారిపై పెంచుతూ వున్న ఈ తరుణంలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో ఆలోచించండి!

ప్రపంచీకరణ భాషపై విసురుతున్న సవాలు ఒక్కపెట్టున ఆంగ్లం, తదితర భాషా పదాలను మనమీదకు పంపడమే. ఇలా వచ్చిపడుతున్న పదాలను మన భాషలోకి తెచ్చుకొనే ప్రయత్నాలూ చెయ్యాలి. అదే సమయంలో మనపై దాడి చేస్తున్న అన్య భాషా సంస్కృతిపై ఉపేక్షాభావం విడనాడాలి. 20శాతంగా వున్న నగర ప్రజల సంస్కృతికే ప్రసార మాధ్యమాలు పట్టంగడుతున్నాయి. ఆ 20శాతం కూడా దిగుమతి అవుతున్న సరుకేగాని మనది కాదు. కాబట్టి మొత్తంగా మన భాష, మన సంస్కృతి ఇది కాదు. మన భాషలా, మన సంస్కృతిలా కనిపిస్తున్నది అంతే. ఈ అవగాహనతో భాషాపరమైన కొన్ని ఆలోచనల్ని పత్రికా, ప్రసార రచయితలతో పంచుకొనే ప్రయత్నమే ఈ రచన.

నేను పదేళ్ళపాటు పత్రికారంగంలో పనిచేసిన అనుభవంతో, స్నాతకోత్తర స్థాయిలో అటు తెలుగు భాషా సాహిత్యాల్లో, ఇటు పత్రికా రచన శాస్త్రంలో పట్టభద్రుడనైన ఫలితంగా లభించిన కొద్దిపాటి జ్ఞానం, పత్రికా పఠనానుభవం, అనువాదకునిగా సముపార్జించుకున్న అనుభవం ఈ రచనలో ప్రతిఫలించింది.

మన భాషను నేటి అవసరాలను తీర్చేస్థాయికి అభివృద్ధిపరచుకోవాలి. ఆయా రంగాల్లో ఎవరికి వారు కష్టపడుతూ ఆ అవసరాలను తీర్చే ప్రయత్నం చేస్తున్నారు. భాషావేత్తల కంటే పత్రిక, ప్రసార మాధ్యమాల రచయితలే నేటి భాషావసరాలను తీర్చే కృషిలో ఎక్కువగా భాగస్వాములవుతున్నారని నా అభిప్రాయం. అయితే వారికీ కొన్ని

పరిమితులున్నాయి. పత్రిక, ప్రసార రచయితల సందేహాలు తీర్చి వారికి దారిచూపే వ్యవస్థ ఒకటి నిత్య నూతనంగా పనిచేయాలి. కానీ అది లేదు. ఆ పని చేద్దామనుకునే వారికి నిధులు లేవు. వ్యక్తిగతంగా ఈ లోటును అందరూ పేర్కొంటారు. కాని ఎవరూ పూడ్చరు.

అన్నిటికీ మించి మరొక పెద్ద అగాధం ఈనాడు ఏర్పడుతున్నది. విద్యారంగం నుంచి మనం భాషాసేవకులను, రచయితలను ముఖ్యంగా పత్రికా, ప్రసార రచయితలను తయారు చేసుకోలేకపోతున్నాం. ఇది ఇలాగే కొనసాగితే ముందుముందు సమాచారాన్ని మాధ్యమాల ద్వారా ప్రజలకు అందజేసే కర్తవ్య నిర్వహణలో భాషాపరమైన అగాధం ఇంకా పెరుగుతుంది. మాధ్యమాల వారూ నిస్సహాయులవుతారు. ఈ నిస్సహాయతకు వారే కాదు మన ప్రభుత్వమూ, విశ్వవిద్యాలయాలు, తల్లిదండ్రులు అందరూ బాధ్యులవుతారు. ముఖ్యంగా ప్రభుత్వం మేల్కొని భాషా విధానాన్ని రూపొందించి విద్యారంగంలో తెలుగును తప్పనిసరి చేయకపోతే జరగబోయే నష్టం అపారంగా వుంటుంది.

ఈ అంశాలకు సంబంధించి ఇంతకంటే మంచి పుస్తకాలు ఇదివరకు వచ్చాయి. ఇక ముందు కూడా వస్తాయి. ఈ మధ్యలో నా ఆలోచనల్ని పత్రికా, ప్రసార రచయితలతో పంచుకుందామనే దీన్ని తీసుకువస్తున్నాను. ఇందులో నేను వ్యక్తీకరించిన అభిప్రాయాలు నా స్వంతం కావు. అందరిలాగే నేనూ తెలుగు ప్రపంచం నుంచి నేర్చుకున్నాను. ఎంతో మంది పరోక్షంగా ఈ అంశాలకు కర్తలు. వారందరికీ కృతజ్ఞతలు. అంతేగాక ఈ పుస్తకం రావడానికి తోడ్పడిన వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలుగును పరిరక్షించే పనిని ఒక ఉద్యమంగా చేస్తూ వస్తోంది. పరిషత్తు అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్, డాక్టర్ సి.నారాయణరెడ్డిగారి నేతృత్వంలో వారి వాత్సల్యపూరితమైన ఆశీస్సులతో పరిషత్తు వేదికపైన ఈ రచన ఆవిష్కృతం కావడం గౌరవంగా భావిస్తున్నాను. పుస్తకం రావడానికి విలువైన సలహాలను అందించిన శ్రీ ఎ.సుదర్శన్ రావు, శ్రీ ఐ.కృష్ణమోహన్‌లకు, చక్కగా ముద్రించిన 'సాయిలిఖిత ప్రింటర్స్' వారికి కృతజ్ఞతలు.

మీ

జె. చెన్నయ్య

భాషా పరిణామం-ఒక సమీక్ష

భాషలో 19, 20వ శతాబ్దాల్లో వచ్చినన్ని మార్పులు అంతకుపూర్వం రాలేదు. ప్రాచీన సమాజంలో భాష ప్రయోజనమే చాలా పరిమితం. పరిమితమైన భూభాగంతోనే ప్రజలకు పరిచయాలు, సంబంధాలు. భాష అంటేనే తనకు చుట్టూ ఉన్న అతి కొద్దిమందితో మాట్లాడుకోవడం. తర్వాత తమ కాలంలోని మంచినీ, తాము సముపార్జించిన గొప్ప అనుభవాల సారాన్ని, జ్ఞానాన్ని రానున్న తరాలకు అందించడం ఎలా అన్న తపన ఉదయించి లిపి కనుగొనడానికి దారితీసింది. సమాజ వికాసం, భాషా వికాసం, రెండూ పరస్పరాధారితాలు. లిపి కనుగొనడం అన్న పరిణామం ఆ భాషా ప్రాంతానికి చెందిన సమాజాల్లో ఒక ముందడుగుగా చెప్పుకోవాలి. లిపి ఏర్పడిన తర్వాత భాషలో వచ్చిన మార్పు అనూహ్యమైంది. స్వేచ్ఛగా తాము చెప్పదలచిన భావాలను, తమ జ్ఞానాన్ని అక్షరీకరించడానికి సాధనంగా నిలిచింది.

ఒకచేత ఇతర భాషల్లో వచ్చిన సారస్వతంలోంచి మనకు అవసరమనుకున్న దాన్నంతటినీ మన భాషలోకి తెచ్చుకోవడం ప్రారంభమైంది. మరొకచేత్తో మన మౌలిక ఆలోచనలతో సాహిత్యాన్ని, సమగ్రశాస్త్ర సంపత్తిని సృష్టించుకోవడం ప్రారంభమైంది. అయితే ఎంత గొప్ప పరిణామానికైనా పరిమితి వున్నట్లు... లిపి పుట్టుకతోనే ప్రయోజనాలన్నీ సిద్ధించలేదు. లిపి ఆధారంగా అక్షరాస్యత, వ్యక్తీకరణ సామర్థ్యం, రచనా విధానం... వీటన్నిటికీ మెరుగులు దిద్దుకోవడం ప్రారంభమైంది. ఆకలితో అలమటిస్తున్న మనిషికి ఎదుట ధాన్యరాశిని నిల్వచేసి, ఆ గృహానికి తాళం వేసిన పరిస్థితితో పోల్చవచ్చు. ధాన్యరాశి నిల్వలున్న గృహం లిపి అయితే, ఆ లిపిని అభివృద్ధి పరచుకొని, భాషా సామర్థ్యాన్ని, వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించుకొనే కీలకమే ఆ తాళం చెవి. మొత్తంమీద ఆ తాళం చెవిని ఉపయోగించి భాషా నిధులను కొల్లగొట్టిన అనుభవం తెలుగుకు కూడా వర్తిస్తుంది.

తెలుగు ప్రాచీనత

తెలుగుభాష చరిత్రను పరిశీలిస్తే క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటికే మూలద్రావిడ భాష ఉండేదని తెలుస్తున్నది. క్రీస్తుపూర్వం 1000 సంవత్సరాల నాటికి

మూలద్రావిడం నుంచి విడిపోయి ప్రత్యేక భాషగా రూపొందిందని ఆంద్రినో, భద్రిరాజు కృష్ణమూర్తి వంటి భాషావేత్తలు నిర్ధారించారు. క్రీ.శ.2వ శతాబ్దినుంచి శాసనాల్లో తెలుగు ఉనికి తెలుస్తున్నది. అమరావతి శాసనంలోని 'నాగబు' వంటి పదాలు అందుకు నిదర్శనాలు. లభ్యమవుతున్న తెలుగు సాహిత్యంలో 11వ శతాబ్దిలో నన్నయ ఆంధ్ర మహాభారతమే ఆదికావ్యం కాగా, ఆయన ఆదికవి అని కొందరి వాదన. కావ్యం వెలిసే కాలం వచ్చిందంటే అంతకుపూర్వమే తెలుగు జన వ్యవహారంలో ఒక స్థాయిలో వుందన్నమాట. నన్నిచోడుని వంటి తొలినాటి కవులు నన్నయకు కొంతముందో, కొంత తర్వాతనో ఉండి వుంటారనడంలో విప్రతిపత్తి ఏమీలేదు. మొత్తంమీద తెలుగు గురించి చెప్పుకోవలసి వచ్చినపుడు నన్నయ మహాభారతాంధ్రీకరణ ప్రయత్న కాలాన్నిబట్టి తెలుగు కావ్యభాషా ప్రతిపత్తిని అందుకుందన్న ప్రమాణం నిలిచిపోయింది. నన్నయ అవ్యవస్థితమైన తెలుగు శబ్దాలకు ఒక వ్యవస్థను ఏర్పరచి ఒక ప్రామాణికతను తీసుకువచ్చాడని కొందరు పండితులన్నారు. కానీ, నన్నయకు ముందునుంచే తెలుగు భాషకు ఒక వ్యవస్థ వుందని, గద్యపద్యసమన్వితమైన కావ్య భాష, తెలుగు వచన శాసనాల్లో కనిపించే వాడుక భాష, జన వ్యవహారంలోని భాష, జానపద సాహిత్య భాష... ఈ విధంగా నాలుగు రకాలైన భాషా స్రవంతి వున్నదని ఆధునికుల అభిప్రాయం. అయితే జన వ్యవహారంలోని భాష, జానపద సాహిత్య భాష ఇలా ఉండేవనడానికి ఆధారాలు లభ్యం కాలేదు. నన్నయకు ముందు కవులు, పండితులు తమ రచనకు ఉపయోగించిన భాషనే నన్నయ వాడి మహాభారతాన్ని తెనిగించారని విజ్ఞుల అభిప్రాయం.

11వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం మధ్య కాలంవరకూ వున్న ప్రాజ్నన్నయ యుగం ప్రధానంగా కవిత్రయ యుగమే. 16వ శతాబ్దం నుంచి వచన రచనలు కనిపిస్తున్నాయి. 15వ శతాబ్దపు ఉత్తరార్ధం నుంచి 16వ శతాబ్దపు పూర్వార్ధం మధ్య రాయల కాలంలో ప్రధానంగా ప్రబంధాల రచన సాగినట్లు కనిపిస్తుంది. ఆ కాలంలో కావ్యరచన తప్ప మరో రచనకు గౌరవం లేదు. శతకాలైనా, గణితశాస్త్ర గ్రంథాలైనా, తర్క, వ్యాకరణ, ఛందశ్శాస్త్రాలైనా పద్యాలే. చివరికి నిఘంటువులు కూర్చినా పద్యాల్లోనే. సంస్కృత నాటకాలు కూడా పద్యరూపంలోనే అనువదించేవారు.

క్రీ.శ.1520 ప్రాంతంలో అంటే శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుడైన కాలంలో విశ్వనాథ స్థానాపతి రచించిన 'రాయవాచకం' వచన రచనలకు నాంది పలికింది. అదే కాలంలో దక్షిణాంధ్ర నాయకరాజుల పాలన ప్రారంభమైంది. ఈ కాలంలో వచన రచనలు, యక్షగానాలు, దృశ్యకావ్యాలు పెద్దఎత్తున వచ్చాయి. దీంతో పద్యానికే తప్ప అన్య రచనకు

పరిగణన లేదన్న లాక్షణికుల ప్రాబల్యం అంతమైంది. జన వ్యవహారంలోని భాషకు గుర్తింపు లభించింది. రచనా గౌరవం సిద్ధించింది. సరిగ్గా ఈ కాలంలో పద్యశైలి అనేక విపరీత పోకడలుపోయి వచనావతరణకు స్వాగతం పలికినట్లయ్యింది. సామినేని ముద్దు నరసింహం 1840లో రచించిన 'హితసూచని'ని ఆయన అన్న కుమారుడు రంగప్రసాదనాయుడు 1862లో ముద్రించారు. అందులో సామినేని- వ్యావహారిక రచననే తాను ఎంచుకున్నట్లు రాస్తూ, సాధారణమైన భాషలో వాడుకలో వున్న గ్రామ్య పదాలు చాలామట్టుకు సరళమైన వాక్యరచనలో అంగీకరించదగ్గవిగా వున్నట్లు వివరణ ఇచ్చుకున్నారు.

భాష వచనరూపంలోకి ప్రవేశించిన కాలంలో చాలా ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు తెలుగు ముద్రణ ప్రారంభమైంది. ముద్రణ ఫలితంగా భాషాబాధ్యతలు విస్తరించాయి. సాహిత్య భాషగానే కాకుండా పత్రికారచనా భాషగా కూడా విస్తృతం కావాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆంగ్లేయుల పాలన దేశంలో స్థిరపడింది. దేశీయుల్లో ఆంగ్ల భాషపట్ల, ఆంగ్ల సాహిత్య అధ్యయనం పట్ల అనురక్తి ఏర్పడింది. ఆంగ్లేయుల పోకడలను అనుకరించే దృష్టి ఏర్పడింది. అప్పుడు ఆంగ్ల సాహిత్యంలోని అనేకానేక వినూత్న ప్రక్రియలను తెలుగులోకి తెచ్చుకోవాలన్న కోరిక కలిగింది. విద్యావిషయాలు, శాస్త్ర విజ్ఞానాది విషయాలను గ్రాంథిక భాషలో రాయడం కష్టమైంది. అప్పుడు ఇటు సంఘ సంస్కరణ, అటు భాషా సంస్కరణ ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

వ్యావహారిక ఉద్యమం

ప్రత్యక్ష పద్ధతిలో విద్యాబోధన ప్రవేశపెట్టిన గిడుగు రామమూర్తి విజ్ఞాన సముపార్జనకు పురాతన కావ్యభాష పనికిరాదని, సరళ గ్రాంథికం కూడా సరిపోదని, శిష్ట వ్యావహారిక భాషే ఈ లోటు పూడ్చగలదని ప్రచారం ప్రారంభించారు. గిడుగుకు గురజాడ బాసటగా నిలిచాడు. పండితులలో గ్రాంథిక వ్యావహారిక భాషాభేదాలవల్ల భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. నిష్ణాతులనుకున్నవారే గ్రాంథిక భాష సరిగా రాయలేకపోతున్నారని, ఇది ఎవరికీ కానిదిగా మారిపోయిందని, దీన్ని ఇక విస్మరించడమే మార్గమని నిరూపించారు. అన్ని రకాలైన రచనలకు శిష్ట వ్యావహారిక భాషే వాడాలని గిడుగు వాదాన్ని లేవదీయడంతో వ్యావహారిక భాషా ఉద్యమం మొదలైంది. 1910 తర్వాత వ్యావహారిక భాషావాదం ఉద్యమ రూపుదాల్చింది. 1910లో నూతన బోధన పద్ధతిని వివరించడానికి విశాఖలో సమావేశమైన

ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ... వ్యావహారిక రచనల్ని ప్రోత్సహించమని గిడుగు అభ్యర్థించాడు. గిడుగు వాదాన్ని గురజాడ సమర్థిస్తూ అదే సంవత్సరం 'గ్రామ్యశబ్ద విచారణ', 'వాడుక భాషా–గ్రామ్యమా' అనే వ్యాసాల్ని రాశాడు. దీంతో గ్రాంథికమా, వ్యావహారికమా... రెంటిలో ఏది కావాలి? అన్న వాదం తీవ్రమైంది.

1933 నవంబర్‌లో ప్రచురితమైన గిడుగువారి 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజా'నికి తెలికిచెర్ల వెంకటరత్నం సంపాదకీయ భూమిక రాస్తూ ఈ పుస్తక రచన ఉద్దేశాలను వివరించారు. ఆయా కాలాల్లో కవులు కొంతమందైనా శిష్ట వ్యవహారిక సిద్ధమైన భాషను తమ కావ్యాల్లో ప్రయోగిస్తూ వచ్చారని, నేటి రచయితలు కూడా వ్యావహారిక భాషలో గ్రంథాలు రాస్తే భాషా ప్రయోజనం నెరవేరుతుందని అన్నారు. నోటిమాటకు, చేతిరాతకు సామరస్యం కుదిరి ఒకదానికొకటి పోషకంగా ఉంటే భాష సహజంగానూ, సరళంగానూ, సుబోధకంగానూ, పరమ ప్రయోజనకారిగానూ వుంటుందని రాశారు. అంతేగాక పూర్వులు రాసిన పురాణ వచనాలు, దేశ చరిత్రలు, జనపద వృత్తాంతాలు, లక్షణ గ్రంథాలు, వ్యాఖ్యానాలు, టీకాలు, వివిధ శాస్త్ర గ్రంథాల శాసనాలు, కథలు మొదలైన

అన్నిరకాల రచనల్లోని వచనం వ్యావహారికంలోనే ఉందని ఆయన నిరూపించారు. గ్రాంథిక భాష అని మన పండితులు వ్యవహరిస్తున్నదాని స్వరూపం ఇదమిత్థమని నిర్ణయించడానికి వీలుకాదని తెలిపారు. గ్రాంథిక భాషలో నిర్దుష్టంగా రాసిన గ్రంథం మచ్చుకు ఒక్కటి కూడా లేదని, గ్రాంథిక భాష పండిత ప్రకాండులకైనా సాధ్యపడక ఇంత అవ్యవస్థంగా ఉందని, ఆ భాషలో స్వతంత్ర రచన చేయడం కష్టం అని అన్నారు.

1912లో మద్రాసు విశ్వవిద్యాలయం సెనేట్‌లో తమకున్న పలుకుబడితో గిడుగు, గురజాడ వ్యవహార భాషలో పాఠ్యగ్రంథాలుండవచ్చని ప్రభుత్వం నిర్ణయించేలా చేయగలిగారు. ఈ నిర్ణయం ప్రకారం సెట్టి లక్ష్మీనరసింహం రాసిన 'గ్రీక్పురాణం' అనే పుస్తకాన్ని స్కూలుఫైనల్ విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు. అయితే అది సంచలనమైంది. పుస్తకం అర్ధ గ్రాంథికమూ, కృత్రిమమైన వ్యావహారికమూ కావడంతో విమర్శలపాలైంది. వ్యావహారిక భాషోద్యమాన్ని బలపరిచి ముందుకు తీసుకుపోయినవారిలో గిడుగు, గురజాడతోపాటు పి.టి.శ్రీనివాసయ్యంగార్, ఏట్సు ముఖ్యులు. తమ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి విజయనగరంలో ఆంధ్ర సారస్వత సంఘాన్ని నెలకొల్పారు. కిళాంబి రామానుజాచార్యులు దీనికి అధ్యక్షులు కాగా బుర్రా శేషగిరిరావు కార్యదర్శిగా వున్నారు. అదే సమయంలో వెలువడిన శ్రీనివాసయ్యంగారి 'Life or Death-Aplia for vernaculers' అనే కరపత్రం గ్రాంథికాన్ని తీవ్రంగా నిరసించడంతో సనాతన పండితులు బాగా రెచ్చిపోయారు.

ఇక వ్యావహారిక భాషావాదాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ... గ్రాంథిక భాషను వదిలి వ్యావహారిక భాషను ఆశ్రయిస్తే సాహిత్యం భ్రష్టుపట్టిపోతుందని ఉద్యమించినవారిలో జయంతి రామయ్యపంతులు, వేదము వేంకటరాయశాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు ముఖ్యులు. తమ ఆశయాలను ప్రచారం చేయడానికి కాకినాడలో 'ఆంధ్రసాహిత్య పరిషత్తు' (Telugu Academy)ను నెలకొల్పారు. 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక'ను కూడా ప్రారంభించారు. కందుకూరి వీరేశలింగం అధ్యక్షతన 'గ్రామ్యదేశ నిరసన సభ'ను నిర్వహించారు. భాష... 'నాగర' 'గ్రామ్య' పేరిట రెండురకాలని, మొదటిది సంస్కృతంలాగా పరిష్కృతం కాబట్టి ఇది కావ్యరచనకు పనికివస్తుందని, రెండవది పామర వినోదార్థం పాత్రోచిత భాషగా అక్కడక్కడా వాడదగిందని అన్నారు. వ్యావహారిక రచనలు పాఠ్యగ్రంథాలు కారాదని ఆదేశించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. 'నన్నయ నుంచి కందుకూరి వరకు గ్రాంథిక భాష మారలేదు. పూర్వకవులంతా ఒకే భాష రాశారు. కాబట్టి గ్రాంథికంలో ఏకరూపత, ప్రామాణికత్వం

వున్నాయి. ఆధునికాంధ్ర భాషకు ప్రత్యేక స్థానం లేదు. ఈ వ్యావహారికానికి వ్యాకరణ సూత్రాలు లేవు. కాబట్టి పాఠ్యగ్రంథ రచనకు పనికిరాదు. పనికొచ్చేది గ్రాంథికం మాత్రమే' అన్నది వీళ్ల వాదన.

ఇలా ఉండగా 1912లో స్కూలుఫైనల్ విద్యార్థి ప్రాచీన, నవీన పాఠ్యగ్రంథాల్లో వేటినైనా చదవవచ్చునని బయ్యా నరసింహశర్మ అందజేసిన వినతిపత్రంపై మద్రాసు ప్రభుత్వం ఆదేశమిచ్చింది. గ్రాంథిక భాషావాదులకు లభించిన తొలి విజయమిది. మరింత వత్తిడి తీసుకొచ్చి విద్యార్థి ఇష్టం కాదు... పాఠశాల ఏది నిర్ణయిస్తే దాన్నే చదవాలని మరో ఆదేశాన్నీ తీసుకొచ్చారు. ఇది మలి విజయం. దీంతో గ్రాంథికవాదం మరింత పుంజుకుంది. గ్రాంథిక, వ్యావహారిక భాషావాదంపై 'ఆంధ్రపత్రిక', 'ది హిందూ' వాదోపవాదాలను ప్రచురించాయి. వాటిలో ఎక్కువగా గ్రాంథిక వాదానికి అనుకూలమైనవే. ఇంతలో మద్రాసు విశ్వవిద్యాలయం వారు దక్షిణాది భాషల్లో ఒకో భాషకు ఒకో కమిటీ వేశారు. తెలుగుభాషకు సంబంధించిన కమిటీలో ఎం.రంగాచార్యులు సమావేశకర్త కాగా కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, పి.టి.శ్రీనివాసయ్యంగార్, పి.రామరాయణింగారు, రెవరెండ్ జె.ఆర్.స్టిల్‌వెల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీవారు సమావేశాలు జరిపి చివరికి ఇంటర్మీడియెట్ విద్యార్థులు శిష్ట వ్యావహారికంలో రాయడానికి అనుకూలంగా తీర్మానించారు. గ్రాంథిక భాషావాదులకు ఇది ఎంతో బాధ కలిగించింది. కమిటీలో రాయలసీమవారికి సరైన ప్రాతినిధ్యం లేదని వాదన లేవదీశారు. దీంతో కోలాచలం శ్రీనివాసరావు, టి.శంకరలింగం పిళ్లై, నాగపూడి కుప్పుసామయ్య, కె.సుబ్బారెడ్డిలను సభ్యులుగా నియమించారు. దీనివల్ల గ్రాంథికవాదంపై మొగ్గు ఏర్పడింది. మెజారిటీ సభ్యులు గ్రాంథిక వాదంవైపు మొగ్గడాన్ని గురజాడ వ్యతిరేకిస్తూ 'The Minute of Dissent to the report of the Telugu Composition Sub-committee' పేరిట సుదీర్ఘ వ్యాసం రాశారు. కానీ, పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యావహారిక వాదం అంతటితో చల్లబడలేదు. గిడుగు తన కృషిని ఉధృతం చేశారు. 1919లో 'తెలుగు' పత్రికను స్థాపించారు. అప్పటివరకు గ్రాంథికవాదానికి మూలవిరాట్టుగా వున్న కందుకూరి వీరేశలింగం వ్యావహారిక వాదాన్ని అంగీకరించడం ఈ ఉద్యమంలో పెద్ద మలుపు. వీరేశలింగం 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్రవరంలో 'వర్తమాన వ్యావహారికాంధ్ర భాషా ప్రవర్తక సమాజము'ను స్థాపించి తానే అధ్యక్షునిగా వున్నారు. వ్యావహారిక భాషా వ్యాకరణం రాస్తానని ప్రకటించారు. ఈ పరిణామంతో గ్రాంథికవాదం బాగా దెబ్బతిన్నది. 1924 నుంచి వెలువడుతున్న 'భారతి' ఉభయపక్షాలకూ

ప్రాముఖ్యం ఇచ్చేది. ఆంధ్రసాహిత్య పరిషత్తువారు కూడా అంతకుముందు తాము విధించుకున్న వ్యావహారిక భాషా బహిష్కారాన్ని రద్దుచేశారు. 1933 మార్చి 10-12 తేదీల్లో జరిగిన 'అభినవాంధ్ర పండిత సభ'కు చిలుకూరి నారాయణరావు అధ్యక్షత వహించారు. ఆధునిక వ్యావహారికమే బోధనా భాషగా ఉండాలని అది తీర్మానించింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో గిడుగువారి 'గద్య చింతామణి' మొదటి భాగం వెలువడింది. 16-20 శతాబ్దాల మధ్య తెలుగు వచనరచనా సంప్రదాయం ఎలా వుండేదో అందులో ఆయన సోదాహరణంగా నిరూపించారు. దీంతో సనాతనవాదులకు పరాభవం ఎదురైంది.

1936లో 'నవ్యసాహిత్య పరిషత్తు' వెలసింది. అది వ్యావహారిక భాషావాదులకు ఆలవాలమైంది. పరిషత్తు తరఫున స్థాపించిన 'ప్రతిభ' పత్రిక వ్యావహారిక వాదాన్ని బలపరుస్తూ రచనల్ని ప్రచురించింది. 'జనవాణి' పత్రికలో గిడుగు శిష్యుడైన తాపీ ధర్మారావు మొదటిసారిగా వ్యావహారిక భాషలో సంపాదకీయం రాశారు. దీనికి ప్రజామోదం లభించింది. గ్రాంథిక భాషావాదం వెనుకబడింది. 1940లో గిడుగు తుది విన్నపం చేస్తూ మరోసారి వ్యావహారిక భాషకోసం ఎలుగెత్తి ఘోషించారు. దేశభాషలో విద్యాబోధన జరగాలని, గ్రాంథిక భాష కనిపించేదేగానీ, వినిపించేది కాదని, వ్యావహారిక భాష జీవంతో కళకళలాడుతుందని రాశారు. '25 సంవత్సరాల కిందట ప్రభుత్వము, విశ్వవిద్యాలయాలు, దేశంలో అందరూ వ్యావహారిక భాషకు వ్యతిరేకంగా వున్నారు. కానీ, ఈనాడు అందరూ రేడియో, వార్తాపత్రికలతోసహా వ్యావహారిక భాషను అంగీకరిస్తున్నా బడుల్లో, కళాశాలల్లో, ప్రభుత్వంలో, విశ్వవిద్యాలయాల్లో మాత్రం వ్యావహారిక భాష ప్రయోజనాన్ని అంగీకరించలేకపోతున్నారు. ఆ పనిని పాత్రికేయులు, మిగిలినవారు చెయ్యాలి. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు వ్యావహారిక భాషను అంగీకరించి అమలు చేసేదాకా నేనీ ఉద్యమంలో పూర్తిగా కృతకృత్యుడ్ని అయ్యానని సంతోషించలేను' అన్నారు. నిజానికి ఈ ఉద్యమానికి గిడుగు చేసిన త్యాగం మరవలేనిది.

గ్రాంథికవాదులు పూర్తిగా వెనక్కుపోలేదు. అప్పుడప్పుడూ తలెత్తుతూ వేదికలు దొరికినప్పుడల్లా తమ వాదాన్ని పైకి తెస్తూనే వున్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తర్వాత పాఠ్యపుస్తకాలను వ్యావహారికంలోనే తేవాలని భద్రిరాజు కృష్ణమూర్తి వాదించారు. కొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై పింగళి లక్ష్మీకాంతం అధ్యక్షతన వివిధ రంగాలవారితో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ సంఘం 1966లో నివేదికను సమర్పిస్తూ మొదటి భాషగా తెలుగు చదువుకునే వారికోసం సరళ గ్రాంథికం ఉండాలని, రెండో భాష లేదా శాస్త్ర విషయాలు చదువుకునేవారికి శిష్ట వ్యావహారికం ఉండాలని

సిఫారసు చేసింది. అదే సంవత్సరం తెలుగును అధికార భాషగా చేస్తూ ప్రభుత్వం చట్టాన్ని తెచ్చింది. అధికార భాషా చట్టంవల్ల కలిగే సమస్యల్ని అధ్యయనం చెయ్యమని కోరుతూ అప్పటి విద్యాశాఖ కార్యదర్శి జె.పి.ఎల్.గ్విన్ అధ్యక్షతన ఒక నిపుణుల సంఘాన్ని నియమించింది.

ఆంధ్రేతరులకు తెలుగు నేర్పడానికీ, ఆ భాషను ఆధునికీకరించడానికీ, విశ్వవిద్యాలయాల్లో తెలుగును బోధనా భాషగా అమలు చెయ్యడానికీ ఒక స్వతంత్ర సంస్థ ఉండాలని సూచించింది. ఈ సూచనల్ని ఆమోదిస్తూ ప్రభుత్వం 1968లో తెలుగు అకాడమీని ఏర్పాటు చేసింది. సంస్థ ఇంటర్మీడియెట్ పాఠ్యగ్రంథాలను తెలుగులో రాయాలనుకున్నప్పుడు మళ్లీ వివాదం తలెత్తింది. చర్చోపచర్చల అనంతరం శిష్ట వ్యావహారికాన్ని కొద్ది మార్పులతో వాడాలని తీర్మానించారు. మళ్లీ భాషా వివాదం పత్రికలకు ఎక్కింది. అయితే గ్రాంథిక భాషావాదుల ప్రయత్నాలు ఫలించలేదు. రేడియో, టెలివిజన్, పత్రికలు, సాహిత్యరంగంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు, సినిమాలు అన్నీ వ్యావహారిక భాషనే వాడడం ప్రారంభమైంది.

అయితే సనాతనవాదులకు కంచుకోటలుగా వున్న విశ్వవిద్యాలయాల్లో ముఖ్యంగా తెలుగుశాఖల్లో మాత్రం బోధనలో, పాఠ్యగ్రంథ నిర్మాణంలో, సిద్ధాంత గ్రంథరచనలో వ్యావహారిక భాషాప్రవేశం అంత తేలిక కాలేదు. 1969లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాన్ని శిష్ట వ్యావహారికంలో రాసేందుకు అనుమతించింది. పురిపండా అప్పలస్వామి కృషి ఫలితంగా 1971లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అన్ని స్థాయులలో వ్యావహారిక భాష అమలుచేసే విషయాన్ని పరిశీలించడానికి ఎం.ఆర్.అప్పారావు నేతృత్వంలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావు, అబ్బూరి రామకృష్ణారావు మొదలైనవారు ఇందులో సభ్యులు. తూమాటి దొణప్ప కన్వీనరు. మెట్రిక్యులేషన్ నుంచి ఎం.ఎ. వరకు క్రమంగా వ్యావహారిక భాషను ప్రవేశపెట్టేందుకు ఒక విధానాన్ని సూచిస్తూ 1973లో కమిటీ ఒక నివేదిక అందజేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రశ్నపత్రాలనుంచి సిద్ధాంత గ్రంథాల రచనవరకూ వ్యావహారిక భాషలోనే సాగడం ప్రారంభమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాత్రం వ్యావహారిక భాషను అంగీకరించి అమలుపరచింది. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సహా ఇతర అన్ని విశ్వవిద్యాలయాలు ఆధునిక తెలుగునే అమలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠ్యపుస్తకాలను కూడా వ్యావహారికంలోనే తెస్తున్నది.

ఈ విధంగా వ్యావహారిక భాషా ఉద్యమం సుదీర్ఘకాలం సాగింది. ఎంతోమంది ఈ ఉద్యమంలో పాల్గొని అనుకున్నది సాధించారు. ప్రజలందరికీ అర్థమయ్యే, ఏ సంకెళ్లూ

లేని సరళమైన తెలుగులో రాయడానికి దోహదం చేసే పరిస్థితిని తీసుకొచ్చారు. ఏమాటకామాట చెప్పుకోవాలి. సృజనాత్మక రచయితలు మాత్రం భాషోద్యమ గొడవలకు దూరంగా తాము వ్యావహారికంలోనే పుస్తకాలు రాసుకున్నారు. పత్రికల్లో గ్రాంథికం, సరళ గ్రాంథికం, శిష్ట వ్యావహారికం అనే దశలుగా సాగింది. వ్యావహారికాన్ని కొద్దిపాటి మార్పులతో నేటి ప్రామాణిక భాషను రూపొందించుకున్నాం. ప్రామాణిక భాషగా రూపొందించి పటిష్టపరచుకొనే ప్రయత్నంలో పత్రికలు చేసిన కృషి ప్రశంసనీయం. నేటి తెలుగు వెనుక ఎంతమంది కృషివుందో వివరించి దీన్ని కాపాడుకునేందుకు పాటుపడవలసిన ఆవశ్యకతను గుర్తుచెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశం.

పత్రికల్లో భాషా పరిణామాన్ని నాలుగు దశలుగా వర్గీకరించవచ్చు. పత్రికల ఆవిర్భావం అంటే 'వృత్తాంతి' (1838) నుంచి 'దేశాభిమాని' (1900) వరకు మొదటిదశ. 'కృష్ణాపత్రిక' (1902) నుంచి 'ఆంధ్రజ్యోతి' (1960) వరకు రెండవ దశగా, 'ఈనాడు' (1974) నుంచి 'వార్త' (1996) మూడవ దశగా విభజించవచ్చు. అక్కడ్నుంచి పత్రికలకు టెలివిజన్ ఛానళ్లు ముఖ్యంగా న్యూస్ ఛానళ్లు తోడై భాషలో అంతకుమునుపు ఎప్పుడూలేని రీతిలో చోటుచేసుకున్న మార్పులను నాలుగవ దశకింద పరిశీలిద్దాం. అంటే 1996 తర్వాత భాషా పరిణామక్రమంలో నాలుగవ దశగా పేర్కొనవచ్చు.

మొదటి దశ

'వృత్తాంతి'తో తెలుగు పత్రికల భాష ప్రారంభమైంది. ఈ పత్రిక మూతపడుతున్న రోజుల్లో 1842 జూన్ 8వ తేదీన 'వర్తమాన తరంగిణి' మద్రాసు నుంచి ప్రారంభమైంది. 'వృత్తాంతి'లాగే ఇందులో పాఠకుల లేఖలు, వ్యాపార ప్రకటనలు, ధరవరలు వంటి వార్తలు ప్రచురించేవారు. పాఠకుల లేఖలకు సమాధానాలు కూడా ఇచ్చేవారు. ఉత్తరాల్ని ప్రచురించడం వల్ల పత్రికల్లో స్థలం వృథా అవుతుందని ఒక పాఠకుడు సంపాదక లేఖ రాస్తే- 'ఉత్తరము వ్రాసినవారికి ఎడిటరు మారు' ఇలా ఉంది... 'మా చందాదారులైన యొక్క పెద్దమనిషిగారు మా పత్రికలోన నుత్తరములు బ్రచురపరచుటవలన కొంత స్థలము వృథా అయిపోతున్నదని వాదుకొన్నారట. వారి ఒక్కరి నిమిత్తము మాత్రమే మేము పత్రికను ప్రచురించుట లేదుగాన యుత్తరములనెట్లు తిరస్కరింతుమోగాని వాటివల్లనున్నతి ప్రయోజనము కద్దు- ద్రావిడ దీపికయనే 4 రెక్కల పత్రికలో మూడుపక్కలుత్తరములున్ను, నాలుగోపక్కనొక్క కాలము సమాచారమున్నుండుట- వారు చిత్తగించలేదు కాబోలు' -ఎడిటరు.

నాటి పత్రికలలో శీర్షికలకు ఉదాహరణలుగా 'పాము కఱచుట', 'అద్భుతము', 'ఆకస్మికపు మరణము', 'హత్య', 'అగ్నిహోత్రుడు' వంటి వాటిని చెప్పుకోవచ్చు. పదాంతంలో పూర్ణానుస్వారం అప్పటి నియమం.

'దినవర్తమాని' (1856)లో ఒక వార్త చూద్దాం...

"హయిదరాబాదు...

మిగుల ఘనత వహించిన గవర్నర్జనల్గారు హయిదరాబాదు నిజాం గారిని గౌరవపరచుటకు వారికి నయిట్ పట్టమివ్వబోవుచున్నారు. ఆ యభిప్రాయమును తెలియపరచునట్టి యొక్క పత్రికను రెసిడంటుకు (కర్నల్ డెలిసన్) పంపగా నా దొర క్రమ ప్రకారము తనదు పరివారంతోకూడి నిజాంగారి యొద్దకుబోయి మా పత్రికను ఒప్పగించిరి. వారు దాన్ని మిగులు తృప్తితోనంగీకరించి యా మంగళ వార్తను తెలియపరచుటకు చిహ్నముగా తనదు రాజధానియందు మాత్రము కాకుండా సికిందరాబాదు పొలారమునందును ఫిరంగీలు వేయించిరి".

దినవర్తమాని పత్రిక భాష వ్యవహారికమని నిడదవోలు వెంకటరావు అభిప్రాయపడ్డారు. కానీ, ఇది పూర్తిగా సరళ గ్రాంథికమే. నుగాగమాలు, యడాగమాలు విరివిగా కనిపిస్తాయి. 'పోయినతూరి', 'కొల్లెత్తువాండ్రు', 'పటాళములు' వంటి నాటి మద్రాసు ప్రాంత పదాలు కూడా ఉన్నాయి. కందుకూరి వీరేశలింగం 19వ శతాబ్ది పూర్వార్ధంలో పత్రికలతో రచనానుబంధాన్ని కలిగి ఉన్నారు. సంఘ సంస్కరణ విషయాలపై అనేక పత్రికలలో విస్తృతంగా రచనలు చేయడం, సంప్రదాయవాదులతో వాదాలు పెట్టుకోవడం జరిగింది. తర్వాత 1874లో ఆయనే స్వయంగా 'వివేకవర్ధిని' మాస పత్రికను ప్రారంభించారు. ఆ పత్రికకు ప్రతి సంచికలో తిలకస్థానంలో మహాభారతం శాంతిపర్వంలోని 'ఒరులేయవి యొనరించిన నరవర యప్రియంబు తన మనంబునకగు... దానొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథములకెల్లన్' అనే పద్యాన్ని ప్రచురించారు. ఆ పత్రిక పెట్టడం వెనుక తనకున్న లక్ష్యాలను వీరేశలింగం ఇలా ప్రకటించుకున్నారు– "తులసీ రుద్రాక్షమాలాది బాహ్యచిహ్న ధారణముకంటే సత్ప్రవర్తన మతమునకధికావశ్యకమని జనులలో విశ్వాసం కుదురువరకును మతము పరిశుద్ధమై దురాచార నివారకము కానేరదు. కాబట్టి పరిశుద్ధ మత సిద్ధాంతములను బోధించుట వేరొక ఉద్దేశము".

వీరేశలింగం తొలుత గ్రాంథికభాషా సమర్థకుడేనని, తర్వాత గిడుగువంటివారి వాదాన్ని ఆమోదించి వ్యావహారిక భాషావాదిగా మారాడని విదితమే. పై వాక్యాలు

కందుకూరి సరళ గ్రాంథిక భావాలను సూచిస్తాయి. ఆ కాలంలో వచ్చిన 'అముద్రిత గ్రంథ చింతామణి', 'ఆంధ్ర ప్రకాశిక', 'హిందూజన సంస్కారిణి', 'సత్య సంవర్ధని', 'శారద', 'చింతామణి', 'ప్రబంధ కల్పవల్లి', 'అనల్ప జల్పితా కల్పవల్లి' వంటి పత్రికల్లో భాష సరళ గ్రాంథికమే. తెలుగులో తొలి దినపత్రికగా 'దేశాభిమాని'ని చెప్పుకోవచ్చు. నిజానికి 1887లో 'కృష్ణా వృత్తాంతిని' అనే పేరుతో రాజకీయ పత్రిక వెలువడటం ప్రారంభించింది. అదే తర్వాత 'దేశాభిమాని'గా మారింది. వారపత్రికగా ప్రారంభమై ద్వైవార పత్రికగా, త్రైవార పత్రికగా వెలువడి దినపత్రికగా మారింది.

'తెలుగు జనానా' అనే పత్రికలో 'ఆంధ్రలోకమున గౌతమియే మొదటి దినపత్రిక కాదు. అట్టి భాగ్యము కృష్ణకే లభించినది. కానీ, అది కృష్ణ వెల్లువలవలెనే మూడునాళ్ల ముచ్చటయై సింధుగతమైనది. ఇదివరకు బెజవాడలోనుండి ఈ మధ్య కృష్ణ దాటి వెడలి గుంటూరుకొచ్చిన దేశాభిమాని కొంతకాలము కిందట దినదినమున తలనూపుచు వచ్చెను...' అన్న మాటల్నిబట్టి దేశాభిమానిని తొలి తెలుగు దినపత్రికగా భావించవచ్చును. 'గౌతమి', 'ఆంధ్రప్రకాశిక', 'శశిలేఖ' వంటివి మరికొన్ని దినపత్రికలు. 1908 ఆగస్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక' 1914 ఏప్రిల్ 1న (మద్రాసుకు తరలి) దినపత్రికగా మారింది.

రెండవ దశ

రెండవ దశలో 'కృష్ణాపత్రిక' నుంచి 'ఆంధ్రజ్యోతి' వరకు వచ్చిన పత్రికలను స్వీకరించాం. పత్రికాభాష మొదటిదశలో గణనీయమైన మార్పును చూడలేదుగానీ, రెండవ దశలో చెప్పుకోదగ్గ రీతిలో మార్పుచెందింది. తెలుగు పత్రికా చరిత్రలో 'కృష్ణా పత్రిక'కు ప్రముఖ స్థానం ఉంది. 20వ శతాబ్ది తెలుగువారి సాహిత్య, రాజకీయ చైతన్య స్రవంతిలో కృష్ణా పత్రికదే అగ్రేసర పాత్ర. జాతీయోద్యమం ప్రారంభమై బెంగాల్ నుంచి బందరువరకు విస్తరించి ప్రజల్లో చైతన్యం పెరగడానికి కృష్ణా పత్రిక వేదికగా నిలిచింది. అందులో ముట్నూరు కృష్ణారావు దర్బారు, సంపాదకీయాల ఒరవడి పత్రికా పాఠకుల సంఖ్యను పెంచాయి. భాష కూడా పూర్వంకంటే సరళతరమైంది. ఇది వార్తాపత్రికల యుగం.

'రాజ్య పద్ధతులను, వాని లోపములను నివృత్తిచేయు మార్గములను, సంఘ సంస్కరణ రీతులను, రసవాద ప్రకృతి శాస్త్ర విశేషములను, వ్యవసాయమును, చేతిపనులు మొదలుగాగలనుపయుక్త విషయములనిందు వ్రాయుచుంటిమి. ఆ విషయములందు కూడా జనసామాన్యమునకు కొంతపాటి పరిచయము కలిగిననగానీ దేశాభివృద్ధి కానేరదు'.

పదాంతములోని ముకారము అంతకుపూర్వంనుంచి వస్తున్న భాషా సంప్రదాయాన్ని సూచిస్తుంది. అది తప్ప మిగతా వాక్య నిర్మాణాన్ని పరిశీలిస్తే, భాష వ్యావహారికం దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. తర్వాత చెప్పుకోదగిన వాటిలో ముఖ్యమైనది 'ఆంధ్రపత్రిక' వార్తాపత్రిక. అందులో దినపత్రికల యుగంలో 'ఆంధ్రపత్రిక'ది చిరస్మరణీయమైన పాత్ర. ఇది తెలుగువారి సమగ్ర జీవనరంగాల ప్రతిఫలనం. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఈ పత్రిక పెట్టిన లక్ష్యాన్ని ఈ విధంగా ప్రకటించారు. 'విచారణీయంబులైన విషయంబులనేకంబు గలవు. జనాభిప్రాయములకనుకూలముగా విషయ విమర్శనను జేయుచు ననుదినమును నాంధ్రదేశ వృత్తాంతాదులను ప్రచురించుటకు దినపత్రిక ప్రచురించుట కేర్పాట్లు చేయబడినవి. కానీ యనివార్యంబులైన యాటంకముల వలన విలంబనమేర్పడినందుకు జింతించుచున్నాము. దేశీయ మహాసభాదర్శములును, రాష్ట్రీయ సభాదర్శములును నాంధ్రపత్రికాదర్శములు'.

ఈ మధ్యలో నల్లగొండ నుంచి 1922 ఆగస్టు 24న షబ్నవీసు వెంకటరామ నరసింహారావు 'నీలగిరి' పత్రికను ప్రారంభించారు. ఆ తర్వాత 4 రోజులకే వరంగల్లు జిల్లా ఇనగుర్తి నుంచి ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు సోదరులు 'తెలుగుపత్రిక'ను ప్రారంభించారు. తెలంగాణలో తెలుగు మాధ్యమంలో విద్యావకాశాలు లేనిరోజుల్లో, తెలుగు ముద్రణ లేనిరోజుల్లో ఎన్నో సమస్యలనెదుర్కొంటూ ఈ పత్రికలు నడిచాయి. నాలుగేళ్ల కాలమే నడిచినా తెలంగాణ ఆంధ్రోద్యమానికి ఊపునిచ్చాయి.

సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికను 1926 మే 10న ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ట్రూపు బజార్లో ఒక చిన్న ఇంట్లో ఒకపక్క ప్రెస్సు, మరో గది ప్రతాపరెడ్డిది, పుస్తకాల బీరువాలు. అన్నీ తానే అయి ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ ఆయన పత్రిక నడిపారు. నిద్రాణమైన తెలంగాణంలో 'సారస్వత జ్యోతి' ప్రకాశనం చేసిన 'గోలకొండ' భాషాసాహిత్యాల వ్యాప్తికి ఇతోధికంగా దోహదం చేసింది. నెల్లూరు నుంచి 1930లో 'జమీన్‌దారు రైతుపత్రిక'గా ప్రారంభమైన పత్రిక తర్వాత 1934లో 'జమీన్‌రైతు'గా మారి నేటికీ వెలువడుతూ రైతుల్లో చైతన్యాన్ని కలిగిస్తున్నది. 1935లో 'జనవాణి' ప్రారంభమై తెలుగు దినపత్రికల్లో వ్యావహారిక భాషకు పట్టంగట్టింది. తాపీ ధర్మారావు ఈ పత్రికద్వారా ప్రవేశపెట్టిన కొత్తదనం తెలుగు పత్రికారచనకు కొత్త ఒరవడిని దిద్దింది. పత్రిక యజమాని అయిన పిఠాపురం రాజా గ్రాంథిక భాషాభిమాని. కానీ, పత్రిక నాలుగేళ్ల కాలం నడిచి భాషావిషయకంగా తర్వాతి నడకను మార్చివేసింది. ఓడల్లో విదేశాల నుంచి సరకులకింద పరచుకొని వచ్చిన పత్రికలను సేకరించి విదేశీ పత్రికల వార్తారచన ధోరణులను నిశితంగా

పరిశీలించి తెలుగు పత్రికారచనను సమూలంగా మార్చే ప్రయత్నం చేశారు. సంపాదకీయ రచనలో నూతనత్వం, శీర్షికల్లో కొత్తదనం వెల్లివిరిసింది.

తాపీ ధర్మారావు స్వయంగా ఎక్కడో రాసిన వాక్యాలు చూస్తే 'జనవాణి'ద్వారా ఆయన ప్రవేశపెట్టిన మార్పులు బోధపడతాయి. 'తక్కువ పదాలతో వాక్యాలు రాసేవాణ్ని. సుమారు మూడే పదాలుంటాయి వాక్యంలో. అందువల్ల వ్యావహారికమనిపిస్తుంది. క్రియా పదాల్ని వ్యావహారికం చేయడమే వ్యావహారికం కాదు. అదో టెక్నిక్ కనిపెట్టాను. గ్రాంథిక భాషావాదులకు కూడా ఆ రోజుల్లో దాన్ని కాదనగల ధైర్యం ఉండేదికాదు'. 1938 ఆగస్టు 15న సోమవారంనాడు 'ఆంధ్రప్రభ' దినపత్రిక మద్రాసులో ప్రారంభమైంది. తొలుత ఖాసా సుబ్బారావు తర్వాత న్యాపతి నారాయణమూర్తి సంపాదకులుగా ఉన్నారు. తర్వాత నార్ల వెంకటేశ్వరరావు సంపాదకులయ్యారు. నార్ల ప్రవేశంతో 'ఆంధ్రప్రభ' తెలుగుపత్రికా రచన ఆధునికీకరణ దిశకు వేదికగా మారిందని చెప్పవచ్చు. దేశీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు వాటి అనువాదం సరళంగా, పాఠకులను ఆకర్షించేవిధంగా చేసేది. సమకాలీనాంశాలైనా, పౌరాణికాంశాలైనా నిక్కచ్చిగా ఉండేవి నార్ల అభిప్రాయాలు. ఆ అభిప్రాయాలెంత నిశితంగా ఉండేవో వాటిని వ్యక్తీకరించేందుకు ఆయన వాడిన భాష కూడా అంత సూటిగా శక్తిమంతంగా ఉండేది.

పత్రికాభాషను గ్రాంథిక చెరనుండి విడిపించి వ్యావహారికంవైపు నడిపించిన పత్రికల్లో కమ్యూనిస్టు పత్రికలకు కూడా తగిన పాత్ర ఉంది. నవశక్తి, స్వతంత్ర భారత్, ప్రజాశక్తి (వారపత్రిక), విశాలాంధ్ర, ప్రజాశక్తి (దినపత్రిక) చెప్పుకోదగ్గవి. 1960లో విజయవాడ నుంచి ప్రారంభమైన 'ఆంధ్రజ్యోతి' పత్రికాభాషకు మరింత పదును తెచ్చింది. పూర్వం ఆంధ్రప్రభలో నార్ల చేసిన ప్రయోగాలను ఆంధ్రజ్యోతిలో కొనసాగించారు. వాడుకభాషకు పుష్టి కలిగించేవిధంగా సంపాదకీయాలు, వార్తలు రాశారు. మాండలిక పదాలను కూడా పత్రికారచనలోకి తెచ్చి ప్రామాణీకరించే ప్రయత్నం చేశారు. నార్ల తర్వాత సంపాదకులుగా ఉన్నవారు అదే ఒరవడిలో పయనించి తెలుగు పత్రికాభాషను సుసంపన్నం చేశారు. అనేక కొత్త పదాలను సృష్టించి అవి స్థిరపడేలా చేశారు. 1960లో సికింద్రాబాదు నుంచి ప్రారంభమైన 'ఆంధ్రభూమి' సైతం ఈ కృషిలో సముచిత భాగస్వామ్యం వహించింది. గోరా శాస్త్రి సంపాదకీయాలు చిరస్మరణీయాలు.

మూడవ దశ

తెలుగు పత్రికల భాషా పరిణామం మూడవ దశ 'ఈనాడు' (1974)తో ప్రారంభమవుతుంది. 20వ శతాబ్ది పూర్వార్ధం ముగుస్తుండగా పత్రికాభాష వ్యావహారికం

వైపు మళ్లిన విషయం ఇదివరకే చర్చించుకున్నాం. 'జనవాణి' వేసిన మార్గంలో తదనంతరం పత్రికలు మునుముందుకు సాగాయి. తెలుగునాట రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విశేషాలేగాక అనువాదం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను పాఠకులకు సుగమంగా అందించేందుకు పత్రికలు ఎంతగానో దోహదం చేశాయి. ఇలాంటి పూర్వరంగంలో 'ఈనాడు' దినపత్రిక విశాఖలో ఆవిర్భవించింది. నార్ల తరం తర్వాత తెలుగు పత్రికల భాషను మలచడంలో నవనవోన్మేషంగా కృషిచేస్తూ అక్కడక్కడ ఉన్న పాత్రికేయులను ఈనాడు తనవద్దకు తెచ్చుకుంది. తెలుగు దినపత్రిక పాఠకుల ఆలోచనలను ప్రభావితం చేస్తూ వారి పఠనాభిరుచిని పెంపొందిస్తూ వారి పఠనావసరాలకు దీటుగా రూపొందుతూ వచ్చింది. పాఠకుల సంఖ్యను పెంచుకోవాలి. సూర్యోదయానికల్లా దినపత్రిక వారికి చేరాలి. ప్రపంచాన్ని వారి కళ్లముందు ఆవిష్కరించాలి. ఈ పనిని వ్యూహాత్మకంగా చేయాలి అని 'ఈనాడు' భావించింది. అన్నింటికీ మించి పాఠకుల వద్దకు వెళ్లడానికి భాషను ప్రధానంగా ఎంచుకుంది. పత్రికా భాషను ఆధునికీకరించే పనిని చేపట్టింది. భాషలో ఏకరూపత వాంఛనీయమని తీర్మానించింది. వివిధ పత్రికా రచయితలు భిన్న శైలుల్లో రాసే రచనల్లో ఏకరూపత ముఖ్యావసరమని నిర్ణయించి రాసే భాషకు విధినిషేధాల్ని ఏర్పరుచుకొంది. ఈ విధినిషేధ ప్రణాళికకు శైలీపత్ర రూపం కల్పించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక ముఖ్యమైన దశలో పలువురు పత్రికా రచయితలు 'ఈనాడు'ను వేదికగా చేసుకొని పత్రికాభాషకు కొత్తదారి వేశారు. ఆ దారిని తర్వాత పత్రికలన్నీ అనుసరించి మరిన్ని ప్రయోగాల్ని చేశాయి. 'దేశ రాజకీయరంగం కొత్త మలుపు తిరిగింది. ఒక ఉదాహరణ చూద్దాం... స్వాతంత్ర్య పోరాట కాలంనుంచీ దేశానికి సారథ్యం వహించిన కాంగ్రెస్ 30 సంవత్సరాలపాటు సాగించిన పాలన అంతమైంది. నూతన శకారంభంగా జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికలలో కలిసికట్టుగా పోటీచేసి విజయం సాధించిన జనతా, ప్రజాస్వామ్య కాంగ్రెస్‌లు కొత్త లోక్‌సభలో వేరువేరు గ్రూపులుగానే వ్యవహరించనున్నాయి. కొత్త మలుపులో ఇదివ్వాళ ఒక నూతన పరిణామం. ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా? లేక 'సుస్థిరతా? అస్థిరత్వమా?' అనే నినాదాల మధ్య సాగిన ఎన్నికల ఫలితాలను యావత్ప్రపంచం గమనిస్తున్న తరుణంలో దేశపాలనా బాధ్యతలను జనతా పార్టీ స్వీకరిస్తున్నది' (ఈనాడు... 1977 మార్చి 25).

తర్వాత వచ్చిన పత్రికలన్నీ చిన్నవి, పెద్దవి, దినపత్రికలు, వార పత్రికలు అన్న తేడాలేకుండా వాడుకభాషలోనే అన్నీ రాయడం కొనసాగించాయి. వార, మాస పత్రికల్లో వార్తాంశాలకు స్థానం తక్కువైనా వ్యావహారిక భాషావిషయాలలో మాత్రం అందరికీ అనుసరణీయమైంది. సాహిత్యాంశాలు కూడా పత్రికా వార్తారచనలో మెదిలే ప్రయోగాల

నుంచి స్ఫూర్తి పొందాయి. సాహిత్యేతరమైన శీర్షికలు, సమకాలీనాంశాల రచనకు పత్రికాభాష, దాని నూతన పరిభాష ఆలంబనగా నిలిచాయి. గ్రాంథిక భాషకు పూర్తిగా దూరమై వాడుక భాషలో లిఖిత సంస్కృతిని దాటి కొంత మౌఖిక సంస్కృతి చోటు చేసుకోనారంభించింది. ఈ దశలో చెప్పుకోదగిన కర్తవ్యాన్ని నిర్వహించిన 'ఉదయం', 'వార్త' దినపత్రికలు ప్రధానమైనవి. ఉదయం (1984) రాకతో దినపత్రికా రంగంమీదకు మరో కొత్త కెరటం వచ్చినట్లయింది. 'ఈనాడు' అంతకుపూర్వం పత్రికాభాష ఆధునికీకరణను ప్రవేశపెట్టి కొత్తగా పాత్రికేయుల్ని తయారుచేసి, వారికి ఆధునిక రచనావశ్యకతను ఒంటబట్టించే ప్రయత్నాన్ని చేస్తే, 'ఉదయం' ఆ ప్రయత్నాలను విస్తరింపజేస్తూ ముందుకు సాగింది. మరింత పెద్దఎత్తున పత్రికా రచయితల్ని తయారుచేసింది. ఒక కొత్త పత్రిక... అందునా కొత్త బాధ్యతలతో కొత్త పోటీలో నిలిచే ఉద్యమ తత్వంతో వచ్చిన పత్రిక కావడంవల్ల ఇందుకోసం కష్టపడవలసి వచ్చింది. అంతకుముందున్న శీర్షికలు మరింత విస్తరించాయి. మరిన్ని వార్తలకు చెందిన పాఠకుల కోసం ప్రత్యేకమైన రచనలు వచ్చాయి. తదనుగుణంగా పాత్రికేయులను మలచుకోవడం ప్రారంభమైంది. ఒక్కసారిగా పాత్రికేయుల సంఖ్య పెరగడంతో భాషాపరమైన నాణ్యత తగ్గే పరిస్థితి వచ్చింది. అయితే పత్రిక ప్రధాన సంపాదక సిబ్బంది కృషితో ఆ లోటును రాజధాని, ఇతర ముఖ్యపట్టణాల ఎడిషన్ల స్థాయిలో చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కొత్తగా పత్రికలో చేరినవారిలో ప్రగతిశీల ఉద్యమాల నేపథ్యంనుంచి వచ్చినవారు భాషను కూడా కొత్తపుంతలు తొక్కించారు.

1996లో 'వార్త' ప్రారంభమైంది. ఏకకాలంలో పది కేంద్రాల నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రికగా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంది. పాత్రికేయ యంత్రాంగాన్ని మండల స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తృతపరచుకుంది. కొత్తగా శాసనసభ నియోజకవర్గాలు, రెవెన్యూ సబ్-డివిజన్ల స్థాయిలో వార్తా కేంద్రాల్ని ఏర్పాటు చేసుకుంది. పుటలు విస్తరించాయి. అంతకుముందు ఈనాడు, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ వంటి దినపత్రికలు ప్రారంభించిన స్థానిక ఎడిషన్లు నిలదొక్కుకున్నాయి. మరొక వ్యూహాత్మక పత్రికగా ఆవిర్భవించిన వార్త, ఆ పోటీని అధిగమించి అగ్రగామిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. ఇతర పత్రికల్లో అనుభవం గడించినవారిని ఉన్నత స్థానాల్లో నియమించుకోవడం వల్ల భాష విషయంలో బాలారిష్టాలు లేకుండానే సాఫీగా ముందుకు నడవగలిగింది. ఈ దశలో అన్ని దినపత్రికలకు భాషా విషయంగా ఎదురైన సవాలు, ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ, ముందుకు వచ్చిన నూతన సాంకేతిక విప్లవం, అంతకుముందు రాజకీయంగా తప్ప దేశంలో పెద్దగా మార్పులు లేని దేశం మనది. కొత్త మార్పులు చాలా తీవ్రస్థాయిలో రావడంతో పత్రికల బాధ్యత

పెరిగింది. ప్రపంచంలోని ఏ మూలనుంచయినా నడవగలిగే స్థాయికి పత్రికలు ఎదగాలి. ఏ మూలనుంచి, ఏ కొత్త అంశం బయటకు వచ్చినా అందుకుని తన పాఠకులకు సులభమైన శైలిలో అందించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ముద్రణ సాంకేతిక పరిజ్ఞానం మారింది. కంపోజింగ్, పేజినేషన్ పరిజ్ఞానం పచ్చింది. తక్కువ శ్రమతో క్షణాల్లో అద్భుతమైన పత్రికను మారుమూల ప్రాంతాలకు సైతం అందించే సమయం వచ్చింది. సరిగ్గా ఈ తరుణంలో పత్రికాభాష పరిణామంలో నాలుగవ దశ ప్రారంభమైంది.

నాలుగవ దశ

నాలుగవ దశలో పత్రికాభాష ఎలక్ట్రానిక్ మాధ్యమాల ప్రభావంతో ప్రసార మాధ్యమాల భాషలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుని ప్రసార మాధ్యమాల (మీడియా) భాషగా విస్తృతమైంది. 1990 దశకంలో టెలివిజన్ మాధ్యమం ప్రారంభమై కొన్నేళ్లపాటు స్థిరపడే ప్రయత్నం చేసింది. విదేశీ ఉపగ్రహాల శక్తిని వినియోగించుకుంటూ విదేశాల నుంచే ఇక్కడికి ప్రసారాల్ని అందించింది. ప్రధానంగా తొలుత కేవలం వినోద ప్రధానమైన కార్యక్రమాలను రూపొందించి టేపులను పంపి అక్కడెక్కడినుంచో ప్రసారం చేసింది. సినిమాలు, సినిమా ఆధారిత కార్యక్రమాలు దాటి ఇతర కార్యక్రమాలను ఎక్కువగా స్పృశించలేకపోయింది. కమ్యూనికేషన్ల శాఖ ప్రైవేటు టెలివిజన్ ఛానళ్లకు అప్‌లింకింగ్ సౌకర్యం కల్పించిన తర్వాత టెలివిజన్ మాధ్యమం ఒక్కసారిగా ఊపందుకుంది. వార్తా ప్రసారాలు వచ్చాయి. వార్తా ఛానళ్లు వచ్చాయి. 24 గంటల ప్రసారాల్ని అందించడం ప్రారంభించాయి. ఈ రంగంలోకి గతంలో ఎన్నడూ లేనంతమందిని తీసుకువచ్చాయి. అంతకుముందున్న పత్రికా ప్రపంచానికి తోడు మరొక ప్రత్యామ్నాయ దృశ్య ప్రపంచం ఆవిష్కృతమైంది.

ఈ దశలో పత్రికల వృద్ధి సమస్యపై సందేహాలు వ్యక్తమయ్యాయి. 24 గంటల తర్వాత వచ్చే పత్రికలకంటే సంఘటన జరుగుతున్న సమయంలోనే ప్రత్యక్ష ప్రసారం ద్వారా టీవీలో తిలకించే పరిణామం వచ్చింది. ఈ సంఘటన వివరాలను పత్రికల్లో రేపు ప్రచురిస్తే జనం చదువుతారా? అనే సందేహం వచ్చింది. అయితే, టీవీల్లో చూస్తున్నారు... పత్రికల్లోనూ చదువుతున్నారు. ఈ విషయాన్ని అనేక అధ్యయనాలు ధ్రువీకరించాయి. పత్రికల సర్క్యులేషన్‌లో ఏటా సగటున 5 శాతం వంతున పెరుగుదల కనిపిస్తూ వచ్చింది. దీనితో పత్రికలకు మనుగడ సమస్య ఎదురుకాలేదని అర్థమైంది. ఎవరిదారిలో వారి ప్రయాణం సాగుతుంది. భాషా వినియోగంలో పత్రికలు, టెలివిజన్ వేటికవిగా కొత్తదనాన్ని తెచ్చుకుంటూ ఒకదానితో మరొకటి నేర్చుకుంటూనే ముందుకెళ్తున్నాయి.

సమాచార విజ్ఞాన విప్లవం- ఈ దశలో పత్రికల్లోనూ, టెలివిజన్ మాధ్యమంలోనూ సంపూర్ణంగా కంప్యూటరీకరణ రాజ్యమేలుతోంది. భాష విషయంలో పత్రికల్లో కొంత కట్టుబాటు ధోరణి, సంప్రదాయకమైన ఆలోచనతో కూడిన రచనా దృష్టి కనిపిస్తుండగా టెలివిజన్‌లో మౌఖిక భాషతో కూడిన వివరణ, ప్రసంగ ధోరణి వినిపిస్తోంది. వెబ్ జర్నలిజంలో సంక్షిప్త రూపాలతో భాష వార్తావేగాన్ని, రచనావేగాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనువాద పదాలు, అనుసరణ ప్రయోగాలు, భావ ప్రధానంగా పదాల కలయికలు చూస్తున్నాం. భాషకు రూపాంతరీకరణలో ప్రధానమైన దశ ఇది.

పత్రికారంగంలో సాక్షి, సూర్య వంటి కొత్త దినపత్రికలు, అంతకుముందున్న పత్రికలు తమ భిన్న ప్రచురణ కేంద్రాలనుంచి ఎడిషన్లను అందిస్తున్నాయి. పాత్రికేయ సిబ్బందిని ఎంపిక చేసుకొని తగిన శిక్షణనిచ్చి వార్తాసేకరణ, రచనా బాధ్యతల్ని అప్పగిస్తున్నాయి. గ్రామీణ స్థాయినుంచి జిల్లాస్థాయి వరకు, రాష్ట్ర రాజధాని నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయివరకు వార్తల్ని, విశేషాల్ని అందించే క్రమంలో భాషా విషయకంగా కొన్ని మార్పులు స్పష్టమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని, జాతీయ-అంతర్జాతీయ రంగంలో ప్రపంచీకరణ, పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో క్షణక్షణానికీ సంభవిస్తున్న కొత్త పరిణామాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం జరుగుతోంది.

అన్ని దినపత్రికలూ భాషాపరంగా, ముద్రణ ప్రమాణాలపరంగా, వార్తాసేకరణ విధానాలపరంగా గణనీయంగా పోటీ వాతావరణంలో తమనుతాము మెరుగుపరచుకొని తెలుగు జర్నలిజాన్ని అగ్రస్థానానికి చేర్చాయి. పత్రికారచయితల సంఖ్య పెరిగింది. ప్రతుల సంఖ్య అమితంగా పెరిగింది. పాఠకులు పెరిగారు. పత్రికా రచయితలకు సంస్థలు శిక్షణనిచ్చాయి. సమాజంలోని భిన్న ప్రాంతాలు, భిన్న సామాజికవర్గాలకు, భిన్న విద్యాస్థాయులకు, సిద్ధాంతాలకు చెందినవారు పత్రికారంగంలో ప్రవేశించారు. నిజానికి ఉన్న అన్ని కోణాలనూ వెలికితీసి నిగ్గుతేల్చే శక్తిమంతులు వచ్చారు. సమస్యలపట్ల ఆర్తితోపాటు ఆ ఆర్తికి భిన్న శైలుల్లో పఠితలకు ఆసక్తిగొలిపేలా అక్షర రూపమివ్వడం మరొక కొత్త పరిణామం. విలేఖరులు ప్రజాజీవితంలో స్పృశించని కోణం లేదు. పూర్వం పత్రికా రచనకు ఉపయోగించిన భాషను పూర్తిగా మార్చివేశారు. సామాజికమైన అవగాహన కలిగినవారు, సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేసే అభినివేశం కలిగినవారు... ఈ విధంగా కొత్తరక్తం ఉరకలెత్తి పత్రికా భాషను పదునెక్కించింది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర వార్తలు, సంపాదకీయాలు, ఎడిట్ పేజీ వ్యాసాలు, యువతకోసం, బాలలకోసం,

మహిళలకోసం, వ్యవసాయదారుల కోసం, వ్యాపార, ఆర్థిక, క్రీడా, కళాసాంస్కృతిక రంగాలకోసం, సినిమాలు, సాంకేతిక పరిజ్ఞాన రంగాలకోసం, భక్తి, అధ్యాత్మిక భావుకులకోసం ప్రత్యేక పుటల్ని పత్రికలు ప్రవేశపెట్టాయి. అంతేకాకుండా ప్రతి రంగానికి సంబంధించిన శీర్షికల్ని సమర్థంగా నిర్వహించి ఆయా పాఠకులను చేరడానికి సమర్థులైన రచనలు చేస్తున్నాయి. భాషను వటవృక్షంలా చేసి ఒకోరకమైన రచనకు ఒకో విధమైన పదజాలాన్ని, రచనా విధానాన్ని రూపొందించి వైవిధ్యభరితం చేశాయి. కొత్తదైనా పాతదైనా భాష ఒకటే. కానీ, ఆ భాషను ప్రయోగించిన తీరును, నేటి అవకాశాలకు అనుగుణంగా, ఆకట్టుకొనేలా, చదివించేలా రాసే విధానాన్ని పత్రికలు స్వంతం చేసుకున్నాయి.

ఒబామా ప్రమాణస్వీకారం నుంచి మైకేల్ జాక్సన్ మరణంవరకు, వరదలు, భూకంపాల నుంచి సంపూర్ణ సూర్యగ్రహణం వరకు మీడియా జర్నలిస్టులకు భూగోళమే తమ కార్యరంగంగా విస్తరించింది. ఈ క్రమంలో అనుక్షణం, అనునిత్యం జరిగే పరిణామాలను మాతృభాషలో అందించడం సవాలుగా మారింది. అపరిమితమైన కొత్త పదాలను అప్పటికప్పుడే అనువదించడం పాత్రికేయులకు తలకుమించిన పనే అవుతున్నది. అనువాదంలో, వార్తా రచనానుభవంలో, భాషా పరిజ్ఞానంలో పండిపోయినవారు ఈ సవాలును ఎదుర్కొంటున్నారు. తెల్లవారేటప్పటికి పాఠకుల ముందు ప్రపంచ విహంగ వీక్షణాన్ని ఆవిష్కరిస్తున్నారు. పత్రికలను అధ్యయనం చేయాలేగానీ పూర్వంతో పోలిస్తే ఇప్పుడు నిత్యం పెద్దసంఖ్యలో కొత్త పదాలు దర్శనమిస్తున్నాయి.

టీవీ రంగంలో ఉన్న పోటీ ఇంతాఅంతా కాదు. ఒకవైపు ఇతర భాషా ఛానళ్లతో పోటీ, మరొకవైపు తెలుగు ఛానళ్లతోనూ పోటీ. ముంబై దాడుల సంఘటన వార్తలను ఎప్పటికప్పుడు అందించేందుకు తమ యంత్రాంగాన్ని ఆగమేఘాలపై అక్కడికి పంపించడం, ఘటనా స్థలం నుంచి రిపోర్టర్ తనవద్దనున్న సమాచారాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వివరించడం ఒక సవాలు. నిమిషాలు, గంటలసేపు సమాచారాన్నంతటినీ గుక్కతిప్పుకోకుండా దృశ్యాలకనుగుణంగా వివరిస్తారు. అక్కడి పరిణామాలపై మన భాషరాని అధికారులు, ప్రత్యక్షసాక్షులు వ్యాఖ్యానిస్తే అనువాదం కష్టమవుతుంది. ముందస్తుగా రికార్డు చేసిన అంశాలను ఇక్కడ ప్రసార కేంద్రంలోని వార్తాసిబ్బంది అనువాదం ద్వారా మన భాషలో ఇవ్వడం సాధ్యమే. టీవీ ఛానళ్ల ప్రసారాల్లో వార్తలు, ప్రత్యక్ష ప్రసారాల దగ్గరనుంచి, న్యూస్ సెంటర్‌లో నిర్వహించే చర్చా కార్యక్రమాలు, నిపుణుల ప్రసంగాలన్నీ ఒక ప్రణాళిక ప్రకారం నిర్దిష్టంగా రాసుకుని భాషాదోషాల్లేకుండా చెప్పడం అసాధ్యమైపోతోంది. ఈ కార్యక్రమాలకు అంతా మౌఖిక భాషే శరణ్యం. అయితే ఇతరత్రా న్యూస్ బులెటిన్లు,

వార్తా ఆధారితమైన కార్యక్రమాలకు లిఖిత సంప్రదాయాన్ని అనుసరించే భాష సాధ్యమే. ఈ కార్యక్రమాల్లో దృశ్యాలకు అనుగుణంగా వాయిస్ ఓవర్‌ద్వారా, న్యూస్‌రీడర్లద్వారా వార్తలందించేందుకు టెలివిజన్ రిపోర్టర్లు, ఎడిటోరియల్ సిబ్బందికి భాషా పరిజ్ఞానం చాలా అవసరం. యాంకర్ల భాషపై ఇప్పటికే విమర్శలున్నాయి.

ధ, థ, భ, ఫ వంటి మహాప్రాణాల ఉచ్చారణ విషయంలో టెలివిజన్‌లో వ్యాఖ్యాతలు ఎవరి భాషా పరిజ్ఞానాన్ని బట్టి, విద్యాస్థాయిని బట్టి వారు వ్యవహరిస్తూ, ఏది సరైన ఉచ్చారణో తెలియని అయోమయ స్థితిని కలిగిస్తున్నారు. వార్తా సిబ్బందిలో కూడా భాషాపరమైన అవగాహన అడుగంటకుండా చూసుకోవాలి. లేకపోతే ప్రసారం చేసే అపస్వరమైన భాషే సరైనదని భావించాల్సి వస్తుంది. పత్రికల్లో కూడా భాషాపరమైన కొత్త పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తున్నది. విద్యావిధానంలో భాషాపరమైన బోధన లోపభూయిష్టంగా ఉండటంవల్ల ఈ తరం ఇటు తెలుగు, అటు ఆంగ్లం ఏదీ కావలసినంతగా నేర్చుకోలేకపోతున్నారు.

ఈ ధోరణి పత్రికారంగంలోనూ, టీవీ రంగంలోనూ ఉంది. రాయడంలో, పలకడంలో దోషాలు సర్వసాధారణమవుతున్నాయి. ఇది వాంఛనీయం కాదు. ఈ విషయంలో మీడియా సంస్థలు, ప్రభుత్వం ఆలోచించాలి. పత్రికల సిబ్బందికైనా, టెలివిజన్ సిబ్బందికైనా భాషాపరమైన అవగాహన ఎంతో అవసరం. వారి ఎంపిక పరీక్షల్లో వృత్తిపరమైన పరిజ్ఞానం, భాషాపరమైన మెలకువలు రెండూ ప్రాధాన్యం వహిస్తాయి. ఒక్కోసారి వృత్తిపరమైన పరిజ్ఞాన ప్రాధాన్యంతో ఉద్యోగంలోకి రావచ్చు. వచ్చిన తర్వాతైనా భాషపై పట్టు సాధించాలి. భాషలో వ్యావహారిక రచనకు, మాండలిక రచనకు స్పష్టమైన విభజన రేఖ ఉంది. నేడు పుస్తకభాష కూడా వ్యావహారికమే అయినా అక్కడక్కడ పాత గ్రాంథిక పదజాలం తారసపడుతున్నది. ఈ తేడాలను తెలుసుకోవాలి. ప్రామాణిక భాషను అలవరచుకోవాలి. ఏ అంశంలో పట్టభద్రులైనా పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ఉద్యోగాలు పొందే అవకాశాలు ఈ రోజు విస్తారంగా ఉన్నాయి. కావలసిందల్లా ప్రామాణిక భాషపట్ల అవగాహన ఏర్పరచుకోవడమే.

అనువాదం

అనువాదం ఇతర భాషా సాహిత్య పద్ధతుల్లోని వైలక్షణ్యాన్ని, విశిష్టమైన విశేషాలను మనకు అందిస్తుంది. ఆయా భాషా ప్రాంతాల వారినుంచి మనం నేర్చుకోదగిన అంశాలను తెలియజేస్తుంది. ఒక భాషలోని ఒకానొక గ్రంథాన్ని మన భాషలోకి తెచ్చుకోవడంద్వారా ఆ భాషను మాత్రమేగాకుండా ఆ భాషలోని సాహిత్యాన్ని, సాహిత్యంలోని ఆ ప్రక్రియ వికాస స్థితిని, ప్రక్రియకు చెందిన ఒకానొక రచనను, ఆ రచనలో కర్త నిక్షిప్తం చేసిన విశిష్ట శైలినీ, రచనా విలువల్నీ ఏకకాలంలో అందుకోవచ్చు. ప్రపంచ భాషల్లోని ఈ విశేషాలను ముఖ్యంగా భారతీయ భాషల్లోని భిన్నత్వాన్నీ, భిన్నత్వంలోని ఏకత్వాన్నీ తెలుసుకునేందుకు అనువాదం తప్ప మరో మంచిమార్గం లేదు.

మౌలిక రచన గొప్పదా అనువాదం గొప్పదా అన్న మీమాంస ఇప్పటికి చాలాసార్లు వచ్చింది. ఇకముందు కూడా వస్తుంది. రెండువైపులా వాదించేవారు గతంలో ఉన్నారు. ఇకపైనా ఉంటూనే ఉంటారు. అనువాదంలో ఇతర అంశాల అనువాదం గొప్పదా సాహిత్యానువాదం గొప్పదా అన్న విషయానికి వస్తే కూడా రెండువైపులా చేరి వాదించేవారున్నారు. ఈ విషయాలు చర్చనీయమే. మౌలిక రచనకు ఎంతో స్వేచ్ఛ ఉంది. ఒక రచయిత, కవి అపారమైన స్వేచ్ఛతో, అమేయమైన సృజనాత్మకమైన ఊహాశక్తితో సృష్టి చేస్తాడు. ఆ సృష్టి ఎవరూ ప్రశ్నించలేనిది. అయితే విమర్శాయోగ్యమే. పైగా సమర్థించుకునే అవకాశం ఉంటుంది. కానీ అనువాదం ఎన్నో పరిమితుల మధ్య అస్వతంత్రమైన వాతావరణంలో సాగుతుంది. మూలరచనలోని ప్రతి అక్షరం, ప్రతి పదం, ప్రతి వాక్యం, ప్రతి పేరా మూల విధేయంగా ఉంటూనే లక్ష్యభాషలో మౌలికంగా అనిపించేలా సాగాలి. మూలంలోని ఏ పదం సందర్భాన్ని బట్టి ఏ అర్థాన్నిస్తుందో అదే అనువాదకుడివ్వాలి. మూల భాషలోని ఒక భావాన్ని, ఆ భావంలో విడదీయలేని విధంగా అల్లుకుపోయి ఉన్న జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాల్ని, సంస్కృతినీ అనువాదకుడు అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూనే లక్ష్యభాషలోని పాఠకులకు సన్నిహితంగా తీసుకువచ్చే ప్రయత్నమూ ఏకకాలంలో చెయ్యాలి. మూల భాషా సంస్కృతులను విడనాడకుండా

లక్ష్యభాషలోని నుడికారాన్ని, సామాజిక విలువల్ని మేళవించాలి. అది అనువాదం కాదు మౌలిక రచనే అన్న అనుభూతి పాఠకులకు కలిగేలా చేసి వారి ఆమోదం పొందాలి. లక్ష్యభాష స్వరూపం, ఆ భాష నిర్మాణం, ఆ భాషా సమాజంలోని ప్రత్యేకతలపట్ల అనువాదపరమైన గౌరవం, అనురక్తీ చూపాలి. దానికి విరుద్ధంగా తనకిష్టమైన రీతిలో పయనించే వీలులేదు. రచయిత ఉద్దేశించిన భావం, భాష, నడక, నడత, వస్తువు, రూపవైవిధ్యం అన్నిటినీ అనువదించాలి. పాఠకులు ముఖ్యంగా... విమర్శనాదృష్టితో తులనాత్మకంగా పరిశీలించి తప్పులు చూపేవారూ సిద్ధంగా ఉంటారు. ఇన్ని పరిమితుల మధ్య సాగే అనువాదం మౌలిక రచనకంటే ఏమాత్రం తక్కువకాదని గుర్తుంచుకోవాలి. ఇలాంటిదాంట్లో మళ్లీ సాధారణానువాదం (General Translation) గొప్పా? సాహిత్యానువాదం (Literary Translation) గొప్పా అనేదీ పరిశీలనాంశమే. సాహిత్యంలోని కథల సంపుటినో, నవలనో, కవితనో అనువదించడం చాలా కష్టం కానీ, దానికంటే ఎవరో ఒక ప్రముఖుని జీవితచరిత్రనో, ఒక యాత్రాగ్రంథాన్నో, ఆత్మకథనో, అభివృద్ధి వివరాలతో కూర్చిన గ్రంథాన్నో అనువదించడం తేలికనీ అనేవారున్నారు. అది ఎలాంటిదైనా అనువాదమే ఒక సృజనాత్మక కృషి. కొన్ని పరిమితులు, అంచనాలు, ప్రమాణాలు, భాషాప్రయోగ జాటిల్య, సారళ్యాల మధ్య సాగే సాహిత్యానువాదమైనా, సాధారణాను వాదమైనా అది అనువాదమే.

ఒక భాషకు చెందిన సృజనాత్మక రచయితకు ఒక భాష బాగా వస్తే చాలు. అనువాదకునికి రెండు భాషలూ రావాలి. మూలభాష స్వరూపం, లక్ష్యభాష స్వరూపం కరతలామలకమై వుండాలి. 'అనువాదమనేది సాధారణంగా పరభాష నుండి మాతృభాషలోకి జరుగుతుంది. ఆ మాతృభాష అంటే అనువాదకుడు రాసే భాష ఇంకా బాగా కూడా రావాలి. అతను మాతృభాషలో దాదాపు నిష్ణాతుడై వుండాలి. నిష్ణాతుడు కావడమంటే నిఘంటువులు కంఠోపాఠం చేయడం కాదు. నిఘంటువులు పదాల అర్థాలను వివరిస్తాయేగానీ యే పదాన్నీ యెప్పుడు, యెలా వాడాలో వివరంగా చెప్పవు' అంటారు రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా). ఎంత మాతృభాషైనా, ఎంత నిష్ణాతులైనా ఎప్పటికప్పుడు అనువాదం సవాలే. నిన్నటి ఒడుపు నిన్నటిది. నేటి ఒడుపు నేటిది. తెలిసిన భాషైనా ఒక్కోసారి గంటకు పేజీ మాత్రమే ముందుకు కదిలితే ఒక్కోసారి ఎనిమిది పేజీలవరకూ చకచకా సాగవచ్చు. చేయితిరిగిన అనువాదకుడైనా పుస్తకం మారినప్పుడు, రచయిత మారినప్పుడు, వాక్యనిర్మాణ క్లిష్టతనుబట్టి, పదప్రయోగ ధోరణినిబట్టి అనువాదకుని నడకవేగం మారుతుంది. తెలిసిన విషయంలాగే, అర్థం తెలిసిన పదాల్లాగే అనిపించినా సరైన మాటలు పేర్చుకుంటూ దీటైన వాక్యాలల్లుకుంటూ ముందుకు సాగడం పట్టుదొరికీ

దొరకనట్లుంటుంది. నిఘంటువును ఆశ్రయించడమొక్కటే మార్గమనిపించినప్పుడు నిఘంటువులోని పదాలు కూడా సరిపడవనిపిస్తుంది.

అనువాదం కూడా ఎంతో విస్తృతమైన కార్యక్షేత్రం. అందరూ అన్నింటినీ అనువదించలేరు. కవిత్వం, కథ, నవాలా ప్రక్రియలు, సాంకేతిక, వైజ్ఞానిక గ్రంథాలు, మనస్తత్వ, సామాజిక, భౌతిక, రసాయనాది శాస్త్రాలు, సాధారణ గ్రంథాలు, జర్నలిజం మొదలైన అనేకరకాలైన అనువాదాలున్నాయి. ప్రధానంగా ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువదించడానికి ఆంగ్లం, తెలుగు రెండూ తెలిసినా చాలదు. వైద్యరంగంలో వేర్వేరు స్పెషాలిటీలున్నట్లుగానే అనువాదకులు తమకు ఆసక్తీ, అభినివేశం వున్న రంగాలను ఎంచుకుంటారు. ఈ రకమైన అనువాదాల్లో వస్తువు పూర్తిగా సాంకేతికం. భాష తెలిసిన తెలుగైనా సాంకేతిక విషయాలు తెలిసినప్పుడే ఆ తెలుగు సుగమంగా సాగుతుంది. అనువాదం ఎప్పుడూ సహజంగా వుండదు. కారణం ఏ రెండు భాషల్లోనూ ధ్వనులు, వర్ణక్రమం, పదజాలం, పదబంధాలు, పద–వాక్య నిర్మాణం ఒకలాగా వుండవు. రెండు భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం అంటే రెండు భాషల్నీ చదివి అర్థం చేసుకోవడం మాత్రమే కాదు. ఏ భాషలో వాక్యం ఎటునుంచి తిరుగుతుందో తెలియాలి. పరస్పర భిన్నంగా వున్న రెండు భాషల మధ్య సమన్వయం సాధించి మూలభాషను సరిగా అర్థం చేసుకుని లక్ష్యభాషలో సహజమైన రీతిలో వచ్చేలా అనువదించగలగాలి. దీనికి అనువాదం కాదు (Instead of Translation, Transcreation has to be done) పునరుత్పత్తి కూడా జరగాలి. ఇది సహజంగా ఉండాలి. మౌలిక రచనల్లో ఉన్నట్లే అనువాదంలో కూడా ఒక్కో రచయితకు ఒక్కో శైలి వుంటుంది. మూల రచయిత వాక్యనిర్మాణం, శైలి కొంతవరకు అనువాదంలో కూడా వచ్చినా అనువాదకుని ముద్ర కూడా విశేషంగా వుంటుంది.

అనువాదం మూలానికి పూర్తి న్యాయం చేకూరుస్తూ లక్ష్యభాషలోని గ్రంథంలా పాఠకుల ఆదరాభిమానాల్ని పొందగలగడం మాటలు కాదు. అనువాదకునికి రెండు భాషల్లో ఎంత ప్రావీణ్యం ఉన్నా అనువాదం చక్కగా రావడం అంత తేలికైన విషయం కూడా కాదు. లక్ష్యభాషను పూర్తిగా అవగాహన చేసుకోవడమేగాక లక్ష్యభాషలో మాటల్ని, భావాన్ని సరళసుందరంగా తేలిగ్గా అర్థమయ్యేలా అనువదించాలంటే అనువాదకుడు తాను చేపట్టిన పనిని ఎంతగానో ప్రేమించాలి. అనువాదంపై ఎంతో అనురక్తిని పెంపొందించుకోవాలి. ఒక ప్రసిద్ధమైన పుస్తకాన్ని ఎంతోమంది అనువాదం చెయ్యవచ్చు. వాటిలో ఒకటిరెండు మాత్రమే గొప్ప అనువాదాలుగా నిలిచిపోతాయి. 'ఒంటిచేత్తో అనువాదాలను చుట్టేయగలను' అని విర్రవీగేవారు కూడా అన్ని అనువాదాలను అంత

విధేయంగా చేయలేరు. అందుకే అనువాదం ఒక కళ. ఒక శాస్త్రం. ఒక యజ్ఞం. కళను అభ్యసించినట్లుగా, శాస్త్రాన్ని అధ్యయనం చేసినట్లుగా యజ్ఞాన్ని శ్రద్ధానురక్తులతో చేసినట్లుగా అనువాదాన్ని పరిగణించాలి.

అనువాదలోకంలో జర్నలిజం రంగం చెప్పుకోదగ్గ క్షేత్రం. పత్రికారచనలో అనువాదం అనివార్యం. దైనందిన కార్యకలాపంలో ప్రతి తెలుగు పత్రికా రచయితా కొంత తెలుగులో వార్తా కథనాల్ని సృష్టించవలసి వుంటే మరికొంత ఆంగ్లం వంటి భాషలనుంచి సంగ్రహించవలసి వుంటుంది. స్థానికంగా జరిగే సభలు, సమావేశాలు ఇతర వనరులనుంచి విలేకరులు తెలుగులోనే సమాచారాన్ని సేకరించి మంచి పదాలు, వాక్యాలతో పాఠకులకు ఆసక్తికరంగా వుండేలా రాస్తారు. ఆంగ్లంలో జరిగే ఉపన్యాసాలు, విలేకరుల సమావేశాల్లో ఆకరసామగ్రిని అర్థం చేసుకొని తెలుగులోకి తెచ్చుకోవాలంటే అనువాద ప్రావీణ్యం తప్పనిసరి. ఉప సంపాదకులైతే కార్యాలయానికి ఆంగ్లంలో వచ్చే పత్రికా ప్రకటనలు, వార్తాసంస్థలందించే దేశ, విదేశీ వార్తల్ని అప్పటికప్పుడు తెలుగులోకి సులభగ్రాహ్యంగా అనువదించి పత్రికలోకి ఎక్కించాల్సి వుంటుంది. టెలివిజన్ ఛానళ్లలో పనిచేస్తున్న విలేకరులకు, సంపాదక సిబ్బందికి 24 గంటల వార్తా ప్రసారాల్లో ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువదించుకునే అంశాలు అనేకం వుంటాయి.

పత్రికా రచయితలకు తెలుగు, ఆంగ్లం ఉభయభాషల్లోనూ ప్రజ్ఞ కావాలి. జర్నలిజం కళాశాలల్లో, పాఠ్యాంశాల్లో అనువాద శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. పత్రికా రచయితగా పనిచేయడానికి తెలుగులో చక్కగా రాయగలిగే శక్తి, ఆంగ్లం నుంచి అలవోకగా అనువాదం చేయగల నేర్పు అలవరచుకోవడం ఎంతో అవసరం. అటు పత్రికారంగంగానీ, ఇటు టెలివిజన్ రంగంగానీ ఏ రంగాన్ని ఎన్నుకున్నా ముందునుంచే శ్రద్ధాసక్తులతో భాషల్ని అభ్యసించాలి. రోజూ తెలుగు, ఆంగ్ల పత్రికలు భాషాదృష్టితోనూ, అనువాద దృష్టితోనూ పరిశీలనగా చదవాలి. తెలుగు పత్రిక చదువుతున్నప్పుడే అన్ని రకాలైన వార్తల్ని, వ్యాసాల్ని సంపాదకీయాన్ని చదివి పద, వాక్య నిర్మాణాన్ని గమనించాలి. చిన్నప్పుడు చదివిన తెలుగు ఎక్కువగా ఒంటబట్టి వుండకపోవచ్చు. చిన్ననాటి తెలుగు వాచకాలను మళ్లీ సమకూర్చుకుని శ్రద్ధగా చదవాలి. తెలుగు అక్షరాలను, ఒత్తులను, గుణింతాలను, పద, వాక్యరచనను సాధనచేయాలి. చిన్నచిన్న వాక్యాలతో ప్రారంభించి క్రమంగా కొంత జటిలమైన అంశాలను సైతం తప్పుల్లేకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. సమకాలీన అంశాలను, పండుగలను ఇతర సాంస్కృతిక విషయాలను తీసుకుని, అవసరమైతే కొంత అదనపు సమాచారాన్ని సేకరించుకొని వ్యాసాలుగా రాయాలి. మన దృష్టిలో భాష బాగా వచ్చు

అనుకొన్నవారికి రాసిన వాటిని చూపించి సలహాలను పొంది ఆ ప్రకారం మరింత మెరుగుపరచుకోవాలి. సందేహాల్ని తీర్చుకోవాలి. ఎంత ఎక్కువగా వచ్చినా వాటన్నిటినీ మొహమాటపడక తీర్చుకోవాలి. ఏ సందేహమైనా తీర్చుకోనంతవరకు అది తీరకుండానే వుంటుంది. దాని ప్రస్తావన ఎప్పుడొచ్చినా సందేహాస్పదంగానే రాస్తాం. తెలుగులో తొలిరోజుల్లో వచ్చిన నవలలు, కథలు, కవితలను విపరీతంగా అపారమైన అనురక్తితో చదవాలి. ఆ రచనల్లోని వస్తువును, శిల్పాన్ని, పదప్రయోగ నైపుణ్యాన్ని ఆస్వాదిస్తూ చదవాలి. ఆనాటి కవులు, కథకులు, నవలాకారులు, నాటకకర్తలను, వారి సాహిత్యకృషిని, తెలుగు సాహిత్యంపై వారు వేసిన ముద్రను అధ్యయనం చేయాలి. పదజాలాన్ని, పదప్రయోగ సందర్భావసరాలను, రచనకు అవి వన్నెతెచ్చిన తీరును, ఆ పదాలు తెలుగుభాషకు సంతరించిన మాధుర్యాన్నీ అర్థం చేసుకొనే ప్రయత్నం చెయ్యాలి. ఆ రకంగా తెలుగును మెరుగుపరచుకొని అటుపైన అనువాదంపై దృష్టిపెట్టాలి. ఆంగ్ల దినపత్రికను చదవాలి. ఆంగ్ల వాక్యరచనా స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. ఆంగ్ల వాక్యాలను ఒక్కటొక్కటీ అనువాదం చేసి చూసుకోవాలి. వార్తనంతా అనువదించే దశకు వచ్చిన తర్వాత మిత్రులకు చూపించి సలహాల్ని పొందాలి. నిఘంటువులను దగ్గర పెట్టుకోవడం కుదరదు. అనువాదాన్ని రోజురోజుకూ ఎక్కువ చెయ్యాలి. అనువాదంలో తొలుత తెలుగు పత్రికలో వచ్చిన ప్రధాన వార్తల్ని ముందు చదివి, ఆంగ్ల దినపత్రికలో వచ్చిన ఆ వార్తలను అనువదిస్తే కొంత సులభంగా సాగుతుంది. ఎంత చదువుతూ అంత లీనమైతే తెలుగు అంతగా అబ్బుతుంది. అనువాదం ఎంతగా చేస్తూపోతే అంతగా ప్రావీణ్యం పెరుగుతుంది. పత్రికలో పనిచేసేవారైనా, ఎలక్ట్రానిక్ మీడియాలోని వారైనా తెలుగు, ఆంగ్లభాషలపై ఈ రకమైన అనురక్తి కనబరచడంలోనే వారి విజయం ఆధారపడి వుంది. జర్నలిస్టుగా మీరు ఏ హోదాలో వున్నా, ఏ స్థాయిలో వున్నా సృజనాత్మకంగా ఆలోచించడం, తగిన సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యాన్ని సముపార్జించుకోవడం, పాఠక, ప్రేక్షక నాడి పట్టుకొనే శక్తి, వారి అవసరాలను గుర్తించడం... ఇవన్నీ ఎంత ముఖ్యమో భాష ఒక్కటీ అంత ముఖ్యం. మిగతావన్నీ అందమైన శరీరమైతే అందమైన శరీరానికి మరింత వన్నెతెచ్చే ఆభరణం భాష. దానికి గౌరవాన్ని ఆపాదించేదే సృజన. భాషలో మౌలిక రచన సగం, అనువాద నైపుణ్యం మరో సగం. రెండు సగాలు కలిస్తేనే పరిపూర్ణత.

పత్రికల్లో అనువాద రచన, శైలి మెరుగుపడవలసిన అవసరం ఎప్పుడూ వుంటుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే పరిణామాల వార్తలు ఎప్పటికప్పుడు పత్రికా వార్తాలయాలకు వచ్చిపడుతూ ఆ క్షణమే తెలుగులోకి అనువదించమని అడుగుతుంటాయి వాటిలోని కొత్త మాటలు. అదొక సవాలు. ఆ సవాలును స్వీకరించి అప్పటికప్పుడు కొత్త మాటలు

కనిపెట్టడంలో సంపాదక సిబ్బంది కృషి ప్రశంసనీయం. దేశవిదేశాల్లో చోటుచేసుకుంటున్న సంఘటనలు, అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా పెద్దసంఖ్యలో కొత్త పదాలు వస్తున్న ఈ రోజుల్లో సమానార్థాల్ని రూపొందించి వ్యవహారంలోకి పంపే బాధ్యతను క్రియాశీలంగా నిర్వహించవలసింది పత్రికారచయితలే. ఈ వేగాన్ని అందుకొని ఈ సవాలును ఎదుర్కొనే వేరే వ్యవస్థ లేదు. ఇటు పత్రికారచయితల్లో కూడా బద్ధకం వదలడంలేదు. తెలుగు పరిస్థితి క్షీణిస్తున్నట్లుగానే తెలుగు అనువాద పరిస్థితి కూడా అవసరమైన స్థాయిలో లేదు. 'అఫిడవిట్' అంటే 'ప్రమాణపత్రం' అని, 'టాస్క్‌ఫోర్స్' అంటే 'కార్యసాధన సమితి' అని, 'రోడ్‌మ్యాప్' అంటే 'మార్గసూచి' అని, 'జె.ఎ.సి.' అంటే 'ఐక్య కార్యాచరణ సమితి' (ఐకాస) అని... ఇలా కొన్ని పత్రికలు అనువాదం చేస్తున్నాయి. ముఖ్యంగా 'ఈనాడు' ఈ విషయంలో ప్రత్యేక కృషి చేస్తున్నది. వీలయినంతవరకు అన్ని ఆంగ్ల పదాలను తెలుగులోకి అనువదిస్తోంది. ఇంకా 'ఇందిరాగాంధీ జాతీయ ఓపెన్ యూనివర్సిటీ' వంటి ఆంగ్ల పదాలను వాడుతూనే ఉన్నారు. ఈ తరానికి చేరేందుకు ఆంగ్ల పదాలను వాడక తప్పడం లేదంటున్న పత్రికలూ ఉన్నాయి. జాతీయ భాషా పత్రికలతో పోలిస్తే తెలుగు పత్రికలు ముద్రణ ప్రమాణాల్లో అన్నివర్గాల పాఠకులను ఆకట్టుకునేందుకు ఎక్కువ పుటలను అందిస్తున్నాయి. ఈ పుటలు నింపే పనిభారమే అధికమైంది. దీనితో గ్రామస్థాయి నుంచి నగరస్థాయి వరకు విలేఖరులు ఎవరిష్టం వచ్చినట్లు వారు వార్తలు కంపోజ్ చేసి పంపేయడం సర్వసాధారణమైంది. వీటిని ప్రతి పంక్తీ పరిశీలించి తప్పులు దిద్దడానికే సమయం చాలని పరిస్థితులవల్ల సంపాదక సిబ్బంది అనువాదం విషయంలో అంతగా శ్రద్ధ చూపలేకపోతున్నారు.

నూతన పదకల్పనలో జరిగిన, జరుగుతున్న కృషి తక్కువేమీ కాదు. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో పత్రికా రచయితలకు సమయం ఉండడంలేదు. శ్రద్ధ కూడా లోపిస్తోంది. నిత్యం అనేక ఆంగ్ల పదాలు వస్తుంటాయి. వాటికి తెలుగులో కొత్త మాటల్ని కనిపెట్టి వ్యవహారంలోకి వదిలితే తప్పక జనామోదం పొందుతాయి. ఆమోదం పొందినవి ప్రామాణికమవుతాయి. భాషను సుసంపన్నం చేస్తాయి. జనామోదం పొందనివి పోతాయి. నష్టంలేదు కానీ, అనువాదం ద్వారా కొత్త అనువాదపదాల సృష్టి మాత్రం ఆగడానికి వీలులేదు. కొత్త మాటల్ని కనిపెట్టి ప్రామాణీకరించే ప్రయత్నాలకోసం మీడియా సంస్థల్లో ఒక వ్యవస్థ ఉండాలి. ప్రతి సంస్థ తనదైన భాషా విధానాన్ని (Style Sheet) రూపొందించుకుని అమలుపరచాలి. ఆ పత్రిక, టెలివిజన్ ఛానల్‌లో ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో భాషా విధానాన్ని అనుసరించడానికి ఈ వ్యవస్థ పనికివస్తుంది.

మనం రాసేది తెలుగేనా!

అన్ని భాషలకూ ఉన్నట్లే తెలుగుకూ తనదైన విశిష్టత వుంది. ఆ విశిష్టత తన పదాల్లో, వాక్యనిర్మాణంలో, అందుకోసం మనం ఉపయోగిస్తున్న సామెతలు, జాతీయాలు, పలుకుబడులతో కూడిన నుడికారంలో ఉంది. దీనివల్లనే ఇది మన భాష, అసలుసిసలైన భాష అని తెలుస్తుంది. రాసే తెలుగుభాషలో జాతీయాలది అగ్రస్థానం. తల్లి నేర్పిన భాషలో మన పెద్దలు రాసిన శిల్పరమణీయమైన తొలినాళ్ల గ్రంథాల్లో, కమ్మని కథలు చెప్పి బాల్యంలో ఒక వింతలోకాన్ని సృష్టించాయి. జ్ఞాపకాల దొంతరల్లో నిలిచిపోయిన 'చందమామ' వంటి పత్రికల్లో మిత్రలాభం, మిత్రభేదం వంటి పంచతంత్ర కథల్లో, జానపదుల కథల్లో, గేయగాథల్లో, అక్షరజ్ఞానం లేకపోయినా కలుషితం కాని సజీవ భాషను అక్కునజేర్చుకున్న గ్రామీణుల వ్యవహారంలో నుడికారపు సొంపు కనిపిస్తుంది. అటువంటి తెలుగు పలుకుబడులను బండ్లకెత్తిన ఆ రోజులు పోయాయి. ఈనాడు అవి బడులలో, గుడులలో, నుడులలో ఎక్కడా కానరావడంలేదు. అయితే ఆ పలుకుబడులతో భాషను నింపి రాస్తే ఆ సౌందర్యాన్ని హాయిగా ఆస్వాదించి, ఆనందించి తనివితీరా నిట్టూర్చే పాఠకజనం మాత్రం ఈనాటికీ ఉన్నారు.

పత్రికల్లో, ప్రసార సాధనాల్లో ఈ తెలుగు నానాటికీ మృగ్యమవుతోంది. ఇళ్లల్లో, గృహిణులు కూడా పత్రికల భాషను, టెలివిజన్ ధారావాహికల భాషను మాట్లాడుతున్నారు. టెలి ధారావాహికల రచయితలు పత్రికా భాషను చదివి జీర్ణించుకుని అదే భాషతో తిరిగి టీవీలను నింపుతున్నారు. విద్యాలయాల్లో అదే అనుసరణీయ భాష అవుతోంది. అసలైన తెలుగును వెనక్కునెట్టి కాస్త తెలుగును, అధికమోతాదులో ఆంగ్లపదాలను కలిపి కిచిడీని వండి వారుస్తున్నారు యాంకర్లు. అది చూసే, వినే తెలుగు అభిమానులు మండి పడుతున్నారు. యాంకర్లు తెలుగును భ్రష్టుపట్టిస్తున్నారని శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లలు ఇదే సరైన తెలుగని తప్పుదోవపట్టే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు. పత్రికలవారు కూడా తమదైన ప్రత్యేకమైన కృతకమైన భాషను, వాక్యనిర్మాణ రీతిని తయారుచేస్తున్నారు. ఈ కృతకమైన భాష సెగలవేడి ఇంకా తాకలేదేమో భాషాభిమానులు ఇంకా పత్రికలను తిట్టిపోయడంలేదు. పైగా ఈ భాషావేత్తలకంటే పత్రికలవారే

మామంచివారు అని పొగిడేస్తున్నారు. అంతటితో ఆగుతున్నారా? లేదు. పత్రికా రచయితలే లేకపోతే మా తెలుగును రక్షించేవారే లేరని అంతులేని ఆరాధనాభావాన్ని వ్యక్తంచేస్తున్నారు.

పరిభాష పేరుతో పత్రికా రచయితలు మౌలిక రచనలో, అనువాదంలో అసలు తెలుగును తోసిరాజని కృతకమైన తెలుగుకు పట్టంగడుతున్నారు. 'రాష్ట్రంలో తాగునీటి పథకాలను చేపట్టేందుకు 1500 కోట్ల రూపాయలు మంజూరు చెయ్యాలని ప్రపంచబ్యాంకు నిర్ణయించింది. ముఖ్యమంత్రి సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం ప్రకటించారు. బ్యాంకు మొదటిదశలో 1000 కోట్ల రూపాయలను విడుదల చేస్తుందని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఆయన చెప్పారు'. ఈ వాక్యాలు చదివితే సరిగ్గా ఈ కింది ఆంగ్ల వాక్యాలకు యథాతథానువాదంగా అనిపిస్తుంది! చూడండి...

"World Bank has decided to sanction Rs.1500 crores grant for taking up drinking water schemes in the State. Chief Minister announced this while talking to reporters in secretariat. Bank will release Rs.1000 crores as a first phase. Proposals to this effect have been sent, he said."

దీన్నిబట్టి చూస్తే, మనవాళ్లు ఆంగ్లంలో ఆలోచిస్తూ తెలుగులో రాసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి వార్తలు పత్రికల్లో కోకొల్లలు. మరోవార్త... 'రాష్ట్ర ప్రభుత్వం 2010-11 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులో సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తుందని భారీ సేద్యపునీటి శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య వెల్లడించారు. జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిచేస్తామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిపై చేసిన విమర్శల్ని పొన్నాల తీవ్రంగా ఖండించారు'.

"Top priority will be given to irrigation sector by allocating maximum budget, for the 2010-11 year, Ponnala Lakshmaiah, Minister for major irrigation announced. Government will complete irrigation projects takenup under jalayagnam, at any cost, he clarified to a question. He strongly condemned the remarks made by opposition leader Chandrababu Naidu, against Chief Minister".

తెలుగు వార్త ఆంగ్ల వార్తకు అనువాదమేమీ కాదు. కానీ విలేకరి ఆంగ్లంలో ఆలోచించి పత్రికా పరిభాషను కలబోసి ఈ వార్త రాశారని తెలుస్తోంది.

మరో వార్త చూద్దాం...'ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చెయ్యాలని కోరుతూ తెలంగాణ రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస), తెలంగాణ విద్యార్థి జె.ఎ.సి. ఇచ్చిన

పిలుపుననుసరించి నేడు రాష్ట్రవ్యాప్తంగా బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్ని ధ్వంసం చేశారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు బంద్ పాటించగా ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది హాజరు పలుచగా కనిపించింది. రాష్ట్ర పోలీసులకు తోడు కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు'. కొన్ని తప్ప దినపత్రికల్లో కనిపించే వార్తలన్నీ ఇలాంటి పదాలతో కూర్చినవే ఉంటాయి. ఆంగ్లంలో వచ్చిన ఏజెన్సీ వార్తలు, పత్రికా ప్రకటనలను తెలుగులోకి అనువాదం చేస్తే వాక్యనిర్మాణం, పదజాలం ఇలా వుండడం సహజం. కానీ, తెలంగాణ రాజకీయ జె.ఎ.సి. ఏర్పాటుచేసిన బహిరంగ సభ రిపోర్టింగ్ కూడా ఇదేవిధంగా రాస్తున్నారు. తెలుగులో ప్రసంగాలు చేసిన సభలోని అంశాల్ని కూడా తెలుగులో కాకుండా ఆంగ్ల వాక్యాల సరళిలో మననం చేసుకుంటూ రాస్తారు. ఈ భాషను పత్రికల్లో నిత్యం చదివే రాజకీయ నాయకులు, మంత్రులు కూడా సభల్లో, విలేకరుల సమావేశాల్లో ఇలాంటి పత్రికారచయితల భాషలోనే మాట్లాడుతున్నారు. ఇళ్లలో, మిత్రులతో మాత్రం సాధారణ భాష మాట్లాడుతారు.

ఈ రోజుల్లో పత్రికల్లో పనిచేసేందుకు కొత్తగా వచ్చినవారు తమకు భాషా పరిజ్ఞానం అవసరం లేదనుకుంటున్నారు. ఆ రోజు పత్రికను చదివితే అదే పడికట్టు పదాలతో రాసేస్తే సరిపోతోంది. విలేకరులకు అంతగా భాషా పరిజ్ఞానం అవసరం లేదని, వారు రాసిందాన్ని ఉప సంపాదకులు ఎలాగూ సరిదిద్దుతారని అనేవారు. కాబట్టి ఆ రోజుల్లో వార్త ఎలా రాసినా నడిచేది. ఇప్పుడు ఉప సంపాదకులు దిద్దే పరిస్థితి లేదు. ఎవరు ఎలా రాస్తే అలాగ వచ్చేస్తుంది. విలేఖరులు అందరూ కాదుగానీ, చాలామంది భాషపై పట్టులేనివారున్నారు. 'ఉద్రిక్తత నెలకొని ఉంది', చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు', 'విశ్వసనీయవర్గాలు తెలిపాయి', 'విమర్శలు వెల్లువెత్తుతున్నాయి', 'పోలీసులు లాఠీలను ఝళిపించారు', 'ఇది అప్రజాస్వామికం', 'విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు', 'తక్షణం రాజీనామా చెయ్యాలి'... ఇలా నేటి పత్రికారచయితలు తమ అక్షరాల పొదిలో ఉన్న ఇన్‌స్టాంట్ ఫుడ్ వంటి పరిభాషతో నెట్టుకొస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం మీడియా రంగంలోకి వస్తున్న వారికి భాషపట్ల అభిరుచి కావలసినంత ఉండడంలేదు. ఇదీ అన్ని ఉద్యోగాల్లాంటిది అయిపోయింది. వాళ్లనని ప్రయోజనం లేదు. విద్యారంగంలో నెలకొని వున్న వాస్తవిక పరిస్థితి అది. తమ పిల్లలకు వృత్తి, ఉద్యోగాల కోసం ఆంగ్లమే బోధించమని తల్లిదండ్రులే అడుగుతున్నారు. ఈ దృక్పథం సరైందికాదని, భాష మన జాతి అస్తిత్వమని, దాన్ని కాపాడుకోవాలని, పిల్లలకు ఫలానా తరగతివరకు తప్పక తెలుగు బోధించాలని కచ్చితమైన నిబంధన విధించలేని స్థితిలో ప్రభుత్వం వుంది. పిల్లలకు 'ఆంగ్లం నేర్పితే

మాకు అభ్యంతరం లేదు. హిందీ నేర్పితే అభ్యంతరం లేదు. కానీ, తెలుగు కూడా నేర్పించేందుకు విద్యావిధానంలో ఒక నిబంధన విధించండి' అని భాషాభిమానులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు.

మాండలికాలను విస్మరిస్తున్నామా!

ప్రాంతాలవారీగా మనకున్న మాండలికాలే మన భాష ఎంత సంపన్నమైందో తెలియజేస్తున్నాయి. అటువంటి మాండలికాలను నిర్లక్ష్యం చేస్తూ మంచిమంచి అచ్చతెలుగు పదాలకు దూరమవుతున్నాం. పరిమిత పదజాలంతో నిశ్చల సరస్సులా వుంటున్న ప్రామాణిక భాషను జీవద్భాష అని అనుకోవడం సమంజసమేనా? ప్రామాణిక భాష అనే ప్రధాన స్రవంతిలో మాండలికాల పిల్లకాలువలు కలవక భాష పేదరాలైపోవడంలేదూ? నిజానికి భాష అంటే మాండలికాలే. ఆ మండల ప్రజలకు కన్నతల్లి (మాతృభాష) మాండలికమే. ఏ మండలానికి ఆ మాండలికం ప్రధాన భాష. ప్రామాణిక భాష అని చెప్పుకుంటున్న వ్యావహారికంలో విద్యావంతులు మాత్రమే మాట్లాడుకుంటారు. సాధారణ ప్రజలకు ప్రామాణిక భాషంటే ఏమిటో తెలీదు. పత్రికల్లోని భాష, టెలివిజన్ ప్రసారాల్లో వినిపించే భాష తాము మాట్లాడుకునే భాష వేరువేరని మాత్రం తెలుసు.

ప్రామాణిక భాష రూపొంది చాలాకాలమైనా అన్ని ప్రాంతాలవారికీ అది దగ్గరకాలేకపోయింది. పుస్తకాల్లో రాసుకోడానికి, పత్రికల్లో చదువుకోడానికి పరిమితమైనదే తప్ప తమ భావాలను స్వేచ్ఛగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించేందుకు మాధ్యమం కాలేకపోయింది. అయినా ప్రామాణిక భాషను పరిమితంగానైనా వాడుకుని ఆదరిస్తున్నారు. ఇటీవలికాలంలో ప్రాంతీయ అస్తిత్వ భావనల నేపథ్యంలో, పాఠ్యపుస్తకాల్లో, ఇతరత్రా అవసరాల్లో మాండలికమే కావాలని అడుగుతున్నారు. ఈ ఉద్యమం తొలుత సృజనాత్మక రచనల్లో ప్రవేశించింది. కథలు, కవిత్వం, నవలలు, విమర్శలు మాండలికంలో రాస్తున్నారు. ప్రామాణిక భాష పెత్తనాన్ని ఇక సహించబోమని అంటున్నారు. మా గోసను శక్తిమంతంగా చిత్రించేది మా యాసే అన్న నినాదం వెలికివస్తోంది. అప్పట్లో పండితులు వ్యావహారిక భాషను గ్రామ్యమని నిందిస్తే, ఇప్పుడు ప్రామాణిక భాషను అధిక సంఖ్యాకులు పరాయి భాషగా చూస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం వాడుక భాష లేదా వ్యావహారిక భాష పేరుతో మాండలికాలపై కొన్ని ప్రాంతాల్లో భాషపై పెత్తనం చేయడమే తప్ప ఆ మాండలికంలో అసంఖ్యాకంగా ఉన్న తెలుగు మాటల్ని స్వీకరించి వ్యావహారిక భాషను అందరి భాషగా చేయలేపోయాం. ఆ పని చేసి వుంటే తెలుగు మరింత సుసంపన్నం అయివుండేది. ఆ ప్రయత్నమే జరగలేదు.

ప్రామాణిక భాష అనే బ్రహ్మపదార్థంలో ఎవరి అస్తిత్వం ఎంత? పోనీ ఈ ప్రామాణిక భాషలో అచ్చతెలుగు వ్యక్తిత్వ ఛాయలేమైనా వున్నాయా అంటే ఎనభైశాతం సంస్కృతం, తదితర భాషాపదాలే. మాండలికాలనుంచే స్వీకరించగలిగితే సంస్కృతం, ఇతర పదాల ఆధిక్యం తగ్గేది. దీనిపై దృష్టి కేంద్రీకరించే వ్యవస్థీకృతమైన ప్రయత్నాలు జరిగే అవకాశాలు ఇప్పటికైతే కనిపించడంలేదు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలకు పరిశోధకులను పంపి మరుగున పడిపోతున్న వేలాది మాండలిక పదాలను సేకరించి వెలుగులోకి తెస్తున్నారు. అయితే ఈ పదాలను ప్రధాన స్రవంతిలోకి తెచ్చే ప్రయత్నం భాషావేత్తలద్వారా జరిగేది కాదు. పత్రికలద్వారా అయితే ఈ పని నెరవేరుతుంది. మంచి ఫలితాలు వస్తాయి. అలా చేయకపోతే అగాధం మరింత పెరుగుతుంది. ఇంకోవైపు తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తూ ప్రముఖ రచయితలుగా పేరు పొందుతున్నవారు కూడా దశాబ్దాల కిందటే తమ గ్రామాలకు, గ్రామాలలోని సంస్కృతికి, అక్కడి మాండలిక భాషకు దూరమయ్యారు. వీరు కూడా మూసపోసిన ప్రామాణిక భాషలో అన్నిరకాలైన రచనా వంటకాలు వండి వడ్డిస్తున్నారు. తెలిసో తెలియకో జీవద్భాషకు దూరమవుతున్నారు.

భాషా జీవనదులన్నీ కలిసి మహాసముద్రంలా రూపొందవలసిన పరిస్థితిని అనేకులు అనేకవిధాలుగా అడ్డుకొంటున్నారు. అంతటా పరిమిత సంఖ్యలోని పడికట్టు పదాలతో గ్రంథరచన, పత్రికారచన, రేడియో, టెలివిజన్ రచన సాగుతున్నది. అందులో అసలు సరుకు ఎంతో చూసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు. భాషారంగంలో ఈ ధోరణి మూలంగా అనువాదరంగం కూడా పరిమిత పదజాలంతో కొనసాగుతూ ఒక అసంపూర్ణ ప్రక్రియగా వుంది. మాండలిక రచనలు అందరికీ అర్థంకావు అనే అభిప్రాయం తప్పు అని నిరూపించే రచనలు అనేకం వచ్చాయి. గురజాడ 'కన్యాశుల్కం'లో ఉత్తరాంధ్ర మాండలిక పదాలు విస్తృతంగా వాడడం, అవి నాటకానికి ఎంతో ప్రాచుర్యాన్ని, జనాదరణను తెచ్చిపెట్టిన విషయం విస్మరించారు. రావిశాస్త్రి రచనలు కలిగించిన సంచలనానికి, స్పందనకు ఆయన స్వీకరించిన వస్తువు, శైలితోపాటు వాటిని అత్యంత శక్తిమంతంగా వ్యక్తీకరించిన మాండలికాన్ని ఎవరూ మరువలేరు.

కాళీపట్నం రామారావు, దాశరథి రంగాచార్య, పులికంటి కృష్ణారెడ్డి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, వేముల ఎల్లయ్య, కాలువ మల్లయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, వి.ఆర్.రాసాని, అన్నవరం దేవేందర్, వేంపల్లె అబ్దుల్‌ఖాదర్ వంటి ఎంతోమంది రచయితలు మాండలికంలో అద్భుత రచనలు అందించారు. కథల్లో, నవలల్లో, నాటకాల్లో అక్కడక్కడా

పాత్రోచితమైన మాండలికాన్ని ప్రయోగించి పండించినవారు ఇంకా చాలామంది ఉన్నారు. బాగా రాయగలిగితే మాండలికం వల్ల ప్రాంతీయ సంస్కృతి, ప్రజల జీవనంలో ఉన్న అరుదైన విశేషాల్ని వారి యాసలో బాగా చెప్పగలిగితే పాఠకులు కూడా ప్రత్యేకమైన ఆసక్తితో చదువుతారు. ఉత్తరాంధ్ర వాసి కాని గొరుసు జగదీశ్వర్ రెడ్డి రాసిన 'వాల్తేరత్త' కథ ఇక్కడ ప్రస్తావనార్హం. అన్ని మాండలికాలూ గొప్పవే. అన్ని మాండలికాలను ప్రాంతాలకతీతంగా పాఠకులందరూ ఆదరించారు, ఆస్వాదించారు. రచయితలు మాండలికాలను సమర్థంగా, సహజంగా, కల్తీలేకుండా రాయగలగడం గొప్ప విద్య. ఆ పని ఎక్కువగా చేయగలిగితే పాఠకులకు మేలు జరుగుతుంది. సాహిత్యానికీ, భాషకూ మేలు జరుగుతుంది. అన్నిటికీ మించి తీయనైన తెలుగు భాషకు మరిన్ని తీయనైన పదాలు దొరుకుతాయి. భాషా దారిద్ర్యం తీరిపోతుంది. పత్రికల్లో కూడా ఎంతోమంది రచయితలు, వ్యాసకర్తలు మాండలికంలో శీర్షికలు నిర్వహించి ఆకట్టుకున్నారు. గంట్యాడ గౌరునాయుడు ఉత్తరాంధ్ర మాండలికంలో, పులికంటి కృష్ణారెడ్డి, శాంతినారాయణ, నామినివంటి వారు రాయలసీమ మాండలికంలో, తెలిదేవర భానుమూర్తి, అల్లం నారాయణ వంటివారు తెలంగాణ మాండలికంలో నిర్వహించిన శీర్షికలు పాఠకుల హృదయాలను హత్తుకున్నాయి.

ఇప్పటికైనా పత్రికా రచయితలు, భాషావేత్తలు ఇన్నాళ్లు భాషకు జరిగిన లోపాన్ని సవరించేందుకు పూనుకోవాలి. రచయితలు విరివిగా మాండలిక రచనలు చేయాలి. భాషావేత్తలు మాండలిక పదాలను స్వీకరించి పత్రికారచనకు అందించాలి. పత్రికా రచయితలు ఆ పదాలను అందుకుని పత్రికల్లో వాటిని ప్రచురించి, అందరికీ అర్థమయ్యేలా ఆ పదాల అర్థాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని వివరించాలి. వాడుకలోకి తేవాలి. అలా తెచ్చిన పదాలు దినపత్రికల్లో ప్రత్యేకంగా ప్రచురించి చర్చచేయాలి. కొన్ని మార్పులతో పత్రికల్లో, రచనల్లో అందరూ ప్రయోగిస్తే అవి తప్పక ఆమోదం పొందుతాయి. అన్నమాచార్య కీర్తనల్లో గుత్తులుగుత్తులుగా రాయలసీమ మాండలిక పదనిధులున్నాయని సాహిత్యరంగంలోని వారికి తెలియని విషయం కాదుగదా! అలాంటివి తెచ్చుకోవచ్చు.

రచనల్లో కూడా నుడికారం కరవే

నిన్నటితరం రచయితలతో పోలిస్తే ఈనాడు వస్తున్న రచనల్లో శిల్పంపట్ల ఆసక్తి చూపుతున్న రచయితలు ఎక్కువగా కనిపించడం లేదు. సామెతలు, ప్రజల జీవనంలోని తెలుగుదనపు సొంపులు, జాతీయాల పోహళింపు లేని రచనలు రుచిగా వుండవు అన్న విషయాన్ని నేటి రచయితలు గుర్తించలేదనాలా లేక వీరికి భాషమీద పట్టులేదనాలా? నుడికారం తెలియదనే మాటే నిజమని భావించాలి. పూర్వంలాగా బాల్యంలో రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల పఠనం లేదు. గ్రామీణ జీవనావరణంలోని కళారూపాల్లోని కథలు, గాథలు, గేయాల్లోని నవరసాల ఆస్వాదనానుభవం శూన్యం. పూర్వపు రచయితల కథలు, నవలల్లోని వస్తుశిల్పాల సమన్వయాన్ని గురించి చదవలేకపోవడం, ఆ విధంగా తమ రచనల్లో శిల్ప సౌందర్యాన్ని పోషించే శక్తిలేకపోవడం నిజం. అంతెందుకు ఇప్పుడు ఆంగ్లం, తెలుగు కలిసిన వాక్యాలే తప్ప అచ్చంగా తెలుగు వచనం కథల్లోనూ నవలల్లోనూ కనిపించడంలేదు. మునిపల్లె రాజు 'వారాల పిల్లాడు' కథా ప్రారంభంలో నారాయణ నాయనమ్మ చనిపోతుంది. చిన్నవాడైన నారాయణ అంతరంగాన్ని రచయిత ఇలా చిత్రిస్తాడు కళ్లకు కట్టినట్లుగా...

'ఆ సాయంత్రానికి కక్కయ్యలూ, అత్తయ్యలూ నారాయణ ఎరగని కొందరు ఎవరెవరో వచ్చారు. పెళ్లిలో తన్ను ఒళ్లో కూర్చోబెట్టుకొని, పల్లకీలో తలవంచుకొని వూరంతా వూరేగిన చిన్నత్తమ్మ- ఏడుస్తూ వచ్చింది. ఆమెతోపాటు పెద్దత్తమ్మ కొడుకులూ, కూతుళ్లూ బావురుమన్నారు. అయ్యో, ఎందుకర్రా అల్లా ఏడుస్తారు? నారాయణకు అర్థంకాలేదు.. కాక తనుగూడా ఏడవడం మొదలుపెట్టాడు. నాన్న వచ్చి బిస్కట్లు, చాక్లెట్లూ పెట్టాడు. జవాను-రామలింగం నారాయణను మేడమీదికి తీసుకెళ్లాడు. తను తప్పించుకొని, పిట్టగోడ కంతల్లో కళ్లూ, ముక్కూ యిరికించి చూశాడు. వాళ్లందరూ ఏడుస్తుండగా తను మాత్రం వాళ్లతోపాటు గొంతు కలిపితే తప్పువచ్చిందా? అదుగదుగో! నాయనమ్మను- చిన్న వాహనం మీద- పుట్టలమ్మ గుడిమీదుగా మోసుకొని తీసుకెళుతున్నారు- నాన్నా, చుట్టాలుగా వచ్చినవాళ్లూ కలిసి. పైన గుడ్డ దేనికి? నెత్తిమీద బట్టగూడా ఎప్పుడూ సరిచేసుకోని నాయనమ్మను వీళ్లంతా ఏదో అన్యాయం చేస్తున్నారు!!! అయ్యొయ్యొ!'

మునిపల్లె రాజు కథ మరొకటి... కథ పేరు 'జెట్టీ'. కథ ప్రారంభం ఇలా సాగింది... 'బయట సన్నని జల్లు పడుతున్నది. లోపల గాలిలేక ఉక్కపోస్తున్నది. కొంప ఇరుకు కొంప. పదివేల కల్పాలనుండి కాలగమనం స్తంభించిపోయినట్లుగా వుంది.

తండ్రీకొడుకుల మధ్య సంభాషణ సాగలేదు. వాళ్లిద్దరూ ఆజానుబాహులు. జెట్టీలు- తరతరాలనుండీ తమను పోషిస్తున్న ప్రభువులవారి సేవలో వారి కండరాలు పిరికితనాన్ని మరచిపోయినవి. ఉష్ణ కాసారం వలె వుడుకుతున్న వాళ్ల రక్తం గదిలోని విషమ ప్రతిష్టంభనలో సంచలనమే పోగొట్టుకున్నట్లున్నది.

ఆ ఇంట్లో దీపంలేదు. నరసింహులు జెట్టీ- నిప్పురాయి కొట్టి ఆరిపోయిన పచ్చి ఆకుచుట్ట తిరిగి వెలిగిస్తున్నాడు. నిప్పురాయి మెఱగులో అతని పలితకేశాలు బంగారంవలె మెరసినవి. కొడుకు పొంతకుండ పక్కన మునిగాళ్లమీద కూచుని పొయ్యిలోకి పుల్లలెగదోసి మంట చేస్తున్నాడు. అతని ముఖం తూర్పుకు, తండ్రి ముఖం పడమటకు. పచ్చిపుల్లలు మండక పొగతో వేధించినప్పుడు పొయ్యిమీద కుండలో కళపెళ ఆగిపోతున్నది. కుండలోని గిద్దెడంటే గిద్దెడే మెరికలు దంచగా వచ్చిన బియ్యపు గింజలు. కానీ కుండనిండు గంజి వస్తుందని పొగలో, విషవాయు స్తంభనలో రెండు మానసిక సంఘర్షణలలో బరువుగా, బిరుసుగా దురభిమానపు మూర్తిగా, నిరాశా దేవత మంటపంగా మారిన ఆ యిరుకు కొంప ఒక తాత్కాలిక ఆశతో- కాలగమన స్తంభనను ఛేదింపజూస్తోన్నది. కానీ, పొగను భరించలేని వీరరాఘవులు జెట్టీ కళ్లు మండిపోతున్నవి'.

డి.వెంకట్రామయ్య 'ఆకలి' కథలో- మున్సబు ఇంటివారు భిక్షగా వేసిన అన్నాన్ని తినాలనిపించలేదు నారిగాడికి. అదేదో పాపపు తిండి అన్నట్లు. 'ఆకలి బాధ విపరీతంగా వుంది. అయినా మున్సబుగారింట్లో పెట్టిన అన్నం తినబుద్ధి కాలేదు నారిగాడికి. "తినకపోతే సచ్చిపోతానేమో" అనుకున్నాడు. సచ్చినా సరే. ఈ కూడు మాత్రం తినకూడదనుకున్నాడు. దాకలో వున్న అన్నమంతా పాకముందు కుమ్మరించేశాడు. మళ్లీ లోపలికెళ్లి ముసుగెట్టుక్కూచున్నాడు. ఆకలితో పేగులు ఉంగలు చుట్టుకుపోతున్నాయి. సత్తువలేక నరాలు లాగుతున్నాయి. నోరు పిడచకట్టుకు పోయినట్టనిపించింది. మెల్లగా లేచివెళ్లి రేవులో దిగాడు. నీళ్లు నోట్లో పోసుకుంటే పళ్లు జివ్వున లాగాయి. ఆ చల్లదనం భరించలేక రెండు గుక్కలు తాగి వచ్చేశాడు. తాగిన నీళ్లు ఖాళీగా వున్న పొట్టలో చల్లగా మండి, ఆకలిమంట ఇంకా పెంచినట్టనిపించింది. గాలి చలిగా వుంది. చలిగాలితోపాటు పారేసిన కూరవాసన... ఆ వాసనకి ఆకలి మరీ ఎక్కువైనట్లనిపించింది. నారిగాడు మనస్సులోనే తర్కించుకున్నాడు. "ఒక్క మున్సబన్న మాటేంటి? ఈ లోకంలో ఎంతమంది ఎన్నెన్ని

గోరాలు సెయ్యటంలేదు? పాపం సెయ్యనోడెవడు? ఇంతకంటే ఎక్కువ కూనీలు సేసినోళ్లెందురు లేరు? మున్సబు కూనీ చేశాడని, ఆయన పెట్టిన కూడు తినకుండా కూకుంటే ఎవడికి నష్టం? నాకే... కూడు లేకపోతే నేనే సత్తాను.... ఎవడెట్టా సత్తే నాకెందుకు... ఎవరి పాపాన ఆడే బోతాడు... బతికిన నాల్రోజులు కళ్లు మూసుకుని పొట్టగడుపుకుంటే సాలు... అన్నం కోసం పుట్టిన జీవుడిది. అన్నంకంటే ఎక్కువేటుంది...' అనుకున్నాడు.

గబగబా లేచివెళ్లి పాకముందు పారేసిన అన్నమూ, కూరా, పచ్చడీ పైపైన దాకలోకెత్తుకున్నాడు. లోపలికొచ్చి కూర్చుని, ఆవురావురంటూ తినేశాడు. కడుపునిండింది. చింకి దుప్పటి ముసుగెట్టుకు పడుకున్నాడు. 'కూర కమ్మగా వుంది. రేపు కూడా మున్సబుగారింట్లో కూరా, పచ్చడీ అడుక్కోవాల' అనుకుంటూ, ఆవులించి కళ్లు మూసుకున్నాడు. ఆ మూసుకున్న కళ్లు మళ్లీ తెరుచుకోనేలేదు'.

మరో రెండు ఇటీవలి రచయితల కథల్ని చూద్దాం... మొదటి కథ. రచయిత్రి మహాలక్ష్మి. కథ పేరు 'ఇలాంటివారూ వుంటారు'. "ఇలా పెద్దవాడినీ, ఆఖరివాడినీ ఒకలాగ పెంచుతున్న పెద్దవాళ్ల మాటెలాగున్నా, పిల్లలమీద మాత్రం దాని ప్రభావం చాలా కనపడేది. కిరణ్ తనకా యింట్లో యిచ్చే ఫ్రీడంని ఉపయోగించుకుని, తన్ని తనెప్పుడూ చాలా గొప్పవాడిగా ఊహించుకుని, ఎవర్నీ లక్ష్యపెట్టకుండా నడుచుకునేవాడు. ఇంట్లోవాళ్లు కూడా అతనికి భయపడి అన్నీ చేసేవారు. ఆఖరివాడికి గారాబం, ముద్దు ఎక్కువయి పెంకెతనం, మంకుతనంతో అనుకున్నవన్నీ పంతంపట్టి సాగించుకునేవాడు. ఎప్పుడన్నా ఏ ఒక్కరన్నా పవన్ పేచీ భరించలేక కేకలెయ్యబోయినా, కొట్టబోయినా రెండోవాళ్లొచ్చి 'పోనీయెండ్రా! చంటి వెధవ అడిగిందేదో యిచ్చెయ్యండి. పెద్దాడయితే వాడే మానేస్తాడు' అంటూ అడిగిందిచ్చేసేవారు".

మరో కథ చూద్దాం. దీని రచయిత ఉదయబాబు. కథ పేరు 'నీ తోడు కావాలి'. "మనం ఎన్నో ఏళ్లనుంచి కలిసి నటిస్తున్నాం. లేడీ ఆర్టిస్ట్ అంటే కేవలం అందుకే వస్తారనా ఏమిటి మీ ఉద్దేశం? రియల్లీ ఐ పిటీయూ రమేష్! ఎనీహౌ! హార్ష్‌గా మాట్లాడినందుకు మన్నించండి రాఘవగారు. మీరిచ్చిన ఈ డబ్బు వాడుకున్నంత కాలం మీ పేరు చెప్పుకుని మరీ తింటాను. నేను వెళ్తాను" అందామె వెళ్లడానికి ఉద్యుక్తురాలౌతూ".

ఒకప్పటి రచనల్లో అచ్చమైన తెలుగు నుడికారపు సొంపు కలగలిసిన తెలుగు గుబాళించేది. ఇటీవలి రచనల్లో అవసరానికి మించిన ఆంగ్లపదాల కలగలుపు. కృత్రిమ వాక్యాలు. నుడికారపు స్పర్శలేమి. కొందరు మాత్రం ఇప్పటికీ తెలుగు నుడికారానికి

పట్టంగడుతూ మంచి రచనలు చేస్తున్నారు. పాత్రికేయుల్లో కూడా భాషపైన మంచి పట్టున్నవారున్నారు. అంతగా పట్టులేనివారూ వున్నారు. భాషపై పట్టున్నవారు అవకాశం, సమయం, సందర్భం వస్తే గొప్పగా రాస్తారు. దినపత్రికల్లో అవసరాన్నిబట్టి ఇలాంటి చక్కని నుడికారం కలగలిసిన వార్తలు రాసి పాఠకులను ఆకట్టుకున్న సందర్భాలు అనేకం. అలాంటి ఒక వార్త...

"నిలువెత్తు తెలుగుతేజం... నిండైన వ్యక్తిత్వం... అనేక యుద్ధాల ఆరితేరిన ధీరోదాత్తత... స్ఫురద్రూపం... చూసి మురిసే సమ్మోహన ఆకారం... ఖంగున మ్రోగే కంచుకంఠం... అయిదు దశాబ్దాల సంచలనం... ఆరుకాలాల ప్రాభవం... నందమూరి జీవితం. సినీ వినీలాకాశంలో విరిసిన సితార... రారాజు... మహానటుడు... రాజకీయ యుద్ధవీరుడు... బడుగుజన బాంధవుడు... అడుగుజనాల అన్న... సంస్కర్త... రాజీపడని వాడు... అలుపెరుగనివాడు... ఓటమికి వెరవనివాడు... వైఫల్యాల్లోని విజయరహస్యం తెలిసినవాడు... అతడు 'ఈ కాలం వీరుడు'. జనం దైవం... ఆరుకోట్ల ఆంధ్రుల అభిమాన కథానాయకుడు... కృష్ణుడు... రాముడు... రావణుడు... యముడు... దేవుడు... చరిత్ర ప్రతి మలుపులో విశ్వరూపం చూపినవాడు... తానే స్వయంగా చరిత్రైనవాడు... అతడు ఘనుడు... పౌరాణిక పాత్రల్లో జీవించినప్పుడు జనం నీరాజనం పలికారు... రాజకీయ రణభేరి మ్రోగించినప్పుడు జనం జేజేలు పలికారు. నేడు నందమూరి మహాభినిష్క్రమణం వార్త విని యావత్ దేశం దిగ్భ్రాంతిపడింది. అఖిలాంధ్ర జగత్తు శోకసంద్రంలో మునిగింది". (1996 జనవరి 19 ఆంధ్రజ్యోతి) యాంత్రికంగా సిద్ధంగా ఉన్న మాటల్ని కలబోసి రాసేది నేటి విధానం. విలేకరి లీనమై పరిస్థితిని కళ్లకు కట్టినట్లు సృజనాత్మకంగా రాస్తే ఆకట్టుకునేదిగా వుంటుంది. కానీ, ఇప్పుడందరూ ఒకే రచనా విధానానికి అలవాటు పడిపోయారు.

ఇంకోవార్త

'ప్రేమరాహిత్యంలో పరితపించి కాలంచెల్లిన సంప్రదాయాలను ధిక్కరించి బ్రిటిష్ రాచరిక వ్యవస్థ బంగారు పంజరం నుంచి బయటపడి బాధలన్నిటినీ గిరాటేసి ఒక అనునయ వాక్యం కోసం, ఒక చల్లని ఓదార్పు కోసం శ్వాసిస్తూ, ఆక్రోశిస్తూ అల్‌ఫయీద్ దోడీకి చేరువైన అతికొద్ది కాలంలోనే కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువరాణి డయానా శనివారం నాడు భౌతికంగా కూడా ఈ లోకంనుంచి కనుమరుగయిపోయింది. ఓ స్వేచ్ఛా స్వప్నం ఈ ప్రపంచం కళ్లముందే కరిగిపోయింది.

ఎవరి స్ఫూర్తితోనైతే దయానా తనలోని శూన్యాన్ని తొలగించుకోడానికి సేవా కార్యక్రమాలు ప్రారంభించిందో ఆ కరుణామయి, పేదలపాలిట అమృత కల్పవల్లి మదర్ థెరిసా కన్నుమూయడంతో విశ్వమానవ సేవాభావం వికలమయ్యింది. 'పతితులార భ్రష్టులార బాధాసర్పదష్టులార ఏడవకండేడవకండి నేనున్నా నేనున్నాను' అంటూ ఓదార్చి ఎందరికో సేదదీర్చి మానవత్వానికే మణిపూసగా విలసిల్లిన నిస్వార్థజీవి థెరిసా సృష్టించిన భూతలస్వర్గం కదిలిపోయింది'. (1997 సెప్టెంబర్ 7 -వార్త దినపత్రిక)

అన్ని వార్తలూ ఇలా రాసే అవకాశం వుండదు. కాకపోతే ప్రత్యేక కథనాలను ఇలాంటి వర్ణనాత్మక ఆలంకారిక శైలిలో రాస్తే పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మిగతా వార్తలను కూడా ఆంగ్ల వాక్యాలకు అనువాదం చేస్తున్నట్లు కాక అసలుసిసలైన తెలుగు వాక్యాలు రాస్తే బావుంటుంది. వార్తలు, ప్రత్యేక కథనాలు, సంపాదకీయాలు, సంపాదకీయ పుటలలోని వ్యాసాలు, ప్రముఖుల పరిచయాలు, ప్రత్యేక పుటలలో వ్యాసాలు... ఏది రాసినా ప్రత్యేకంగా అసలుసిసలు తెలుగు వాక్యాలతో కూడుకొని వుండాలి. ఇలా రాయాలంటే పత్రికారచయితకు పదజాలం తెలియాలి. ఒక మాటకు నానార్థాలు తెలియాలి. జాతీయాలు తెలియాలి. సామెతలు, తెలుగు పలుకుబడులపై పట్టు వుండాలి. ఇంతకూ ఈ పలుకుబడులు, జాతీయాల గురించి చూద్దాం.

క్షీరనీర మరాళ న్యాయం

ఎవరైనా పాలను పాలుగా నీళ్లను నీళ్లుగా వేరుచేసి నిష్పాక్షికంగా తీర్పు చెప్పడాన్ని క్షీరనీర మరాళ న్యాయం అని అంటారు. పాలను, నీళ్లను కలిపి ముందుంచితే హంస ఆ రెంటిని వేరుచేస్తుందని నానుడి. క్షీరమంటే పాలు, నీరమంటే నీరు. మరాళమంటే హంస. అందుకే క్షీరనీర మరాళ న్యాయం అన్నారు. సంస్కృతంలో ఇలాంటివాటిని న్యాయాలు అని అన్నారు.

మండూక తులా న్యాయం

ఇదొక కప్పల తక్కెడ. రాజకీయ పార్టీల్లో అంతర్గత కుమ్ములాటలు దీనికి అద్దంపడతాయి. నాయకులందర్నీ ఒక్కతాటిమీదకు తేవడం మండూకా(కప్ప)లను తుల (తక్కెడ)లోకి చేర్చడమంత కష్టం. కిందపడ్డ కప్పను ఎత్తి తక్కెట్లోకి వేస్తుంటే మరో కప్ప పడుతుంది. దాన్ని వేసేలోగా మరోటి తక్కెట్లోంచి కిందకు దూకుతుంది. కప్పల తక్కెడలాంటి పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కష్టమనడానికి ఈ న్యాయాన్ని వాడతారు.

కాకతాళీయ న్యాయం

అనుకోని విధంగా రెండు ఘటనలు ఒకేసారి జరిగితే అంతా కాకతాళీయం అంటారు. ఈ కాక ఏమిటో తాళీయమేమిటో చాలామందికి తెలియదు. తెలుసుకుంటే సాభిప్రాయంగా సరైనవిధంగా ఆ పదాన్ని వాడవచ్చు. దీనివెనుక వున్న కథ ఏమిటంటే– కాక (కాకి) తాళవృక్షం (తాటిచెట్టు) మీద వాలింది. సరిగ్గా అదే సమయానికి తాటిచెట్టు మీదనుంచి తాటిపండు పడింది. నిజానికి తాటిచెట్టుపై కాకి వాలడానికి, చెట్టుపై నుంచి పండు నేలరాలడానికి సంబంధమే లేదు.

ఉలూఖల మర్దల న్యాయం

ఇది అర్థమయ్యేలా చెప్పాలంటే– రోలు వెళ్లి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుంది. అనే సామెతను సంస్కృతంలో చెప్పడమే. రోలు వెళ్లి... నన్ను బాదుతున్నారు అని మద్దెలతో చెబితే, నిన్ను ఒకవైపే బాదుతారు... నన్ను రెండువైపులా వాయిస్తున్నారని ఎదురు మొరపెట్టుకుందట.

గతజల సేతుబంధన న్యాయం

'నీరంతా పోయాక ఆనకట్ట కట్టడంవల్ల ఫలితం ఏముంది' అన్న మాటకు గతజల సేతుబంధనమంటారు. చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు అని కూడా ప్రయోగిస్తారు. సకాలంలో స్పందించి వుంటే ఇప్పుడిలా నష్టం జరిగి వుండేదికాదు గదా అని విచారించడాన్ని ఈ జాతీయం సముచితంగా చెబుతోంది.

గోముఖవ్యాఘ్ర న్యాయం

పైకి మంచివారుగా కనిపిస్తూ లోపల దుర్మార్గులుగా ఉండే సందర్భాల్లో అమ్మో వాడు గోముఖ వ్యాఘ్రం బాబోయ్ అనడం వింటూంటాం. వ్యాఘ్రం అంటే పులి. గోవు రూపంలో ఉన్న పులి అన్నమాట.

సింహావలోకనం

జరిగిన సంగతులను ఒకసారి స్మరించుకోవడాన్ని 'సింహావలోకనం' అని వాడుతుంటాం. సింహం అవలోకించుకోవడం. మృగాని చంపి ఆ కళేబరాన్ని తన దగ్గర ఉంచుకున్న సింహం దాన్ని ఎత్తుకుపోవడానికి వేరే జంతువులేవైనా పొంచి ఉన్నాయేమోనని అటూఇటూ చూస్తుంది. దీన్నే సింహావలోనం అంటారు.

స్థాలీపులాక న్యాయం

కొన్ని గంటల పర్యంతమో, రోజుల పర్యంతమో చెప్పదగిన విషయాన్ని మచ్చుకు కొంత చెప్పడాన్ని స్థాలీపులాక న్యాయం అంటారు. అంటే పుస్తకం మధ్యలో ఒకానొక భాగంలో పుడక పెట్టుకొని ఆ భాగాన్ని మాత్రమే ఉటంకించడం అన్నమాట. అన్నం ఉడికిందా లేదా అన్ని చూడ్డానికి అంతా పట్టి చూడాల్సిన అవసరం లేదు అనడంలాంటిది. క్లుప్తంగా చెప్పడానికి కూడా ఈ నానుడిని ఉపయోగిస్తారు.

శాఖాచంక్రమణం

శాఖ (కొమ్మ)పైకి ఎగిరిన కోతి అక్కడే నిలవక మరొక కొమ్మపైకి దూకడాన్ని శాఖాచంక్రమణం అంటారు. శాఖ అంటే కొమ్మ. చంక్రమణం అంటే మారడం. తరచూ పార్టీలు మారడాన్ని, ఒక విషయాన్ని చెబుతూ అంతలో వేరే విషయంలోకి వెళ్లడం, ఒకచోట స్థిరంగా నిలవలేక తరచూ మారుతూ ఉండడానికి ఈ నానుడిని వాడతారు.

అజాగళస్తన న్యాయం

చూడడానికి బాగానే ఉన్నా అవసరానికి ఉపయోగపడనిదాన్ని అజాగళ స్తనం అంటారు. మేక దవడ కిందిభాగంలో స్తనాలు వేలాడడం చూస్తాం. కానీ అవి పాలురాని స్తనాలు. నిరుపయోగమైనవి అన్నమాట.

తోసిరాజు

సీనియర్‌ను తోసిరాజని జూనియర్‌కు పదోన్నతిని కల్పించారని చెప్పడానికి ఈ మాట వాడతారు. ఈ తోసిరాజనడాన్ని తోసివేయడం కాదు. చదరంగంలో రాజుకు ఒక ఎత్తు ముందుకు వేసి రాజు ఆటకట్టించడమన్న మాట. తోసివేయబడిన రాజును 'తోసిరాజు' అంటారు.

ప్రసూతి వైరాగ్యం

వైరాగ్యాలు చాలారకాలు. ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం వంటివి. ప్రసూతి వైరాగ్యం ఎలా వుంటుందంటే గర్భిణి ప్రసవ సమయంలో నొప్పులు భరించలేక మళ్లీ గర్భం దాల్చకూడదు బాబోయ్ అనుకుంటుంది. కానీ, ప్రసవమై బిడ్డ పుట్టాక మాతృత్వ మాధుర్యాన్ని చవిచూశాక మళ్లీ మామూలే. అలాగే శ్మశాన వైరాగ్యం.

మిత్రులు, ఆప్తులు, సన్నిహిత బంధువులెవరైనా చనిపోతే అంత్యక్రియల్లో పాల్గొంటారు. శ్మశానంలో దుఃఖ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు... ఛ జీవితం ఎంత అశాశ్వతమైంది. ఈ మాత్రానికి ఇన్ని కుట్రలు, కుతంత్రాలు, ధన సంపాదన కోసం అర్రులు చాచడం. ఇదంతా పోయాక ఏంచేసుకుంటాం? అనుకుంటారు. ఆ కాస్తా పూర్తయి ఇంటికివచ్చి దైనందిన పనుల్లో పడిపోతే మళ్లీ మామూలే. అన్నీ మరచిపోతాం. పురాణ వైరాగ్యమంటే సన్మార్గాన్ని గురించి, నీతినియమాలు, ధర్మమార్గం, దానధర్మాలు, వగైరా ఎన్నో విషయాలపై పురాణం వింటాం. ఆ సమయంలో ఇకపై నీతిగా బతకాలన్న ఉత్తేజం కలుగుతుంది. కానీ, ఇంటికి వచ్చాక మళ్లీ లౌకిక విషయానురక్తి మామూలే.

యక్షప్రశ్నలు

శరపరంపరగా చిక్కుప్రశ్నలు సంధించే మిత్రునితో ఒరే! నీ 'యక్షప్రశ్నలు' ఆపరా! అనటానికి ఈ మాట వాడతారు. కానీ, దీనివెనుక వున్న మహాభారతంలోని కథ మాత్రం ఎక్కువమందికి తెలియదు. పాండవులు అరణ్యవాసం చేస్తుండగా ఒక సంఘటన జరిగింది. ఒక బ్రాహ్మడి అరణి కట్టెలు మాయలేడి కొమ్ముల్లో చిక్కుకున్నాయి. లేడి చిక్కకుండా పరుగుతీసింది. ఆ కట్టెలు తెచ్చిఇచ్చి బ్రాహ్మడికి సహాయం చేసే ఉద్దేశంతో పాండవుల్లో నకులుడు లేడి వెంటపడ్డాడు. లేడి మాయమైంది. దాన్ని వెతుకులాటలో అతడికి దాహంవేసింది. సమీపంలోనే వున్న సరస్సువద్దకు వెళ్లి నీరు తాగబోయాడు. అంతలో 'మొదట నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పినమీదటే నీరు తాగు. లేకపోతే ప్రమాదం' అని అశరీరవాణి చెప్పింది. లక్ష్యపెట్టని నకులుడు నీరుతాగి విగతజీవుడయ్యాడు. ఆ తర్వాత వరుసగా సహదేవుడు, అర్జునుడు, భీముడు అలాగే మరణిస్తారు. చివరకు ధర్మరాజు అక్కడికి వచ్చి యక్షుడు అడిగిన కఠినమైన ప్రశ్నలకు జవాబు చెప్పి తన ధర్మవర్తనతో తమ్ములను బతికించుకుంటాడు. ఇదీ కథ...

భగీరథ యత్నం

పట్టువదలకుండా ప్రయత్నించి విజయం సాధించిన సందర్భాల్లో 'భగీరథ ప్రయత్నం' అని ప్రశంసాపూర్వకంగా అంటుంటారు. ఎన్నో ఏళ్లపాటు పూర్తికాని బృహత్కార్యాన్ని ఎవరైనా మహాత్ముడు తన కృషితో పూర్తిచేస్తే ఫలానావారి భగీరథ ప్రయత్నం వల్ల పని నెరవేరింది అనుకోవడం కద్దు. కానీ దీనివెనుక వున్న పురాగాథ తప్పక తెలుసుకోవాలి.

సగరుడు అనే రాజు అశ్వమేధయాగం చేశాడు. తన 60వేల మంది కుమారులను ఆ యాగాశ్వం వెంట పంపాడు. ఆ గుర్రం వెళ్లివెళ్లి సముద్రంలో కలిసిపోయింది. దీంతో

సముద్రంలో నీరంతా ఇంకిపోయింది. సగరుని యాగానికి అంతరాయం కలిగించేందుకు ఇంద్రుడు ఆ యాగాశ్వాన్ని అపహరించి రసాతలంలో కపిలుని ఆశ్రమం వద్ద దాచాడు. సగరుని కుమారులు అశ్వంకోసం సముద్రాన్ని వేయి యోజనాలు తవ్వారు. చివరకు రసాతలంలో అశ్వం కనిపించింది. అక్కడ తపస్సు చేసుకుంటున్న కపిలుడు కనిపించాడు. ఆ మహర్షిని అవమానించడంతో ఆయన శపించగా సగర పుత్రులు భస్మమైపోయారు. తర్వాత అనేక సంవత్సరాలకు సగరుని వంశంలో భగీరథుడు జన్మించాడు. తపస్సుచేసి గంగను భువికి దింపడానికి అంగీకరింపజేశాడు. అయితే స్వర్గం నుంచి నేరుగా గంగ భూమ్మీద పడేటప్పుడు ఆ వేగాన్ని, భారాన్ని శివుడు తప్ప మరెవ్వరూ భరించజాలరు. దీంతో భగీరథుడు మళ్లీ శివునికోసం కఠోర తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమై భగీరథుని కోరిక మన్నిస్తానంటాడు. ఆ విధంగా గంగ ఆకాశంబున నుండి శంభుని శిరస్సు మీదకు, అక్కడినుండి భూమ్మీదకు దిగుతుంది. గంగకు దారిచూపుతూ భగీరథుడు తన పితృదేవతలు భస్మమైన ప్రదేశానికి తీసుకెళతాడు. గంగాజలం సోకి సగర పుత్రులు దుర్గతినుంచి విముక్తిపొంది స్వర్గానికి వెళతారు. భగీరథుడు ఇంత కష్టాన్ని ఎదుర్కొని అనుకున్నది సాధించాడు. కాబట్టి చాలా కష్టనష్టాలనెదుర్కొని ఏదేని మహత్కార్యం సాధించిన వారిది 'భగీరథ ప్రయత్నం' అనే నానుడి నిలిచిపోయింది.

త్రిశంకు స్వర్గం

ఎటూకాకుండా అయోమయంలో ఉన్నవారిని త్రిశంకు స్వర్గంలో పడిపోయా రంటారు. ఉన్నచోట ఉండలేక కోరుకున్న చోటికి చేరలేనివారు నేను త్రిశంకు స్వర్గంలో మిగిలాను అని ఆవేదన చెందుతారు. శాసనసభకుగాని, లోక్‌సభకుగాని ఎన్నికలు జరిగి ఏ పార్టీకీ ఆధిక్యం రాకపోతే ఆ సభను త్రిశంకు సభ అంటారు. ఇది ఉట్టికీ స్వర్గానికీ చెందకుండా మధ్యలో వున్నదన్నమాట. దీనిగురించి మరిన్ని వివరాలు తెలిపే కథ ఒకటుంది.

సత్యవంతుడనే సూర్యవంశపు రాజు వివాహిత అయిన స్త్రీని అపహరించి తీసుకువెళతాడు. అందుకు ఆగ్రహించిన తండ్రి త్రిధన్యుడు అతనికి నగర బహిష్కార శిక్ష విధిస్తాడు. మూడు రకాలైన తప్పులు చేసినందుకు సత్యవంతునికి త్రిశంకుడని పేరువచ్చింది. ఈ త్రిశంకుడు స్వర్గానికి పోవాలని ముచ్చటపడ్డాడు. అందుకు అవసరమైన యాగం చేయించమని వశిష్ఠుని కోరాడు. ఆ మహర్షి తిరస్కరించడంతో ఆయన కుమారులను అర్థించాడు. వారూ అంగీకరించలేదు. త్రిశంకుడు వశిష్ఠుని, ఆయన కుమారులను నిందించాడు. దీంతో 'ఛండాలుడవు కమ్మ'ని శపించారు వశిష్ఠ కుమారులు.

చివరకు విశ్వామిత్రుడు అనుగ్రహించి త్రిశంకుని చేత యాగం చేయించడానికి అంగీకరించాడు. అయితే యజ్ఞం చేయించేందుకు మునులెవరూ ముందుకు రాలేదు. దాంతో విశ్వామిత్రుడు తన తపోమహిమతో త్రిశంకుని సజీవంగా స్వర్గానికి పంపుతాడు. కానీ, త్రిశంకుని స్వర్గంలో చేర్చుకొనేందుకు ఇంద్రుడు అంగీకరించక కిందకు పడదోశాడు. త్రిశంకుడు తలకిందులుగా పడిపోతూ తన అవస్థను విశ్వామిత్రునికి విన్నవించుకున్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు అంతరిక్షంలోనే త్రిశంకుడిని ఆపాడు. తన తపశ్శక్తినంతా ధారవోసి త్రిశంకుని కోసం ఒక స్వర్గాన్ని సృష్టించడానికి నిశ్చయించుకున్నాడు. విషయం తెలిసిన ఇంద్రుడు, విశ్వామిత్రుని దగ్గరికి వచ్చి వేరే స్వర్గాన్ని సృష్టించవద్దని, తాను భూమికీ, ఆకాశానికీ మధ్య అంతరిక్షంలో అవకాశం కల్పిస్తానని చెప్పాడు. ఆ విధంగా త్రిశంకుడు అప్పటినుంచి ఇటు భూమికీ కాక అటు స్వర్గానికీ కాక మధ్యలో వేలాడాడు. దీన్నే త్రిశంకు స్వర్గం అంటారు.

నలభీమపాకం

ఇది చాలా ఆసక్తికరమైన జాతీయం. దీనికి గొప్ప కథే వుంది. నిజానికి స్త్రీలే అద్భుతంగా వంట చేస్తారని చెప్పారు కానీ, మగవారే మంచి వంటగాళ్లని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఈనాటికీ ఎవరైనా కమ్మగా వండితే నలభీమపాకంలా ఉంది అని పొగిడేస్తూంటారు. నలుడు, భీముడు కమ్మని వంటలు చేయడంలో నేర్పరులు. భీముడు ఎంత భోజనప్రియుడో అంతటి పాకశాస్త్ర ప్రవీణుడు కూడా. అజ్ఞాతవాసంలో విరాటుని కొలువులో వలలుడు అనే పేరుతో వంటవానిగా ఉన్నాడు. నలునిది మరో కథ. నిషధ దేశాధీశుడైన నలుడ్ని స్వయంవరంలో దమయంతి వరించింది. దీంతో కాల ప్రతినిధి అయిన 'కలి'కి అసూయ కలిగింది. కలి నలుడ్ని ఎన్నో కష్టాలపాలు చేశాడు. అడవులు పట్టుకు తిరుగుతూ నలుడు ఋతుపర్ణుడనే రాజువద్ద వంటలవానిగా చేరతాడు. నలునికి అగ్ని వశమై ఉండడం వల్ల వంట చేసేప్పుడు కొద్దిగా గడ్డి విసరగానే నిప్పు పుట్టేది. ఆ మంటలోనే వంట పూర్తయ్యేది. నలుడు రెండు చేతులు చరిచినప్పుడు ఎక్కడలేని సుగంధ ద్రవ్యాలన్నీ పుట్టుకొచ్చి, వాటితో వంట అద్భుతమైన రుచులను సంతరించుకొనేది. అందుకే 'నలభీమపాకం' అంటే అంత ప్రత్యేక ప్రశంసను అందుకుని తెలుగులో ఒక జాతీయంగా మారి, 'ఆహా నలభీమపాకం' అనే మెచ్చుకోలుగా మిగిలింది.

కుంభకర్ణ నిద్ర

విపరీతంగా నిద్రపోయేవారిని కుంభకర్ణునితో పోలుస్తుంటారు. కుంభకర్ణుడు రావణుని తమ్ముడు. కైకసి, విశ్వవసువు తల్లిదండ్రులు. పుట్టినప్పుడే పర్వతమంత ఆకారంతో

ఉన్నాడతడు. రావణ, కుంభకర్ణులు బ్రహ్మదేవుని కోసం ఘోర తపస్సు చేస్తారు. అసలే కుంభకర్ణుడు కొండంత ఆకారంగలవాడు. ఎంతోమందిని ఒక్కసారిగా తొక్కి, పిసికి చంపగలడు. అతనికి మరిన్ని వరాలిస్తే ఇక ముల్లోకాలేం కావాలి అని దేవతలంతా ఏకమై బ్రహ్మదేవుని వేడుకున్నారు. అప్పుడు బ్రహ్మ సరస్వతీదేవిని పిలిచి వరాలు కోరే సమయంలో కుంభకర్ణుని నాలుకపై వుండి 'ఆరు నెలలు నిద్ర–ఒకరోజు భోజనం' కోరుకొనేలా చేయమని కోరతాడు. ఆ వరం ప్రకారం కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రపోతాడు. అందుకే మొద్దునిద్ర పోయేవారిని కుంభకర్ణునిలా నిద్రపోతాడని నిందించడం జరుగుతున్నది. ఏదైనా ప్రారంభించిన పని ఎంతకూ పూర్తికాని సందర్భాల్లో కూడా ఫలానా పని అధికారుల నిర్లక్ష్యం వల్ల 'కుంభకర్ణ నిద్ర'పాలైంది అని కూడా అంటుంటారు.

శల్యసారథ్యం

శల్యుడు మహాభారత యుద్ధంలో కౌరవులపక్షాన నిలిచి యుద్ధరంగంలో పాల్గొంటాడు. కర్ణునికి రథసారథిగా వుంటాడు. పాండవుల్లో నకుల, సహదేవులకు మేనమామ అయిన శల్యుడ్ని శ్రీకృష్ణుడు పిలిపిస్తాడు. సైన్యసమేతుడై వస్తుండగా దుర్యోధనాదులు మధ్యలోనే శల్యుని కలుసుకొని తమ మర్యాదలతో ప్రసన్నుని చేసుకుంటారు. వాటికి సంతోషించి కౌరవులపక్షాన ఉండడానికి సమ్మతిస్తాడు. తర్వాత పాండవులను చూడడానికి వస్తాడు. మేనల్లుళ్లు ఎంతో గౌరవిస్తారు. నిజానికి పాండవులపక్షాన నిలిచి పోరాడవలసిన తనను దుర్యోధనుడు లొంగదీసుకున్నాడే అని వాపోతాడు. మాట తప్పలేనని అంటాడు. అప్పుడు వారిపక్షాన ఉంటూకూడా తనకు తోచినవిధంగా సహాయం చెయ్యవలసిందని పాండవులు కోరతారు. ఆ విధంగా కర్ణునికి సారథిగా బాధ్యతలు చేపట్టిన మొదటినుంచి చివరివరకు అనుక్షణం కర్ణుని అవమానించేలా మాట్లాడుతూ, కర్ణుని ముందే పాండవులను మెచ్చుకుంటూ మాట్లాడతాడు. కర్ణుని రథం నేలకు కుంగి, అర్జుని చేతిలో మరణిస్తాడు.

ఈ కారణంగా ఒకరిపక్షాన ఉండి వేరొకరికి సహాయపడేవారిని శల్యునితో పోలుస్తారు. రాజకీయాల్లో తమ పార్టీవారైనా సరే మనస్పర్థలుంటే మాత్రం వైరిపక్షంతో అంతర్గతంగా అవగాహన కుదుర్చుకొని ఓడించే ప్రయత్నం చేస్తారు. పైకి తమ అభ్యర్థి తరఫున సారథ్య బాధ్యతల్ని నిర్వహిస్తూనే రహస్య కార్యకలాపాలద్వారా ఓడించేందుకు వెనుకాడరు. దీన్నే శల్యసారథ్యం అని అంటారు.

వజ్రాయుధం

ఎన్నికల్లో విజయావకాశాలను గురించి రాస్తూ ఫలానా పార్టీ అభ్యర్థికి ఆ నియోజకవర్గంలో ఫలానా వర్గం ఓట్లే ఎన్నికల సమరంలో వజ్రాయుధంలా ఉపయోగపడతాయి అని అంటారు. ప్రత్యర్థిని చిత్తుచేయడానికి ఎవరైనా గట్టి పాచిక వేసినప్పుడు ఆయనపై వజ్రాయుధాన్ని ప్రయోగించాడని, ఈ దెబ్బతో చిత్తవడం ఖాయం అని అంటారు. 'ఈ విషయంలో ఇది వజ్రాయుధంలా ఉపయోగపడుతుంది' అంటారు.

ఇంతకూ వజ్రాయుధం ఇంద్రుని ఆయుధం. పూర్వం వృత్రాసురుని సంహరించేందుకు బ్రహ్మదేవుడు, దేవతలకు తరణోపాయం చెబుతూ దధీచి అనే ఋషిని ప్రార్థించి ఆయన ఎముకలతో ఆయుధం తయారుచేసుకొమ్మని, ఆ ఆయుధంతో వృత్రాసురుని సంహరించడం సాధ్యమేనని చెబుతాడు. దధీచి దేవతల కోరిక తీర్చడానికి యోగాగ్నిలో దేహాన్ని త్యజించాడు. దేవతలు ఆయన ఎముకల్ని తీసుకువెళ్లి విశ్వకర్మకు ఇచ్చారు. విశ్వకర్మ దధీచి ఎముకతో మహాశక్తిమంతమైన ఆయుధాన్ని తయారుచేసి ఇంద్రునికి ఇచ్చాడు. దీనిపేరే వజ్రాయుధం... తిరుగులేనిది.

నక్షత్రకుడు

'నక్షత్రకునిలా వెంటబడి వేధిస్తూ పీడిస్తున్నాడురా వీడు' అనే మాట వింటూ వుంటాం. విశ్వామిత్రుని శిష్యుడు ఈ నక్షత్రకుడు. హరిశ్చంద్రుని చేత ఏ విధంగానైనా అబద్ధమాడించాలని విశ్వామిత్రుడు కంకణం కట్టుకుంటాడు. తనకు ఇస్తానన్న ధనాన్ని హరిశ్చంద్రుని నుంచి వసూలు చేయమని ఆయన వెంట నక్షత్రకుని పంపుతాడు. ఆ ధనం కోసం అనేకవిధాలుగా బాధించి, పీడించి హరిశ్చంద్రునితో అబద్ధం చెప్పించమని అతడికి విశ్వామిత్రుని ఆదేశం. రాజ్యాన్ని పోగొట్టుకుని భార్య చంద్రమతి, కుమారుడు లోహితునితో హరిశ్చంద్రుడు అడవులపాలై నక్షత్రకుని చేత ప్రత్యక్ష బాధలు పొందుతాడు. ఆ విధంగా నక్షత్రకుని లక్షణాలు తర్వాతి మానవుల్లో కూడా ప్రవేశించాయి. అప్పులవాడు వెంటపడి వేధిస్తే కూడా అందరికీ గుర్తొచ్చే పేరు నక్షత్రకుడు.

సత్యహరిశ్చంద్రుడు

సత్యానికి మారుపేరు హరిశ్చంద్రుడు. ఆ పేరుతో నాటకం వుంది. హరిశ్చంద్రుడు సత్యం కోసం ఎన్ని ఇబ్బందులు పడిందీ ఈ నాటకంలో గాంధీ చూశారు. ఆ తర్వాతే జీవితంలో ఇంకెప్పుడూ అబద్ధం ఆడకూడదని, సత్యం కోసం నిలవాలనీ నిర్ణయించుకున్నట్లు

గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు. అంతటి మహాత్మునికి స్ఫూర్తిప్రదాత హరిశ్చంద్రుడు. సత్యం కోసం రాజ్యాన్ని వదులుకోవడమే కాదు. విశ్వామిత్రునికి ఇస్తానని అంగీకరించిన ధనాన్ని ఇవ్వడానికి హరిశ్చంద్రుడు భార్య చంద్రమతిని అమ్మి, చివరికి తనను తాను అమ్ముకున్నాడు. కాటికాపరిగా అనేక కష్టాలు పడ్డాడు. కాబట్టి సత్యం కోసం నిలిచే మనిషిని, సత్యం కోసం ఎన్ని కష్టాలైనా చిరునవ్వుతో ఆహ్వానించే వ్యక్తిని 'అపర సత్యహరిశ్చంద్రుడు' అని ప్రశంసిస్తారు. ఇన్ని తరాలుగా హరిశ్చంద్ర పాత్ర తరగని స్ఫూర్తిని మనకు అందిస్తోంది. ఈ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు కూడా అందించాలంటే హరిశ్చంద్రుని కథను నిలబెట్టుకోవాలి.

ఉడుతభక్తి

'ఉడతాభక్తిగా నాకు తోచిన సేవ చేయనీ' అంటుంటారు. సీతాదేవిని రావణుడు అపహరించాడు. ఆమెను విడిపించడానికి శ్రీరాముడికి సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన వానరసైన్యం లంకపై దండయాత్రకు వెళతారు. లంక చేరాలంటే సముద్రంపై వారధికట్టాలి. ఇది చాలాపెద్ద కార్యం. కోతిమూక పెద్దపెద్ద బండరాళ్లను ఒక్కటొక్కటిగా వేసి సేతువు నిర్మిస్తుండగా శ్రీరామునిపై అపారమైన భక్తితో ఒక ఉడుత తన చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుంటుంది. తాను చిన్న ప్రాణి. పెద్దపెద్ద రాళ్లను మోసుకొచ్చి వేయలేనని అనుకోలేదు. భక్తితో తోచిన పనికి పూనుకుంది. సముద్రజలంలో మునిగి ఇసుకలో పొర్లాడింది. ఒంటికి ఇసుక అంటింది. పదేపదే వారధి కట్టే చోటుకు వెళ్లి తనువుకు అంటుకున్న ఇసుక రేణువులను విదిలించసాగింది. అలా అవిశ్రాంతంగా చేసింది. చివరికి పెద్ద ఇసుకదిబ్బ తయారై వారధి నిర్మాణానికి యథోచిత సహాయం చేసింది. దాని భక్తికి ముగ్ధుడైన శ్రీరాముడు ఉడుతను చేతిలోకి తీసుకొని వేళ్లతో నిమిరాడని, ఉడుత శరీరంపై కనిపించే తెల్లని చారికలు ఆ శ్రీరాముని చలవేనని చెబుతుంటారు.

కార్యం పెద్దదైనా ఉడతాభక్తిగా చేతనైన సహాయం చేస్తే అలాంటి ఎన్నో చేతులు కలిసి పెద్ద పనిని నెరవేరుస్తాయి అనడం 'ఉడుత భక్తి' జాతీయం అందించే స్ఫూర్తి

కబంధ హస్తాలు

'తరతరాలుగా స్త్రీ, పురుషుని కబంధ హస్తాల్లో చిక్కి నలిగిపోతూ తనైదన అస్తిత్వాన్ని నిలబెట్టుకోలేకపోతోంది'. అనడం మనకు తెలుసు. 'మన దేశం కొన్ని వందల ఏళ్లపాటు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లో చిక్కి విలవిలలాడింది. 1947లో ఎట్టకేలకు బానిస శృంఖలాలు తొలగిపోయాయి.' వంటి ప్రయోగాలున్నాయి.

ఇంతకూ ప్రయోగించేవారికి, పాఠకులకు, శ్రోతలకు కబంధ హస్తాలంటే ఏమిటో తెలుసా! త్రేతాయుగంలో కబంధుడనే రాక్షసుడుండేవాడు. అతి భీకరమైన ఆకారంగలవాడు. యోజన విస్తీర్ణమైన పొట్ట, అంతకంటే పెద్దవైన చేతులు, పొట్టలోనే కళ్లు ఉండేవి. చేతులు అటూఇటూ తిప్పుతూ చిక్కినవారిని పొట్టలో వేసుకుంటూ ఉండేవాడు. అందుకే ఈ హస్తాలకు కబంధ హస్తాలని పేరు. సీతాదేవిని వెతుకుతూ వెళుతున్న సందర్భంలో రామలక్ష్మణులు కూడా కబంధహస్తాల్లో చిక్కుకున్నారు. కానీ వారు ఆ రాక్షసుడి హస్తాల్ని నరికివేయడంతో కబంధుడికి శాపవిమోచనం కలిగింది.

శకుని

శకునిమామ గురించి తెలియనివారు లేరు. గాంధారి తమ్ముడు, దుర్యోధనాదుల మేనమామ. మాయోపాయాలతో, దుష్ట చింతనతో కౌరవ, పాండవుల మధ్య వైరాన్ని పెంచి మహాసంగ్రామానికి ఆజ్యం పోశాడు. మాయా పాచికలు వేసి ధర్మరాజును ఓడించి పాండవుల సర్వస్వాన్ని హరించి అరణ్యాజ్ఞాతవాసానికి పంపాడు. గాంధారీదేవికి తొలుత గొర్రెతో పెళ్లిచేసి, ఆ తర్వాత ధ్రుతరాష్ట్రునితో వివాహం చేశారని తెలిసిన దుర్యోధనుడు గాంధార రాజును, ఆయన కుమారుడు శకునిని జైల్లో వేశాడని, ఆ తర్వాత శకుని దుర్యోధనుని శ్రేయోభిలాషిగా మారి దగ్గరగా వుంటూనే తనను శిక్షించిన దుర్యోధనుని నాశనం చేశాడని ఇంకో కథ కూడా చెప్తారు. మొత్తంమీద చెప్పుడు మాటలతో కలతలు సృష్టించేవారిని, మాయోపాయాలు, కుట్రలు, కుటిల కుతంత్రాలు పన్నేవారిని శకునితో పోలుస్తారు.

దుష్టచతుష్టయం

మహాభారతంలో నలుగురు దుష్టులు అంటే దుర్యోధనుడు, అతని తమ్ముడు దుశ్శాసనుడు, వారి మిత్రుడు కర్ణుడు, శకునిమామ. పాండవులపై జరిగిన అకృత్యాలకు, మాయా జూదానికి, ద్రౌపదీ వస్త్రాపహరణానికి ఇలా చివరికి కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసింది ఈ దుష్టచతుష్టయం వేసిన ఎత్తులు, మదమాత్సర్యాలేనని చెప్పుకుంటారు. లోకంలో ఏ నలుగురు దుష్టులనైనా మహాభారతం స్ఫూర్తితో దుష్టచతుష్టయం అని పిలుస్తారు.

కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు

పాండవుల అరణ్యవాసాన్ని భగ్నం చేసేందుకు కౌరవులు కుట్రపన్నారు. ఇందుకోసం ఘోషయాత్ర పేరిట వారుంటున్న ద్వైతవనానికి బయల్దేరారు. ఆ వనంలో సరోవరం

వద్ద దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని మొదలైన కౌరవ పరివారం దిగింది. అవతల పాండవులు. వారి సమక్షంలోనే వీరిని గంధర్వ రాజు చిత్రసేనుడు అడ్డుకున్నాడు. కౌరవులకు, చిత్రసేనుడికి జరిగిన యుద్ధంలో దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకునులకు గర్వభంగం జరిగింది. గంధర్వులు వారిని తమ రథాలకు కట్టివేసి తీసుకువెళ్లడానికి సిద్ధమయ్యారు. ఆ విషయం దగ్గర్లోని పాండవులకు తెలిసింది. భీమసేనుడా వార్త విని 'కాగల కార్యాన్ని గంధర్వులే నెరవేర్చార'ని వాళ్లకు తగిన శాస్తి జరిగింది అన్న అర్థంలో అన్నాడు. ధర్మరాజు వారించి 'ఇలాంటి పరిస్థితిలో అలా అనడం సరికాదు. వారిని విడిపించండి. వారి పాపాన వారే పోతారు' అన్నాడు. భీమార్జున నకుల సహదేవులు గంధర్వులను ఓడించి, కౌరవులను విడిపించారు. తమ శత్రువులకు వేరెవరో తగిన శాస్తి చేసినప్పుడు 'కాగల కార్యాన్ని గంధర్వులే నెరవేర్చారు' అనడం స్థిరపడిపోయింది.

బకాసురుడు

ఇది కూడా మహాభారతంలోని ఘట్టం. ఏకచక్రపురంలో బకాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. అతి భయంకరుడైన బకాసురుడు నగరంమీద పడి విచ్చలవిడిగా అందరినీ భక్షిస్తూ ఉండేవాడు. ఊరివారంతా వాడితో ఒక ఒప్పందం చేసుకున్నారు. వారానికి ఒకరోజు ఒకో ఇంటినుంచి మనిషి ఆహార పదార్థాలను బండిలో వేసుకొని బకాసురుని వద్దకు వెళ్లేలా ఒప్పించారు. ఆ మనిషినీ, బండిలోని ఆహార పదార్థాలను, బండికి వున్న ఎనుబోతులనూ వాడు భక్షించేలా జరిగింది ఆ ఒప్పందం. ఒకనాడు ఆ ఊళ్లో పాండవులకు ఆశ్రయమిచ్చిన బ్రాహ్మణ కుమారుని వంతు వచ్చింది. ఆ బ్రాహ్మణ కుమారుడు తల్లికి ఒకడే. ఆ తల్లి దుఃఖిస్తుంటే కుంతీదేవి ఓదార్చి నీకు ఒకడే కొడుకు. నాకు ఐదుగురు. వారిలో ఒకడు పోయినా ఫరవాలేదు. అని భీముని పంపిస్తుంది. భీముడు వెళ్లి బకుని సంహరించి ప్రజలను రక్షిస్తాడు. విపరీతంగా తినేవాడికి బకాసురుడని పేరు వచ్చింది.

చేతిచమురు

వెనుకటికి అనుభవంలేని భాగవతులు ఊరూరా తిరుగుతూ ఒక ఊరు వెళ్లారు. తమ ఆటను ప్రదర్శింపజెయ్యమని గ్రామస్తులను అడగడానికి మొహమాటపడ్డారు. చూడబోతే అక్కడివారు పెద్దమనుషులుగానూ, ఉదార బుద్ధిగలవారుగానూ కనిపించడంతో ఆట చూసిన తర్వాతనైనా తమంతట తాముగా వారే ఉదారంగా సహాయం చేయకపోరులే అని భావించారు. తమవద్దనున్న కొద్దిపాటి మొత్తంతోనే చమురు కొని వీధిలో దీపాల వెలుగులో ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శన బావుందని గ్రామస్తులు ప్రశంసించారు. అయితే

ఎవరో సహాయం చేసి ఆట ఆడించి వుంటారులే అని కొందరు, మరిన్ని ఆటలు ఆడతారేమో తర్వాత ఇవ్వవచ్చులే అని మరికొందరు భావించి సహాయం చేయలేదు. భాగవతుల పరిస్థితి ఇబ్బందిగా మారింది. చేతిలో ఉన్నదికాస్తా చమురు కోసం వదిలింది కదా! అని వాపోయారు. ఆశించింది వస్తుందని భావిస్తే రాకపోగా చేతిలో ఉన్నదికాస్తా ఖర్చయినప్పుడు 'చేతిచమురు వదిలింది కదా!' అని బాధపడడానికి ఈ జాతీయాన్ని వాడుతున్నారు.

రెంటికి చెడ్డ రేవడు

అటూఇటూ కాకుండా పోయిన సందర్భాల్లో 'నా పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడు'లా అయిపోయిందే! అని బాధపడడం చూస్తుంటాం. రేవడు అంటే రజకుడని అర్థం. ఏటిలో బట్టలుతుకుతూ ఉతికిన బట్టల్ని ఒడ్డున ఆరవేశాడు. తిరిగి రేవులో దిగి మిగిలినవాటిని ఉతకడంలో నిమగ్నమయ్యాడు. ఒడ్డున ఆరవేసిన బట్టలు గాలికి కొట్టుకుపోవడం చూసి అటు పరుగెత్తాడు. అయినా అవి దొరకలేదు. ఇటుచూస్తే అదే సమయంలో ఏరుపొంగి రేవులో ఉతకడానికి వేసిన బట్టలు కొట్టుకపోయాయి. రెండువైపులా నష్టం సంభవించడంతో అతడు రెంటికి చెడ్డ రేవడయ్యాడు.

మేకపోతు గాంభీర్యం

'చాల్లే నీ మేకపోతు గాంభీర్యం', 'మేకపోతు గాంభీర్యాన్ని కట్టిపెట్టి నడువు'... పరిస్థితిని ఎదుర్కొనే శక్తి లేకపోయినా పైకి గంభీరంగా కనిపించడాన్ని మేకపోతు గాంభీర్యం అంటారు. ఈ జాతీయం ఎలా వచ్చిందో చూద్దాం. అడవిలో మేకల మందలోంచి తప్పిపోయిన మేకపోతు దిగులుగా సంచరిస్తోంది. అంతలో సింహం ఎదురుపడింది. లోలోపల మేకపోతు భయపడసాగింది. ఇంతలో సింహం మేకపోతునుద్దేశించి 'ఏమోయ్! ఎవరైనా దేవునికి మొక్కుబడి వుంటే గడ్డం పెంచుకుంటారు. నీవెందుకు పెంచుకున్నట్లో!' అని అడిగింది, మేకపోతుకు సహజంగానే వేలాడే గడ్డం ఉంటుందని తెలియక. మేకపోతు లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుంటూ... 'మిత్రమా! నా భార్య గర్భవతి కాదు, నాకు దేవుని మొక్కు కూడా లేదు. కానీ, గడ్డం పెంచడం వెనుక కథ చెప్తా విను... నూరు పెద్ద పులులను, యాభై ఏనుగులను, పాతిక ఎలుగుబంట్లను, పన్నెండు తోడేళ్లను, ఒక సింహాన్ని చంపుకుని తిన్నట్లయితే నాకు మహారాజయోగం పడుతుందని ఒక మహర్షి చెప్పాడు. ఇప్పటివరకు మిగతా అన్నిటినీ చంపి తిన్నాను. ఒక సింహం దొరికితే చంపి తిని, నా పని పూర్తి చేసుకుందామని అనుకుంటుండగా అదృష్టవశాత్తూ నీవు ఎదురుపడ్డావు. ఇక

ఈ పని పూర్తిచేసి గడ్డం తీసేస్తా'నంది. అంతే... అదంతా నిజమేనని భావించిన సింహం భయంతో కాలికి బుద్ధిచెప్పింది.

బాదరాయణ సంబంధం

ఎదుటి వ్యక్తికీ, తనకూ బీరకాయపీచు సంబంధమేదో ఉందని చెప్పడానికి 'బాదరాయణ సంబంధం' అనే మాట వాడతారు. నిజానికి ఏ సంబంధం లేకపోయినా ఏదో సంబంధం కల్పించుకోవడమే బాదరాయణ సంబంధం. దీనివెనుక వున్న కథ చిత్రమైంది.

గ్రామంలోని బ్రాహ్మణ దంపతుల ఇంటికి ఎక్కడ్నుంచో ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. ఎద్దుల బండిపై వస్తూ ఆ ఇంటిలో రేగుచెట్టు ఉండడం చూసి ఆవరణలోకి ప్రవేశించాడు. ఎద్దును రేగుచెట్టుకు కట్టివేశాడు. లోపలికొచ్చేశాడు. ఇంటిముందు విస్తళ్లు కుట్టుకుంటూ కూర్చున్న ఆ గృహస్థు అలా చెప్పాపెట్టకుండా ఇంట్లోకి ప్రవేశించిన మనిషిని చూసి బహుశా తన భార్య తాలూకేమోననుకున్నాడు. ఇంట్లోకి వచ్చిన ఆ పెద్దమనిషి శుభ్రంగా స్నానం చేసి బట్టలు మార్చుకొని బయటికి వచ్చాడు. గృహస్థు పక్కనే కూర్చుని విస్తళ్లు కుట్టడం ప్రారంభించాడు. కాసేపయ్యాక ఇంటావిడ వాళ్లను పిలిచి భోజనం వడ్డించింది. కొత్త వ్యక్తి భర్త తాలూకేమోనని అడగలేదు. తర్వాత పక్కవేస్తే హాయిగా నిద్రపోయాడు. అప్పుడు అతనెవరైందీ మీకు తెలుసా? అంటే నీకు తెలుసా? అని భార్యాభర్తలు పరస్పరం ప్రశ్నించుకున్నారు. అతడు ఎవరి తాలూకూ కాదని తేల్చుకున్నారు. చివరికి ఆ మనిషి నిద్రలేచాక... అయ్యా! మీరెవరు? మీకు మాకు ఏమిటి సంబంధం? మా ఇంటికి ఇలా దయచేశారేమిటి? అని అడిగారు. అందుకా పెద్దమనిషి... అయ్యా మీ ఇంటిముందు రేగుచెట్టుంది. నా బండి చక్రాలు రేగుకర్రతో చేసినవి. కనుక మనది 'బాదరాయణ సంబంధం' అన్నాడు. బదరి అంటే రేగుచెట్టు. 'నిజానికి లోతుగా చూస్తే ప్రతి ఒక్కరితోనూ ఏదో ఒక సంబంధం ఉంటుంది. కోపగించుకోకండేం!' అని తాపీగా వెళ్లిపోయాడు.

ఆటు, పోటు

సముద్రతీర ప్రాంతాలవారికి ఈ ఆటుపోట్ల గురించి బాగా తెలుసు. పర్వదినాల్లో సముద్రం పొంగుతుంది. చంద్రోదయ, అస్తమయాల్లో అలలు ఉవ్వెత్తున లేస్తాయి. పొంగి పోటు పొడుస్తాయి. అప్పుడా అలల ఉధృతి చూడవలసిందే. కెరటాల పోటువల్ల తీరప్రాంతాలలో సలభై యాభై మైళ్లవరకు నదుల్లో కూడా నీరు ఉబికివస్తుంది. ఆ సమయంలో ప్రవాహం ఎదురుతన్నుతుంది. దీన్నే సముద్రం పోటు అంటారు. పొంగడాన్ని

పోటు అని, చంద్ర అస్తమయంతో తగ్గిపోవడాన్ని ఆటు అని అంటారు. జీవితంలో ఎగుడుదిగుళ్లు, కష్టసుఖాలు, వెలుగునీడలు, సాధారణం అని చెప్పడానికి 'ఆటుపోట్లు' అంటారు. కష్టనష్టాలెదుర్కొని పైకి వచ్చినవారిని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచారంటారు.

తు.చ.తప్పక

చెప్పిన పని తు.చ.తప్పకుండా పాటిస్తాను. అక్షరాలా అమలుచెయ్యడాన్ని తు.చ.తప్పకుండా అంటారు. 'తు', 'చ' అనేవి సంస్కృత అక్షరాలు. 'లోకాస్సమస్తాం సుఖినోభవంతు', 'ద్రోణంచ, భీష్మంచ, జయద్రథదంచ సుఖినోభవ' అన్నా అర్థం వస్తుంది– 'తు' లేకపోయినా సరే. ద్రోణంచ, భీష్మంచ అంటే ద్రోణుడు, భీష్ముడు అని. 'చ' అంటే మరియు అనే అర్థం. మరియు అనేది లేకపోయినా ఫరవాలేదు. అయితే అలాంటి 'తు'లు, 'చ'లు తప్పకుండా రాయడం, తు.చ.తప్పకుండా పాటించడం అన్నమాట. అంత శ్రద్ధగా అనుసరించినప్పుడు తు.చ.తప్పకుండా అని ప్రయోగిస్తాం. పొల్లుపోకుండా చేయడానికి తు.చ.తప్పకుండా అని అర్థం చెప్పవచ్చు.

మక్కీకి మక్కి

ఇది కూడా తు.చ. తప్పకుండాలాంటిదే. ఫుల్‌స్టాపులు, కామాలు సహా కాపీ చేయడం అన్నమాట. ఓ శ్రీమంతుని దగ్గర గుమాస్తా ఉండేవాడు. పుస్తకాలు, పత్రాలకు నకళ్లు రాసే పని అప్పగించాడు. చెప్పిన పనిని తు.చ. తప్పకుండా అక్షరాలా పాటించే ప్రయత్నం చేశాడు గుమాస్తా. ఇచ్చిన పుస్తకంలో ఒకచోట ఈగ చనిపోయి అతుక్కుని ఒక ముద్రలా పడి వుంటుంది. పుస్తకంలో ఆ గుర్తుకు కూడా ఏదో ప్రాధాన్యం ఉంది అనుకొన్న గుమాస్తా నకలులో కూడా ఒక చంపి అతికించాడని, దీన్నే 'మక్కీకి మక్కి' అంటారని చెప్తారు. శ్రద్ధగా పుటలు, పేరాలు, వాక్యాలను ఉన్నదున్నట్లు అనువాదం చేస్తే మక్కీకి మక్కి అనువదించారంటారు. విద్యార్థులు పరీక్షల్లో కాపీకొడితే మక్కీకి మక్కి కాపీ చేశారంటారు. సరైనవిధంగా కాపీ కొట్టలేనివారిని ఉద్దేశించి 'నకల్ మార్‌నే కే లియే భీ అకల్ రహనా పడ్‌తా' (కాపీ కొట్టడానికి కూడా తెలివితేటలు కావాలి) అంటారు.

చంద్రునికో నూలుపోగు

జగత్తుకు ఇంతగా చల్లని వెన్నెలనిచ్చి కాపాడుతున్న చంద్రునికి కృతజ్ఞతగా నెలపొడుపు నాడు తన ఉత్తరీయం నుంచి ఒక నూలుపోగు తీసి చందమామవైపు చూస్తూ సమర్పించి

నమస్కరించడం సంప్రదాయం. ఎంతో మేలుచేసిన గొప్పవారికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం? 'చంద్రునికో నూలుపోగు'లా ఇదుగో ఈ చిన్న కానుక స్వీకరించండి! అని నివేదిస్తుంటారు. కొండంత దేవునికి కొండంత పత్రి (ఆకు) ఇవ్వలేము కదా! అని కూడా అంటుంటారు.

కోతిపుండు బ్రహ్మరాక్షసి

చిన్నగా ఉన్నప్పుడే జాగ్రత్తపడి వుంటే పరిస్థితి ఇంత తీవ్రమయ్యేది కాదుగదా! అనే అర్థం వచ్చేవాటికి 'కోతిపుండు బ్రహ్మరాక్షసి' అయ్యింది అని చెప్తారు. కోతిపుండు బ్రహ్మరాక్షసి ఎలా అయ్యిందో తెలుసుకుందాం. కోతికి వచ్చిన పుండును దానిమానాన దాన్ని వదిలేస్తేనో, చేతనైతే మందు రాస్తేనో త్వరగా మానిపోతుంది. కోతులు ఊరుకోవు కదా! దాన్ని మిగిలినవన్నీ కూడా మరింత కెలుకుతాయి. దాంతో ఆ పుండు పెద్దదై మానడం అసాధ్యమై చివరికి కోతి చావుకు వస్తుంది. ఆ విధంగా కోతిపుండు బ్రహ్మరాక్షసిగా మారితే జరిగే విపత్తును ఈ జాతీయం హెచ్చరిస్తుంది.

కరిమింగిన వెలగపండు

'కరిమింగిన వెలగపండు' చందంగా 'వేసిన తాళం వేసినట్లే వుంది. డబ్బు, నగలు మాయమయ్యాయి' వంటి ప్రమాణాల్లో ఎక్కువగా వాడుతుంటారు. వెలగపండును ఉన్నది ఉన్నట్లే ఏనుగు మింగుతుంది. వెలగపండు కడుపులో అలాగే ఉంటుంది. కానీ, లోపలి గుజ్జుమాత్రం ఉండదు.

చిదంబర రహస్యం

చిదంబరం అనేది దక్షిణ భారతదేశంలోని తమిళనాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం. నటరాజస్వామి కొలువైన దేవస్థానం. అమ్మవారి పేరు శివగామి. ఐదు ప్రాకారాలతో ఎత్తైన గోపురాలతో దక్షిణాది శిల్పకళా వైభవానికి నిదర్శనంలా ఉంటుంది. గర్భాలయం పేరు చిత్సభ. దీని మధ్యలో నటరాజస్వామి విగ్రహం ఉంటుంది. దేవుని వెనుకభాగాన తెరకట్టి వుంచుతారు. కొన్ని పర్వదినాల్లో మాత్రమే భక్తులకోసం దాన్ని తొలగిస్తారు. నిజానికి తెరవెనుక శూన్యమే. నిర్మలమైన ఆకాశంలా వుంటుంది. సాధారణంగా చిదంబరంలోని ఆ చోటును ఎవర్నీ చూడనివ్వరు కాబట్టి దాన్ని 'చిదంబర రహస్యం' అంటారు. అంతకుమించి పెద్ద బ్రహ్మ రహస్యమేమీ కాదు. ఏమీ లేకపోయినా ఏదో ఉన్నట్లు భ్రమ కల్పించారు కాబట్టి అది 'చిదంబర రహస్యం'గా పేరు పొందింది. చాలా

విషయాలకు 'అంతా చిదంబర రహస్యం' అని వాడడం పరిపాటైపోయింది. ఈ మధ్య కేంద్ర హెూంమంత్రి చిదంబరం తెలంగాణ విషయంలో చెప్పిన రహస్యాన్ని కూడా 'చిదంబర రహస్యం' అని అర్థ విపరిణామం చేశారు మీడియాలో...

బ్రహ్మరథం

సన్యాసులు మరణించినప్పుడు వారి భౌతికకాయాన్ని తీసుకువెళ్లేందుకు ఒక ప్రత్యేక వాహనాన్ని తయారుచేస్తారు. దీనికి బ్రహ్మరథం అని పేరు. ఆ భౌతికకాయాన్ని బ్రహ్మరథంపై ఉంచి వేద పండితులు వేద మంత్రాల్ని పఠిస్తూ ఉండగా బ్రాహ్మణశ్రేష్ఠులు దానిని మోస్తారు. పెద్ద ఊరేగింపు జరుగుతుంది. బ్రహ్మరథం అనేది గొప్ప గౌరవంగా భావిస్తారు. కాబట్టి ఈ అర్థంలో ఎవరిని అమితంగా గౌరవించినా 'జనం బ్రహ్మరథం పట్టారు' అంటూ ప్రయోగిస్తారు.

దశమగ్రహం

అల్లుడ్ని దశమగ్రహం అంటారు 'జామాతో దశమగ్రహం' అనే సమాసంలో జామాత (అల్లుడ్ని)ను పదో గ్రహంగా అభివర్ణించారు. మనకు నవగ్రహాలున్నాయి. ముఖ్యంగా రాహువు, కేతువులు పట్టి పీడిస్తాయి. అల్లుడు కూడా పీడిస్తాడు కాబట్టి దశమగ్రహంగా చెప్పుకుంటారు.

శంకుస్థాపన

ఏదైనా నిర్మాణం చేసేముందు భూమిపూజ చేస్తారు. ఆ సమయంలో వాస్తు ప్రకారం నిపుణులు చూపినచోట తవ్వి పురోహితుని సలహాపై పూజాద్రవ్యాలు భూమిలో వేస్తారు. నవధాన్యాలు, నవరత్నాలు, శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత నిర్మాణం చేపడతారు. ఆ శంకుస్థాపన జాతీయంగా మారింది. నేడు భవన నిర్మాణ పనుల్ని ప్రారంభించినా, రోడ్డు నిర్మాణం ప్రారంభించినా శంకుస్థాపన చేశారని రాస్తున్నారు.

కూపస్థ మండూకం

బావిలో కప్ప అని అర్థం. ఆ కప్పకు బావే సర్వస్వం. తనదైన లోకం. అది దాటి బయటికి రాదు కాబట్టి వేరే లోకం తెలియదు. ఎవరైనా తననుతాను తక్కువ చేసుకోడానికి 'నేను కూపస్థ మండూకాన్నిరా! నాకీ విషయాలన్నీ ఎలా తెలుస్తాయి చెప్పు?' అంటారు. వేరొకర్ని గురించి తక్కువ చేయడానికి కూడా 'వాడొక కూపస్థ మండూకం' అని అంటారు.

తిలోదకాలు

'తిల'లంటే నువ్వులు. మంత్రసహితంగా నువ్వులు చేతిలోకి తీసుకొని వాటిమీదుగా ఉదకాలు (నీళ్లు) వదలడాన్ని 'తిలోదకాలు వదిలారు' అంటారు. పితృదేవతలకు శ్రాద్ధాలు పెట్టేటప్పుడు ఈ విధంగా నువ్వులతో తర్పణాలు విడుస్తుంటారు. దీంతో పెద్దలకు ఆత్మశాంతి కలుగుతుందని అంటారు. ఒక పార్టీతో కొంతకాలం పొత్తును కొనసాగించిన మరో పార్టీ దానికి వీడ్కోలు చెప్పడాన్ని 'తిలోదకాలిచ్చింది' అంటుంటారు. ఒక ప్రతిపాదనను చేసి, తర్వాత దాన్ని విస్మరించి పూర్తిగా విరమించుకున్నప్పుడు కూడా తన నిర్ణయానికి తిలోదకాలిచ్చారని అంటుంటారు.

సాష్టాంగ ప్రణామం

దేవునికి స+అష్టాంగ ప్రణామం... ఎనిమిది అంగాలతో కూడిన దండాన్ని అర్పించుకోవడాన్ని సాష్టాంగ ప్రణామం అంటారు. దాదాపు తెలుగు వారందరికీ తెలిసిన తెలుగుమాట ఇది. అయితే దీని అర్థం చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. ముఖం, రొమ్ము, రెండు చేతులు (జోడించి), రెండు మోకాళ్లు, రెండు కళ్లు... భూమిని తాకేవిధంగా బోర్లా పడుకొని నమస్కారం చేయడం సాష్టాంగ ప్రణామం అవుతుంది. ఎంతో భక్తితో దేవునిముందు సాష్టాంగ ప్రణామం చేసేవారికి ఏయే అవయవాలు వాల్చి ప్రణామం చేస్తున్నదీ సరిగా తెలియదు. ఆ పేరు మాత్రమే తెలుసు. మరికొందరు అతి వినయంతో నిలబడే 'సాష్టాంగ ప్రణామం' అంటుంటారు. కొందరు నిలబడి తల కదలకుండానే 'శిరసు వంచి నమస్కరిస్తున్నాను' వంటి పెద్దపెద్ద మాటలు వాడతారు... 'తాపత్రయం' అని వాడతారు ఆ మూడు రకాల తాపాలేమిటో వారికే తెలియదు.. మనకు చెప్పరు. 'అష్టకష్టాలు' పడుతున్నాను అంటారు. ఆ ఎనిమిది రకాలైన కష్టాలేమిటో వారికి తెలియదు. తెలియకుండానే తాము పడుతున్నవి అష్టకష్టాలుగా భావిస్తారు. అదేవిధంగా అష్టైశ్వరాలంటే తెలియదు.

సాహిత్యంలో తెలుగు బంగారం ఉంది

'దేశ భాషలందు తెలుగు లెస్స' అనే మాటను తెలుగు గొప్పదనాన్ని గురించి చెప్పడానికి చాలామంది వాడతారు. సంతోషం. ఈ మాట శ్రీకృష్ణదేవరాయలవారు అన్నట్లు కొందరికి తెలుసు. రాయలు రచించిన 'ఆముక్తమాల్యద' అనే ప్రౌఢ ప్రబంధంలోని ఒకానొక పద్యంలో ఇదొక పాదం. ఇదీ మొత్తం పద్యం...

'తెలుగదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్లనృపులు గొల్వ ఎరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స'

రాయలకు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు కలలో కనిపించి 'ఇది తెలుగుదేశమని, నేను తెలుగువారి దేవుణ్ని... ఇక ఈ భాష దేశభాషల్లోనే గొప్పనైందీ' అన్నాడు. ఈ భాషలో కావ్యం రాయమని ఆదేశించాడు. తెలుగు నిస్సందేహంగా గొప్ప భాషే. రాయలవారు అన్నమాట నిజంగానే తెలుగు గొప్ప భాష అని ప్రశంసించేదే. కానీ, అన్నిటికంటే గొప్పదని అనుకోరాదు. ఎందుకంటే ప్రతి భాష గొప్పదే. నుడికారం, వాక్యనిర్మాణం, మనిషి అవస్థల్ని, భావ తీవ్రతను శక్తిమంతంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పగలిగే లక్షణం ప్రతి భాషకూ ఉంటుంది. భాషలో చక్కని వచనంగాని, పద్యంగానీ రాయడంలోనూ, అలా రాసిందాన్ని ఆస్వాదించడంలోనూ దాని గొప్పదనం ఉంటుంది. గొప్పగా రాసేవారు, ఆ లోతులు తెలిసి ఆస్వాదించి అభినందించేవారు అన్ని భాషల్లోనూ ఉంటారు. ఏ భాష లక్షణం ఆ భాషది. అది తెలుసుకుంటే ఏ భాషకు చెందినవారు తమ భాష మిగతా భాషలకంటే గొప్పది అనలేరు. భాషను అనుసరించి ఆ భాషకున్న చరిత్రను పరిశీలిస్తే ఎంతో ఉజ్వలమైన సాహిత్యం వచ్చినట్లు తెలుస్తుంది. ఆ భాషను మాధ్యమంగా చేసుకొని ఎన్నో ప్రక్రియల్లో గొప్ప రచనలు వచ్చి వుంటాయి. ఆ రచనలు ఇతర భాషలవారినీ ఎంతగానో ఆకట్టుకుని ఉంటాయి. అవకాశాన్ని, అనువాదకుల శక్తినీబట్టి ఆ భాషల్లోకి అనువాదం కూడా అయి ఉంటాయి.

భాష బంగారం. ఆ బంగారానికి రచయితలు తమ అభివ్యక్తి వైవిధ్యంతో, శైలీ రమ్యతతో ఒక రచనను అద్భుతమైన నగగా తయారుచేస్తారు. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ విశ్వమానవ విభవానికి నివాళి ఎత్తిన కవిత, 'నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను, నేను సైతం భువనఘోషకు అశ్రువొక్కటి ధారవోశాను' అన్న శ్రీశ్రీ మహాప్రస్థానం, 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అని రాయప్రోలు నిలిపిన తెలుగు గౌరవం తెలుగు బంగారంతో చేసిన నగలే. నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లల్లాంటివని తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'లో అనడం ఆ అభివ్యక్తి వైవిధ్యానికి, శైలీ రమ్యతమకు నిదర్శనం. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై, ఈ యడవి దాగిపోనా, ఎటులైనా ఇచటనే ఆగిపోనా' అన్న కృష్ణశాస్త్రి ప్రకృతి కవిత్వం అలాంటిదే. 'వెండి గజ్జెల రవళియే కవ్వించునా నన్నింతగా, గుండె గజ్జెలలో చేరి ఉన్నదేమో వింతగా' అన్న డాక్టర్ సి.నారాయణరెడ్డి కవితా కర్పూర కళికలు అలాంటివే. 'తీగలను తెంపి అగ్నిలో దింపినావు, నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి కవితా మహేంద్రోదయాలు... ఇవన్నీ తెలుగు బంగారంతో వెలుగులు విరజిమ్మేలా చేసిన నగలే.

ఈ భాషలో తయారవుతున్న గొప్ప నగల్ని, వాటిని తీర్చిన నగిషీల్ని చదివి ఆనందించేందుకు, చేతనైతే అలాంటి కవులు, రచయితల అడుగుజాడల్లో నడిచి మంచి రచనల్ని అందించేందుకు అపారమైన అవకాశాలున్న సముద్రం భాష. అటువంటి తెలుగుభాషా సముద్రంలో మునకలు వేసి అనర్ఘ రత్నాలను వెలికితీసే పనికి ఎవరూ ధనం చెల్లించనవసరంలేదు. గ్రాములో వందోవంతు బంగారు రజను దొరకని కంసాలి బూడిదలో కళ్లు ఇంతలు చేసుకొని వెతికేవాళ్లు భాషలోని మణుగులకొద్దీ బయటపడే బంగారాన్ని చూడలేకున్నారు. ఈ భావ దారిద్ర్యం నుంచి ఎప్పుడు బయటపడతామో! పత్రికా రచయితలు కూడా ఈ బాధ్యతను గుర్తించి తమ దైనందిన వార్తారచనలో, ప్రత్యేక వ్యాసాల్లో అపూర్వమైన తెలుగుమాటలను ప్రయోగించాలి. మనకున్న గొప్ప గ్రంథాలను, వాటిలోని పూర్వ కవిరచయితల ప్రయోగాలను అనురక్తితో చదివి ఆనందించడమేగాకుండా ఆ పదాల నిధులను కూడగట్టుకొని, ఆ పద ప్రయోగాలతో గొప్పగా రాస్తే తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాలు మరింత సంపన్నమవుతాయి. కృతకమైన భాషాబంధాలనుంచి, అనువాద భావదారిద్ర్య శృంఖలాలనుంచి వెలికివచ్చి కొత్త లోకాన్ని చూస్తే తెలుగు తోటలు వర్ణవర్ణాల పూలతో వికసించేలా చేయవచ్చు.

ఇందుకోసం ప్రతి పత్రికా రచయితా తెలుగు పఠనంపట్ల శ్రద్ధ వహించాలి. పదసంపదను చేదుకోవాలి. చేదుకున్న పదసంపదలో నిండి వున్న అర్థ సంపదను, ఔచిత్యమంతంగా ప్రయోగించే విచక్షణను అలవరచుకోవాలి. ఇవి చేయగలిగితే పత్రికారచయితలు, ప్రసార మాధ్యమాల రచయితలు, అనువాదకులు తమ రంగాల్లో ఎంతో నిబద్ధతతో కూడిన సేవలందించగలుగుతారు. దీనివల్ల నేటితరం ప్రధానంగా ప్రయోజనం పొందుతారు. భాషాభిమానాన్ని, భాషా పరిజ్ఞానాన్ని సముపార్జించుకో గలుగుతారు. భాషను మునుముందుకు నడిపించే సంధాతలు, భాగ్యవిధాతలు అవుతారు.

ప్రత్యేక రచన

పత్రికారచన ఇప్పుడు చాలా విస్తృతమైన పరిధిని సంతరించుకుంది. రాజకీయాలు, సాహిత్యం, కళలు, సాంస్కృతిక-సామాజిక విషయాలు, వ్యాపారం, పరిశ్రమలు, వైద్య ఆరోగ్య విషయాలు, వ్యవసాయం, ఆర్థికరంగం, చరిత్ర-పురావస్తు విశేషాలు, యాత్రారంగం, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, వైజ్ఞానికరంగం, సినిమా, క్రీడలు, ఈ రంగాలే కాకుండా మహిళలు, బాలలు, యువత... ఇలా ఒక రంగం, ఒక విషయం అనిలేదు. దినపత్రిక విప్పితే చాలా విశేషాలు. అనేక విషయాలకు సంబంధించి పైపై అంశాలు కూడా లోతైన సమాచారం, విశ్లేషణ ఉంటున్నాయి. అన్ని విషయాలు రాసేందుకు ఒకప్పుడు కొందరు మాత్రమే ఉండేవారు. ప్రత్యేక విషయాలు ఒకోవారం ఒకో రంగంపైనే ఉండేవి. పాఠకుల అవసరాలు, డిమాండు పెరగడంతో అందుకు అనుగుణంగా ప్రతిరోజూ అనేక అంశాలు వివరంగా ఇవ్వవలసి వస్తోంది. పత్రికారచయితలు సర్వజ్ఞులు కాకపోయినా అన్నిటిగురించి కొంతకొంత అవగాహన ఉంటుంది. ఆ అవగాహన మేరకు వివిధ రంగాలకు సంబంధించి ఒక కోణాన్ని ఎంచుకొని సమాచారాన్ని సేకరించి విశ్లేషించి రాస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు రాయవలసిన అంశంపై దృష్టి నిలిపి పరిశోధించి రాసి, వేరే అంశంపైకి వెళుతున్నారు. ఇప్పటికిప్పుడు పాఠకుల అవసరాలు తీరుతున్నాయి. లోటు పూడ్చుకునేందుకు ఇంటర్నెట్ కూడా తోడుంది.

కానీ, ఇంతటితో సరిపోతుందా! వచ్చే ఐదేళ్లకో, పదేళ్లకో ఈ ప్రమాణాలు సరిపోతాయా? వచ్చే వేగం, జ్ఞానం, కలిగిన తరం అంచనాలకు ఈ స్థాయి తూగుతుందా? ఆలోచించదగిన విషయమే. ఇతర సమాచార సాధనాలతోపాటే పోటీపడడానికి, గెలిచి నిలవడానికి ఎవరికివారు ఎప్పటికప్పుడు తమ శక్తిని పెంచుకుంటూ పోవాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు పేరు (బ్రాండ్ ఇమేజ్)తో నడిచేది. ఇప్పుడు పూర్వప్రతిష్ఠ కాదు... నాణ్యతే గీటురాయి. కొన్ని పత్రికలు కొన్నేళ్లకిందటే చాదస్తంగా అనేక శాఖలను నెలకొల్పాయి. అంతర్గతంగా వ్యవసాయానికి వ్యవసాయం, క్రీడలకు క్రీడలు, వాణిజ్యం, పరిశ్రమలు ఇలా వివిధ శాఖలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాయి. ఆ శాఖకు సంబంధించిన

సమస్త సమాచారం సేకరించి, క్రోడీకరించి ఉంచారు. పదేళ్లకిందట చెన్నై మౌంట్‌రోడ్డులో వున్న 'ది హిందూ' కార్యాలయంలో వివిధ శాఖల్ని సందర్శించినప్పుడు అక్కడి పరిస్థితి చూసి ఆశ్చర్యం కలిగింది. తెలుగు పత్రికా కార్యాలయాల్లో నాటికీనేటికీ ఆ పరిస్థితి లేదు. ఫీచర్స్ విభాగంలో ఆంగ్లంలో వస్తున్న వివిధ రకాలైన మేగజైన్లు, ఇంటర్నెట్‌పైనే ఆధారపడుతున్నాయి. శాఖను ఏర్పాటు చేసి తగిన ముద్రిత సామగ్రి అంటే పరిశోధన పత్రాలు, ప్రత్యేక సంచికలు, గ్రంథాలు, ఆడియో-వీడియో సీడీలు, ఫిల్మ్‌తో నింపడం ఒకటి. ఆ ఆకర సామగ్రిని అకడమిక్‌గా వాడుకుంటూ ఎప్పటికప్పుడు దాన్ని నవీకరించుకుంటూ ఉండడానికి, ఆ రెఫరెన్స్‌ను వినియోగించుకొని పత్రికలో ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలు రాయడానికి తగిన నిపుణులైన పత్రికారచయితలను నియమించుకోవడం ఒకటి.

పత్రిక కార్యాలయంలో వివిధ విషయాలపై ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు నవీకరించుకుని నిర్వహిస్తే పత్రికలో ఎప్పుడు ఏ ప్రత్యేక అంశంపై రాయవలసి వచ్చినా వెంటనే రాస్తారు. ఉన్నత ప్రమాణాలతో కూడుకొని వుంటుంది కూడా. అటువంటి పత్రికలను పాఠకులూ ఆదరిస్తారు. వాటిపై ఆధారపడతారు. తెలుగు పత్రికల్లో వివిధ అంశాలపై ప్రత్యేక రచనలు చేసేందుకు పాత్రికేయులకు శాఖలు కేటాయిస్తున్నారు. రీసెర్చ్ అండ్ రిఫరెన్స్ మెటీరియల్‌ను కొంతవరకు ఎప్పటికప్పుడు సమకూరుస్తున్నారు. కానీ, తగిన స్థాయిలో వుండడంలేదు. పైపైని రాతల్లా ఉంటున్నాయి. ఈ రోజుల్లో చాలవరకు ఇంటర్నెట్‌పై ఆధారపడడం పెరిగిపోతోంది. నెట్‌నిండా సమస్త విజ్ఞానం ఉంటున్నది కాబట్టి ప్రత్యేక విభాగాలు అవసరంలేదని భావిస్తున్నారు. ఎప్పుడు ఏ విషయంపై ఏ కోణంలో రాయాల్సిన అవసరం ఏర్పడినా అప్పటికప్పుడు ఆ సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని రాస్తున్నారు. అవతార్ సినిమా గురించో, ఆస్కార్ నామినేషన్ల గురించో అయితే ఇంటర్నెట్‌లో చాలా సమాచారం లభిస్తుంది. కానీ, నెట్‌లోని వివిధ బ్లాగ్‌లు, వికీపీడియా వంటి నెట్‌వర్క్‌ల్లో కూడా సరయిన సమాచారం లభించని సందర్భాలు, తప్పుడు సమాచారాలు ఉండడం జరుగుతోంది. అందునా స్థానిక విషయాలు, వివిధ విషయాల సమాచారం మనదగ్గరే సరైనవిధంగా లేదు. ఉన్నదాన్ని కూడా పూర్తిస్థాయిలో ఇంటర్నెట్‌లో పొందుపరుస్తున్న వారు కూడా లేరు. కాబట్టి ఇంటర్నెట్ సర్వరోగ నివారిణి కాదని గమనించి ఎవరికి వారు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకొని పటిష్ఠపరచుకోవాలి. ముఖ్యంగా పరిశోధక రచయితలు మన పుస్తక భాండాగారాలను మర్చిపోకూడదు.

ప్రధాన పుటల్లో కూడా 25 శాతం స్థలాన్ని అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర వార్తలకు, సంపాదకీయాలు, ఎడిట్‌పేజీ వ్యాసాలకు వదిలి మిగతావి ప్రతిరోజూ వాణిజ్యం, ఆర్థికరంగం, క్రీడలు, యువత, ఉద్యోగ, విద్యావకాశాలు, మహిళలు, ఆరోగ్య విషయాలపై లోతైన సమాచారాన్ని ఇవ్వడానికి మిగతా స్థలాన్ని కేటాయిస్తున్నారు. పరిధి విస్తృతికి తగినట్లుగా ఆయా విషయాలకు సంబంధించిన అంశాలను ఇతరులకన్నా బాగా ఇవ్వగలిగినప్పుడు పత్రికపై పాఠకులు ఆధారపడడం, ఆదరించడం, ఉపయోగించుకొని ప్రయోజనం పొందడం పెరుగుతుంది. ప్రత్యేక పుటలు (Special pages) ప్రాధాన్యం పెరుగుతున్నకొద్దీ వివిధ విషయాలకు సంబంధించిన అంశాల పదజాలాన్ని తెలుగు పాఠకులకు సుగమంగా అందించడానికి కూడా ప్రత్యేక కృషి అవసరం. మనకు తెలుగులో సాధారణ నిఘంటువులకు తోడు వివిధ శాస్త్రాల పారిభాషిక పదజాలానికి సంబంధించిన ప్రత్యేక నిఘంటువులు కావాలి. జంతు, జీవ, రసాయన, భౌతికశాస్త్రాల వంటివాటికి కొంతవరకు పదకోశాలు లభ్యమవుతున్నా ప్రపంచ వాణిజ్యం, ఆర్థికరంగం, శాస్త్ర–సాంకేతిక రంగం వంటి రంగాలకు సంబంధించిన పదాలకు ఇంటర్నెట్‌లో కుప్పలుతెప్పలుగా వున్న వివిధ ఇతర విషయాల పదజాలానికి తెలుగులో అర్థాలు లభించడం అంత తేలిక కాదు.

ఈ పరిస్థితుల్లో ఎవరికివారు వివిధ విషయాలపై ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేసుకొని నిపుణులైన పత్రికారచయితలను నియమించుకోవాలి. తగిన సమాచారం, పరిశోధనా సామగ్రిని అందజేయాలి. అంతటితో ఆగకుండా ప్రతి శాఖకు భాషా ఉప విభాగం తప్పనిసరి. ఆ విభాగం నుంచి నిరంతరం పదకోశాలను తయారుచేసుకోవడంలో నిమగ్నమై ఉండాలి. వెలుపల వున్న ఆయా విషయాలకు సంబంధించిన నిపుణుల సలహా సహకారాలతో పదకోశాలను రూపొందించుకోవాలి. ఈ విధంగా పత్రికా కార్యాలయాల్లో ప్రత్యేక విషయాలకు సంబంధించి, ఆయా విషయాల భాషకు సంబంధించి పరిశోధన, అభివృద్ధి విభాగాలు పటిష్ఠంగా పనిచేస్తే పత్రికలు విజ్ఞాన సర్వస్వాలుగా వెలువడడానికి వీలు కలుగుతుది. ఏ విషయంపైనైనా ఎవరు అందించే సమాచారంపై గుడ్డిగా ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుంది. విశ్వసనీయమైన, స్వయం సమృద్ధమైన సమాచార నిధిగా పత్రికలు రూపొందుతాయి.

పత్రికల్ని విజ్ఞాన సర్వస్వాలుగా రూపొందించుకునే క్రమంలో భాషకు తగిన ప్రాధాన్యం ఇవ్వగలిగితే సమస్త శాస్త్ర విజ్ఞానాన్ని తెలుగులో తెచ్చుకొనేందుకు అవసరమైన

పదసంపదను వృద్ధి చేసుకొన్నవారమవుతాం. భాష సుసంపన్నమవడం వల్ల పత్రిక అందించదలచిన ప్రత్యేక వ్యాసాలు, సమాచారానికే పరిమితం కాకుండా భాష ఆధునికీకరణ జరుగుతుంది. ఏ విషయంపై, ఏ శాస్త్రంపై తెలుగులో రచయితలు పరిశోధన గ్రంథాలు రాయాల్సి వచ్చినా తడుముకోవాల్సిన అవసరం ఉండదు. ఇప్పటివరకు ఉన్న పరిస్థితుల్లో ఇంటర్నెట్‌లో ఇతర భాషల సమాచారాన్ని పెట్టుకోగలిగినంతగా తెలుగును పెట్టలేకపోయాం. అందుకు ప్రధాన అవరోధం భాషే. భాషను అభివృద్ధిపరచుకోగలిగితే ఆ లోటు తీరుతుంది. ఆధునిక కాలంలో పెరుగుతున్న అవసరాలకు దీటుగా భాషా సామర్థ్యాన్ని పెంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అపరిమితం. ఈ బాధ్యతా నిర్వహణలో పత్రికలవారు పాలుపంచుకున్నప్పుడు భాషకు, దేశానికీ ఎంతో మేలు చేసినవారవుతారు.

సాహిత్య, సాంస్కృతిక వార్తారచన

పత్రికలు అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నిత్యం జరుగుతున్న సంఘటనల్ని వార్తలుగా ప్రచురిస్తున్నాయి. ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే రచనలు, ఛాయాచిత్రాలతో ప్రచురిస్తుంటాయి. సాహిత్యం, కళా సాంస్కృతిక రంగాల్లో పరిణామాలను ఎప్పటికప్పుడు అందిస్తుంటాయి. సాహిత్యం, సంస్కృతి, కళలు సమకాలీనంగా వర్ధిల్లుతున్నా అవి అప్పటికప్పుడు పుట్టినవి కావు. గత అనేక శతాబ్దాలుగా ఇవి సమాజానికి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతున్నాయి. పురాణేతిహాసాలను ప్రజలకు పరిచయం చేసింది సాహిత్యమైతే, వాటికి కళారూపాలు దృశ్యమానం చేసి రసానుభూతిని పంచిపెట్టాయి. రామాయణం, మహాభారతం, భాగవత కథలు మానవరూపు దాల్చి మనుషుల మధ్య ఆడిపాడి మాట్లాడి మంచిని గురించి చెప్పి, చెడును రూపుమాపి ఆదర్శాలను ప్రబోధించాయి. కళాసాహిత్యాల అనంతర ఆధునిక కార్యక్షేత్రం తరతరాల సమకాలీన సమాజంవైపు మళ్లింది. సమకాలీన సమస్యలకు అద్దంపట్టి ఇప్పటి మానవరూపాల్ని ధరించాయి. అక్షరం రూపం పొందింది పద్యమైనా, గద్యమైనా, వచనమైనా 'విశ్వశ్రేయ: కావ్యం' ఆదర్శాన్ని స్వీకరించింది. శాస్త్రీయ కళలకు తోడుగా ఆదినుంచీ జానపదులకు దగ్గరగా ఉన్న లోక కళారూపాలు ప్రత్యేక వ్యక్తిత్వంతో భాసించాయి. సంస్కృతి విస్తృతమైన పదం. ఒక తరంనుంచి మరొక తరానికి సంప్రదాయకంగా అందుతున్నదే సంస్కృతి. ప్రజల కట్టూబొట్టూ, వేషభూషణాలు, పెళ్లిళ్లు–పేరంటాలు, ఆహారవిహారాలు, పండుగపబ్బాలు, క్రీడావినోదాలు, ఆటపాటలు, కర్మకాండలు... జీవనంలోని అన్నీ సంస్కృతి కిందకు వస్తాయి.

సాహిత్యంలోని భిన్న ప్రక్రియలను చేపట్టి కొత్తగా, అందంగా చెప్పడంలో ప్రత్యేక ముద్రచూపే సృజనాత్మక వ్యాపారంలో రచయితలు నిమగ్నమై ఉంటారు. నటీనటులు, నాటకకర్తలు, ప్రయోక్తలు, దర్శకులు, నర్తకీనర్తకులు, గాయనీగాయకులు, చిత్రలేఖకులు, శిల్పులు, ఇతర కళాకారులు కళను ప్రజలకోసమూ, కళకోసమూ ప్రయోగిస్తూ తమ ఉనికిని చాటే వ్యాపకంలో భాగస్వాములై ముందుకు సాగుతున్నారు. సాహిత్యంలో ఏ రచనా ఆ సంస్కృతిలోని ఏ ఉత్తమ పార్శ్వమూ, ఏ కళలోని మనోరంజక అంశమూ ఏదో ప్రాంతానికే పరిమితం. వెయ్యిమందికో, రెండువేల మందికో పరిమితం. ఇలాంటి సాహిత్య,

కళా సంస్కృతులను పరిమితుల పరిష్వంగం నుంచి విడిపించి లక్షలు, కోట్లమంది వద్దకు తీసుకెళ్లే శక్తి పత్రికలకు, ప్రసార మాధ్యమాలకే ఉంది. ఎలా ఉన్నవి అలా చూపించడం ఒకటి. వాటిలోని ఉదాత్త, అనుదాత్త గుణాలను అంచనాకట్టి చూపడంద్వారా ప్రజల్లో అభిమానం కలిగించడం, మంచి రచనలు వచ్చేందుకు ప్రోత్సాహం కలిగించడం, మంచి కళాంశాల రూపకల్పనకు ఊతమివ్వడం, ప్రణాళికలను మెరుగుపరచుకోవడం, దోహదం చేయడం మరొకటి. దీన్నే సాహిత్య, కళావిమర్శ అంటారు. తరతరాలుగా పదిలపరచుకొంటూ వస్తున్న సంస్కృతి గొప్పదనాన్ని వెలుగులోకి తెస్తూ ఆ విలువలపై ప్రజల్లో అనురక్తిని కలిగిస్తూ సంస్కృతిలో ప్రతి మనిషి భాగస్వామిగా, సంస్కృతీ పరిరక్షణకు ప్రతి మనిషీ బాధ్యుడుగా ఉండాలని చెప్పేది కూడా కళావిమర్శే.

ఈ రకమైన కళావిమర్శ చేస్తూ మానవ సమాజ పురోగతిని కళాత్మకం, సంస్కారయుతం చేసే శక్తి, అవకాశం పత్రికలకు, ప్రసార మాధ్యమాలకే ఉంది. ఈ శక్తిని, అవకాశాన్ని ఈ మాధ్యమాలు ఏ మేరకు వినియోగిస్తున్నాయో పరిశీలనాయోగ్యమే. ఈ పని ప్రయోజనాత్మకమని భావించడమే కాదు, చిత్తశుద్ధితో చేసేవారు ఒకప్పుడు ఉండేవారు. తమకున్న బాధ్యతల్లో అదీ ఒకటని, ఇంకా చెప్పాలంటే మిగతా బాధ్యతల్లోకి ఇదే తక్కువదనీ నేటివారు భావిస్తున్నారు. సాహిత్య, కళా సంస్కృతులపై అపారమైన ఆ విలువలను సాధికారికంగా విశ్లేషించగల సత్తావున్నవారు అప్పటివారైతే, వాటిపైన కనీస అవగాహన కూడా లేక అదొక పాతచింతకాయపచ్చడిగా భావిస్తూ, చిల్లర రాజకీయ కార్యకలాపాల కోసం ఏ వార్త రాస్తే ఎంత ఎక్కువ ప్రతులు అమ్ముడయ్యే అవకాశం ఉందనే ప్రాకులాట కోసం తమ స్థలాన్ని అంకితం చేస్తున్నాయి నేటి పత్రికలు. తమ సమయాన్ని వృథా చేస్తున్నాయి. ప్రసారమాధ్యమాలు సాధారణమైన నాయకునికి సంబంధించి ఏ ఛానల్లో దుమ్మురేగుతోందో దానిపై వార్తలు ఎక్కువగా రాసే పరిస్థితి ఉంది. మంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగితే మాత్రం ఇలాంటి పనిలేనివారి ఆటపాటల కోసం విలువైన స్థలాన్ని ఇవ్వడం అవసరమా? అని తేల్చిపారేస్తున్నారు. నిర్ణేతలకు సాహిత్య, సామాజికపరమైన అభిరుచి, అవగాహన ఏమాత్రం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని చెప్పాలి.

సాహిత్య వ్యక్తీకరణకు భాష ఒక సాధనమేగానీ, రచన గొప్పదైతే భాషను రచన నుంచి వేరుచేసి విశ్వజనీనమైన మానవీయ భావనను, ఆదర్శాన్ని, అవస్థను మనం చూడవచ్చు. అనువాదం ద్వారా ఈ భావనను, ఆదర్శాన్ని ప్రపంచంలోని ఏ భాషలోనివారైనా ఆస్వాదించి అనుసరించవచ్చు. అలాగే ఒక దేశం తమవద్దకు అతిథిగా వచ్చిన మరో

దేశాధినేతకు ఇవ్వదగిన, ఇచ్చి మెప్పించదగిన ఆతిథ్యం భోజనాదులకంటే సంగీత, నృత్యాది ప్రదర్శనలే. భాషకు అతీతమైన, శ్రుతిలయ సమన్వితమైన ఈ కళలే కదా ప్రపంచంలో మనకింత చోటు సంపాదించి పెట్టేవి. పరమ యాంత్రికమైనది మానవ జీవనం. బిడ్డ కడుపున పడినప్పటినుంచి బయటపడి, పెరిగి పెద్దయి పెళ్లిచేసుకుని, బిడ్డల్ని కని వృద్ధుడై బొందలో పడడం తప్ప వాస్తవానికి ఎక్కువేముంది? అలాంటి జీవనంలో కష్టసుఖాలన్నిటినీ వెలిగించి జీవితపు రుచిని పెంచేది సంస్కృతే కదా! గొప్పగొప్ప పరిశోధనలు చేసి వైజ్ఞానిక జగత్తులో పేరుప్రతిష్ఠలార్జించుకున్న ఒక శాస్త్రవేత్త కంటే చదువుసంధ్యల్లేకపోయినా వీధి నాటకంలో చూపిన అభినయమో, పాడిన పద్యమో ఆ కళాకారునికి ఎక్కువ జనాదరణ సంపాదించిపెడుతుంది.

ఇటువంటి సాహిత్య, కళాసంస్కృతులు ఒక తరం నుంచి మరో తరానికి సజీవ స్రవంతిలా సాగిపోవాలంటే కళాస్రష్టలకు తోడు, దర్శించి ప్రశంసించి పోషించే ప్రజలకు తోడు, వాటి గొప్పదనాన్ని పదిమందికి పంచిపెట్టే కళావిమర్శకులూ కావాలి. వాటి మంచికోరి వాటి మంచిచెడ్డలను విశ్లేషించి మరింత ఉన్నతికోసం కళాకారులు, విద్వాంసులు మరింత తపస్సు చేసేలా దారిచూపే విమర్శకులు కావాలి. ఆ విమర్శకులుగా పత్రికారచయితలే కావచ్చు. సాంస్కృతిక వికాసంలో పత్రికారచయితలు నిర్వహించే పాత్ర సామాన్యమైనదేమీ కాదు. జాతి ఔన్నత్యాన్ని పట్టిచూపే కళాసాహిత్యాలకు పాతకాలపు పత్రికలు గొప్ప వేదికలుగా నిలిచాయి. ఇటీవలి దశాబ్దాల్లోనే కళావిమర్శపై ఆసక్తి తగ్గింది. ఎక్కడైనా ఒక ప్రదర్శన జరిగినా అక్కడికి వెళ్లే విలేకరులు కొంత సమయాన్ని వెచ్చించి తిలకించి విశ్లేషించలేపోతున్నారు. అందుకు కారణం పత్రికల్లో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల విశ్లేషణకు ప్రాముఖ్యం కల్పించకపోవడమే. ఆ కార్యక్రమాలకు వెళ్లే విలేకరులు అసలు ప్రదర్శనను పక్కనపెట్టి ప్రదర్శనను తిలకించినవారు చేసే ఉపన్యాసాలకు ప్రాధాన్యమిస్తున్నారు. చివర్న కళాకారులు ఫలానా నాటకంలో తమ పాత్రల్లో జీవించారనో, నర్తకి అద్భుతంగా నృత్యాంశాలను అభినయించిందనో ఒక ముక్క రాస్తారు. ఆ ప్రదర్శన మంచిచెడులను గురించి వివరంగా రాసి మంచి ప్రదర్శన అయితే అందులోని మెచ్చుకోదగ్గ అంశాలేవో, లోపాలేవో ప్రస్తావించలేకపోతున్నారు.

ఉన్న కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నేటి పత్రికారచయితలు సరిగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల విశ్లేషణ చేయగలుగుతున్నారా! అంటే అటువైపు కూడా ఆశావహమైన పరిస్థితులు కనిపించడంలేదు. ఈ విధులు నిర్వహించే పత్రికా రచయితలకు తగిన అవగాహన కల్పించే దిశగా శిక్షణనివ్వాలి. కళావిమర్శ చేసే

పత్రికారచయితలకు సాహిత్యం, వివిధ రకాల కళారూపాలంటే అభిరుచి ఉండడం ప్రధానమైన అర్హత. తాను స్వయంగా కవి, రచయిత, కళాకారుడు అయితే మంచిది. అటువంటివారిని పత్రికలవారు నియమించుకోవచ్చు. వారు కళాకారులు, కవిరచయితలు కాకపోయినా సరే... అభిరుచి మాత్రం తప్పనిసరి. అభిరుచితోపాటు అవగాహన కూడా అవసరం.

స్థూలదృష్టితో సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలున్నాయో వాటి రూప వైవిధ్యమేమిటో తెలుసుకోవాలి. తెలుగు సాహిత్యం వెయ్యేళ్లుగా ఉజ్వలంగా వర్ధిల్లుతున్నది. శాఖోపశాఖలుగా విలసిల్లుతున్నది. కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, అనువాదం తదితరమైన రచనలు ఎంతో ఉన్నతస్థాయిని అందుకున్నాయి. కవిత్వంతో తెలుగు సాహిత్యం ప్రారంభమైంది. నన్నయ భారతాంధ్రీకరణతో కవిత్వం ప్రారంభమైంది. కవిత్రయ యుగంలో గొప్ప కావ్యాలు వెలిశాయి. అనంతరం ప్రబంధయుగంలో పెద్దన 'మనుచరిత్ర', రాయలవారి 'ఆముక్తమాల్యద', తిమ్మన 'పారిజాతాపహరణం', భట్టుమూర్తి 'వసుచరిత్ర', తెనాలి రామకృష్ణుని 'పాండురంగ మహాత్మ్యం' వంటి గొప్ప ప్రబంధాలు వెలిశాయి. ఆధునికయుగంలో గురజాడ నుంచి నేటివరకు నవ్య కవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం వంటి అనేక కవితా ధోరణులు వచ్చాయి. వాటిలో అనుభూతివాదం, దళితవాదం, స్త్రీవాదం వంటి వాదాలు వచ్చాయి. కవిత్వం అంటే పద్య కవిత్వం, వచన కవిత్వం, గేయ కవిత్వం అని మూడు రకాలైన ప్రక్రియా వైవిధ్యం ఉంది.

ఏ అంశంపై కవిత రాస్తున్నామో అది కవితావస్తువు. ఆ వస్తువును ఆయా కవులు తమ ఊహాశక్తి మేరకు తమదైన శైలీరమ్యతను, శిల్ప వైవిధ్యాన్నీ కలబోసి గొప్ప కవితగా రూపొందించేందుకు పూనుకుంటారు. వస్తువును అంటే ఉదాహరణకు గురజాడ 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' ఖండికను తీసుకుంటే పూర్ణమ్మ అనే బాలిక పుట్టి పెరిగిన నాటి పరిస్థితులు, బాల్య వివాహాలు, కాసులకు ఆశపడి పసిబిడ్డలను ముసలివాళ్లకు ఇచ్చి పెళ్లిచేయడం, కొన్నాళ్లకు భర్త చనిపోవడం, బాలిక విధవగా మారడం, అనంతర జీవితమంతా చీకటిమయం కావడం వంటి పరిస్థితులు ఈ కవితకు వస్తువు. కవి ఈ వస్తువును ఎంచుకోవడం ప్రశంసనీయం. ఎందుకంటే ఆనాటి ఒక దురాచారాన్ని కవితా వస్తువుగా తీసుకొని సమకాలీనుల్లో దురాచారంపట్ల చైతన్యం కలిగించి మంచిమార్గంలో పయనించేలా చేయాలని భావించారు. రెండవది ఆ వస్తువును గొప్పగా కవిత్వీకరించడం మరింత

ప్రశంసనీయం. పూర్ణమ్మ కథకు గురజాడ ఎంచుకున్న ఛందస్సు ఎంతో ప్రశంస పొందింది. అలా సామాజిక స్పృహకలిగిన కవితావస్తువుల్ని తీసుకున్న కవులున్నారు. పౌరాణిక, చారిత్రక అంశాలను కవితావస్తువులుగా స్వీకరించినవారూ ఉన్నారు. అయితే వస్తువు ప్రత్యేకంగా ఉండి, ఆ వస్తువును కవిత్వంగా మలచడంలో చూపిన ప్రతిభావిశేషాలవల్ల కవికి మంచిపేరు వచ్చింది.

ఆనాటికీ ఈనాటికీ పెద్ద మార్పేమీ లేదు. ఒకో యుగంలో ఒకో విధమైన వస్తువును ఎన్నుకొని దాన్ని విశిష్టమైన కవితగా మలచడానికి కవి ఎంతో ప్రత్యేకతను ప్రదర్శించవలసి ఉంటుంది. ఒక కవితను లేదా కవితా సంపుటినీ, ఆ సంపుటి ఆవిష్కరణ సభను రిపోర్ట్ చేసేటప్పుడు ఇలాంటి ప్రాథమిక విషయాలను పత్రికారచయిత తెలుసుకోవాలి. మామూలుగా ఆ కవి ఏ స్థాయివారైనదీ తెలుసుకోడానికి కొన్ని సూత్రాలు దోహదకారులుగా నిలుస్తాయి. పత్రికల్లో వచ్చే కవితలు, కవిత్వంపై వెలువడే విమర్శా వ్యాసాలు గమనిస్తూ ఉంటే కవిత్వం ఏ దిశగా పయనిస్తున్నదీ తెలుస్తుంది. కవుల పరిచయాలూ వస్తుంటాయి. కవితల్ని చదివి పరిశీలించే ప్రయత్నం చేస్తే కవితా వస్తువు ఏమిటి (శీర్షికలోనే కవితా వస్తువు) తెలుస్తుంది. కవి ఆ వస్తువును కవితామయం చేసి తన శక్తితో గొప్పగా మలచిన తీరు అర్థమవుతుంది. పుస్తకావిష్కరణ సభకు హాజరైనప్పుడు వక్తల ప్రసంగాలు కొంతవరకు కవితాత్మను ఆవిష్కరించేవిగానూ ఉంటాయి. మరికొంత కవిని మరీమరీ పొగిడేవిగా కూడా ఉంటాయి. అయితే ఆ రెంటినీ సమన్వయించి సంయమనంతో కూడిన రిపోర్ట్ రాయడానికి పుస్తకం (కవులు, రచయితలు ఆవిష్కరణ సభ రోజు పత్రికారచయితలకు ప్రతి ఇస్తుంటారు) చూస్తే అందులోని నాలుగైదు కవితల్ని చూస్తే ఆ కవి స్థాయి ఏమిటో తెలిసిపోతుంది.

కవిత్వంపై అభిరుచి ఉన్న ప్రతి కవీ వంద కవితలు రాసి, పెద్దలకు చూపి, వాటిలో యాభై కవితల్ని ఎంపిక చేసుకుని, పత్రికకు పంపితే పాతిక మాత్రమే ప్రచురితమైతే ఆ పాతిక కవితలనే పుస్తకంగా వేసుకుంటే బావుంటుంది. కానీ, ప్రస్తుతం కవిత్వం రాయడం ప్రారంభించగానే పుస్తకం వేసుకుంటున్నారు. వేయగానే ఆవిష్కరణ. ఆవిష్కరణ సభకు అతిథుల రాక. పిలిచి పీట వేసినందుకు ఆ కవిని యోగ్యతకు మించి పొగడడం కనిపిస్తున్నది. వక్తల పొగడ్తలను విలేకరులు శ్రద్ధగా రాసుకొని ప్రతిభావివక్షకు అతీతంగా రిపోర్టు చేస్తున్నారు. ఒక వక్త మాట్లాడుతూ కొన్ని పంక్తులు రవీంద్రుని 'గీతాంజలి'ని మించిపోయేలా ఉన్నాయని పొగిడారనుకోండి. వక్త చెప్పాడు కదా అని రాయడమేనా? ఆలోచించాలి.

ఈ పొగడ్తలు సాహిత్యానికి చాలా నష్టం తెచ్చిపెడుతున్నాయి. తొలి కవితను లేదా తొలి కవితా సంపుటిని కొందరు పెద్దవాళ్లకిస్తే పుస్తకాన్ని సరిగా చూడకనే చాలా బావుంది అని ప్రశంసిస్తారు. ఒకటో రెండో కవితల్ని (అంతకన్నా ఎక్కువ చదివే తీరికలేక) అటూఇటూ తిప్పిచూసి మధ్యలోని నాలుగు పంక్తులను లాగి అందులో లేని గొప్పదనాన్ని తమ పొగడ్తల శక్తితో ఎత్తిచూపి చెప్పేస్తుంటారు. ముందుమాటా అలాగే రాసేస్తుంటారు. ఇలాంటి పెద్దలు, అనుభవం ఉన్న కవులు కూడా అప్పుడే గొంతు విప్పిన కవులకిచ్చే కితాబులపట్ల పత్రికారచయితలు అప్రమత్తంగా ఉండాలి. నిజానికి అలా పొగడడంవల్ల చిన్నవారిని సైతం మహాకవుల జాబితాలో చేర్చినట్లు అవుతుందేమోగానీ అది వారి ఉన్నతికి ఏమాత్రం ఉపయోగపడదని పొగిడేవారు కూడా గుర్తించాలి. నిజానికి రాసిందల్లా భాషా కాదు. అందమైన వచనమంతా కవిత్వమూ కాదు. కవిత్వమంటే సాధారణ వచనానికి అతీతమైంది. ఒక కవిత రాయాలంటే వస్తువును అన్వేషించడంపైనా, దానికి అనుగుణమైన నిర్మాణంపైనా భావచిత్రాలపైనా, కొత్తకొత్త అభివ్యక్తులపైనా శిల్పసాగర మధనం జరగాలి. పదబంధాలను ఏర్చుకుని, కూర్చుకొని, పేర్చుకొని, పదేపదే చదువుకొని కొత్త ఆలోచనల్నిబట్టి దిద్దుకొని మెరుగుపరచుకొని, మెరుపులు మిరుమిట్లు గొలిపేలా తుదిరూపు దిద్దుకోవాలి. చెవికింపైన మాటలతో కూడిన పంక్తులు కాదు కవిత్వమంటే. వరకట్నం, జనాభా పెరుగుదల, ఉగాది వంటివి కాదు... నేటి కవితా వస్తువులే వేరు.

కవితలు రాసేవారు కవులు. నవల రాసేవారు నవలాకారులు లేదా నవలా రచయితలు. కథ రాసేవారు కథకులు లేదా కథారచయితలు. ఒకే కవి లేదా రచయిత కవితలు, కథలు సంపుటాలుగా వేస్తే కవితా సంపుటి, కథల సంపుటి. వివిధ రచయితల కథలు లేదా కవితలను కూర్చితే వాటిని సంకలనాలు అంటారు. కవి, రచయిత ఒకానొక కవిత లేదా కథావస్తువును ఎన్నుకొని కవితను, కథను, నవలను, నాటకాన్ని స్వయంగా సృష్టిస్తాడు. కాబట్టి అవి సృజనాత్మక రచనలంటారు. పద్యం రాసినా, వచన కవిత రాసినా, గేయం రాసినా కవి అంటారు. ప్రత్యేకంగా పేర్కొనాల్సి వస్తే పద్యకవి, గేయకవి అనాలి. వచన కవిత రాసేవారిని కవి అంటే చాలు. వచనకవి అనక్కర్లేదు. ఒక అంశంపై రాసిన కవితను ఖండిక అనవచ్చు. ఒక అంశంపై ఏకసూత్రమైన పుస్తకమంత కవిత రాస్తే దీర్ఘ కవిత అనొచ్చు. విస్తృతార్థంతో పెద్ద కాన్వాసుతో రాసిన పద్య కవితలు, వచన కవితలు అయితే కావ్యం అనొచ్చు. 45 నిమిషాలలోపు వ్యవధిలో ప్రదర్శించేది నాటిక (Playlet). అంతకుపైబడి వచ్చేది నాటకం (Play). వ్యవధి విషయంలోనే కాక నాటకంలో తీసుకునే విషయం విస్తృతమైనది. చెప్పడంలో కూడా నాటికకు, నాటకానికి తేడా ఉంటుంది. పద్యాలుంటేనే పద్యనాటకం. పద్యాలు లేని పౌరాణిక ఇతివృత్తమైతే పౌరాణిక నాటకం.

చరిత్ర నేపథ్యం కలిగిన ఇతివృత్తమైతే చరిత్రాత్మక నాటకం. పూర్తిగా చరిత్రను ఆధారం చేసుకున్నది చారిత్రక నాటకం. సమకాలీన ఇతివృత్తాన్ని స్వీకరించి రచించింది సాంఘిక నాటకం.

కవిని రచయిత అని, రచయితను కవి అని అనకూడదు. మామూలు రచయితను సాహితీవేత్త అనకూడదు. సుప్రసిద్ధ, ప్రముఖ, ప్రఖ్యాత అని వాడేటప్పుడు ఆ వ్యక్తి అంతగా ప్రసిద్ధుడు, ప్రముఖుడు అయితేనే ఆ విధంగా రాయాలి. 'వక్తలు శ్లాఘించారు' అని రాస్తారు. మాట్లాడిన ప్రతివారు వక్తలు కారు. వక్త అంటే ఏదేని అంశంపై విషయ విస్తృతి, మంచి భాష, అనర్గళంగా ప్రసంగించగల వారిదే వక్తృత్వం.

'విమర్శ' (Criticism), 'విమర్శకుడు' (Critic) అని రెండు పదాలున్నాయి. ఒక కవితను గురించి, కవితా సంపుటిని గురించి, ఆధునిక కవితను గురించి, కథాసాహిత్యాన్ని గురించి, నవలాసాహిత్యాన్ని గురించి గుణదోషాలను విశ్లేషిస్తూ రాసేవారిని, మాట్లాడేవారిని, ఆ విషయాలతో వ్యాసాలు, పుస్తకాలు రాసేవారిని విమర్శకులు అంటారు. ఆ రాసేది విమర్శ. తిట్టేవారిని రాజకీయంగా విమర్శించడం అంటారు. సాహిత్యపరంగా కళపరంగా విమర్శించడం అంటారు. కొందరు విమర్శను కూడా సృజనాత్మక రచనకింద పరిగణిస్తారు. నాటకరంగంలో నటించేవారు నటీనటులు. నాటకాన్ని రచించినవారిని నాటకకర్త లేదా నాటక రచయిత అని అంటారు. రచయిత రాసిన నాటకాన్ని తీసుకుని పాత్రధారుల్ని ఎంపిక చేసుకుని నిర్దేశకత్వం వహించేది దర్శకుడు. నాటకానికి కావలసిన ఆహార్యం, రంగోద్దీపన, సంగీతం, రంగాలంకరణ, వస్త్రాలంకరణ వంటివన్నీ సమకూర్చుకుని, సమన్వయించుకుని నాటక ప్రయోగం పూర్తిచేసేది ప్రయోక్త... నాటకాన్ని ప్రదర్శించడం ఒకప్పుడు (Drama), ఇప్పుడు నాటకం ఒక రంగస్థల ప్రదర్శన.

రంగస్థల కళల్లో నాటకం ఒకటి. అంతేగాకుండా నాటకకర్త రాసిన నాటకాన్ని తీసుకుని ప్రయోక్త (Producer) సంగీతం, రంగాలంకరణ, రంగోద్దీపన, ఆహార్యం, వస్త్రాలంకరణ వంటి హంగులన్నీ సరైన పాళ్లలో వినియోగించుకొని ఇచ్చే సమగ్ర ప్రదర్శన (Complete Theatre) ఈనాటి నాటకం. పత్రికారచయిత ఒక నాటక ప్రదర్శన చూసేటప్పుడు ఇంతలోతుగా అవగాహన ఏర్పరచుకొని ఇన్ని విధాలుగా నాటక ప్రదర్శనను అంచనా వెయ్యవచ్చు. పూర్వపు లెక్కల్లో నాటకం అంటే నటీనటుల నటన తీరు ఒక్కటే. ఇవ్వాళ సమగ్రమైన ప్రదర్శన. ప్రయోక్త అందించిన నాటక ప్రయోగాన్ని, దర్శకత్వ పటిమను, నటీనటుల నటనను, సంగీతం, ఆహార్యం, రంగోద్దీపన, రంగాలంకరణ తదితర అంశాలను విడివిడిగా పరిశీలించి విమర్శ చేయాలి. నాటక పోటీలను నిర్వహించే

కార్యక్రమాన్ని పరిషత్తు నిర్వహణ అంటారు. కొన్ని సంస్థలు 50 ఏళ్లుగా నాటక పరిషత్తులను నిర్వహిస్తున్నాయి. పరిషత్తులవల్ల నాటకరంగంలో పోటీ ఏర్పడి నాటక రచన, దర్శకత్వం, ప్రయోక్తృత్వం, నటుడు, నటి, ప్రతినాయకుడు, హాస్యనటుడు, నాటక ప్రదర్శన ఇత్యాది విభాగాల్లో పోటీ జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా నంది నాటకోత్సవాల పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనివల్ల నాటకరంగంలో వివిధ శాఖల్లో నాటక సమాజాలు పోటీ పడడానికి, తద్వారా ప్రమాణాలు పెంపొందడానికి అవకాశం ఏర్పడుతుంది. పరిషత్తుల కోసమే నాటకాలు రూపొందించే పనిలో పడడంవల్ల మంచి నాటకాలు రావడంలేదని అనేవారు కూడా ఉన్నారు.

వీటన్నిటి గురించి లోతుగా ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే ఈనాడు సాంస్కృతిక విలేకరులకు కొంత అవగాహన కలిగించడం అవసరం కాబట్టే. నిత్యం కూచిపూడి నాట్యం, భరతనాట్యం, పౌరాణిక నాటకం, సాంఘిక నాటిక, లలిత సంగీతం, కర్ణాటక సంగీతం గాత్రం, వాద్యం, హిందుస్థానీ సంగీతం, బుర్రకథ, ఒగ్గుకథ, వీధి నాటకం తదితరమైన జానపద కళారూపాలు, చిత్రలేఖనం, శిల్పకళా ప్రదర్శన, కవి సమ్మేళనం, సాహిత్య సదస్సు, అవధానం ఇలా ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి ప్రాథమికమైన అవగాహన ఉండాలి. ఒక్కోదాన్ని ఎలా చూడాలో తెలిసినప్పుడే ఆ ప్రదర్శన లేదా కార్యక్రమంలో వివిధ అంశాలను గురించి సరైనవిధంగా వ్యాఖ్యానించగలం. అలా సమగ్ర విమర్శ చేసినప్పుడే ప్రదర్శనలోని అన్ని విషయాలకు న్యాయం జరుగుతుంది. ప్రదర్శనలో భిన్నమైన బాధ్యతలు నిర్వహించినవారు తమ గురించి ఏం రాస్తారా? అని మరునాటి పత్రిక చూస్తారు. ఒక నాటకం రిహార్సల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రదర్శన ఇచ్చేవరకు కొన్ని వారాలపాట కళాకారులు తాము కనబరచిన పనితీరుపైన కళావిమర్శకుల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోగోరుతారు. నాటకం చూసినవారిలో కొంతమంది అప్పటికప్పుడు కళాకారులను అభినందిస్తారు. కానీ కళాకారులకు అదొక్కటే సరిపోదు. మీడియా ఏమనుకుంటోంది? ఏం రాస్తుంది? అని చూస్తారు. మీడియా బావుందని రాస్తే తమ పనితీరు బావుందని ప్రజలందరికీ తెలుస్తుంది. ఎక్కడైనా బాగాలేదని రాస్తే, ఆ రాతల్ని స్ఫూర్తిగా తీసుకొని తరువాతి ప్రదర్శనలో మెరుగుపరచుకోవచ్చునని భావిస్తారు. ఈ రోజుల్లో కళాకారులకు ఒక నాటక ప్రదర్శనవల్లనో, ఒక నాట్య ప్రదర్శనవల్లనో, ఒక బుర్రకథ, ఒగ్గుకథ, వీధి నాటకం, చిందు యక్షగానం వల్లనో ఆర్థికంగా ఒరిగేది లేదు. కాకపోతే వృత్తి కళాకారులనేవారు తమ ప్రదర్శనలద్వారా తమకు తెలిసిన విద్యను పదిమందికి పంచిపెట్టడం, తద్వారా కాస్త జీవనోపాధి పొందడం... ఇదే తమ జీవనంగా

భావిస్తారు. ప్రవృత్తి (Amature) కళాకారులు నాటకాన్ని రాయడం, నాటకాన్ని ప్రయోగించడం (Produce), దర్శకత్వం వహించడం, నటించడం... ఇలాంటి శాఖల్లో ఆసక్తికొద్దీ పనిచేస్తారు. అలాంటివారికి కళా విమర్శ (Art Appreciation) చాలా ముఖ్యం. ఆ రంగంలో కృషిచేయడానికి, ముందుకు వెళ్లడానికి ఇది సోపానంలా పనిచేస్తుంది.

సాంస్కృతిక విలేకరులు ఇతర పుస్తక రచయితలు, ప్రసార మాధ్యమాల్లోని వారు ఎవరైనా సాహిత్యరంగంలో ఒక ప్రక్రియ గురించి, వాటి ఆవిర్భావ వికాసాల గురించీ అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రజలెదుర్కొంటున్న సమస్యల గురించి వార్తలు అందించడమేగాక వారి జీవనంలోని సంస్కృతికి అద్దంపట్టే వార్తలూ అందించాలి. వారిని ఉత్తమాభిరుచి కలిగిన పౌరులుగా తయారుచెయ్యాలి. వారికి రాజకీయాలకంటే జాతి వారసత్వ సంపదను గురించి ఎక్కువగా తెలియజేయడం అవసరం. వారసత్వ సంపద అంటే సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖన శిల్పకళలు, జానపద సంస్కృతి మొదలైన కళారూపాలే.

64 కళలు కావాలి

మనకున్న కళలు అనేకం. 64 కళలు అని చెప్పుకుంటూ ఉంటాం. చతుష్షష్టి కళల్లో ప్రధానమైనవి లలితకళలు. వాటిలో చిత్రలేఖనం, శిల్పకళ కూడా ముఖ్యమైంది. ఈ కళలకు కూడా ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. అంతా చిత్రకళేగానీ ఇందులో రంగుల్లో ముంచి, కుంచెతో వేసే నీటివర్ణాలు, తైలవర్ణాల చిత్రలేఖనాలు వెయ్యడమేగాకుండా రేఖాచిత్రాల కళ డ్రాయింగ్, యంత్రాలు, రంగులు, రసాయనాలతో చేసే ప్రింట్‌మేకింగ్, రాళ్లమీదనో, చెక్కమీదనో టెర్రకోట (మృణ్మయ) మీదనో, కంచు, ఇనుము వంటి లోహాలమీదనో, ఫైబర్‌మీదనో చేసేదీ, చెక్కేదీ శిల్పకళే... ఇవన్నీ స్థూలంగా చిత్రకళ కిందకే వస్తాయి. ప్రాచీన దేవాలయ శిల్పం మొట్టమొదటిది. అజంతా, ఎల్లోరాల్లోనిది కుడ్యచిత్రకళ. తొలినాళ్లలోనిది మూర్తి చిత్రకళ. దేవతలు, రాజులు, రాణులు సైనికులు, సింహాలు వంటివి ఆనాటి శిల్పాలకు మూలం. ఆధునిక కాలానికి వచ్చేటప్పటికి కథావస్తువు మారిపోయింది. చిత్రకారుడు ఏదో ఒక ఆలోచన చేయడం, ఆ ఆలోచనలో మొగ్గతొడిగే ఒక ఊహ. ఆ ఊహకు తగుపాళ్ల రంగుల మేళవింపుతో అందమైన బొమ్మ వేయడం ప్రారంభమైంది. బొంబాయి, బెంగాల్ తదితర రాష్ట్రాల్లోని చిత్రకళా శైలి, ధోరణులు మన కళపై తమ ప్రభావాన్ని చూపాయి. తర్వాత ఆధునిక చిత్రకళ ప్రవేశించింది. పెయింటింగ్‌లోనూ, శిల్పంలోనూ నవ్యత చోటుచేసుకుంది. పూర్వకాలంలోవలె ఈనాడు సంప్రదాయికమైన బొమ్మలెవరూ చేయడంలేదు. రచయిత ఒకానొక కథావస్తువును ఎంచుకున్నట్లుగానే చిత్రకారుడు, శిల్పి అత్యాధునికమైన లేదా సమకాలీనమైన ఒక అంశాన్ని స్వీకరించి దానికి ఆకృతినివ్వడానికి తన నైపుణ్యాన్నంతా ధారవోస్తున్నాడు. మహానగరంలోని మురికివాడలో ఒక ఇల్లే కావచ్చు. ఎక్కడో మారుమూల గ్రామంలో అత్యంత సహజమైన రీతిలో మొలకు గోచీపోత, తలకు చిరుగుల రుమాలు కట్టుకుని, వార్ధక్యంతో ముడుతలుపడ్డ శరీరంతో, ముఖంలో పేదరికం తాండవిస్తున్నట్లున్న దీనత్వంతో చుట్ట కాల్చుకుంటూ 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని' అన్నట్లు ఆలోచిస్తున్న దృశ్యాన్ని ఒక పెయింటింగ్‌గా వేయవచ్చు. ఎవరికివారు కొత్తదనాన్ని చూపి ప్రత్యేకతను నిలబెట్టుకోవాలని

ప్రయత్నిస్తున్నారు. అయితే పాత పద్ధతుల్లో బొమ్మలు చేస్తున్నవారూ ఉన్నారు. అందమైన వచనాన్ని పంక్తులుగా పేర్చి కవిత్వంగా చలామణిలో పెడుతున్నవారిలాంటి వారన్నమాట.

నిజమైన కవిత్వ విమర్శకుడు మంచి వచనం కవిత్వం కాదని అన్నట్లే అచ్చం ఇందిరాగాంధీలా చేసిన పొట్రేయిట్, సరసులోని నీరు, నీటి అలలపైన అరవిరిసిన తామరలు, పచ్చికబయళ్లు, దూరంగా కొండలతో కూడిన ప్రకృతి (Land Scape) చిత్రాలు, పశుపక్ష్యాదుల బొమ్మలకు కాలం చెల్లిపోయిందని తేల్చిచెప్పే చిత్రకళా విమర్శకులు ఈనాడు ఉన్నారు.

నీవు బాధ్యతగల చిత్రకారుడివి. ఎలాంటి బొమ్మ వేయాలనే విషయంపై అత్యంత సృజనాత్మకంగా ఆలోచించు. బొమ్మ వేయదగిన అంశాన్ని ఖరారు చేసుకో. ఆ తర్వాత మనసులో ఆలోచన రూపంలో వున్న ఆ బొమ్మను వాస్తవ చిత్రంగా మలచడం కూడా ముఖ్యమే. ఊహ కొత్తదనాన్ని చాటేలా ఉండడం నీ పనిలో సగమే. ఊహకు ప్రాణం పోయడానికి నీవు వాడే రంగులు, హంగులతో నవ్య చిత్రకల్పనా సంవిధానం, కళావిమర్శకులను ఆలోచింపజేసేలా రూపొందడం... ఇదంతా కొత్తదారుల్లో పయనిస్తోంది. బొమ్మలు చేసేవారు ఇప్పుడున్న కళ ఏ దిశగా నడుస్తోంది అనేది చూసి కొత్త ప్రయోగాలు చేసి నిలదొక్కుకోవాలేగానీ పాత కాలంనాటి బొమ్మలను పట్టుకుని 'నా బొమ్మ అచ్చం ఇందిరాగాంధీలా ఉందికదా! ఇంతకంటే మంచి బొమ్మలుంటాయా?' అని అమాయకంగా అడగరాదు. కళారంగంలో చోటుచేసుకుంటున్న కొత్త మార్పులను పట్టుకొని ఆ ప్రమాణాలతో కళావిమర్శ చేయడానికి పూనుకోవడం సాంస్కృతిక విలేకరుల కర్తవ్యం.

సంప్రదాయ కళ లేదా అంతా అధునికమూ, నైరూప్య చిత్రకళ మాత్రమే ఈనాడు ఉందా? చిత్రకళ అంటే అదేనా అంటే ఒక్కమాటలో తేల్చి చెప్పడం సాధ్యంకాదు. ఈనాటికీ కొండపల్లి శేషగిరిరావు 'మేనకా విశ్వామిత్ర', కాపు రాజయ్య 'బోనాలు', 'లార్డ్ ఆఫ్ సెవెన్‌హిల్స్', బి.వి.రెడ్డి 'సంక్రాంతి', ఉల్చి 'బుద్ధుని మహాభినిష్క్రమణం', భగీరథి 'మొగల్రాజపురం కొండలు', దామెర్ల రామారావు 'బావికాడ' వంటి చిత్రాలకు విలువ ఉంది. సంప్రదాయ చిత్రకళ, శిల్పకళ ఎప్పుడూ ఉంటాయి. అయితే దాన్ని రూపొందించడంలో చిత్రకారులు, శిల్పులు చూపే పరిణతినిబట్టి పరిగణన ఉంటుంది. పత్రికారచయితలు ఈ తేడా గమనించి ప్రశంసించాలి. మేనకను మీనాక్షి శేషాద్రి అంత అందంగా చిత్రించడంతోనో, పొట్రేయిట్‌ను అచ్చం ఇందిరాగాంధీలా వేయడంతోనో అది గొప్ప చిత్రం అయిపోదని గుర్తుంచుకోవాలి.

మనముందు గాయకుడు లేదా గాయని అద్భుతమైన గొంతుతో జానపద గేయం పాడి కరతాళధ్వనులు అందుకుంటే చాలా గొప్పగా ఉందని కళాకారులను పత్రికారచయిత పొగిడేయవచ్చు. అయితే ఆ గేయం ఏ ఒక్క ప్రాంతపు యాసలో కూర్చిందో లేదా సేకరించిందో లేక ఆ గాయనీగాయకులు ఇష్టంవచ్చినట్లు యాసలతో, ప్రామాణిక భాషా ప్రయోగంతో మిశ్రమంగా అల్లి ఆలపించిందో పరిశీలించాలి.

ఆ మధ్య ఒక ప్రముఖ నర్తకి ఇచ్చిన కూచిపూడి నాట్య ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రదర్శనను సాంతం తిలకించిన ఒక మంత్రిగారు 'భరతనాట్యం చాలా బావుంది. మనమందరం పిల్లలకు తప్పకుండా భరతనాట్యం నేర్పించి తెలుగువారి నాట్యకళను పరిరక్షించేందుకు కృషిచెయ్యాలి' అని పిలుపునిచ్చారు. అందరూ కొట్టారు చప్పట్లు. ఆ మంత్రి తర్వాత ముక్తాయించిన సభాధ్యక్షులు కూడా మంత్రిని తెగ పొగిడేశారు. ఆనాటి ప్రదర్శన కూచిపూడి నృత్యమని, అది భరతనాట్యం కాదని తెలిసినవారు, మంత్రి అజ్ఞానానికి చింతించినవారు కొందరు లేకపోలేదు.

'భారతీయ నృత్యకళ' అనే మాట వాడుతుంటాం. ఆ పేరుతో ఫలానా నృత్యకళ అంటూ ఒకటి లేదు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోగల వేర్వేరు నృత్యాలను కలిపి భారతీయ నృత్యకళ అని పేర్కొంటాం. ఈనాడు భరతనాట్యం ప్రధానంగా తమిళనాడుకు సంబంధించిన నృత్యం. కేరళలో కథక్, కథాకళి, మోహినీయాట్టం ఉన్నట్లే, మన రాష్ట్రంలో కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి ఉన్నాయి. కేంద్రప్రభుత్వ గుర్తింపు పొందిన నాట్యం కూచిపూడి. ఇది కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించింది. అక్కడున్న వేదాంతం, పసుమర్తి, చింతా, వెంపటి, భాగవతుల, మహంకాళి, జోశ్యుల, యేలేశ్వరపు వంటి కొన్ని కుటుంబాలవారు పరంపరాగతంగా ప్రదర్శిస్తూ కాపాడుతున్న నాట్యం కూచిపూడి. సిద్ధేంద్రయోగి ఈ నాట్యానికి మూలపురుషుడు. ఇందులో సిద్ధేంద్రుడు రచించిన భామాకలాపం ఉంది. గొల్లకలాపం ఉంది. మరికొన్ని కలాపాలున్నాయి. ప్రహ్లాద, ఉషాపరిణయం, మోహినీభస్మాసుర వంటి కూచిపూడి యక్షగానాలున్నాయి. ఇవేగాక కూచిపూడి నాట్యానికి ప్రాచీనరూపాలైన పగటివేషాలు అనేకం ఉన్నాయి. ప్రాచీనులు అందించిన పగటివేషాలు, కలాపాలు, యక్షగానాలతోపాటు అనేక నృత్య నాటకాలను రచించి అద్భుతమైన నాట్యకల్పన (Choreography) చేసి, సంగీతాన్ని సమకూర్చి, కూచిపూడి నాట్యానికి అపూర్వమైన ప్రాచుర్యాన్ని కల్పించి విశ్వవిఖ్యాతం చేయడంవల్లనే కేంద్రప్రభుత్వం కూచిపూడిని శాస్త్రీయ నృత్యశైలిగా గుర్తించింది. సంప్రదాయ కుటుంబాల్లో పెద్దలు స్త్రీలను ఈ కళలోకి ప్రవేశించకుండా నిషేధించారు. అందుకే కూచిపూడిలో

పురుషులే స్త్రీ వేషాలు ధరిస్తారు. పద్మశ్రీ డాక్టర్ వేదాంతం సత్యనారాయణ శర్మ స్త్రీ వేషాలు ధరించి మెప్పించినవారిలో మహోన్నతులు. తర్వాతి కాలంలో యామినీ కృష్ణమూర్తి, హేమమాలిని, రాధారెడ్డి, శోభానాయుడు వంటి కూచిపూడి సంప్రదాయేతర కుటుంబాలకు చెందిన స్త్రీలు కూచిపూడి నాట్యగురువులవద్ద నాట్యం నేర్చుకొని గొప్ప నర్తకీమణులుగా రాణిస్తున్నారు.

కూచిపూడి సంప్రదాయ కుటుంబాలవారికి నాట్యమంటే జీవన సర్వస్వం. ఐదేళ్ల వయస్సులో మిగతా పిల్లలకు అక్షరాభ్యాసంలాగా వారి పిల్లలకు నాట్యశాస్త్రం, సంస్కృతం, సంగీతం, సాహిత్యం, నట్టువాంగం, అన్ని రకాలైన స్త్రీ, పురుష పాత్రలు... ఇలా అన్నీ నేర్పిస్తారు. అలా అన్నీ నేర్చుకున్నవారు నట్టువాంగం దగ్గర్నుంచి గాత్రం, మృదంగ సహకారం వరకు నాయక, ప్రతినాయక, సహాయ పాత్రలనుంచి నాయిక, చెలికత్తె, లీలావతి వంటి రాజమాత పాత్రల వరకు అన్నీ సమర్థంగా పోషించగలరు. కూచిపూడి వారిలా కూచిపూడియేతర కళాకారుల్లో కూడా నాట్యమే సర్వస్వంగా కొనసాగుతున్నవారు ఉన్నారు. కూచిపూడిని అభిరుచి కోసం అభ్యసించి ఇతర వృత్తుల్లో ఉంటూ కూడా మంచి నర్తకీనర్తకులుగా కొనసాగుతున్నవారు గణనీయ సంఖ్యలో ఉన్నారు. కూచిపూడివారు ఒక యక్షగానంలోనో, కలాపంలోనో అన్ని బాధ్యతల్ని నిర్వహించగలిగితే కూచిపూడియేతరులు నృత్యానికి పరిమితమవుతున్నారు. దశాబ్దిపైబడి నాట్యరంగంలో కొనసాగితే నాట్యగురువుగా కూడా వ్యవహరిస్తారు. అయితే నాట్య వికాసంలో అందరికీ పాత్ర ఉంది. కూచిపూడి నాట్యశైలిలో తమదైన సృజనాత్మక శక్తితో నృత్య నాటకాన్నో (Ballet), ఏకపాత్ర కేళిక (Solo item)నో రూపొందించి దక్షతతో అన్నిరకాలైన హంగులు కూర్చుకుని దేశవిదేశాల్లో అద్భుతంగా ప్రదర్శించి కూచిపూడిని ప్రపంచపటంపై నిలపడంలో తమవంతు పాత్ర నిర్వహించారు. నాటకీయత, సాత్త్వికాభినయం కూచిపూడి ప్రత్యేకత.

మన రాష్ట్రంలో పూర్వం ఆస్థాన నృత్యం, ఆలయ నృత్యం, ఆగమ నృత్యం వంటివి ఉండేవి. రాజాస్థానాల్లో వీటికి ఎంతో మంచి పేరుండేది. నాట్యరంగంలోని కళాకారిణులు ఇప్పటివరకు కూచిపూడివారి గురించి చెప్పుకున్నట్లే సంగీత, సాహిత్య, నాట్యాది రంగాల్లో అపారమైన ప్రజ్ఞను సముపార్జించి గొప్ప విదుషీమణులుగా గౌరవం పొందేవారు. సంస్థానాలు, దేవదాసీల వ్యవస్థ వచ్చిన తర్వాత నర్తకీమణులంటే కొంత గౌరవం తగ్గినా వారి విద్యకు విలువ, ఆదరణ తగ్గలేదు. నాట్యరంగంలో పరిశోధకునిగా, బహుగ్రంథకర్తగా, నర్తకునిగా, నాట్యాచార్యునిగా పేరుపొందిన డాక్టర్ నటరాజ రామకృష్ణ అంతకుపూర్వమున్న వివిధ రకాలైన నాట్యాలను ఏకీకృతం చేసి తమిళులకు భరతనాట్యంలా ఆంధ్రులకు

'ఆంధ్రనాట్యం' అని నామకరణం చేశారు. ఈ లాస్య నర్తనానికి తోడు కాకతీయుల కాలంలో వర్ధిల్లి కాలగతిలో కలిసిపోయిన 'పేరిణి' పేరుతో ఒక పౌరుష నాట్యాన్ని పునఃసృష్టి చేశారు. మన రాష్ట్రంలో ఇప్పుడు ఈ రెండు నృత్యశైలులూ ఉన్నాయి. మన నృత్యాల్లో ఈ వైవిధ్యాన్ని పత్రికా విలేకరులు గుర్తించాలి. నాట్యోత్సవాల్లో, ఏకవ్యక్తి నాట్య ప్రదర్శనల్లో పాల్గొని కళావిమర్శ చేసే సందర్భంలో ఈ అంశాలపై స్పష్టత ఉన్నప్పుడే రాసే రాతల్లో కూడా స్పష్టత, పరిణతి ఉంటాయి.

కూచిపూడి నాట్యం, ఆంధ్రనాట్యం, కర్ణాటక సంగీతం (Classical Music)వంటి శాస్త్రీయ కళారూపాల్లోనే కాదు జానపద కళారూపాల్లో కూడా సంప్రదాయ, సంప్రదాయేతర కళాకారులున్నారు. వీరిని వృత్తి (Professionlas) కళాకారులు, ప్రవృత్తి (Amature) కళాకారులు అని కూడా అంటారు. తాతముత్తాతల కాలంనుంచి పారంపర్యంగా కళకోసం జీవించేవారు సంప్రదాయ (Traditional) కళాకారులు. ఎలాంటి కళానేపథ్యం లేకపోయినా ఒకానొక కళపై మక్కువ పెంచుకొని కళాకారులుగా తయారయ్యేవారు ప్రవృత్తి కళాకారులు. స్వయంకృషితో సాధన చేసి సంప్రదాయ కళాకారులకు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నత స్థానానికి చేరుకున్నవాళ్లూ సంప్రదాయేతర కళాకారుల్లో ఎంతోమంది ఉన్నారు.

జానపదుల గురించి కూడా కొంత చర్చించుకుందాం. జానపదులకు సంబంధించిన సమస్తమైన అంశాలను జానపద విజ్ఞానం (Folklore) అంటారు. జానపద విజ్ఞానంలో జానపద సంస్కృతి, జానపద సాహిత్యం అని రెండు ప్రధానాంగాలు. జానపద సంస్కృతిలో కళలు, ఆ కళల్లోనూ నృత్యకళలు, వాద్యకళలు, నాటకకళలు, కథాకళలు ఉన్నాయి. కళలే కాకుండా సంస్కృతిలో ఇంకా అనేక అంశాలున్నాయి. జానపద సాహిత్యంలో జానపద గేయాలు, పొడుపు కథలు, సామెతలు వంటి అనేక విభాగాలున్నాయి. జానపద విజ్ఞానం ప్రధానంగా వాఙ్మయం. అంటే వాగ్రూపంలో ఉంటుంది. ఫలానావారు రచించారని ఉండదు. అందుకే జానపదాలు అజ్ఞాత కర్తృత్వాలు. అయితే రాష్ట్రంలోని ప్రాంతాలవారీగా సంస్కృతిలో ఎంతో వైవిధ్యం ఉంది.

పత్రికారచయితలు తలచుకుంటే సాహిత్య, సాంస్కృతిక వార్తలకు ప్రాధాన్యం సమధికం చేయగలరు. సాంస్కృతిక వేదికల్లో జరిగే కార్యక్రమాలకు హాజరై సమగ్రమైన కథనాలను పంపేలా తమ సోదరులైన సాంస్కృతిక విలేకరులను కోరవచ్చు. నిజానికి సాహిత్య, సాంస్కృతిక విషయాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని ఏ పత్రిక యాజమాన్యం, ఛానల్ కచ్చితమైన నిబంధన విధించదు. పాఠకుల మనోభావాలు తెలుసుకోకుండానే వాళ్లు కోరని అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామా అనేది ఆత్మవిమర్శ చేసుకోండి. ఛానళ్లలో

24 గంటల ప్రసారాల్లో రోజూ ఒక రెండు గంటలు సమయం కేటాయించగలిగితే ఇంత విశాలమైన రాష్ట్రంలో సాహిత్య, సాంస్కృతిక సంపదకు కొదవలేదు కదా! కొన్ని ఛానళ్లలో 'థర్టీ మినిట్స్', 'ఇదీ సంగతి'లో కొన్నిసార్లు సాహిత్యాంశాలపైనా, కళారూపాలపైనా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేయవచ్చు. తెలంగాణ బోనాల గురించో, చిత్తూరు జిల్లాలో జరిగే గంగజాతర గురించో, కోస్తాలో జరిగే సంక్రాంతి సంబరాల గురించో... ఇలా ప్రసారం చెయ్యాలేగానీ ఎంతచేసినా తరగని సాంస్కృతిక గనులు మన రాష్ట్రంలో ఉన్నాయి.

పత్రికల్లో కూడా సాహిత్య, సాంస్కృతిక వార్తలకు ఎక్కువ స్థలాన్ని కేటాయించాలి. నిత్యం రాష్ట్రవ్యాప్తంగా జరిగే కార్యక్రమాల వార్తలే కాకుండా ప్రత్యేకంగా శీర్షికల్ని ప్రవేశపెట్టి కళారూపాల పరిచయం, ప్రదర్శనా పద్ధతి, కళాకారుల పరిచయాలను సచిత్రంగా ప్రచురించాలి. నేటికీ కూచిపూడి అంటే, కర్ణాటక సంగీతం అంటే, పౌరాణిక, సాంఘిక నాటకాలంటే పేర్లు మాత్రమే తెలిసి, అవి ఎలా ఉంటాయో తెలియనివారు అధికసంఖ్యలో ఉన్నారు. అలాంటివారి కోసం సాహిత్యాన్ని గురించి, సాహిత్యంలోని భిన్న ప్రక్రియల వికాసాన్ని గురించి వివరించి చెప్పవచ్చు. నాట్యాన్ని గురించి, నాటకాల గురించి, విస్తృతంగా చర్చించి అవగాహన కలిగించవచ్చు. యువత అధికసంఖ్యలో కళల్ని అభ్యసించి సంస్కృతిని పెంపొందించేలా చైతన్యాన్ని కలిగించవచ్చు. రాష్ట్రంలో ప్రాంతాలవారీగా అసంఖ్యాకమైన జానపద కళారూపాలున్నాయి. ఇప్పటివరకు ఒక ప్రాంతంలో ఉన్న గొప్ప కళారూపాలు ఆ ప్రాంతంలోని వారికే తెలియని పరిస్థితి ఉంది. పత్రికలద్వారా, ఛానళ్లద్వారా నిరంతరం ఒక్కొక్క రూపాన్నే పరిచయం చేస్తూపోతే తెలుగు సంస్కృతి ఎంత సంపన్నమైందో తెలుస్తుంది. దీనివల్ల మన కళాకారులకు ప్రోత్సాహం, కళలకు పునరుజ్జీవం, సామాజిక సామరస్యం సిద్ధిస్తాయి.

సంగీతం

లలితకళల్లో సంగీతం ఒకానొక కళ. నాదమయమైన, లయాత్మకమైన ఈ కళకు ప్రాచీనమైన ఒక సంప్రదాయం ఉంది. శాస్త్రం ఉంది. అందుకే దీన్ని శాస్త్రీయ సంగీతం అని అన్నారు. శాస్త్రీయ సంగీతంతో పాటు జానపద సంగీతం, లలిత సంగీతం కూడా వున్నాయి. భారతీయ సంగీతంలో దాక్షిణాత్య సంగీతానికి కర్ణాటక సంగీతమని, ఔత్తరాహుల సంగీతానికి హిందుస్థానీ సంగీతమని పేరు. ఇవిగాక సినీ సంగీతం మరొకటి వుంది. గత శతాబ్దంలో ఆవిర్భవించిన లలిత సంగీతం ప్రధానంగా తొలుత ఆకాశవాణి ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చింది. కవులు రచించిన గేయానికి లలితమైన స్వరాన్ని కూర్చేటప్పుడు, రాగబద్ధం చేసేటప్పుడు భావప్రధానంగా వుండేలా చూడడం ఇందులో ప్రధానం. శాస్త్రీయ సంగీతాన్ని సంప్రదాయ (ప్రాచీన) సంగీతం అన్నారు కాబట్టి ఆధునిక కాలంలో ఆవిర్భవించిన లలిత సంగీతాన్ని ఆధునిక సంగీతం అన్నారు. సినీ సంగీతం సినిమాలోని పాటలను ఆశ్రయించి స్వేచ్ఛా విధానంలో స్వరాన్ని కూర్చడం జరుగుతుంది. ఒకానొక రాగం లేదా ఒకటికి మించిన రాగాల్లో కూర్చినా జనాకర్షణ ప్రధానంగా ఉంటుంది. శాస్త్రీయ సంగీతంలో ఒక కృతిని స్వరబద్ధం చేసినంత, పాడినంత క్రమశిక్షణ దీనికి లేదు. ఇక జానపద సంగీతానికి ఏ హద్దులూ వుండవు. జానపద గీతులకు కర్తలంటూ వుండదు. ప్రతిదీ అజ్ఞాతకర్తృత్వమే. పల్లె ప్రజలు తమ భావావేశాన్ని, గానధర్మాన్ని, జీవన సన్నివేశాన్ని అనుసరించి పాటల్ని అల్లుకుంటారు. పాడుకుంటారు. ఒకరి నుంచి మరొకరు విని ఇతరులూ పాడుకుంటారు. ఈ క్రమంలో కొన్ని మార్పులు కూడా వస్తాయి. జానపద గాయకులు ఒక విధంగా వాగ్గేయకారులే. శ్రుతి, లయ వీటిలోనూ వుంటుంది. బాణీలు ఎవరు కట్టారు చెప్పడానికి వీల్లేదు. కాని వాటికున్న ప్రాధాన్యం, మహత్తు చెప్పనలవి కానిది.

జానపద సంగీతాన్ని, సినీ సంగీతాన్ని అటుంచితే ముఖ్యంగా శాస్త్రీయ సంగీతాన్ని ఆస్వాదించడం, పత్రికలకు, వార్తా ప్రసార సాధనాలకు రిపోర్టు చేయడం అంత సులభం కాదు. సంగీతజ్ఞులకు వార్తా రచనా ప్రావీణ్యం వుంటే రిపోర్టింగ్ సమస్య వుండదు. కాని రెండు ప్రజ్ఞలు ఒకరిలో వుండడం దుర్లభం.

ఇప్పుడు జరుగుతున్నదేమిటంటే సంగీత కచేరీ జరుగుతున్న చోటికి విలేకరులు వెళ్ళడం, ఆహ్వానపత్రంలోని వివరాలకు తోడుగా నిర్వాహకుల నుంచి కచేరీలు పాడుతున్న కీర్తనలు, రాగాలు, తాళాలు, వాద్యసహకారం అందిస్తున్న వారి వివరాలను నోట్ చేసుకొని వెళుతున్నారు. ఆ తర్వాత 'సికా వారి నిర్వహణలో రవీంద్రభారతిలో గురువారం హైదరాబాద్ బ్రదర్స్ గాత్రకచేరీ సంగీత ప్రియులను ఆనందాబ్ధిలో ఓలలాడించింది. హిందోళ రాగంలో 'సామజవరగమన' త్యాగరాజ కీర్తన ఆదితాళంలో ప్రారంభించి శ్రీరాగంలో 'ఎందరో మహానుభావులు'తో ముగించారు. ఆద్యంతం శ్రోతలు తన్మయత్వంతో కచేరీని ఆలకించారు' అని రాసేస్తారు. అంతకన్నా రాయలేని ఈ దుస్థితి ఇప్పుడే కాదు ఎప్పట్నుంచో వుంది.

విమర్శ అనేది సాహిత్య విమర్శ అయినా సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన శిల్పకళా విమర్శ అయినా పత్రికలు, ప్రసార సాధనాల ద్వారానే జరగాలి. విమర్శే లేనినాడు ఆ కళకు పరిపూర్ణ వికాసం లేదు. ఒక విద్వాంసుడు తనదైన మనోధర్మంతో విశిష్టమైన ప్రయోగాలు చేస్తుంటే కళావిమర్శకుల ద్వారా ఆ ప్రయోగాల విషయం సంగీత లోకానికి తెలియాలి. ఆ విద్వాంసుని ప్రత్యేకత విని పదిమందీ ప్రశంసించాలి. సంగీత పరిణామ చరిత్రలో ఆ ప్రయోగాల గురించి రాయాలి. యువతరం పాట విని గుణదోషాల గురించి చర్చ చేసినప్పుడే వారు తమ విద్యను మెరుగుపరచుకొనేందుకు వీలవుతుంది. కాని ఇప్పటివరకు సంగీత విమర్శ అన్నది లేదు. సాంస్కృతిక విలేకరులు తమ శక్తికొలది కొద్ది వివరాలతో రిపోర్టు చేస్తున్నారు.

సంగీతాన్ని గురించి ప్రాథమికమైన అవగాహన కూడా లేని విలేకరి తనవద్దకు వచ్చి అడిగితే ఏ విద్వాంసుడైనా ఏం చెప్తాడు. వీళ్ళకేమీ తెలియదు వీళ్ళతో మాట్లాడేదేమి టనుకుంటే సరిపోతుందా! సంస్కృతి ఇలా వుంటే సంగీత కళకు ఎంతో అన్యాయం చేస్తు న్నట్లే అవుతుంది. పత్రికలు, ప్రసార సాధనాల వైపునుంచీ, ఇటు సంగీతరంగం నుంచీ ఈ పరిస్థితిని మార్చి ఈ అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నమేదీ ఇప్పటివరకూ జరగలేదు. తమ విలేకరులకు సంగీతాన్ని గురించి అవగాహన ఏర్పరిచే బాధ్యత మాధ్యమ యాజమానులదా? సంగీత విద్వాంసులదా?

శాస్త్రీయ సంగీతం అందరికీ అర్థమయ్యేది కాదు. ఒక స్థాయి కలిగిన వారి కోసమే మేం పాడుతున్నాం అంటుంటారు కొందరు విద్వాంసులు. అది కొంతవరకు నిజమే కానీ, శ్రోతల్ని పెంచుకొనేదెలా? పాడుతున్న వారి గొప్పతనం లోకానికి తెలిసేదెలా?

అన్నవి జవాబులేని ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు జవాబు లభ్యం కావాలంటే ఇటు సంగీత విద్వాంసులూ, ఇటు కళావిమర్శకులూ ఇద్దరూ తమ వంతు చొరవ తీసుకోవాలి.

గాయకులు కచేరీ చేసే సందర్భాన్ని బట్టి ఏయే అంశాలు పాడాలి అనేది నిర్ణయించు కుంటారు కాబట్టి పాడేటప్పుడు ఒక్కొ అంశానికి ముందు ఆ రాగం పేరు, కృతికర్త, తాళం తెలియజేయాలి.

తమ గాన ప్రణాళికలో రాగాలాపన వుంటే ఆ రాగంలో తాను చేయబోయే ఆలాపన గురించి ముందుగానే ప్రకటించాలి. రాగానికి సంబంధించిన స్వరప్రస్తారంతో ఆ రాగ స్వరూపాన్ని వివరించాలి. అప్పుడే శ్రోతలు సరైన రీతిలో అర్థం చేసుకుంటూ వినే అవకాశం వుంటుంది.

ఉదాహరణకు హంసధ్వని రాగంలో 'వాతాపి గణపతింభజే' పాడతానని ఒక్క ముక్కలో చెప్పడం కాకుండా స్వరకల్పన గురించి కూడా వివరంగా చెప్పి ఫలానా తాళంలో నా మనోధర్మాన్ని అనుసరించి స్వర సమూహాలతో 'వాతాపి గణపతింభజే' అనే పల్లవితో గణపతి ప్రార్థన పాడుతున్నాను అని చెప్పాలి.

ఈ విధంగా పాడబోయే కీర్తన గురించి, ఆ కృతి స్వరకల్పన గురించీ వివరిస్తూ శ్రోత గానంలో లీనమయ్యే విధంగా చెయ్యాలి. గంటో గంటన్నరో కొనసాగే కచేరీకి 5 నుంచి 7 నిమిషాల వివరణ తప్పనిసరి.

విలేకరులు, సాధారణ సంగీతాభిమానులకు కూడా ఈ పద్ధతి వల్ల సంగీతాన్ని అర్థం చేసుకొని ఆనందించడానికి అవకాశం కలుగుతుంది. విలేకరులు తమ రసానందాన్ని కళావిమర్శగా మలచి రిపోర్టు రాసే సావకాశం ఏర్పడుతుంది. అలా వచ్చి ఇలా రాగాల పేర్లు తెలుసుకొని ఏదో తోచిన విధంగా రాయడం మానాలి.

సంగీతం నేర్చుకుంటున్నవారి సంఖ్య, వ్యాప్తి బాగానే వున్నా కళావిమర్శ ఆ స్థాయిలో లేదు. కళావిమర్శస్థాయి పెంచే కృషి పత్రికలు ప్రసార సాధనాల పరంగా జరగాలి. శాస్త్రీయ సంగీతం మనకు పరంపరాగతంగా సంక్రమించిన గొప్ప వరం. కళావిమర్శ చేసే విలేకరులను తయారుచేసుకొని ఈ కళను గురించి ప్రసారం, ప్రచురణ చేయాలి. అచ్చం నేపథ్యగాయనీ గాయకుల్లాగే పాడుతున్నారనే నెపంతో టివి ఛానళ్ళలో పిల్లల్ని ఆకాశానికి ఎత్తేసే ప్రస్తుత ధోరణిని కొనసాగిస్తే వారి ఉన్నతి అక్కడే ఆగిపోతుంది. అసలు సిసలైన సాంస్కృతిక వారసత్వం మరుగునపడుతుంది.

విలేకరులు కూడా ఈ అంశాల్ని గుర్తుంచుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో యాజమాన్యాలు వారికి చెల్లిస్తున్న వేతనం, వారికి వున్న వ్యవధి, ఏక కాలంలో ఒకటికి మించిన సభల్ని, సాంస్కృతిక ప్రదర్శనల్ని చూసి రిపోర్టు చేయవలసి రావడం ఇబ్బందికరమే. కాని ఈ పరిస్థితిని యాజమాన్యాలు నివారించాలి. విలేకరులు ఈ సాకు చూపి మేమేం చేయలేకపోతున్నాం అంటున్నారు. ఒకానొక విద్వాంసుడు పాడే రెండు మూడు కృతులైనా ఆ అరగంట సేపు శ్రద్ధగా విని పరిణతితో రిపోర్టు చేసే ప్రజ్ఞను సముపార్జించుకోవాలి. ముందు సంగీతంలో రకాలను తెలుసుకోవాలి. ప్రాచ్య, పాశ్చాత్య సంగీతం అంటే అర్థం ఏమిటి? ప్రాచ్యదేశాలు అంటే తూర్పు దేశాలు (మనదేశం కూడా వస్తుంది) పాశ్చాత్య సంగీతం అంటే వెస్టర్న్ మ్యూజిక్. భారత్‌లో శాస్త్రీయ సంగీతంలో కర్ణాటక సంగీతం, హిందుస్తానీ సంగీతం, జానపద సంగీతం, లలిత సంగీతం, సినీ సంగీతం వేరు.

శాస్త్రీయ సంగీత రంగంలో సంగీతం ప్రధానం. త్యాగరాజస్వామి కృతిలోనూ సాహిత్యం వుంటుంది. 'నిధి చాలా సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా'లో సాహిత్యం వుంటుంది. అయితే సంగీతం ప్రధానం. సాహిత్యం అనుషంగికం. అలాగే శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు మొదలైన వాగ్గేయకారులు అన్నమాచార్య కీర్తనలు ఆలపించడంలో ఒక ప్రత్యేకత ఉంది. నిజానికి అన్నమయ్య కీర్తనలు సాహిత్య ప్రధానమైనవి. అయితే సంగీత రంగంలోని పెద్దలు అన్నమయ్య కీర్తనల్ని ఇటు లలిత సంగీత పద్ధతిలో పాడటంతోపాటు శాస్త్రీయ రాగాల్లో స్వరకల్పన చేసి సంగీత ప్రధానంగానూ ఆలపిస్తారు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, డాక్టర్ శ్రీపాద పినాకపాణి, నేదునూరి కృష్ణమూర్తి వంటి విద్వాంసులు శాస్త్రీయ రాగాల్లో స్వరపరచారు. ఎంతోమంది స్వరపరచిన కీర్తనల్ని పాడుతున్నారు. ఈ అంశాలను అధ్యయ నం చేసి, తేడాలను అర్థం చేసుకుంటే విలేకరులు సంగీత కార్యక్రమాల రిపోర్టింగ్‌కు న్యాయం చేయగలుగుతారు.

పేర్లు రాసేటప్పుడు జాగ్రత్త

ఇతర ప్రాంతాల పేర్లు, వ్యక్తుల పేర్లు రాసేటప్పుడు పత్రికారచయితలు, ఛానళ్లవారు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ సమస్య ఈనాటిది కాదు. విదేశాలకు చెందిన పేర్లు మాత్రమే కాదు, మనదేశంలో ఇతర రాష్ట్రాలవారి పేర్లను కూడా ఒక్కోసారి తప్పుగా రాయడం, తర్వాత తప్పని తెలిసినా పాఠకులను అయోమయంలో పడేయడమెందుకని ఆ తప్పుడు పేర్లను అలాగే కొనసాగిస్తున్నారు. కాబట్టి తొలిసారి ఆ ప్రాంతాలు, వ్యక్తులు వార్తల్లోకి ఎక్కినప్పుడే ఆ ప్రాంతాలు, వ్యక్తుల సరైన పేర్లను ఆ ప్రాంతాలు, భాషల నిర్మాణాన్ని, ఉచ్చారణను పరిశీలించి స్థిరపరచాలి. వచ్చిన చిక్కల్లా ఆయా భాషల్లోనే ఉంది. వైదేశిక స్థల, వ్యక్తి నామాలు మొదటిసారి మనకు ఆంగ్లంలోనే వస్తాయి. ఆంగ్లంలో 'RABINDRANATH TAGORE' అని వస్తే ఉత్తరాది భాషల్లో 'B' ని మనం 'V' గా వెంటనే నిర్ణయం చేసుకుని రవీంద్రనాథ్ టాగోర్ అని రాసుకున్నాం. కానీ, అది బెంగాలీలో 'రవీంద్రనాథ్ ఠాకూరొ' అని ఉంటుంది. అలాగే 'జ్యోతిబసు' అని రాస్తున్న పేరు నిజానికి జ్యోతిబాషు. ఆంగ్లంలో 'JYOTHI BASU' అని ఉంది కాబట్టి జ్యోతిబసు అనుకున్నాం.

సంస్కృతంలోని 'వ'కారాన్ని ఉత్తరాదిలో 'బ'కారంగా, 'య'కారాన్ని 'జ'కారంగా పలుకుతారు. 'గోబింద బల్లభ్ పంత్' పేరును ఆంగ్లాన్ని అనుసరించి గోవింద వల్లభ్ పంత్ అని రాస్తున్నాం. 'జనేశ్వర్ మిశ్ర్' అనే పేరును 'జ్ఞానేశ్వర్ మిశ్రా' అని రాశాం. 'AMETHI' లో 'THI' అనేదాన్ని 'థి'గా చూస్తాం కాబట్టి అమేథీ అని రాశాం. నిజానికి దీన్ని ఉత్తరప్రదేశ్‌లో 'అమేఠీ' అంటారు. 'KASHMEER' లో 'KA' ను 'కా' అని రాసుకోవడంతో 'కాశ్మీర్'గా స్థిరపరచాం. నిజానికి అది 'కశ్మీర్'. బీజేపీ సీనియర్ నాయకుడు 'L.K.ADVANI' లో 'ADVA' ను సాధారణంగా 'అద్వా'గా భావించి ఎల్.కె.అద్వానీ అని రాస్తున్నాం. నిజానికి 'ఎల్.కె.ఆడ్‌వాణీ' అని రాయాలి. 'ALI' ని 'ఆలీ' అని రాస్తాం. నిజానికి ఉర్దూపేర్ల వ్యవస్థ తెలియక ఆంగ్లాక్షరాల్ని ఒక ప్రాంతంవారు ఆలీ అని రాశారు. ఉర్దూ ప్రకారం 'అలీ' సరైన రూపం. అలాగే 'అఫ్ఘానిస్తాన్' సరైన రూపం కాగా 'ఆఫ్ఘనిస్తాన్ లేదా ఆఫ్ఘానిస్థాన్' అంటూ ఇష్టప్రకారం రాస్తున్నాం. బాగ్దాద్ కాదు... 'బగ్దాద్', ఫరూక్ అబ్దుల్లా కాదు... 'ఫారూక్ అబ్దుల్లా' సరైన రూపం. 'డెహ్రాడూన్' అని ఆంగ్లాక్షరాలను

తెలుగుచేశాం. నిజానికి ఉత్తరాంచల్‌లో 'దెహ్రాదూన్' అని పలుకుతారు. 'బిన్ లాడెన్' కాదు... 'బిన్‌లాదెన్'. 'బీహార్' కాదు... 'బిహార్'. కేంద్రమంత్రి పేరు 'కపిల్ సిబాల్' అని రాశాం. నిజానికి ఆంగ్లంలో 'KAPIL SIBBAL'. దాన్ని 'కపిల్ సిబ్బల్' అనైనా రాసి ఉండాలి. సరైన రూపం 'కపిల్ సిబల్'. 'రామ్‌జెత్మలానీ' లో 'JETHMALANI' ఆంగ్లాక్షరాలను మూలంగా తీసుకొని రాశాం. సరైన రూపం 'జేఠ్మలాని... జేఠ్‌మలాని' అని రాస్తే ఇంకా సరిగా ఉంటుంది. 'బంగ్లాదేశ్' కాదు 'బాంగ్లాదేశ్'. అఫ్ఘానిస్తాన్ అధ్యక్షుని పేరు 'హమీద్ కర్జాయ్' అని ఆంగ్లాక్షరాల ప్రకారం నిర్మించాం. నిజానికి అది 'హామిద్ కర్జాయ్'. హిందీ సినీ ప్రముఖుని పేరు 'YASH CHOPRA' ను ఆంగ్లాక్షరాలు ప్రమాణంగా తీసుకొని 'యాష్‌చోప్రా' అని రాశాం. నిజానికి 'యశస్సు' అనే అర్థంలో వచ్చే పేరు అది. 'య్‌శచోప్డా' సరైన పేరు. కార్గిల్ యుద్ధం మనలో దేశభక్తిని రగిలించింది. అప్పుడే ఆ పేరు వార్తల్లో బాగా నానింది. 'KARGIL' ఆంగ్లాక్షరాలను అనుసరించాం. 'KA' ను 'కా' చేశాం. నిజానికి అది 'కర్‌గిల్'. 'షాజహాన్' అలాంటిదే. ఉర్దూలో అరసున్న వచ్చే పేరది. 'షాజహాఁ' ఇలా ఉండాలి. పంజాబ్‌లో ఖలిస్తాన్ ఉద్యమం సాగినప్పుడు 'భింద్రేన్‌వాలా' అనే పేరు వార్తల్లో ప్రముఖంగా వచ్చింది. పంజాబీలో ఆ పేరు 'భ్రింద్రాఁవాలా' ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. అంతెందుకు పి.వి. ప్రధానమంత్రి అయిన కొత్తలో హిందీవారికి ఎలా రాయాలో, ఎలా ఉచ్చరించాలో తెలియలేదు. వారికి 'NARSINGRAO' ఉంది... 'కృష్ణ'కు 'KISHEN' లాగా. 'పి.వి.నర్‌సింగ్‌రావు' అని అన్నారు. తర్వాత అతికష్టంమీద నరసింహారావ్ అన్నారు. 'విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్' అనాలి. కానీ సింగ్‌ను సంస్కృతీకరించి 'సింహ్' అన్నారు. తమిళనాడు గవర్నర్‌గా ఉన్న (సుర్జీత్ సింగ్ బర్నాలా అని రాస్తున్నాం) బర్నాల స్వయంగా తన పేరు 'సుర్జిత్‌సింఘ్ బర్నాల' అని రాసిచ్చారు. 'KURNOOL' గా ఉన్న రోజుల్లో ఆంగ్ల, హిందీ న్యూస్‌రీడర్లు ఆంగ్లాక్షరాలను అనుసరించి 'కుర్నూల్' అనేవారు. అలాగే 'CUDDAPAH' గా ఉన్న రోజుల్లో 'కుడప్ప' అని పలికేవారు. వాళ్ల బాధపడలేక మనవాళ్లు స్పెల్లింగ్‌ను మార్చుకున్నారు. ఒకసారి తప్పుగా రాయడం ప్రారంభమై కొన్నేళ్లు జరిగాక ఇది సరైన రూపం అని సరిదిద్దబోతే పాఠకులు గందరగోళానికి గురవుతారు. కాబట్టి తొలుతనే ఆయా అసలు భాషల నిర్మాణం ప్రకారం రాస్తే సరిపోతుంది.

'ప్రముఖ విప్లవ కవి శ్రీశ్రీ', 'ప్రముఖ తెలుగు రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి', 'కవి మణిమాణిక్యం నరసింహరావు', అని రాయడం గురించి మాట్లాడుకుంటున్నప్పుడు ముందు వీటిని సరిచేద్దాం. 'శ్రీశ్రీ' అంటే చాలు. ఆయనెవరో తెలియనివాళ్లు కూడా ఉంటారని అనుకుంటే 'మహాకవి శ్రీశ్రీ' అంటే సవ్యంగా ఉంటుంది. దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రిని

ఏమని రాయాలో తెలియని తరం కూడా వచ్చేసిందని ముందు మనం బాధపడాలి. ఆ తర్వాత ఆయన 'భావకవి దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి' అని సరిచేయాలి. 'కవి మణిమాణిక్యం నరసింహరావు'... ఈ పేరుతో కవులు లేరు. ఈ నరసింహరావు పేరు 'మునిమాణిక్యం నరసింహారావు'. 'కాంతం కథలు' అనగానే తెలుగు పాఠకుల మదిలో మెదిలే రచయిత మునిమాణిక్యం. 'గాయని శోభారాజ్' అని ఎక్కువగా రాస్తున్న పేరు ఒకటి ఉంది. 'ఛార్లెస్ శోభరాజ్' పేరుమోసిన అంతర్జాతీయ నేరగాడు. మన పత్రికారచయితలు కాస్తా దుష్టచరిత్ర కలిగిన ఇతడి పేరును మన అన్నమయ్య గాయని 'శోభారాజు'కు తగిలించారు.

రోజూ దినపత్రికల్ని, న్యూస్‌ఛానళ్లను శ్రద్ధగా చూసేవారు వార్తల్లో వ్యక్తులు, ఎవరెవరికి ఏ గౌరవాలు దక్కాయి, ఏ పదవుల్లో నియమితులయ్యారు, ఏ పుస్తకాలు వెలువడ్డాయి. ఆ పుస్తకాల రచయితలెవరు, ప్రభుత్వం ఏయే కొత్త పథకాలను ప్రవేశపెట్టింది, నగరంలో, రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ఏ సంఘటనలు జరిగాయి... అన్నవి తెలుసుకొని గుర్తుంచుకోవాలి. పత్రికల్లో, ఛానళ్లలో వచ్చేవి సాధికారికమైనవి అనుకొంటారు. ఇలాంటివి చదివి ఇవే నిజమనుకుంటారు. అందుకని ప్రతిదీ చాలా జాగ్రత్తగా రాయడం మంచిది. పత్రికారచయితలు భాషను గురించీ, సాహిత్యాన్ని గురించీ, వివిధ రంగాల్లో తెలుగు ప్రముఖుల గురించీ, తెలుగులో వచ్చిన–వస్తున్న గొప్ప పుస్తకాల గురించీ, వాటి రచయితల గురించీ, వ్యక్తులు స్వాతంత్ర్య సమరయోధులా, కవులా, రచయితలా, చిత్రకారులా, శిల్పులా, నర్తకులా, సంగీత విద్వాంసులా... అన్న విషయాన్ని చదివి తెలుసుకొని వుండవద్దా! మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా విద్యార్థిని, మంత్రిణి (మంత్రి అంటే చాలు) మహిళా పరిశోధకురాలు (రాలులోనే మహిళ అని తెలుస్తున్నది కదా!), మహిళా వైద్యురాలు... వంటివి ఆపాలి.

తప్పులెంతకాలం రాస్తూపోతాం

భాషను వ్యాప్తిచేస్తూ, ఆధునికీకరిస్తూ, సమాచారాన్ని, వినోదాన్ని భాషద్వారా ప్రజలకు అందించడంలో పత్రికలకు మించిన సాధనం లేదు. పత్రికలకు తోడుగా టెలివిజన్, ఇంటర్నెట్ మాధ్యమం కూడా విస్తృతంగా భాష ప్రాతిపదికపై అందిస్తున్న సమాచార, విజ్ఞాన, వినోద సేవలు ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞాన మహాయుగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పత్రికలు వెలుడడం ప్రారంభించి సుమారుగా 170 ఏళ్లవుతోంది. తొలినాటికి ఈనాటికీ మధ్య ఎన్నో పరిణామాలు సంభవించాయి. పత్రికాభాషా పరిణామం ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని చలనశీలంగా ముందుకు నడిచివచ్చింది. కాలాన్ని

అనుసరించి ఆయా దశల్లో మార్పుల్ని తానై ప్రవేశపెట్టింది. పత్రికాభాషకు సంబంధించినంతవరకు తొలి పత్రికల కాలం 1840వ దశకం. 1900 వరకూ ప్రాథమిక యుగం. 19వ శతాబ్దం చివరిపాదంలో పత్రికాభాష సరళ గ్రాంథికంవైపు అడుగులు వేసి వీరగ్రాంథిక పరిష్వంగం నుంచి ఉద్యమిత్వంతో బయటపడింది. ఛాందసవాదుల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొని బండి 'ర'లను, అర్ధానుస్వారం, సమాసఘటిత వాక్యనిర్మాణ శృంఖలాలను వదిలించుకుంది. కందుకూరి వీరేశలింగం నడిపిన పత్రికలు ఈ భాషాపరమైన మార్పును ప్రతిబింబించాయి. గిడుగు, గురజాడల ప్రభావంతో భాష ఆధునిక ప్రస్థానాన్ని వెతుక్కుంది.

20వ శతాబ్ది తొలిరోజుల్లో దినపత్రికలు ఆవిర్భవించడంతో పత్రిక పఠనం పెరిగింది. పత్రికాభాషకు ప్రాధాన్యం పెరిగింది. కథలు, కవితలు, ధారావాహిక నవలా ప్రచురణతోపాటుగా ప్రజా సమస్యలకు, జాతీయ, అంతర్జాతీయ విశేషాలకు, స్వాతంత్ర్యోద్యమానికి పత్రికలు వెన్నుదన్నుగా నిలవాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. గౌతమి, తెలుగు జనానా, ఆంధ్రప్రకాశిక వంటి పత్రికలు మొదట వార, మాస పత్రికలుగా వెలువడి తర్వాత దినపత్రికలుగా మారాయి. దినపత్రికగానే అవతరించినది 'ఆంధ్రపత్రిక'. లక్ష్య ప్రకటనలో 'దేశాభివృద్ధియు, భాషాభివృద్ధియు' తన లక్ష్యమని ప్రతినబూనింది. సరళ గ్రాంథికం తన భాషా విధానమైనా, ఆ కాలంలో సాహిత్య వికాసంలో వచన ప్రక్రియలు కూడా తమవంతు ప్రాధాన్యం అందుకున్నాయి. పాఠకుల లేఖలు, పాఠకులు అధికంగా పాల్గొన్న అనేక శీర్షికల్లో వ్యావహారిక భాష తనవంతు గౌరవాన్ని అందుకుంది. 'భారతి', సంవత్సరాది సంచికలు భాషకు, సాహిత్యానికి ఎంతో సేవచేశాయి. 1935లో ప్రారంభమైన 'జనవాణి'తో భాష ఆధునికీకరణ ప్రస్ఫుటమైంది.

ఆధునిక అవసరాలకు అనుగుణంగా భాషను గ్రాంథిక బంధనాల నుంచి దించి సులభతరం చేయడం కోసం పత్రికలు చేసిన కృషి అనన్యసామాన్యం. 20వ శతాబ్దం రెండవ భాగం వచ్చేసరికి పత్రికారచయితలు తమ దృష్టినీ, భాషకు సంబంధించిన బాధ్యతల పరిధినీ ఎంతగానో విస్తరించుకున్నారు. ఇతర భాషల్లో ముఖ్యంగా ఆంగ్లంలో పత్రికలను గమనిస్తూ ఆంగ్ల సాహిత్యంతో తెలుగుకు సాన్నిహిత్యాన్ని పెంచుతూ వచ్చారు. ఆ రోజుల్లో అనువాదానికే అగ్రాసనం. నిత్య వ్యవహారాల్లో సంపాదకీయం మినహా మిగతా ఎక్కువ అంశాలు అనువాదంద్వారా తెలుగులోకి వచ్చేవి. అయితేనేం ఆ తరం పత్రికారచయితలు భాషమీద అధికారం, సాహిత్యంపై అభినివేశం కలిగినవారు. సాహిత్యరంగంలో లబ్ధప్రతిష్టులైన వారు సంపాదకులుగా, సహాయ, ఉప సంపాదకులుగా, విలేకరులుగా

ఉండేవారు. ఒక జట్టుగా అనువాదాలను సైతం మూలరచనల్లా రాసేవారు. ప్రతి పదాన్ని, వాక్యాన్ని నిశితంగా పరిశీలించి వాటికి మంచిమంచి ప్రత్యామ్నాయాలను కనిపెట్టి ప్రయోగించేవారు. అలాంటి పదజాలం పెద్దసంఖ్యలో పత్రికలకు లభించింది. ఈ విధంగా పదాలను ప్రయోగించే దశలో వారి మధ్య మంచి చర్చ జరిగేది. అలా చర్చ జరగడంవల్ల ఎక్కువ మందికి ఆమోదయోగ్యమైన, తర్వాతి కాలంలో నిలిచిపోదగ్గ పదాలు వచ్చాయి, నిలదొక్కుకున్నాయి. భాష ఆధునికీకరణను సుగమం చేశాయి.

ఆనాడు పత్రికల్లో భాషా ప్రావీణ్యం కలిగినవారే ఉండేవారు. రాసేవారే కాకుండా కంపోజింగ్, ప్రూఫ్‌రీడింగ్ విభాగాల్లో సైతం తప్పులెన్నుతూ దోషరహితంగా చేసేవారు ఉండేవారు. నాటి పత్రికల్లో రాసేవారు సామాన్యులు కారు. వెలుపల భాషా సాహిత్యరంగాల్లో ఉద్దండులైనవారు ఉండేవారు. ఒక పదాన్ని ఎత్తిచూపి క్యావ ప్రయోగ ప్రమాణాలను వివరించగలిగేవారు. అలాంటి మహామహా కవిపండితుల కనుసన్నల్లో పత్రికాభాష తేటబారింది. ఓ యాభై ఏళ్ల కాలానికి తగిన పదసంపదను వృద్ధిచేసుకుంది. 1980ల్లో పత్రికలు భాషాపరంగా సమూలమైన మార్పులు సంతరించుకోవడానికి, అంతకుముందు రెండుమూడు దశాబ్దాల్లో పత్రికారచయితల రాశీభూతమైన కృషి ప్రాతిపదికగా నిలిచింది. ఆ రెండుమూడు దశాబ్దాల్లో పత్రికా కార్యాలయాల్లో నడయాడుతూ భాషను సుసంపన్నం చేసేందుకు కృషిచేసిన తరాన్ని గురువుల్లా ఆరాధించి వారి అడుగుజాడల్లో నడచినవారు 80ల విప్లవానికి తమవంతు శ్రమను ధారవోశారు.

ఈ తరంలో కూడా తెలుగు భాషా సాహిత్యాలను బాగా అధ్యయనం చేసినవారు, ఆధునికీకరణకు చొరవ తీసుకోవాల్సిన అవకాశాన్ని గుర్తించినవారికి, ఆధునికీకరణను ఒక ఉద్యమస్థాయిలో నడిపిన పత్రికాధిపతులు తోడుకావడంతో ఈ కృషి ఎంతో వేగంగా సాగింది. ఈ దశలో పత్రికాభాషలోని పదజాలం సమూల మార్పులకు నోచుకుంది. ఆధునికీకరణకు గురికావాలని, నూతనావసరాలకు సిద్ధం కావాలని ప్రతి పదం తపించింది. తర్వాతి దశలో పత్రికల సంఖ్య పెరిగింది. పత్రికారచయితల సంఖ్య అనేక రెట్లు పెరిగింది. భాషను మునుపటికంటే నవనవోన్మేషంగా ప్రయోగించే పదునైన కలం యోధులు వచ్చారు. పత్రికల్లో పుటలు పెరిగాయి. శీర్షికలు, అనుబంధాలు, జిల్లాలు, నగరాల టాబ్లాయిడ్లు పెరిగాయి. ఆ వేగంలో, ఎక్కువ రాయడంలో తప్పులు కూడా పెరిగాయి. పెరిగిన తప్పులను ఎత్తిచూపి ఆ తప్పులను ఒప్పులు చేసేవారే లేకుండాపోయారు. పండితులు ఎత్తిచూపిన అలాంటి తప్పులను కొన్నింటిని పరిశీలిద్దాం...

షష్ఠిపూర్తి

అరవై ఏళ్ల వయసు నిండడం 'షష్ఠిపూర్తి' అని రాస్తుంటారు. ఈ సంస్కృత పదంలో వున్న మెలిక ఏ కొందరికో మాత్రమే తెలుసు. పత్రికలవారికి మాత్రం తెలియదనుకోవాలి. నిజానికి 'షష్ఠి' అంటే ఆరవది.. కానీ, అరవయ్యది కాదు. 'షష్టిపూర్తి' అంటే అరవై సంవత్సరాలు నిండడం అనే అర్థం వస్తుంది. డెబ్బయ్యేళ్లను 'సప్తతి' అంటారు.

పంచమి, నవమి

తెలుగు తిథుల్లో అమావాస్య తర్వాత, పౌర్ణమి తర్వాత ఐదో రోజు పంచమి. తొమ్మిదో రోజు నవమి వస్తుంది. తెలుగు రచయితలు ఐదు నాటికలు కలిగిన సంపుటికి 'పంచమి' అని, తొమ్మిది వ్యాసాలతో కూడిన సంపుటికి 'నవమి' అని పేరు పెడతారు. అంటే ఐదవది, తొమ్మిదవది అని మాత్రమే అర్థమని గ్రహించడంలేదు. వాస్తవానికి వీటిని 'నాటక పంచకం' 'వ్యాస నవకం' అనాలి.

అనేకమంది

'అనేక', 'మంది' అనే రెండు మాటలు కలిగిన సమాసమిది. అయితే 'అనేక' సంస్కృత పదం. 'మంది' తెలుగు. రెంటినీ కలపడంతో వైరి సమాసమైంది. దీనికి బదులు 'చాలామంది' అని వాడితే సరిపోతుంది.

వైరుధ్యం

భాషాపరంగా దీని ప్రాతిపదిక 'విరుద్ధం'. విరుద్ధం 'వైరుద్ధ్యం'గా మారాలే తప్ప 'వైరుధ్యం' కావడానికి వీలులేదు. 'పారిశుధ్యం' కూడా అలాంటిదే. 'పరిశుద్ధమైంది' అనేది 'పారిశుధ్యం'గా మారడం తప్పు. వీటిని 'వైరుద్ధ్యం', 'పారిశుద్ధ్యం' అని రాయాలి.

గ్రంథం

తెలుగు పత్రికల్లో ఇప్పుడు 'గ్రంథా'నికి, 'గ్రంధా'నికి తేడాలేకుండా ఉంది. 'గ్రంథాలయం' కాస్తా 'గ్రంధాలయం'గా మారిపోయింది.

వివక్ష

స్త్రీలపట్ల వివక్ష అధికంగా ఉందనే అర్థంలో 'వివక్ష' పదాన్ని ఎక్కువగా వాడుతున్నారు. ఇది సంస్కృత పదం. నిజానికి ప్రాధాన్య వివక్ష అనే సమాసంలో ప్రాధాన్యక్రమ చర్చ,

ప్రాధాన్యాన్ని చెప్పడం అని అర్థం. వివక్ష ప్రయోగం మరీ వికటించి 'వివక్షత' అయ్యింది. ఇదికూడా తప్పే.

విధివంచకులు

చాలామంది పత్రికారచయితలు ఈ 'విధివంచక' వంచితులవుతున్నారు. వంచింపబడినవారు వంచితులు. విధిచేత వంచించబడ్డవారు 'విధివంచితులు'. స్త్రీలను గురించి రాసేపక్షంలో 'విధివంచితలు' అని రాయాలి. ఏకవచనమైతే 'విధివంచిత'. కానీ, కొందరు 'విధివంచకులు' అని పొరపాటుగా రాస్తున్నారు. 'విధివంచితులు' అనాలి. లేదంటే విధినే వంచించినవారు అనే అర్థం వస్తుంది.

సుస్వాగతం

ఇప్పటికే ఉన్న మాటలను మరింత వినయంగా, గౌరవంగా అతిశయించి చెప్పడంకోసం మనవాళ్లు విపరీతంగా ప్రయత్నిస్తుంటారు. 'సుస్వాగతం' కూడా అలాంటిదే. సు+ఆగతం=స్వాగతం. ఇలా అంటే చాలు... సుస్వాగతం అవసరం లేదు.

వాదన

'Argument' వినిపించే అర్థంలో 'వాదన'ను పత్రికల్లో వాడుతున్నారు. పత్రికల్లో రాసేమాట 'పాటియై ధరజెల్లు'తోంది. 'వీణావాదనం' 'మృదంగ వాదనం' అనే పదాల్లో వాయించడమేగానీ వాదించడం లేదు. 'సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తన వాదన వినిపించింది' అనే బదులు 'వాదం' వినిపించింది అంటే ఇబ్బంది ఉండదు.

వాఙ్మూలం

ఇందులో 'వాక్', 'మూలం' అని రెండు పదాలున్నాయి. ఈ రెండు పదాలకు సంధి చేసినప్పుడు 'వాక్'లోని 'క' కారం 'ఙ' కారంగా మారాలి. వాక్+మయం=వాఙ్మయంగా మారినట్లు ఇది కూడా 'వాఙ్మూలం' కావాలి. సులభంగా త్వరగా రాయడంలో 'వాగ్మూలం లేదా వాంగ్మూలం' అని మార్చి రాస్తున్నారు.

వయోపరిమితి

'రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు ఇప్పుడున్న వయోపరిమితిని 35 ఏళ్లకు పెంచింది'. వంటి వాక్యాల్లో పత్రికల్లో ఈ మాట వాడుతున్నారు. ఇందులో 'వయస్',

'పరిమితి' అనే రెండు పదాలున్నాయి. వయస్ అనేది సకారాంత సంస్కృత పదం. సకారానికి క, ప వర్ణాలు పరంగా వచ్చినప్పుడు విసర్గ (ః) ఆదేశంగా వస్తుంది. కాబట్టి ఇది 'వయ:పరిమితి' గానీ వయోపరిమితి కాదు. నాదాక్షరాలు పరంగా వచ్చినపుడు మాత్రమే సకారాంత శబ్దంలోని 'అస్' 'ఒ' కారంగా మారుతుంది. ఉదా: 'వయోవృద్ధులు, వయోధర్మము' వంటివి. 'వయస్' అనే సకారాంత శబ్దం తర్వాత వచ్చే 'పరిమితి'లో నాదాక్షరం రాలేదు కాబట్టి 'వయోపరిమితి' తప్పు.

వర్తక వాణిజ్యాలు

వర్తకమన్నా వాణిజ్యమన్నా ఒకటే. అయితే ఆంగ్లంలో 'Trade and Commerce' అనే మాటలు తరచూ వచ్చినప్పుడు వాటిని మూలవిధేయంగా అనువదించడానికి 'వర్తక వాణిజ్యాలు' అంటున్నారు. 'Commerce' కు మొదటినుంచీ 'వాణిజ్యశాస్త్రం' అనే అర్థం కూడా వాడుతున్నారు. 'Business, Trade, Commerce' అన్నిటికీ వర్తకం, వాణిజ్యం అని రకరకాలుగా వాడుతున్నారు. ఆంగ్లంలో వ్యాపారస్థాయినిబట్టి 'Trade, Commerce' మాటలు వాడుతున్నారు. ఆ ప్రకారం రెండు పదాలు వాడవలసి వస్తే ఏదో ఒకటి వాడితే సరిపోతుంది.

ప్రయాణీకులు

ప్రయాణీకులు, యాత్రీకులు, సంబంధీకులు, గోత్రీకులు, వంటి పదాలు ఒకేరకమైనవి. 'యాత్ర' ప్రాతిపదికకు 'ఇక' ప్రత్యయం కలిస్తే 'యాత్రిక' ఏర్పడుతుంది. దీనికి బహువచన రూపం 'యాత్రికులు' అంతేగానీ యాత్రీకులు కాదు. అలాగే ప్రయాణ+ఇకులు=ప్రయాణికులు, సంబంధ+ఇక=సంబంధికులు, గోత్ర+ఇక=గోత్రికులు అవుతాయి.

మత్స్యకారులు

వివిధ వృత్తులవారిని గౌరవంగా వ్యవహరించడం కోసం మత్స్యకారులు, స్వర్ణకారులు, కుంభకారులు, క్షురకులు వంటి పేర్లను వాడుతున్నారు. ముఖ్యంగా బంగారంతో వస్తువులు తయారుచేసేవారు స్వర్ణకారులని, కుండలు తయారుచేసేవారు కుంభకారులని, క్షౌరం చేసేవారు క్షురకులు అని వాడడం సరే. మత్స్యకారులు అంటే చేపలు తయారుచేసేవారు, చేపలతో మరేదో తయారుచేసేవారు కావాలి కదా! అందువల్ల మత్స్యకారులు సరైన మాట కాదు. ఇది పత్రికల్లోనే కనిపిస్తుంది. అందరూ జాలర్లు, బెస్తవారు అనడం కనిపిస్తుంది.

ప్రశ్నాపత్రం

దీని సరైన రూపం 'ప్రశ్నపత్రం'. వ్యాకరణాన్ని అనుసరించి 'ప్రశ్నాపత్రం' తప్పు. సంస్కృతంలో ప్రశ్న హ్రస్వ అకారాంత పదం. దీర్ఘ అకారాంత శబ్దం కాదు. కాబట్టి ప్రశ్న శబ్దాన్ని పూర్వశబ్దంగా ప్రయోగించినప్పుడు హ్రస్వ అకారాంత శబ్దంగానే భావించాలి. కాబట్టి ఇది 'ప్రశ్నపత్రమే'గానీ 'ప్రశ్నాపత్రం' కాదు.

ప్రాధాన్యత

ఇది 'ప్రధానం' అనే ప్రాతిపదిక రూపం. ప్రధానుడిలోని గుణం ప్రాధాన్యం. అంటే గుణవాచకం అన్నమాట. ప్రధాన శబ్దానికి 'య' ప్రత్యయం కలిసి ఏర్పడిన రూపం. భావవాచకమైన ప్రాధాన్య శబ్దంపై మళ్లీ 'త' ప్రత్యయం చేర్చడం వ్యాకరణ విరుద్ధం. కాబట్టి 'య' ప్రత్యయంతో సరిపెట్టి 'ప్రాధాన్యం' అంటే సరిపోతుంది. అలాగే 'ప్రాముఖ్యత'ను 'ప్రాముఖ్యం' అని, 'ప్రావీణ్యత'ను 'ప్రావీణ్యం' అని అనాలి.

ప్రథమ ప్రాధాన్యం

ఇది పునరుక్తి. 'ప్రథమ' అంటేనే తొలుత చేయదగినది అని. ప్రాధాన్యం అంటే కూడా అంతే. ఆంగ్లంలోని 'TOP PRIORITY' లేదా 'FIRST PRIORITY' పదాలను 'అగ్ర ప్రాధాన్యం', ప్రథమ ప్రాధాన్యం'గా రాస్తుంటారు. ప్రాముఖ్యం కూడా వీటికి సమానార్థకమే. 'ప్రాధాన్యం' అంటే చాలు. ప్రథమ ప్రాధాన్యం, అగ్ర ప్రాధాన్యం అనక్కర్లేదు. అలాగే ప్రాధాన్యత, ప్రాముఖ్యత అనే మాటలకు బదులుగా ప్రాధాన్యం, ప్రాముఖ్యం అని వాడాలి. ప్రాధాన్యం, ప్రాముఖ్యం, ప్రావీణ్యం... ఇవి మౌలికంగా గుణవాచక శబ్దాలు. వీటికి మళ్లీ మరో గుణవాచక శబ్దాన్ని తగిలించి ప్రాధాన్యత, ప్రాముఖ్యత, ప్రావీణ్యత అనడం అనవసరం.

ప్రేరేపణ

ప్రేరేపణ అనేది తప్పు. 'ప్రేరణ' అనే అర్థంలో ప్రయోగిస్తున్నారు. 'ప్రేరేచు' అనే తెలుగు పదానికి 'అన' అనే సంస్కృత ప్రత్యయం రాకూడదు. కానీ, దాన్ని కలిపి 'ప్రేరేపణ' అనడం వ్యాకరణ విరుద్ధం. కాబట్టి పూర్తి సంస్కృత పదమైన 'ప్రేరణ'ను వాడితే సరిపోతుంది.

మల్లిఖార్జునుడు

శ్రీశైల మల్లికార్జునునికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలిస్తే ఈ చిక్కు తొలగిపోతుంది. మల్లికా పుష్పాలతో భ్రమరాంబికా దేవి స్వామివారిని పూజిస్తుంది. అందువల్లనే ఆయన మల్లికార్జునుడయ్యాడని అంటారు. అయితే కొందరు ఆయనను మల్లిఖార్జునుడుగా అని పొరపాటుగా పిలుస్తారు. ఆ పేరుపెట్టుకొన్న వారిని కూడా చాలామంది 'కా' ను 'ఖా'గా పిలుస్తారు.

శాఖాహారం

శాకాహారానికి వచ్చిన తిప్పలివి. శాఖ (కొమ్మ, ఆకు)లకు సంబంధించిన ఆహారమే కదా అని శాఖాహారం అంటుంటారు. హోటళ్లకు 'శాఖాహార హోటల్' అని, రుచికరమైన శాఖాహార వంటలకు ప్రసిద్ధి అని అంటుంటారు.

ఫలాహారం

ఉదయంపూట తీసుకునే టిఫిన్‌ను 'ఫలహారం', 'ఫలాహారం' అని పిలుస్తుంటారు. ఫలాలతో కూడిన ఆహారాన్ని ఫలాహారం అనడం సరైనదే. గ్రామాల్లో కూడా ఈ సంస్కృత పదం 'ఫలహారం' (తప్పు) అంటుంటారు. పల్లెల్లో పూజలు, వ్రతాలు చేసుకున్నప్పుడు తీసుకునే ప్రసాదాన్ని కూడా 'ఫలారం' (ఫలాహారం) అంటారు. అంటే దేవుళ్లకు నైవేద్యంగా వివిధ రకాలైన పండ్లను పెట్టడం వల్ల ఫలారం అంటారేమో! ఉదయం తీసుకునే ఫలాహారాన్ని అల్పాహారం అని అనడం సరైంది. భోజనాన్ని అనల్పంగా తీసుకున్నా అనల్పాహారం అనాల్సిన అవసరం ఉండదు.

పాత్రికేయులు

పత్రికారచయితలను 'పాత్రికేయులు' అని పిలుస్తారు. ఇది తప్పని తిరుమల రామచంద్ర, రవ్వా శ్రీహరి వంటి పండితులు చెబుతున్నా దీన్ని 'పాత్రికేయులు' వినలేదు. ఇది రూఢి అవడంతో పండితులకంటే వ్యవహారమే ముఖ్యం అన్నట్లుంది. పత్రికా శబ్దానికి 'ఏయ' అనే ప్రత్యయం తోడై పాత్రికేయ ఏర్పడింది. రాధ+ఏయ=రాధేయ (రాధ కుమారుడు కర్ణుడు), వినత+ఏయ=వైనతేయ (వినత కుమారుడు గరుత్మంతుడు) అన్నట్లుగా పత్రిక+ఏయ=పాత్రికేయ (పత్రిక కుమారుడు) అని అనాల్సి వస్తుంది. 'స్త్రీభ్యో ఢక్' అనే సూత్రం ప్రకారం స్త్రీలింగ పదాలకు ఢక్ (ఏయ) ప్రత్యయం చేరితే అలా వస్తుంది.

కాబట్టి 'పాత్రికేయులు' పదాన్ని నివారించి పత్రికారచయితలు అనవచ్చు కదా! అన్నది పండితుల సూచన. 'విలేఖరి' కూడా సరైన పదం కాదు. భాషను సులభతరం చేసే క్రమంలో దీన్ని 'విలేకరి'గానూ వాడుతున్నారు. ఇదీ తప్పేనని 'విలేఖకులు' అని వాడాలన్నది పండితుల అభిప్రాయం. 'లేఖకులు' అనే మాటకు 'వి' ఉపసర్గ చేర్చి విలేఖకులు అవ్వాలని అంటున్నారు. అయితే పత్రికాలోకం ఇన్నాళ్లు ఎవరేమన్నా మేం ఇలాగే వాడతాం అనుకున్నట్లున్నారు. ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియావారు కూడా 'విలేఖరి'ని స్వంతం చేసుకున్నారు.

మరికొన్ని తప్పులు–ఒప్పులు చూద్దాం

తప్పు	**ఒప్పు**	**తప్పు**	**ఒప్పు**
అంతర్బహిర పోరాటం	అంతర్బహిః పోరాటం	అంతర కళాశాల	అంత:కళాశాల
అక్షింతలు	అక్షితలు, అక్షతలు	అగణిత ప్రతిభాశాలి	అగణ్య ప్రతిభాశాలి
అధిగమించు	అతిగమించు	అధీనత	అధీనం
ఆధ్వర్యం	ఆధ్వర్యవం	అనుకూలవతి	అనుకూల
అనుయాయుడు	అనుయాయి	అపురూపం	అపూర్వం
అభ్యంగనం	అభ్యంగం	అయిష్టం	ఇష్టంకానిది
అర్థరాత్రి	అర్ధరాత్రి	అసభ్యకరంగా	అసభ్యంగా
ఆదర్శవంతం	ఆదర్శం	ఆపేక్ష	అపేక్ష
ఆధునీకరణం	ఆధునికీకరణం	ఆశీస్సు	ఆశిస్సు
ఆసాంతం	సాంతం	ఆహ్వానితులు	ఆహూతులు
ఇష్టాగోష్టి	ఇష్టగోష్టి	ఉక్రోశం	ఉత్క్రోశ
ఉదహరించు	ఉదాహరించు	ఉదారపూరితం	ఔదార్యం
ఉధృతం	ఉద్ధృతం	ఉపాధ్యాయురాలు	ఉపాధ్యాయ
మీననేత్రి	మీననేత్ర	ఏకాకితనం	ఏకాకిత్వం
ఏకైక	ఒకేఒక	ఐక్యత	ఐక్యం
ఔత్సాహికులు	ఉత్సాహవంతులు	కాంగ్రెసేతర	కాంగ్రెసితర

తప్పు	ఒప్పు	తప్పు	ఒప్పు
కిరాతకం	కిరాతత్వం	కీకారణ్యం	కీకటారణ్యం
కోటానుకోట్ల	కోట్లకొద్ది	చారిత్రకులు	చారిత్రికులు
జగదాంబ	జగదంబ	జయంతోత్సవం	జయంత్యుత్సవం
జాగర్త	జాగ్రత్త	జాగారం	జాగరం, జాగరణం
తక్షణం	తత్‌క్షణం	తద్వారా	తద్ద్వారా
తాపసి	తపస్వి	దారుఢ్యం	దార్ఢ్యం
దీర్ఘకాలిక	దీర్ఘకాల	మధ్యకాలిక	మధ్యకాల
స్వల్పకాలిక	స్వాల్పకాలిక	దురలవాట్లు	దురభ్యాసాలు
దురాగతం	దుష్కృత్యం	దృశ్యశ్రవణ	దృశ్యశ్రవ్య
ధారావాహికం	ధారావాహిక	నటప్రపూర్ణ	నటనాప్రపూర్ణ
పతాకం	పతాక	పటిష్ఠవంతం	పటిష్ఠం
పర్యటనా కార్యక్రమం	పర్యటన కార్యక్రమం	పర్యవేక్షణాలోపం	పర్యవేక్షణ లోపం
పారంగతుడు	పారగతుడు, పారీణుడు	పునరావృతం	పునరావృత్తం
పూర్వీకులు	పూర్వులు	పాపిష్ఠి	పాపిష్ఠుడు
ప్రతిష్ఠంభన	ప్రతిష్టంభన	ప్రతిష్ఠాత్మకమైన	ప్రతిష్టాకరమైన
ప్రధాని	ప్రధానమంత్రి	భస్మీపటలం	భస్మపటలం
భీతావహం	భీత్సావహం	మధ్యంతరం	మధ్యాంతరం
మమేకం	మమైక్యం	మర్యాదస్థుడు	మర్యాదాస్థుడు
మహిళా ఔత్సాహికులు	ఔత్సాహిక మహిళలు	మహిళాబాధితులు	బాధిత మహిళలు
యథోచిత	యథౌచిత, ఉచిత	విచ్ఛిన్నకర ధోరణులు	విచ్ఛేదకర ధోరణులు
విదేశీశక్తులు	విదేశీయ శక్తులు	విద్యుత్‌కోత	విద్యుత్తుకోత

తప్పు	**ఒప్పు**	**తప్పు**	**ఒప్పు**
విద్యుత్ కొరత	విద్యుత్తు కొరత	విస్తీర్ణం	విస్తీర్ణత
వృద్ధాప్యం	వృద్ధత్వం	వ్యతిరేకత	వ్యతిరేకిత
శక్తివంతులు	శక్తిమంతులు	శతాబ్దం	శతాబ్ది
శిరచ్ఛేదం	శిరశ్ఛేదం	శీతాకాలం	శీతకాలం
శోభస్కరం	శోభాకరం	శోభాయమానం	శోభమానం
సంవత్సరీకం	సాంవత్సరీకం	సకుటుంబ సపరివార సమేతంగా	సకుటుంబంగా లేదా సపరివారంగా
సమర్థవంతంగా	సమర్థంగా, సామర్థ్యంతో	సభికులు	సభ్యులు
సరళి	సరణి	సరిసమానం	సరి లేదా సమానం
సశాస్త్రీయం	శాస్త్రీయంగా	సహాయం	సాహాయ్యం
సాంప్రదాయం	సంప్రదాయం	సార్వజనీనం	సర్వజనీనం
సిరిసంపదలు	సిరి లేదా సంపద	సునాయాసం	అనాయాసం
సైద్ధాంతికపరంగా	సిద్ధాంతపరంగా, సైద్ధాంతికంగా	సౌహార్ద్రం	సౌహార్దం
అభాగిని	అభాగ్య	నిస్వార్థ	నిస్స్వార్థ
నిశ్వాస	నిశ్శ్వాస	మహద్భాగ్యం	మహాభాగ్యం
ముఖ్యఅతిథి	ముఖ్యాతిథి	విబేధం	విభేదం

'ఆజానుబాహువు' అనే మాట ఉంది. శ్రీరాముడు ఆజానుబాహువు అని చెప్తారు. 'ఆజానుబాహుం, అరవింద దళాయతాక్షం' అనే శ్లోక పాదాన్ని అందరూ వాడతారు. పొడవైన ప్రతి ఒక్కరినీ ఆజానుబాహుడు అంటారు. 'జానువుల వరకూ బాహువులున్నవాడు' అని అర్థం. అంటే బాహువులు (భుజాలు) జానువుల (మోకాళ్ల) వరకూ వచ్చేవాడు అని. అరవింద దళాయతాక్షం అంటే అరవిందముల వంటి కళ్లుగలవాడు అని. 'ఆజన్మ బ్రహ్మచారి' అని కొందరిని పిలుస్తారు. అటల్‌బిహారీ వాజ్‌పేయి వంటివారు జన్మంతా బ్రహ్మచారిగా ఉండిపోయారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనే మాటను

చాలాసార్లు దేశభక్తి విషయంలో వాడతారు. జననీ జన్మభూమిచ్చ(?) అని విచ్చలవిడిగా వాడతారు. జననీ జన్మభూమిశ్చ అనేది సరైంది. 'స్వర్గాదపీ గరీయసీ' అని అంటుంటారు. సినిమా పాటలో దీర్ఘాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. కాస్త పద విభజన, అర్ధ వివరణ చేసుకుంటేగదా తెలిసేది. స్వర్గాత్ అపి అంటే స్వర్గం కంటే కూడా అని, గరీయసి అంటే ఉన్నతమైనది అని. 'నా తదనంతరం నా యావదాస్తిని నా కుమారునికి చెందేలా విల్లు రాస్తున్నాను' అన్న మాటను ఇష్టానుసారం వాడతారు. 'తదనంతరం' అంటే అనంతరం, తర్వాత అని అనుకుంటారు. కానీ,

తత్+అనంతరం= తదనంతరం. ఇక్కడ 'నా అనంతరం' అంటే సరిపోతుంది.

ఏదైనా ఒక పదం, పదబంధం కనిపించిందంటే కొంత పరిశీలించి దాని మౌలికరూపం ఏమై ఉంటుందా అని ఆలోచించాలి. రాసేటప్పుడు మనకు తెలిసిన మాటలనే ప్రయోగించాలి. ఏదైనా పదం బావుందనిపిస్తే దానిగురించి, పరిశోధించి పూర్వం ఏ అర్థంలో, ఏ సందర్భంలో ప్రయోగించారో తెలుసుకొని ప్రయోగించాలి. తెలియని పదం ప్రయోగిస్తే ఎటువంటి విపరీతార్థమైనా రావచ్చు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు అంత్యక్రియలు జరుగుతున్నప్పుడు ఆకాశవాణి ప్రత్యక్ష వ్యాఖ్యానాన్ని ప్రసారం చేసింది. సరిగ్గా చితికి నిప్పంటించే సమయంలో శోకసంతప్తులైన జనం హాహాకారాలు చేస్తున్నారని చెప్పబోయి ఒక వ్యాఖ్యాత– 'జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు' అన్నారు. నిజానికి ఎంతో అనుభవజ్ఞుడైన వ్యాఖ్యాత ఆయన. తెలిసి చేసిన ప్రయోగం కాదు. అందుకని తెలియకపోతే తెలుసుకొని ప్రయోగించాలి. ఏమాత్రం అజాగ్రత్త కూడదు. నిజానికి పత్రికారచయితకు దైనందిన వ్యవహారంలో పెద్దగా భాషా పరిజ్ఞానం అవసరం లేదు. కానీ, పత్రికారచయిత తన పరిధిని మించిన పదసంపదను, నానార్ధ సంపదను సమకూర్చుకోవాలి. ఇతరులు రాసిన వాటిలో తప్పొప్పులను గమనించదంద్వారా కూడా కొంత నేర్చుకోవచ్చు.

భాషే అసలు సమస్య

రాష్ట్రంలో చాలా విశ్వవిద్యాలయాలు, ఇతర కళాశాలలు జర్నలిజం, కమ్యూనికేషన్ కోర్సులను నిర్వహిస్తూ ఏటా పెద్దసంఖ్యలో పట్టభద్రుల్ని తయారుచేస్తున్నాయి. మరోవైపు ఆయా దినపత్రికలు పత్రికారచయితలను తయారు చేసేందుకు శ్రద్ధగా జర్నలిజం కళాశాలల్ని నిర్వహిస్తున్నాయి. పత్రికారచయితలు కాగోరేవారిని సుశిక్షితులుగా తయారుచేసే కార్యక్రమం ఎంత బాగా జరుగుతున్నా భాషపై ప్రాథమిక అవగాహన కూడా లేకుండా వస్తున్న అభ్యర్థులకు భాష నేర్పించడమే అసలు సమస్యగా ఉంటోంది. పత్రికలు, ప్రసార మాధ్యమాలకు సంబంధించి నిర్మాణాత్మకమైన శిక్షణనివ్వడానికి వివిధ విశ్వవిద్యాలయాల్లో కొన్ని కోర్సులున్నాయి. ఈ కోర్సుల నిర్వహణద్వారా ఈ రంగాలకు నిపుణులైన మానవ వనరులను అందించడమే ముఖ్య లక్ష్యం. పత్రికా పరిశ్రమకు, టెలివిజన్ పరిశ్రమకు ఉపకరించే అంశాలు బోధించడానికి వీలుగా పాఠ్యాంశాలను పాఠ్య ప్రణాళిక నిర్ణాయక సంఘాలు నిర్ణయిస్తున్నాయి. ఈ సంఘాల్లో పేరుపొందిన పరిశోధకులే ఉంటారు. పాఠ్యాంశాల్ని అప్పుడప్పుడూ కాలానుగుణంగా, అవసరాలకు తగినట్లుగా నవీకరిస్తూ ఉంటారు.

వృత్తివిద్య కాబట్టి తగినపాళ్లలో ప్రాయోగిక (Practical) సిద్ధాంత (Theory) అంశాలను పొందుపరుస్తారు. సిద్ధాంత అంశాల్లో రిపోర్టింగ్, ఫీచర్, ఎడిటోరియల్ రైటింగ్, ఎడిటింగ్, రేడియో, టెలివిజన్, కమ్యూనికేషన్, అడ్వర్టయిజింగ్, ప్రజాసంబంధాలు, పత్రికాచట్టాలు, మీడియా మేనేజ్‌మెంట్, ప్రింటింగ్ వంటివి ఉన్నాయి. ప్రాయోగికాంశాల్లో రకరకాల వార్తలు రాసేందుకు అసైన్‌మెంట్స్, శాఖాపరంగా విద్యార్థుల చేత ఒక పత్రిక నడపడం, ఏదేని ఒక ప్రత్యేక అంశంపై ప్రాజెక్టు రిపోర్టు రాయడం వంటివి ఉంటాయి. జర్నలిజం విద్యార్థులు ఎప్పటికప్పుడు వార్తల్ని తెలుసుకొనేందుకు, పీటీఐ, యూఎన్ఐ వంటి వార్తాసంస్థలు నిరంతరం పంపే ఆంగ్ల వార్తలను చూసి తెలుగులో అనువాదం చేసేందుకు ఏజెన్సీలకు అవసరమైన రుసుము చెల్లించడం జరుగుతోంది. వెలుపల జరిగే కార్యక్రమాలకు స్వయంగా విద్యార్థులు వెళ్లి విషయ సేకరణ చేసి వార్తలు, ఫీచర్లు, వ్యాసాలు రాసేందుకు వీలుకల్పిస్తారు. పత్రికా కార్యాలయాలకు, టెలివిజన్ కేంద్రాలకు

విద్యార్థులను తీసుకువెళతారు. అక్కడి పనితీరును అధ్యయనం చేసి పత్రిక రూపొందే క్రమాన్ని, టీవీ కార్యక్రమ ప్రసారానికి ఉండే అన్ని హంగులను పరిశీలించే అవకాశం కల్పిస్తారు. వార్తలు రాసే రోజులు పోయాయి. కంప్యూటర్‌పై కంపోజ్ చేయడం ఈనాటి పరిస్థితి. ఇందుకోసం జర్నలిజం కళాశాలల్లో కూడా కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. రోజూ చదువుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోడానికి, సమకాలీన విషయాలపై పట్టు సంపాదించుకోడానికి తెలుగు, ఆంగ్ల దినపత్రికల్ని, ఇతర 'కాలిక' పత్రిక (Periodicals)లను, ఆకర గ్రంథాల (Reference Books)ను అందుబాటులో ఉంచుతున్నారు. బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని, ఇతర సౌకర్యాలను, సదుపాయాలను వినియోగించుకుంటే విద్యార్థి కోర్సు పూర్తిచేసేనాటికి పత్రికలోనో, టీవీ ఛానల్‌లోనో ఉప సంపాదకునిగా లేదా విలేకరిగా సమర్థంగా పనిచేసి మంచిపేరు తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఆ దృష్టితోనే ఇతర రకాలైన సదుపాయాలను కల్పిస్తున్నారు. విద్యాత్మక కార్యక్రమంలో, పరీక్ష విధానంలో లోపం కనిపించదు.

ఈ కోర్సు పూర్తిచేసి విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి వెలుపలికి వచ్చినవారు నేరుగా పత్రికా కార్యాలయాల్లో, టీవీ ఛానళ్లలో ఉద్యోగాలు పొంది ఆ క్షణంనుంచే సమర్థంగా పనిచేయగలగాలి. అలా చేయగలుగుతున్నారా? అంటే కొంతమంది చేయగలుగుతున్నారు. అభిరుచి కలిగి శ్రద్ధాసక్తులతో అన్నీ నేర్చుకొని మీడియాలోకి వెళ్లి రాణిస్తున్నవారున్నా తక్కువమందే. 'విశ్వవిద్యాలయాల నుంచి కళాశాలల నుంచి వెలుపలికి వచ్చినవారిలో మా అవసరాలకు తగిన ప్రమాణాలు ఉండడంలేదు' అనే మీడియా పెద్దల పెదవి విరుపునూ తీసివేయలేం. మరి లోపం ఎక్కడుంది? లోపం విద్యార్థుల్లో ఉందని, అలాగే విద్యాసంస్థల్లో, అధ్యాపకులలో శ్రద్ధాలోపం గురించి కూడా చెప్పకతప్పదు. జర్నలిజం, కమ్యూనికేషన్ కోర్సుల్లో చేరేవారిలో రకరకాల విద్యార్థులున్నారు. ఒక వర్గం నిజంగా ఆసక్తి వున్నవారు. రెండో వర్గం... పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే హాస్టలు వసతి, భోజన సౌకర్యం కావాలి. ఇవి లభించే అవకాశం ఉన్న కోర్సుల్లో జర్నలిజం, కమ్యూనికేషన్ కోర్సు ఒకటి. అందుకని ఈ కోర్సును ఎన్నుకొనేవారు. మూడోవర్గం... మీడియాలో ఉన్న ఉద్యోగావకాశాల దృష్ట్యా ఈ కోర్సులో చేరి శిక్షణ పొందితే మంచిదని భావించేవారు. వీరికి ఏదైనా ఒకటే. అనేక రకాల మార్గాల్లో ఇదీ ఒకటి.

విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో ఉండే ఉద్యమాలు, ఆందోళనలవల్ల తరగతులు సరిగా జరగక జర్నలిజం విద్యార్థులు నష్టపోతున్నారు. వార్షిక పరీక్షల పద్ధతి ఉన్నప్పుడు విద్యార్థులు సంవత్సరం చివరివరకూ పెద్దగా తరగతులకు హాజరుకాని పరిస్థితి ఉండేది.

చివర్న నిజంగా పట్టా అవసరమున్నవారు పరీక్షలు రాసేవారు. పట్టా అవసరం లేదనుకున్నవారు రాసేవారు కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ విధానంలో కూడా పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. తరగతులు జరిగే పరిస్థితి, జరిగిన సందర్భాల్లోనూ విద్యార్థులు తగినంత శ్రద్ధ చూపిన దాఖలాలూ తక్కువ. కొద్దిగా అటూఇటూగా అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నిజంగా అభిరుచి ఉండి, ఇబ్బందులతో ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టి, ఎలాగైనా మీడియాలో అవకాశాల కోసం ప్రయత్నించాలనుకొనేవారు తరగతులకు హాజరవుతున్నారు. అయితే విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఉన్న ప్రైవేటు కళాశాలల్లో బోధన, విద్యార్థుల శ్రద్ధ కొంత మెరుగు.

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఈ కోర్సులకు అవసరమైన బోధన సిబ్బంది, మౌలిక సదుపాయాలు కొదవే. తగినన్ని అధ్యాపక పోస్టులను ప్రభుత్వం మంజూరు చెయ్యదు. పదవీ విరమణ చేసినవారి స్థానాల్ని భర్తీ చేసుకొనేందుకు అనుమతినివ్వదు. ఒకప్పుడు పత్రికారచయితల్ని మాత్రమే తయారుచేసేందుకు అనువుగా తీర్చిదిద్దిన పాఠ్యాంశాల్లో ఇప్పుడిప్పుడే ప్రసార మాధ్యమాని (Electronic Media)కి సంబంధించిన అంశాలను చేరుస్తున్నారు. నిజానికి ఆ పాఠ్యాంశాల్ని పూర్తిస్థాయిలో ఇంకా చేర్చనేలేదు. ఈ అంశాల్ని బోధించే నైపుణ్యం కలిగిన అధ్యాపకులు కూడా లేరు. పత్రికా శాస్త్రాన్ని బోధించే అధ్యాపకులే టీవీ జర్నలిజం గురించి కూడా బోధిస్తున్నారు. విద్యాత్మకంగా వారికి తెలిసిన అంశాలేగానీ సాంకేతింగా తెలిసిన అంశాలు తక్కువే. పత్రికాశాస్త్ర బోధనకు, అభ్యాసానికి అవసరమైన సదుపాయాలే అంతంతమాత్రం. ప్రసారమాధ్యమ రంగంలో పనిచేయడానికి కావలసిన అభ్యాస పరికరాలు ఏర్పాటు చేయడంలో విద్యాసంస్థలు వెనుకబడే ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి పరికరాలు, కంప్యూటర్లు, వీడియో కెమెరాలు, ఎడిట్‌సూట్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహణ తీరును గుర్తుచేస్తుంటాయి. పరికరాలుంటే వీటిని నడిపే నిపుణులుండరు. నిపుణులుంటే పరికరాలు ఉండవు. ఇవన్నీ సవ్యంగా ఉపయోగించుకొని లబ్ధిపొందే ఆసక్తి ఉన్న విద్యార్థులెందరు అన్నదీ పరిశీలనాంశమే.

విశ్వవిద్యాలయాల్లో జర్నలిజం, కమ్యూనికేషన్ రెగ్యులర్ కోర్సులు మాత్రమే ఉన్న రోజుల్లో తరగతులకు హాజరుకాని విద్యార్థివర్గంలో వివిధ పత్రికల్లో అప్పటికే పనిచేస్తున్నవారు కూడా ఉండేవారు. తమకు ఇదివరకే అన్ని అంశాలు తెలుసునని, తరగతులకు హాజరై కొత్తగా నేర్చుకునేదేముంది? అనే అభిప్రాయం వారిలో ఉండడం మూలాన పరీక్షలకు మాత్రమే హాజరయ్యేవారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో దూరవిద్యద్వారా

స్నాతకోత్సవ స్థాయిలో కరస్పాండెన్స్ కోర్సులు ప్రవేశపెట్టడంవల్ల పత్రికల్లో, టెలివిజన్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఆ కోర్సుల్లో చేరుతున్నారు. ఇప్పటికే కావలసినంత అనుభవం ఉన్నందువల్ల మా రంగంలో అన్ని అంశాలపై పట్టు ఉందనీ, ఈ కోర్సుల్లో కొత్తగా నేర్చుకునేదేముందని, ఈ రంగంలో పనిచేస్తున్నాం కాబట్టి డిగ్రీకోసమైనా చేరదాం అనుకునేవారున్నారు. చేరి శ్రద్ధగా చదువుకొని బుద్ధిగా పరీక్షలు రాసేస్తున్నారు. అనుభవంలో నేర్చుకున్న అంశాలే కాకుండా పాఠ్యాంశాల ద్వారా నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయే అన్న విషయం తర్వాత తెలుసుకొని కోర్సు చేసినందుకు సంతోషించేవారూ ఉన్నారు. జర్నలిస్టులుగా సంపాదించిన అనుభవం తీసిపారవెయ్యదగిందేమీ కాదు. అనుభవం ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొని నిలబడి సత్తా నిరూపించుకొనేందుకు ఉపయోగపడేదే. కానీ, అంత అనుభవానికి తోడు థీరీద్వారా నేర్చుకొనే జ్ఞానం అవగాహనను మరింత పెంచుతుందనేది తిరుగులేని సత్యం.

వివిధ అంశాలతో కూడిన పాఠ్యాంశాలు శాస్త్రం, ఆ శాస్త్రాన్ని అందించగలిగేవి విశ్వవిద్యాలయాలేననడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. కాబట్టి విశ్వవిద్యాలయాల్లో చేరడం కాలం వృథా అనుకొనేవారు (మీడియాలోని వారైనా సరే) తమ అభిప్రాయాన్ని మార్చుకోవాలి. విశ్వవిద్యాలయాలు కూడా రెగ్యులర్ కోర్సును మరింత పటిష్ఠంగా నడిపేందుకు శ్రద్ధ తీసుకోవాలి. పత్రికలు, ప్రసారమాధ్యమాల్లో అవసరాలు, ప్రమాణాలకు దీటుగా తమ పాఠ్యాంశాలను నవీకరించుకోవాలి. విద్యారంగం నుంచి వచ్చేవారిని చేర్చుకొనేందుకు మీడియా ఆసక్తి చూపేలా తయారుకావాలి. జర్నలిజం శాఖల్ని అభివృద్ధిపరచాలి. అధ్యాపకులు తగినంతమంది లేని సమస్యను అధిగమించాలంటే మీడియాలో అటు పత్రికల్లోనూ, ఇటు టెలివిజన్ ఛానళ్లలోనూ అపారమైన అనుభవం సంపాదించినవారు ఎంతోమంది ఉన్నారు. వారి సేవలను వినియోగించుకోవడంద్వారా జర్నలిజం విద్యార్థుల జ్ఞానార్తిని తీర్చవచ్చు. తద్వారా తెలుగు పత్రికారంగాన్ని సుసంపన్నం చేయవచ్చు.

పత్రికా సంస్థల్లో జర్నలిజం శిక్షణ

ప్రస్తుతం తమకు కావలసిన పత్రికారచయితలను ఆయా పత్రికలే తయారు చేసుకుంటున్నాయి. మొదట్లో కొన్ని పరిమిత వర్గాలనుంచే పత్రికారచయితలు వచ్చారు. పత్రికలు ప్రారంభమై సుమారు 170 ఏళ్లయిందని భావిస్తే దినపత్రికలు 20వ శతాబ్దం ఉషోదయాన అవతరించాయి. ఆ శతాబ్దం మూడు పాదాలు అంటే 75 సంవత్సరాల్లో దినపత్రికా రచనలో మార్పులు మందగతిలో నడిచాయి. చివరిపాదం మార్పులు ఒక విప్లవంలా వచ్చాయి. పూర్వం ప్రధాన నగరాల్లో, జిల్లా కేంద్రంలో ఒక విలేకరి ఉంటే ఈ దశలో సంఖ్య అనేకరెట్లు పెరిగారు. ప్రచురణ కేంద్రాలు పెరిగాయి. జిల్లా, నగర అనుబంధాలు వచ్చాయి. ముద్రణ ప్రమాణాలు కూడా పెరిగి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని భారతీయ భాషా పత్రికారంగంలో తెలుగు పత్రికలు అగ్రస్థానానికి ఎదిగాయి. ఈ పరిణామాలు పత్రికారంగం రూపురేఖలనే సమూలంగా మార్చివేశాయి. పత్రికా సంస్థ విస్తరిస్తున్న ప్రతి దశలో పత్రికారచయితల సంఖ్య అనేకరెట్లు పెరుగుతూ వచ్చింది. యాంత్రిక విప్లవంవల్ల, చాలా పనులను కంప్యూటర్, అంతర్జాలం చేయడంవల్ల మనుషుల సంఖ్య తగ్గాలి. కానీ, విస్తరణవల్ల పెరిగింది. అవసరాలకు తగిన సంఖ్యలో నిపుణులైన పత్రికారచయితలను నియమించుకొనే ప్రయత్నంలో ఒక దశదాటిన తర్వాత సరైన నిపుణులు లభించని పరిస్థితి వచ్చింది.

కాబట్టే పత్రికలు తమకు కావలసినవారిని తామే తయారుచేసుకోవడం ప్రారంభించాయి. వెలుపలి జర్నలిజం విద్యాసంస్థలమీద ఆధారపడకూడదని, తామే స్వయంగా జర్నలిజం కళాశాలలను నెలకొల్పాలని భావించాయి. ఈ విధంగా ప్రధాన దినపత్రికలు తమ కళాశాల నిర్వహించే కోర్సులో చేరవలసిందని ప్రకటనలిచ్చి రాత, మౌఖికపూర్వకమైన అర్హత పరీక్షల్ని నిర్వహించి అభ్యర్థుల్ని ఎంపిక చేసుకొంటున్నాయి. అలా ఎంపికైనవారికి కళాశాలలో తమ అధ్యాపకులతో శిక్షణనిప్పిస్తున్నాయి. ఈ శిక్షణలో విశ్వవిద్యాలయాల కోర్సులలో ఉన్నట్లు వివిధ అంశాలపై బోధన చేస్తూనే తమదైన శైలిలో ఇతర అంశాలను కూడా బోధిస్తున్నాయి. జర్నలిజం కళాశాలల్ని నిర్వహిస్తున్న సంస్థలకు పత్రికలే కాకుండా టెలివిజన్ ఛానల్ కూడా ఉండడంతో తమ కళాశాలల అభ్యర్థులకు

పత్రికా రచనాంశాలే కాకుండా టెలివిజన్‌కు పనిచేసేందుకు సంబంధించిన అంశాల్లోనూ శిక్షణనిస్తున్నాయి. శిక్షణ పూర్తిచేసుకున్నవారిని ఎలాగైనా వాడుకోవచ్చు. ఒకప్పుడు తమ సిబ్బందికి కొంతవరకు శిక్షణనిచ్చేవారు. ఇప్పుడు శిక్షణకు పూర్తిస్థాయి జర్నలిజం కళాశాలలు ఏర్పాటు చేసుకున్నారు. పత్రికకు, ప్రసార మాధ్యమానికి సంబంధించిన పాఠ్యాంశాలు బోధించేందుకు తమతమ సంస్థల్లోని అనుభవజ్ఞులను, వారికితోడు వెలుపలి అనుభవజ్ఞులను నియమించుకుంటున్నాయి.

జర్నలిజం కళాశాల నుంచి వెలికివచ్చే అభ్యర్థి తొలిరోజునుంచే అనుభవజ్ఞుని పనితీరుకు తీసిపోకుండా– విధి నిర్వహణలో మునిగిపోయేలా తీర్చిదిద్దాలని లక్ష్యం. ఈ లక్ష్యానికి అనుగుణంగా బోధన, అభ్యసనాంశాలను నిర్ణయించారు. తెలుగు భాష, చరిత్ర, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పరిశ్రమలు, పార్లమెంటరీ వ్యవహారాలు, అభివృద్ధి పథకాలు, ప్రభుత్వ పాలన, రాజకీయాలు, అర్థశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్యం, క్రీడలు... ఒక్కటేమిటి? అన్ని అంశాలను నిపుణులద్వారా బోధింపజేస్తున్నారు. పత్రికారచయితగా అన్ని అంశాలపైనా రాయవలసి ఉంటుంది కాబట్టి అన్ని అంశాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో సమస్త విషయాలను నేర్పుతున్నారు. అనువాదం, భాషా పరిజ్ఞానం, సమకాలీన విషయాలు, వివిధ అంశాలపై వ్యాసరచన వంటివి ప్రత్యేకంగా సాధన చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. 10 నెలల కాలంలో రోజుకు 8 నుంచి 10 గంటల చొప్పున ఈ తరగతులు జరుగుతున్నాయి. ఎంతోమంది విషయ నిపుణులు, రోజువారీగా ప్రతి అంశమూ బోధించే అధ్యాపకులు ఈ శిక్షణలో పాలుపంచుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే పత్రికా సంస్థలు నడుపుతున్న జర్నలిజం కళాశాలలు విస్తృతస్థాయిలో అభ్యర్థులకు శిక్షణనిస్తున్నాయి. అలాగే కోర్సు పూర్తిచేసుకున్నవారికి ఉద్యోగాలిస్తున్నాయి. సంపూర్ణ శిక్షణ పొందినవారు కొంతకాలానికే మరో పోటీ పత్రికకో, ఛానల్‌కో వెళ్లిపోయే అవకాశం ఉన్నా శిక్షణలో లోటు రానివ్వడంలేదు. ఒక్కో అభ్యర్థిపై చాలా ఖర్చుపెడుతున్నారు. చాలా శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి విశ్వవిద్యాలయాల జర్నలిజం కోర్సు విద్యార్థులకు లభ్యంకాని స్థాయిలో వీరికి శిక్షణ ఉంటున్నది.

అయినా అటు విశ్వవిద్యాలయాల జర్నలిజం విద్యార్థులకూ, ఇటు పత్రికా సంస్థల జర్నలిజం కళాశాలల విద్యార్థులకూ రానివీ, నేర్పినా నేర్వలేనివి ఉన్నాయి. పత్రికలకు, ఛానళ్లకు వారినుంచి కావలసినవి, వారు ఇవ్వలేనివి అవే. వాటిల్లో ముఖ్యంగా చెప్పుకోదగింది భాష. తర్వాత చెప్పుకోదగినవి సంస్కృతి, సాహిత్యం, కళలు, జనజీవనం, మన పూర్వులు, వారి రంగాలు ఇత్యాది విషయాలు. ఇవి విద్యార్థులకు ఎప్పటిలోగా

తెలియాలంటే... పాఠశాల, కళాశాల స్థాయిలో బాగా ఒంటబట్టాలి. వారు పట్టభద్రులై జర్నలిజం రంగాన్ని తమ అనంతర జీవన కార్యక్షేత్రంగా ఎన్నుకొనేనాటికే వాటిమీద పట్టు అలవడాలి. మిగతా అంశాలు సాంకేతికపరమైనవి. అవి ఏ దశలోనైనా నేర్చుకోవచ్చు. కానీ, భాష తదితర అంశాలు ఒక అభిరుచిగా ప్రాథమిక స్థాయినుంచీ రావాలి. విశ్వవిద్యాలయ జర్నలిజం విద్యార్థులు, పత్రికా సంస్థల జర్నలిజం విద్యార్థులు ఎవర్ని కదిపినా పట్టుమని పది వాక్యాలు తప్పుల్లేకుండా చక్కగా రాయలేరు. పద్యాలు తెలియవు. వచనరచన తెలియదు. కథలు తెలియవు. పండుగలు-పబ్బాలు, గ్రామీణ జీవనంలోని సామెతలు, జాతీయాలు ఇవేవీ తెలియనప్పుడు నుడికారపు సొంపు సంగతి దేవుడెరుగు, సాధారణమైన సృజనాత్మక వచనమైనా రాయలేరు. ఆంగ్లాధిపత్యం కలిగిన విద్యాసంస్థల్లో చదివి వచ్చామని చెబుతారుగానీ, కనీసం ఆంగ్లంలోనైనా చక్కగా రాయగలరా? అంటే అదీలేదు.

జర్నలిజం పడికట్టు పదాలు తప్ప తెలుగు అనబడే ఒక భాషపై పత్రికారచయితకు అధికారం లేదు. లేకపోవడానికి విద్యావిధాన లోపమే కారణం. ఈ లోపాన్ని సరిదిద్ది తెలుగు పత్రికలకు రచయితలను అందించాలంటే పాఠశాల స్థాయినుంచి భాషపై అభిరుచిని రంగరించిపోసే పద్ధతి కావాలి. ఓనమాల నుంచి ప్రారంభించి గుణింతాలు, ఒత్తులు, ధ్వనులు, వర్ణాలు, పదాలు, వాక్యాలు తప్పుల్లేకుండా రాయడం నేర్పాలి. భాష అంటే ఇవేకాదు. ఆ భాషలో అక్షర రూపందాల్చిన కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు, స్వీయచరిత్రలు, విమర్శాగ్రంథాలు, వీటితోపాటు వాగ్రూపంలో తరతరాలుగా జనం నాలుకలపై నర్తిస్తున్న కళారూపాలు, ఆటపాటల కథలు, గాథలు, గేయాల్లో పరిమళించే తెలుగు నుడికారం వంటివన్నీ చదవాలి... వినాలి... ఆనందించాలి... అధ్యయనం చేయాలి. అవన్నీ ఒంటబట్టించుకుంటే ఆ భాషపైన, ఆ భాషకు సంబంధించిన జాతి సంస్కృతిపైన అవగాహన ఏర్పడుతుంది. ఆ అవగాహన పునాదులమీద అందమైన వార్తా భవనాలను నిర్మించవచ్చు. భాషపై ఇలాంటి అనురక్తి, అభినివేశం కలిగిన తరాన్ని మనం తయారుచేసుకొనే వరకు ఇతర అంశాల్లో మనమిచ్చే ఎంత గొప్ప శిక్షణ అయినా ఆత్మలేని శరీరంలాంటిదే అవుతుంది.

రేడియో భాష నాడు, నేడు

ఒకప్పుడు రేడియో అంటే ఆకాశవాణి. ఆకాశవాణి అంటే రేడియో మాత్రమే. కానీ దశాబ్దాల ఆకాశవాణి మనుగడ తర్వాత రేడియో శాఖోపశాఖలుగా విస్తరించింది. మరీ ముఖ్యంగా ఆకాశవాణి ఒకవైపు ఎప్పటిలాగా కొన్ని విలువలకు కట్టుబడి హుందాగా ప్రవహిస్తూ వుంటే ఎఫ్ఎం ఛానళ్ళలోని రేడియో జాకీ(ఆర్.జె)ల నోట, శ్రోతల నుంచి మాట్లాడించి చేసే ప్రత్యక్ష ప్రసారాల పరంగా తెలుగుభాష ఘోరంగా తయారయ్యింది. ఆకాశవాణిలో ప్రజా జీవితంలోని సర్వాంశాలున్నాయి. ఈ జాతీయ శ్రవ్య మాధ్యమం ఉజ్వలమైన జాతి చరిత్రలో సుస్థిర స్థానాన్ని ఆక్రమించింది. ఉదయం భక్తిరంజనితో ప్రారంభమై రాత్రి ప్రసార పరిసమాప్తి వరకు బాలల కోసం, యువత కోసం, కార్మికుల కోసం, మహిళల కోసం, వృద్ధుల కోసం, విద్యార్థుల కోసం, రైతుల కోసం సమస్త శ్రోతృ వర్గం కోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది. ప్రాంతీయ, జాతీయ వార్తలు, సమకాలీనాంశాలు, నాటకాలు, జానపద, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రసంగాలు, సాహిత్య, సాంస్కృతిక విశేషాలు... ఇలా అనేక విశేషాంశాలు నిత్యం ప్రసారమవుతాయి. ఆకాశవాణి ప్రసార ప్రయాణంలో ఎన్నో చెప్పుకోదగ్గ మైలు రాళ్లున్నాయి. ఎంతోమంది గొప్ప సంగీత విద్వాంసులు, కవులు, రచయితలు, కళాకారులు, ప్రయోక్తలు–వ్యాఖ్యాతలుగా పదవులు చేపట్టి ఆకాశవాణిని తమ సృజనాత్మకమైన ప్రయోగాలతో సుసంపన్నం చేశారు. భాషకు సంబంధించినంతవరకు ఇటీవలి కాలంలో వచ్చిన టి.వి.ఛానళ్ళు, ఎఫ్ఎం రేడియో ఛానళ్ళు ఆకాశవాణిని చూసి నేర్చుకోదగ్గ విషయాలు అనేకం వున్నాయి. పత్రికలు ఆకాశవాణికి ప్రత్యామ్నాయంగా భాషాపరమైన శిక్షణతో, క్రమశిక్షణతో అనేక దశలను దాటి ప్రామాణిక రూపు సంతరించుకున్నాయి. ఆకాశవాణి భాషా విధానం కూడా ప్రామాణికతను ఎన్నడూ మీరలేదు. అందులో వివిధ విభాగాల్లో పనిచేసినవారు భాషారంగంలో 'పండిపోయిన వారు కావడం ఒకటి, ప్రభుత్వ ప్రసార విభాగం కావడం వల్ల భాషాపరమైన కొన్ని స్పష్టమైన, నిర్దుష్టమైన నియమాలు విధించుకోవడం ఒకటి'. ఈ రెండు కారణాల వల్ల మొదటి నుంచీ హర్షించదగ్గ రీతిలోనే తన కార్యక్రమాల్ని రూపొందించి ప్రసారం చేస్తూ వచ్చింది.

వార్తలు, వివిధ అంశాలపై ప్రసంగాలు, కవితలు, కథానికలు, నాటకాలు, వ్యవసాయదారుల కార్యక్రమాలు, లలిత, శాస్త్రీయ సంగీతం తదితర కార్యక్రమాలు ఆకాశవాణిలో ముఖ్యంగా ప్రసారమవుతున్నాయి. వీటిలో లలిత సంగీతంలో ఏ గీతానికా గీతం తొలుత గేయ కవితారూపంలో రచనా రూపం పొంది స్వరబద్ధమైనవి. శాస్త్రీయ సంగీతంలోని కృతులన్నీ పూర్వ సంగీతమూర్తుల సాహిత్య, సంగీత రచనలే. కాబట్టి వీటిలోని భాష కవితాత్మకమైంది. ప్రామాణికమైంది. కవితలు, కథలు, నాటకాలు, ప్రసంగాలు, వ్యవసాయదారుల కార్యక్రమాల్లో కూడా రచనాభాష ప్రామాణికమైంది. అయితే రచనారూపం నుంచి శ్రవ్యరూపంలో కళాకారులు, ప్రసంగకర్తలు చదవగా ధ్వని ముద్రితం చేసినవి. రచనాభాషగా, ధ్వని ముద్రితమైన భాషగా రెండూ శ్రవ్య ప్రధానంగా రూపొందడం ఆకాశవాణి ప్రత్యేకత. రేడియో శ్రవ్య మాధ్యమం కావడంవల్ల ప్రసంగ పాఠమైనా, నాటకమైనా, కథైనా, పుస్తక భాషగా కాకుండా శ్రోతలు వింటూ అర్థం చేసు కుంటూ లీనమయ్యే విధంగా రూపొందడం ఆకాశవాణి విశిష్టత. కార్యక్రమ నిర్వాహ కులందరూ రేడియోలో ప్రసారం చేయడానికి నిర్ణయించిన ప్రతి రచననూ ముందుగా పరిశీలించి లోటుపాట్లు సరిదిద్ది ధ్వనిముద్రిత దశకు తీసుకెళుతుంటారు. అయితే భిన్నమైన రచయితలు రాసే రచనలు ప్రసారానికి నోచుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, కడప వంటి ప్రధాన కేంద్రాలు, తిరుపతి, కొత్తగూడెం, వరంగల్, నిజామాబాద్, మార్కాపురం, ఆదిలాబాద్, కర్నూలు వంటి ఎఫ్.ఎం. కేంద్రాల కార్యక్రమాల భాషలో వ్యత్యాసాలు బాగా కనిపిస్తాయి. పత్రికల్లో వున్నట్లే వందల సంఖ్యలో రచయితలు రేడియోకు రచన చేస్తున్నారు. కాని పత్రికా రచయితల భాష సాధించిన ఏక రూపత లేదా ప్రామాణికత రేడియో రచయితల వల్ల కాలేదు. అయ్యే అవకాశమూ కనిపించదు. పత్రికా రచనా భాషకు సమన్వయం వుంది. రేడియో రచయితలకు లేదు. వ్యాఖ్యాతల (ఎనౌన్సర్ల) ప్రకటనల భాష ప్రామాణికంగా వుంటుంది. ఇతర రచయితల భాషలో అది కనిపించదు. ఆకాశవాణికి రచనలు పంపేవారిలో ప్రముఖ రచయితలు ఈనాడు తక్కువ. శ్రోతల సంఖ్య తగ్గుతున్నకొద్దీ రాసే ప్రముఖుల సంఖ్య కూడా తగ్గుతున్నది. ప్రముఖుల చేత ప్రత్యేకంగా రాయించి వారి స్థాయికి తగ్గరీతిలో ఎక్కువ పారితోషికాన్ని చెల్లించే ఆర్థిక వనరులు కూడా ఆకాశవాణికి లేవు. దీంతో ఒకప్పటి ఆకాశవాణి భాషకున్న ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఫలానా ప్రసంగ వాక్యంలో ఇది ప్రభుత్వ విధానాలను వ్యతిరే కించే విధంగా వుంది. ఇందులో ఫలానా వాక్యం, ఫలానా పదం సరిగా లేవు. ఫలానా పదం ఆమోదయోగ్యం కాదు... అని రచయితకు చెప్పి తిరిగి రాయించి దగ్గరుండి ప్రతి మాట పరిశీలనాత్మకంగా వింటూ ధ్వని ముద్రితం చేసేవారు. ఇప్పుడు అంత శ్రద్ధ కని

పించడం లేదు. రాష్ట్ర రాజధానిలో, ఇతర ప్రధాన కేంద్రాల్లో కార్యక్రమ నాణ్యతా, సమీక్షా సమావేశం ప్రతిరోజూ జరుగుతూ కొంత నియంత్రణ చేస్తున్నా, మిగతా కేంద్రాల్లో భాష గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. రేడియో శ్రవ్య మాధ్యమం. దీనిలో ప్రసారానికి వాడవలసిన భాష కూడా శ్రవ్య ప్రధానంగా వుండాలి. చదువుతున్నా చెప్తున్నట్లుండాలి. చెప్తుంటే వింటూ, చూస్తూ వున్నట్లుండాలి. చిన్నచిన్న మాటలుండాలి. గ్రామీణులకైనా ఇట్టే అర్థమయ్యేలా వుండాలి. బాగా వాడుకలో వున్న మాటలే తప్ప మరుగునపడిన, సంస్కృతీకరించిన మాటలు వాడరాదు... అన్న సూత్రాలను పెద్దగా లెక్కపెడుతున్న జాడలు లేవు. అసలు ఒకప్పటి ఆకాశవాణి ప్రయోక్తలు భాషపై అధికారం వున్నవారు. ప్రయోగంలో మంచిచెడులను నిర్ణయించే శక్తి వుండి ప్రతి పదాన్ని గుచ్చిగుచ్చి చూసేవారు. ఇప్పుడు అలాంటి వారు తగ్గిపోయారు. వీరి ఎంపిక విధానంలో, అనంతర శిక్షణలో ఆకాశవాణి భాషా నైపుణ్య పరీక్ష అనేది లేదు. భాషా విధానం అనేది లేదు. అన్నిటికీ మించి ప్రసార వ్యవధి తగ్గలేదు. సిబ్బంది తగ్గారు. ఉన్నవారికి భారం పెరిగింది. వేతనాలు నిరాశజనకం. పదోన్నతులు మృగ్యం. వారి శ్రమను గుర్తించి గౌరవించి వెన్నుతట్టి ముందుకు నడిపే నాథుడే కరువయ్యారు. ఢిల్లీలో వీరి పాలనాధికారులు. వారికి ఈ ప్రాంతపు భాషపై మమకారమూ, శ్రద్ధా ఏవీ లేవు.

ఆకాశవాణి అంతా ఒకటి కాదు. ఇందులో వార్తా ప్రసారాలు, సాధారణ కార్యక్రమాలు, వాణిజ్య ప్రసారాలు, కొత్తగా కొన్నేళ్ళ కిందట అనుబంధంగా వచ్చి చేరిన ఎఫ్.ఎం. రెయిన్‌బో, వార్తా ప్రసారాల్లో అనువాదం, పఠనం రెండు భాగాలు. అనువాద భాష, పఠనభాష రెండు భాగాలు. వార్తలను ఇలా అనువదించాలి. వివిధ రకాలైన వనరుల నుండి ఈ విధంగా వార్తల్ని చేరుకోవాలి అనే విషయంలో దశాబ్దాల నుంచి ఒక దారి వుంది. అనువాదంలో వార్తలు చదవడంలో అనుభవ సంపన్నులైన వారు ఆ దారి వేసి వున్నారు. అయితే ఆ దారిని శ్రద్ధగా, నిపుణంగా అనుసరిస్తున్నవారు అరుదైపోతున్నారు. వారు అనుసరిస్తున్నారా లేదా అని చూసేందుకు, అవసరమైన మార్గదర్శనం చేసేందుకు వార్తాసంపాదక సిబ్బందికి వ్యవధి వుండడం లేదు. ఒకప్పుడు వార్తలంటే ఇటు హైదరాబాద్‌కైనా, అటు విజయవాడకైనా ప్రాంతీయ వార్తలే. జాతీయ వార్తలు ఢిల్లీ నుంచి ప్రసారమయ్యేవి. అప్పుడైనా, ఢిల్లీలోనైనా ఆంగ్లంలో అన్ని భాషల వారి కోసం తయారుచేసే బులెటిన్ అందజేసి అనువదించుకొమ్మని ఆదేశించేవారు. అనువాదకులు ఉన్నంతలో శ్రద్ధతో అనువదించి చదివేవారు. జాతీయ వార్తా ప్రసార విభాగం హైదరాబాద్ వచ్చేసింది. ఇప్పుడు హైదరాబాద్‌లో రెండు పూటలా ప్రాంతీయ వార్తలు, మూడు పూటల

జాతీయ వార్తలు, గంట గంటకు ఫోన్‌లో వార్తలు, హైదరాబాద్, విశాఖల్లోని ఎఫ్.ఎం.కు వార్తల ముఖ్యాంశాలు, ఇవేగాక ఆగ్నేయాసియా దేశాల తెలుగు శ్రోతల కోసం రోజూ వార్తలు, వివిధ అంశాలపై వ్యాఖ్యలు ఇన్ని వున్నాయి. ఇంతగా వార్తా ప్రసారాలు పెరిగినా అందుకనుగుణంగా పెరగవలసినవి పెరగలేదు. ప్రైవేటు ఛానళ్ళ పోటీని తట్టుకొని తాజా వార్తలు, తనదైన ప్రతినిధుల ద్వారా సేకరించే ప్రత్యేక వార్తలందించడం ద్వారా శ్రోతల ఆదరాభిమానాలు పొందే అవకాశాలు ఆకాశవాణికి కల్పించలేదు. రాజధానిలో, విజయవాడ, విశాఖ, తిరుపతి, వరంగల్, అనంతపురం, గుంటూరు, ఉభయ గోదావరులు, కృష్ణా తదితర జిల్లాలు, ప్రాంతీయ కేంద్రాల్లోని విలేకరులు ఎప్పటికప్పుడు వార్తాప్రసారాన్ని సుసంపన్నం చేసే వార్తల్ని పంపలేకపోతున్నారు.

అయినప్పటికీ శక్తికొద్దీ ఆకాశవాణి వార్తా ప్రసారాలకు అనాదిగా వుంటూ వస్తున్న ప్రతిపత్తిని కాపాడుతున్నారు. వివిధ రకాలైన వనరులను పరిశీలిస్తూ సంపాదకులు వార్తల్ని సేకరించి అనువాదకులకు అందిస్తే, అనువాదకులు ప్రామాణికమైన, ఏకరూపతతో కూడిన వార్తానువాదం చేస్తున్నారు, చదువుతున్నారు. ఆకాశవాణి వార్తా ప్రసారం అంటే సంచలనాల కోసం పాకులాడడం వుండదని, సంయమనం, విశ్వసనీయత ప్రధానంగా భావిస్తారనే పేరు నిలబెట్టుకుంటూనే వున్నారు. అనువాద ప్రక్రియలో పాల్గొంటూ ఈ పేరు నిలబెట్టేలా పాటుపడుతున్న సిబ్బందికి ప్రోత్సాహం అందించే కృషి అటు ఢిల్లీస్థాయి నుంచే జరగాలి.

ఇక ఎఫ్.ఎం. ఛానళ్ళ భాష బాగుపడే అవకాశమే లేదు. ఎందుకంటే ఆకాశవాణి యువలోకాన్ని ఎక్కువగా ఆకర్షించలేకపోయిందని, ఆ తరానికి చేరడమే ప్రధాన లక్ష్యమని ఈ ఛానళ్ళు పేర్కొంటున్నాయి. యువతరాన్ని చేరడంలో ఎఫ్.ఎం. రేడియో ఛానళ్ళు విజయవంతమయ్యాయని చెప్పక తప్పదు. అయితే యువతరాన్ని చేరడమంటే వాళ్ళకు లేనిపోని కైపు ఎక్కించడమా! ఎంతగా ఎక్కువమంది శ్రోతలను చేరితే అంతగా బాధ్యత పెరుగుతున్నదన్న వాస్తవాన్ని ఈ ఛానళ్ళు విస్మరించాయి. తాజా సినిమాల గురించీ, ఆ సినిమాల్లో వెర్రితలలు వేసిన ప్రేమ సన్నివేశాల గురించీ శ్రుతిమించి ప్రసారం చేస్తున్నాయి. ఆర్.జె.లు అప్పటికప్పుడు రేడియో వింటున్న శ్రోతలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలకరిస్తూ వాళ్ళ ప్రేమల గురించీ, ప్రేయసీ ప్రియుల గురించి కవ్విస్తూ, నవ్విస్తూ అడుగుతున్న ధోరణి యువతరానికి మేలు చేసేదిగా లేదు. ఆ భాష చాలా ఘోరంగా వుంటున్నది. ఆర్.జె.లు మాట్లాడేది ఒక భాష కాదు. వాళ్ళు ఫోన్ ద్వారా శ్రోతల నుంచి మాట్లాడించేది కూడా ఒక భాష కాదు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీ... ఈ నాలుగేనా మళ్ళీ తెలుగులో

కూడా హైదరాబాద్ భాష, మరో ప్రాంత భాష... అన్నీ కలిపిన భాష. నవ్విస్తూ, కవ్విస్తూ తాజా సినిమా పాటలు వినిపిస్తూ, వసపిట్టల్లా మాట్లాడుతూపోయే ధోరణి వుంది. ఈ ఛానళ్ళు వింటున్నవాళ్ళు ఇదే సరైన పద్ధతేమో, ఆర్.జె.ల భాషే సిసలైన తెలుగేమో అనుకునే దురవస్థ ఒకటి స్థిరపడుతోంది. హైదరాబాద్‌కు 20 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునికులైన నగర యువత మనోభావాలను ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు, భాష ఉండాలన్నది సమర్థనీయమే. కాని అన్ని భాషలకు స్థానం కల్పించండి. తెలుగు వారికి తెలుగు, ఆంగ్లేయులకు ఆంగ్లం, హిందీ వారికి హిందీ, ఉర్దూ వారికి ఉర్దూ వేరు వేరుగా ఇవ్వండి. దేనికదిగా దాని స్వరూపం, స్వభావం, మౌలికతను కాపాడండి. ముఖ్యం గా ఎఫ్.ఎం. ఛానళ్ళూ తెలుగును కాపాడండి!

టెలివిజన్ 'టెల్'గు భాష

ఈనాడు నిరక్షరాస్యులైన తెలుగింటి గృహిణులు కూడా టి.వి. ధారావాహికల భాషే మాట్లాడుతున్నారు. నలుగురు కలిసి చెప్పుకొనే మంచి చెడుల్లో, పెళ్ళి చూపుల సందర్భాల్లోని కలయికల్లో, దేవాలయాల్లో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో, పిల్లల పుట్టిన రోజు పండుగల్లో అనుదిన ధారావాహికల సన్నివేశాల గురించీ, అత్తాకోడళ్ళ పాత్రల చిత్రణ గురించీ, సంభాషణల గురించీ మాట్లాడుకుంటున్నారు. స్నేహితులను చూడడానికి వెళ్ళేటప్పటికి అక్కడ టి.వి. తెరపై తెలుగులోనే కాబోలు చక్కగా 'చ్ఛ' కాదు 'చ' చక్కగా వ్యాఖ్యాతలు, యాంకర్లు గుక్క తిప్పుకోకుండా తల మాత్రం అతి నాటకీయంగా ఆడిస్తూ మాట్లాడుతున్నారు. అంతలో మరో ఛానల్‌లో ఏవో '... రేకులు' ధారావాహికలో పెద్దావిడ పాత్రలో తమిళమూ, తెలుగూకాని సంభాషణలు. ఆ రకమైన తమిళ యాస పాత్ర విలక్ష ణతకు, వీక్షకులకు ఆకర్షించే ఎత్తుగడకు చిహ్నామని ఆ ఇంట్లోని పెద్దావిడ చెప్తున్నారు. ఆనాటి అరగంట అయ్యేదాకా ఆ ఇంటి వాళ్ళెవరూ మాట్లాడలేదు. పైగా వీళ్ళు ఈ సమయంలో వచ్చారెందుకన్నట్లుగా చూశారు. పూర్తయ్యాకనే పండగకు ఊరెళ్ళివచ్చిన విశేషాలు చెప్పుకొన్నాం. బయటపడుతుండగా ఛానల్‌లో ఒకబ్బాయి నిలబడి ఆంగ్లం, తెలుగు కలియబెట్టి ఒకటే మాట్లాడేస్తున్నాడు. అవతల ఫోన్లో ఒక యువతి కూడా ఇలాగే మాట్లాడుతోంది. తన స్నేహితునికి ఏదో పాట డెడికేట్ చేస్తున్నానని చెప్తూ ఆ పాట ప్లే చెయ్యమంటోంది. ఛానల్‌లో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం 'పాడుతా తీయగా' అనే కార్య క్రమంలో మాట్లాడుతూ- అంతకుముందు అద్భుతంగా పాడిన చిన్నారి భాషా దోషాన్ని సరిదిద్దుతూ 'తేనెలాంటి తెలుగుభాషను తెలుగులాగే నేర్చుకోండి. ఆంగ్ల భాషనూ నేర్చుకోండి తప్పులేదు. ఈనాడు జీవనోపాధి భాష ఆంగ్లమే కదా!' అంటున్నారు. ఇంటికి చేరుకొని టి.వి. ఆన్ చేస్తే ఇదీ సన్నివేశం. ఏమాటకామాట చెప్పుకోవాలి. ఒకటి రెండు ఛానళ్ళలో మంచి తెలుగు మాట్లాడతారు. భాషాపరమైన జాగ్రత్తలు చాలా తీసుకుంటారు. అందరూ వీళ్ళను ఫాలో అయిపోతే బావుండు కదూ మమ్మీ! అంది మా అమ్మాయి. ఇలా సాగుతోంది జన జీవితంపై దండయాత్ర చేసిన టెలివిజన్ మాధ్యమంలోని తెలుగు భాషా వైభవం.

టివి ఛానళ్ళలో వినోద ఛానళ్ళు, వార్తాఛానళ్ళు వున్నాయి. వార్తా ఛానళ్ళలో అప్పుడప్పుడూ వార్తలతో పాటు ఊదరగొట్టే చర్చా కార్యక్రమాలు, వార్తలు, వినోదం కూడా కలిపి అందిస్తున్నారు.

ఏ ఛానల్ అయినా టెలివిజన్ ప్రసార పరిశ్రమలో తనదైన కొత్త ఒరవడి సృష్టించి రేటింగ్స్‌లో ముందుకు దూసుకువెళ్ళాలని, వీక్షకులు రిమోట్ తిప్పకుండా తమ ఛానల్ చూస్తూ వుండాలని ఆశించడం సహజం. అది తప్పుకాదు. అయితే ప్రజలకు అన్ని మాధ్యమాలకంటే చాలా సన్నిహితంగా వెళ్ళిన టీవీ ప్రతీక్షణం వాళ్ళకు చూపించే ఫ్రేముల్లో ఏముంటున్నదో ఆలోచించమని మాత్రమే కోరుకుంటాం. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, యువత టి.వి.లో వచ్చే భాషే మాట్లాడుతున్నారు. టివిలో యాంకర్లు, న్యూస్ ప్రజెంటర్లు పలికే మిశ్రమ భాషే తెలుగు అనుకుంటున్నారని గమనించడం లేదు. పలికేవారు, టీవీ చూస్తూ వింటున్నవారు ఆ మిశ్రమ భాషే సరైంది 'దటీజ్ టెల్గూ' అనుకునే పరిస్థితి వుంది. కొందరు పేరుమోసిన వ్యాఖ్యాతలు చక్కని తెలుగు మాట్లాడుతున్నారు. ఒకటి రెండు చానళ్ళలో తెలుగుపట్ల చాలాశ్రద్ధ చూపే వ్యాఖ్యాతలు, న్యూస్‌రీడర్లు వున్నారు. శ్రద్ధ చూపడం వెనుక వారు అనుసరిస్తున్న భాషా విధానం కొరకు కల్తీలేని తెలుగు మాటల ఊటలు ఊరేలా చేసే యంత్రాంగం కారణం. ఈ భాషా విధానంపై వారు ఎంపిక చేసుకున్న సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చుకుంటారు. భాష పట్ల ఆ ఛానళ్ళ యజమానులకున్న అభిమానానికి జోహార్లు. అయితే మిగతా వారి మాటేమిటి. ఎక్కడైనా మంచి జరుగుతుంటే దాన్ని అనుసరించడం వుండాలి కదా! నిజానికి చెడు జరిగితే అనుసరిస్తారుగానీ మంచిని అనుసరించరు.

ఒక వినోద కార్యక్రమాలందించే ఛానల్‌ను పరిశీలిస్తే పిల్లల పుట్టిన రోజులు, పెద్దల పెళ్ళిరోజుల శుభాకాంక్షలందించే కార్యక్రమంలోగానీ, సినిమా షూటింగ్‌లు, తారల ప్రేమా యణాలు, పెళ్ళి వేడుకల కబుర్లు, కొత్త సినిమా విశేషాల కార్యక్రమాల్లోగానీ, రకరకాల గేమ్‌షోల్లోగానీ కొంత ముందుగా తయారుచేసిన రచన వుంటుంది. ఆ రచనను వ్యాఖ్యాత పలుకుతారు. మిగతాది సినిమావాళ్ళు మాట్లాడే ముచ్చట్లు. గేమ్‌షోల్లో పాల్గొనే వారి భాషాపరిజ్ఞాన పరిమితి ప్రకారం మాట్లాడే తెలుగు వుంటుంది. వారు రాసుకొని మాట్లాడే అవకాశం లేదు. అప్పటికప్పుడు ఎలా తోస్తే అలా మాట్లాడతారు. దానికేమీ నిబంధన లేదు. అలా ఉండక తప్పదు. కాని కార్యక్రమానికి సూత్రధారులుగా వుండే వ్యాఖ్యాతల తెలుగును మెరుగుపరచే అవకాశం ఎప్పుడూ వుంది. కాని దాన్ని నిర్లక్ష్యం చేసే అవకాశం కూడా ఎప్పుడూ వుంటోంది.

ఈనాడు న్యూస్ ఛానళ్ళు ఎక్కువగా వున్నాయి. అవి అందించే 24 గంటల వార్తలు, వార్తా ధారావాహిక కార్యక్రమాల్లో తెలుగు భాష వాడకం అపరిమితం. ఈ తెలుగు వాడకం రెండు రకాలు. ఒకటి మౌఖిక భాష. రెండవది లిఖిత భాష. లిఖిత భాష అంటే చేత్తో రాసే భాష కాదు యంత్ర లిఖిత భాష. మొదటి రకం మౌఖిక భాషపై ఎవరికీ అదుపు వుండదు. ఛానల్‌లో ఒక కార్యక్రమంపై చర్చ జరుగుతున్నప్పుడు మాట్లాడడానికి ఆహ్వానించిన వారు భాష బాగా తెలిసిన వారు అయి వుండవచ్చు. కేవలం రాజకీయ నాయకుల భాష మాట్లాడేవారూ వుండవచ్చు. సూత్రధారి వారి చర్చను ముందుకు తీసుకెళతారు. అవసరమైన సందర్భాల్లో ప్రశ్నలు మార్చి, గాడి తప్పుతున్న వారి గతిని మార్చి, అది ప్రత్యక్ష ప్రసారం కాబట్టి తానూ కొన్ని తప్పులు మాట్లాడుతూ నిర్వహిస్తారు. ఇలా జరుగుతున్న చర్చ మధ్యలో ముఖ్య సంఘటనలు తాజా సమాచారాన్ని ఘటనాస్థలి నుంచి ప్రతినిధులు అందించడమూ వుంటుంది. భాషాపరంగా ఇది చూడడానికి ఎవరూ ఏమీ చెయ్యలేని విధంగానే కనిపిస్తున్నా పరిశీలనాత్మకంగా చూస్తే ఏ కొంతయినా చేయడానికి అవకాశం లేకపోలేదు. స్టూడియోలో చర్చా కార్యక్రమానికి సూత్రధారిగా వ్యవహరిస్తున్నా వ్యక్తికీ, ఘటనాస్థలి నుంచి తాజా సమాచారాన్ని అందించే వారికీ తగిన శిక్షణ ఇవ్వవచ్చు.

24 గంటల వార్తా ప్రసారంలో భాషాపరమైన శ్రద్ధ తీసుకోవడానికి పుష్కలంగా అవకాశాలున్నాయి. విలేకరులను, వార్తలు చదివే వారిని ఎంపిక చేసుకొనే దశలోనే భాషాపరమైన పరీక్ష వుండాలి. ఎంపిక చేసుకున్నాక వారికి వివిధ దశల్లో మరి కాస్త మెరుగు పెట్టవచ్చు. ఎప్పటికప్పుడు వారు చేస్తున్న తప్పులను ఎత్తి చూపుతూ తప్పులు నివారించవచ్చు. ఇలాంటి పని ఒకటి రెండు ఛానళ్ళలో జరుగుతున్నది. ముఖ్యంగా ఈటీవీ, హెచ్ఎంటివీలను చెప్పుకోవచ్చు. టివి రంగం ముఖ్యంగా ఆగమేఘాలపై సాగే ప్రతీ క్షణ ప్రత్యక్ష ప్రసారాలయుగంలో ఈ భాషాపరమైన కృషి సాధ్యం కాదనే ఛానళ్ళవారూ వున్నారు. రెండు ఛానళ్ళకు సాధ్యమవుతున్నది మిగతావారికి ఎందుకు సాధ్యం కాదు అన్నది ప్రశ్న. రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ కోట్ల సంఖ్యలో వున్న తెలుగు ప్రేక్షకుల కోసం వెలసి, వారికోసమే కార్యక్రమాల్ని అందిస్తూ, లాభాలు గడిస్తూ వున్న ఛానళ్ళు ఆ భాషను భాషగా పరిరక్షించి అందించే ప్రాథమిక బాధ్యతను గుర్తించలేదా, ఆ భాషే భ్రష్టుపట్టి ఆ భాషీయులు తమకు తెలియకుండానే సంకరభాషకు అలవాటు పడితే ఆ తప్పు ప్రభుత్వానిదా, ప్రజలదా? ఎవరిని నిందించాలి.

శ్రవ్య మాధ్యమం రేడియోకి రాసేటప్పుడు విని అంతా అవగతం చేసుకొనే విధంగా రాయాలని, టెలివిజన్ భాష వినడానికి, కనడానికి మధ్య సమన్వయం చేసుకొనే విధంగా

రాయాలని మౌలికమైన సూత్రం. అలా జరుగుతున్నట్లు లేదు. లేకపోవడానికి కారణం ఆ రంగంలో ఈ మౌలిక సూత్రం తెలిసిన వారు తక్కువగా వున్నారు. ఉన్నవాళ్ళకు కూడా ఈ సూత్రాన్ని తెలియజెప్పి ఆ రకంగా మలచుకొనే వ్యవస్థ అస్సల్లేదు. దీనివల్ల మాధ్యమాన్ని అనుసరించి రాసే పరిస్థితి పోయింది. రేడియోలో ఒకప్పుడు చాలా బాగా వుండేది. డి.వెంకట్రామయ్య ప్రాంతీయ వార్తా విభాగంలో వివిధ రకాలైన వనరుల నుంచి వచ్చిన వార్తల్ని చదివి చెబుతుంటే వినే వార్తలుగా సంక్షిప్తీకరించే నైపుణ్యంతో రాసేవారు. ఆ విద్యను కొంత నాబోటివారికి నేర్పించారు. పి.టి.ఐ., యు.ఎన్.ఐ. వంటి వార్తా సంస్థల నుంచి వచ్చే కాపీలలోనో లేదా దినపత్రికలోనో, పత్రికా ప్రకటన రూపంలో వచ్చే కాగితాల్లోనో వుండే పేరాలను యథాతథంగా ఇవ్వడం కాకుండా వివరాలను తీసుకుని రేడియో కోసం రాసేవారు. ఒక పదం అటూ ఇటూ మార్చడానికి వీల్లేని విధంగా రాసేవారు, అనువాదం చేసేవారు. టెలివిజన్ వార్తా రచన, అనువాదం కూడా దృశ్య శ్రవ్య మాధ్యమానికి తగినట్లుగా ఉండాలే తప్ప మరోలా వుండడానికి వీల్లేదు. కాని అలాగే వుంటోంది. ప్రధాన కారణం పత్రికల్లో పనిచేసేవారే టెలివిజన్‌కు వెళ్ళడం వల్ల అక్కడా లిఖిత భాషే రాస్తున్నారు.

ఈ పరిస్థితిని మార్చే వాతావరణం టెలివిజన్ ఛానళ్ళలో లేదు. ఎక్కడెక్కడ నుంచో విలేకరులు కెమెరాతో షూట్ చేసిన ఔట్‌పుట్ పంపితే స్టూడియోలో వున్న ఉప సంపాదకులు ఆ దృశ్య పరిధికి తగినన్ని మాటలతో వార్తను కంప్యూటర్‌లో రూపొందిస్తున్నారు. పత్రికలో విలేకరి రాసే వార్త దాదాపు యథాతథంగా అచ్చవుతుంది. టీవీలో ఏ వాక్యం ఎవరి సొంతం కాదు. ఎప్పటికప్పుడు లేదా అప్పటికప్పుడు మారుతుంటుంది. 'ప్రపంచ వీక్షణం', 'థర్టీ మినిట్స్', 'ఇదీ సంగతి' వంటి కార్యక్రమాలకు మాత్రమే ప్రయోక్తలు ముందుగా రచన సిద్ధం చేసుకుని, షూట్ చేసుకుని, ఎడిట్ చేసి ప్రసారానికి పంపుతారు. వార్తలకు అలా కుదరదు. క్షేత్రస్థాయి నుంచి విలేకరి పంపిన వార్త ప్రసారానికి సిద్ధమయ్యే సరికి మారిపోతోంది. కాని ఆ ప్రసారానికి సిద్ధం చేసే దశలోనే టీవీ మాధ్యమానికి అనుగుణంగా రాయడానికి అవకాశం ఉంది. కాని 24 గంటలు, నిమిషానికి 60 సెకన్లు ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎప్పుడు ప్రత్యక్ష ప్రసారంలోకి వెళుతుందో, ఎప్పుడు ఎంత నిడివి కలిగిన దృశ్యం వస్తుందో అంచనా వేయలేరు. పరిస్థితిని బట్టి వుంటుంది. ఒకో వార్త ఒకోలా రూపొందుతుంది. ఒకో వార్తకు ఒకోలాగా మాటల పొందిక వుటుంది. టెలివిజన్ సాంకేతిక పరిజ్ఞానంలో ఒదిగేటట్లుగా వార్తా ప్రసారం తాజా వార్తలు, అప్పటికప్పుడు ప్రత్యక్షం కావడం, గొలుసులా ముందుకు సాగిపోయే సంక్షిప్త వార్తలు, దృశ్యాల్ని పంపడం వీటన్నిటి

మధ్య భాష ఒక ప్రాధాన్యాంశమే కాకుండా పోతోంది. భాష ఎంతో ముఖ్యమైన అంశమని ఎవరూ గుర్తించని పరిస్థితి కనిపిస్తోంది.

న్యూస్ రీడర్ల ముందుకు వెళ్ళే అంశాన్ని వార్తకు అనుగుణమైన శైలి, చమత్కారాలు, మాటల మాయాజాలం వుంటుంది. వార్తను వీక్షకులను ఆకట్టుకొనేలా రూపొందించే క్రమంలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. అయితే భాషాపరమైన విధినిషేధాలు అంటూ వుండవు. తెలుగు, ఆంగ్లం విశృంఖల మిశ్రమంగా వుంటుంది. భాషాపరమైన సూచనలు చేసేవారెవరూ వుండరు. అంత తీరిక, ఓపిక ఎవరికీ వుండదు. ఆ అవసరమే వుండదు. ఎంతసేపూ కొత్త వార్తలను మిగతా వారికంటే ముందు ఇవ్వడం మీద, మిగతా ఛానళ్ళకు లభ్యం కాని దృశ్యాలను సంపాదించడం చూపడం మీద శ్రద్ధ ఉంటుంది.

ఈ రకమైన వాతావరణంలో టివి వార్తా ఛానళ్ళు నడుస్తున్నాయి. ఈ భాష మారాలి. సంస్కరించడం అవసరం అనే మాట ఒప్పుకుంటారు. ఆ మాధ్యమంలో ఉన్నతస్థానాల్లో వున్నవాళ్లు కవులు, రచయితలు, భాష పట్ల అనురక్తి వున్నవాళ్ళే. తాము తలచుకుంటే పరిస్థితిని మార్చగల వాళ్ళే. కాని ఛానల్ యజమాన్యుల దృష్టి వ్యాపారం, రేటింగ్స్, వ్యాపార ప్రకటనలు, సంచనాలు, తమ దృష్టిని వేరే ఛానళ్ళపైకి మళ్ళించకుండా వీక్షకులను కట్టిపడేయడం, మళ్ళీ రేటింగ్స్.... ఇలా ఈ వలయం తిరుగుతూనే ఉంటుంది. 'చూస్తూనే వుండండి' అంటూనే వుంటుంది.

సామెతలు తెలుగు భాషకు చిరునామా....

పౌరాణిక ప్రాధాన్యమున్నవి, ప్రాచీన కావ్యాల్లో ప్రయోగించినవి, కవులు, పండితులు కాకపోయినా అనుభవంతో పండిన పెద్దల నోట అలవోకగా వెలువడ్డవి చాలా గొప్ప మాటలు మనకున్నాయి. సామెతలు 'ఆమె'తలు అన్నారు. మేలుకోరే స్త్రీమూర్తి మనం అనుసరించదగిన మాట ఒకటి మన హితం కోరి చెప్పిందనుకుంటే సామెతలు అలాంటివి అనుకోవచ్చు. అలా సామెతలు, ఆర్యోక్తులు, పలుకుబడులు ఏవైనా కానివ్వండి. పేర్లే వేరు. వాటి అర్థం ఒక్కటే– లోకరీతి... లోకనీతి... నిత్యసత్యం. పెద్దల మాట చద్దిమూట అన్నారు. ఇప్పటికే భాష బాగా తెలిసినవారు వీటిని మరొక్కమారు హాయిగా చదువుకొని మ్యూజియం సరకుగా మారుతున్న పదాలను ఒక్కసారి మననం చేసుకోవచ్చు. తెలియని తరం (వారి తప్పు కాకపోవచ్చు) కూడా వచ్చింది కాబట్టి వారికి ఉపయుక్తంగా ఉండేలా కొన్ని మాటల్ని చర్చించుకోవాలి. ఇవన్నీ చదువుతుంటే అన్నీ తెలిసినవారు, ఏ కొన్నయినా తెలియని వారూ వుండవచ్చు. అందుకని ప్రతి సామెతకు, ప్రతి మాటకు కొంత వివరణ ఇవ్వాలనిపించింది. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో భాష పూర్తిగా కృతకమైపోతున్న కాలంలో, ఎవరో విచక్షణరహితంగానో, వివేచనరహితంగానో వాడితే వాటిని గుడ్డిగా వాడే ధోరణి కనిపిస్తోంది. పత్రికాభాష, టెలివిజన్ భాష ఎప్పుడో కలిసిపోయాయి. పత్రికల్లో పనిచేసేవారే టీవీ ఛానళ్ళలోకి వచ్చేసేసరికి రెండూ భిన్నమైన మాధ్యమాలైనప్పటికీ భాషాభే దాన్ని మాత్రం లేకుండా చేశారు. 'ప్రభుత్వంపై చంద్రబాబు ధ్వజమెత్తారు' లాంటి ప్రయోగాలు అలాంటివే. 'ధ్వజమెత్తారు'లాంటి మాటలు పత్రికలాంటి లిఖిత మాధ్యమాలకే సరిపోతాయి. తెలుగుదేశం, ప్రరాపా అలాంటివే.

పత్రికా రచయితగానీ, టీవీ రచయితగానీ తనకు అనునిత్యం అనుక్షణం తారసపడే పదాలను ఒకసారి గమనించాలి. ఇది ఎలా వచ్చి వుంటుంది? దీని అర్థమేమై వుంటుంది? అన్నది ఆలోచించాలి తనలో తాను. బోధపడకపోతే ఎవరినైనా అడగాలి. ఒక పద ప్రయోగం విషయంలో ఎప్పుడైనా సందేహం వస్తే, తోటివారిని అడిగి సందేహ నివృత్తి చేసుకోవాలి. లేకపోతే ఆ సందేహం ఎన్నడూ తీరదు. తీర్చుకోనంత కాలం ఆ తప్పు

చేస్తూనే వుంటాం. జానకి అంటే జనకుని కూతురని, సౌమిత్రి అంటే ఆ పేరు సుమిత్ర అయివుండదు. సుమిత్ర కుమారుడు లక్ష్మణుని పేరై వుంటుందని తెలుసుకోవాలి. మైథిలి అంటే అర్థం చాలామందికి తెలియకపోవచ్చు. మిథిల భూపతి పుత్రి మైథిలి... సీత. కృష్ణాష్టమినాడు 'వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనం' అన్న శ్రీకృష్ణ స్తుతి శ్లోకాన్ని ఒక పత్రికలో 'వాసుదేవం సుతం దేవం' అని రాశారు. 'వసుదేవ సుతం దేవం' సరైన మాట. అంటే వసుదేవుని కుమారుడు శ్రీకృష్ణుడని అర్థం. శ్రీకృష్ణుని వాసుదేవుడని అంటారు. వాసుదేవునికి, వసుదేవునికి తేడా అక్షరాల్లో వెంటనే తెలియదు. 'స్వాతంత్ర్య సమర పోరాటం'లో అని వాడిన వారికి సమరం, పోరాటం రెండూ ఒకటేనని, ఏదో ఒకటి వాడితే సరిపోతుందని తెలియకపోవచ్చు. 'పావని' అంటే పావనమైన వ్యక్తి కావచ్చు. కాని ఆంజనేయస్వామికి కూడా ఆ పేరు వుంది. అంటే పవను (వాయుదేవుడు)ని కుమారుడని అర్థం. 'ఆచంద్ర తారార్కం' అనే మాట బాగా వాడుకలో వుంది. కొందరికి అర్థం తెలుసు. కొందరికి మాత్రమే పూర్తిగా ప్రతిపదార్థం తెలుసు. ఆజన్మ బ్రహ్మచారి అంటే జన్మించినది మొదలుకొని బ్రహ్మచారిగా వున్నారు అని అర్థం. ఆచంద్ర తారార్కం అంటే చంద్రునితో మొదలుకొని ఆర్కం (సూర్యుని) వరకూ అని. ఈ పదబంధం మూడు భాగాలు. చంద్రుడు, తారలు, ఆర్క అంటే 'జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా' అన్నమాట. సూర్యుడు, చంద్రుడు, చుక్కలు ఎప్పుడూ నిలిచి వెలుగుతాయి కాబట్టి, మనం పొగడుతున్న మహనీయుని కీర్తి కూడా అంతకాలం నిలిచి వుంటుందని చెప్పడానికి ఆచంద్రతారార్కం అని చెప్పుకుంటాం.

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలప్పుడు టీవీలో ఒక పాట వినిపిస్తుంది. 'కంసవైరికి నేడు హంస వాహనసేవ' అని... కంసవైరి ఎవరు? శ్రీకృష్ణుడు. హరి అవతారమైన శ్రీ వేంకటేశ్వరుని కవి కంసుని శత్రువుగా ఇందులో ప్రయోగించారన్నమాట. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అనే మాట వుంది. ఇది నిజానికి వాల్మీకి రామాయణంలోని శ్లోకం. సంస్కృతంలోని ఈ మాటలకు అర్థం స్థూలంగా 'కన్నతల్లి, పుట్టిన ఊరు స్వర్గం కంటే గొప్పవి' అని చాలామందికి తెలుసు. అయితే పదాల నిర్మాణ స్వరూపం అందరికీ తెలియక 'జననీ జన్మభూమిచ్ఛ స్వర్గాదపీ గరీయసీ' అని ఉచ్చరిస్తారు. రాసేటప్పుడు అదే పొరపాటు చేసేవారుండవచ్చు. 'జననీ, జన్మభూమి స్వర్గాత్ అపి గరీయసీ' అనడం సరైనది. తల్లి, జన్మించిన గడ్డ స్వర్గం కంటే (అపి) కూడా గరీయసీ (గొప్ప) అని పూర్తి అర్థం. దాశరథి అంటే దశరథుని కుమారుడు శ్రీరాముడని, ద్రుపదరాజపుత్రి ద్రౌపది అని గమనిస్తే తెలుస్తుంది.

అగ్నికి ఆజ్యం పోసినట్లు

హోమం చేస్తున్నప్పుడు ఇతర సమిధల(హోమద్రవ్యాల)తోపాటు నెయ్యిని పోస్తారు. అప్పుడు అసలే మండే అగ్నికి ఆజ్యం (నెయ్యి) తోడైతే ఇక చెప్పేదేముంది? అన్నది సాధారణార్థం. అసలే కోపంగా వున్న వ్యక్తికి కోపాన్ని పెంచే సంఘటన మరేదైనా జరిగి నప్పుడు ఈ మాట వాడడం కద్దు.

అగ్గిమీద గుగ్గిలం

ఇది కూడా అలాంటిదే. నిప్పు కణికలమీద గుగ్గిలం వేస్తే మంట ఇంకా అధికమ వుతుంది అనేది సాధారణార్థం. అసలే కోపంగా వున్న మనిషిని మరింత రెచ్చగొట్టేదేదైనా జరిగితే అప్పుడు ఆ వ్యక్తి, లేదా నేను కూడా అగ్గి మీద గుగ్గిలం అయ్యారని రాస్తారు.

అడకత్తెరలో పోకచెక్క

అడకత్తెర అనేది ఒక ఇనుప పరికరం. పోకల్ని కత్తిరించేందుకు వాడతారు. కత్తిరించే సమయంలో రెండు కోడల మధ్యలో పెట్టి కత్తిరిస్తున్నప్పుడు పోకచెక్క నలిగిపోవడాన్ని అడకత్తెరలో పోకచెక్క అంటారు. ఇది సాధారణార్థం. తల్లికి, భార్యకు మధ్య నలిగిపోయే మగవాడు నా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా వుంది అనడానికి ఈ మాట వాడవచ్చు.

అడ్డాలనాడు బిడ్డలు గానీ గడ్డాలనాడు కాదు

చిన్నప్పుడు అంటే తల్లి తన ఒడిలో అడ్డం వేసుకొని పాలిచ్చి ఆకలి తీర్చే వయసులో వున్నప్పుడు బిడ్డలు గానీ... పెద్దవాళ్ళయి (గడ్డాలు వచ్చిన తర్వాత)నాక తల్లిదండ్రులను పట్టించుకోరు అనడానికి ఈ జాతీయాన్ని వాడతారు. ముసలివారయ్యాక ఓ మూలన పడి వుండండి అని కసిరికొట్టే పిల్లల్ని గురించి చెప్పుకునే మాట.

అడక్కపోతే అమ్మయినాపెట్టదు

కొన్నిసార్లు బిడ్డల ఆకలి గమనించి అమ్మ అన్నం పెడుతుంది. కొన్నిసార్లు అమ్మ తినమని ఒత్తిడి చేస్తున్నా పిల్లలు ఆటే ముఖ్యమనుకుంటారు. మరికొన్నిసార్లు పిల్లలు అడిగితే గాని అమ్మయినా అన్నం పెట్టదు అంటారు. ఇది సాధారణార్థం. కొందరు నాయకులు మనసులోని కోరికను అదుపులో పెట్టుకోలేని పదవీకాంక్షతో ముఖ్యమంత్రిని నేరుగా మంత్రి పదవినిమ్మని అడుగుతారు. అలా అడగడం హుందాతనం కాదని ఎవరైనా

అంటే అడగందే అమ్మయినా పెట్టదని సమర్థించుకుంటారు. ఇలా చాలా సందర్భాల్లో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

అడుసుతొక్కనేల కాలు కడగనేల

అడుసు అంటే బురద. పొరపాటున బురదలో కాలు పెట్టినప్పుడు బురద అంటడం, అంటిన తర్వాత కాలు కడగడం మామూలే. బురదలో కాలు పెట్టకపోతే కడిగే ఇబ్బంది తప్పుతుంది కదా! అనేది సాధారణార్థం. ఎవరైనా తెలిసి తెలిసి పొరపాటు చేసి ఇబ్బందుల్లో పడినప్పుడు మిత్రులు అడుసు తొక్కనేల కాలు కడగనేల అని హెచ్చరిస్తుంటారు. ఈ మాట చాలా సందర్భాలకు వర్తిస్తుంది.

అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు

అత్త కోడల్ని సాధించడం. దాంతో అత్తమీద బాగా కోపం వచ్చి కోడలు అత్తను ఎదిరించి మాట్లాడలేక ఆ కోపాన్ని దుత్త (కుండ) మీద చూపిందని సాధారణార్థం. పై అధికారి మీద కోపం వుండి ఆయన్నేమీ అనలేని పరిస్థితిలో తేరగా దొరికిన అటెండరుపై ఆ కోపాన్ని ప్రదర్శించినప్పుడు ఈ మాట వాడతారు.

అదుగో అంటే ఆరు నెలలు

అదుగో వచ్చే అని ఆశ చూపి నెలలు, ఏళ్లు గడిపే సందర్భాల్లో ఈ మాట వాడతారు. మరికొందరు ఫలానా పనిచేస్తాను అన్నారంటే ఆ మనిషి మనస్తత్వం తెలిసినవారు ఆయన అదుగో అంటే ఆరు నెలల మనిషిలే అంటుంటారు.

అదిగో పులి-ఇదిగో తోక

కొందరు లేనిపోని పుకార్లు లేవదీస్తుంటారు. నమ్మలేని విషయాల్ని చిలవలు పలవలు సృష్టిస్తుంటారు. వాస్తవంగా ఏమీ వుండదు. అదిగో పులి అని ఒకరంటే ఇదిగో తోక అని మరొకరంటే గుడ్డిగా నిరాధారంగా ప్రచారం చేసేవారిని దృష్టిలో వుంచుకొని ఈ మాట పుట్టింది. అర్థం లేని నమ్మడానికి వీల్లేని వాటిని జనం ప్రచారం చేయడాన్ని ఈ విధంగా చెప్పారు.

అరచేతిలో వైకుంఠం చూపాడు

గుడ్డిగా నమ్మేవారికి మాయమాటలు చెప్పి బోల్తా కొట్టించడం ఎంతో తేలిక అనడానికి ఈ మాట వాడతారు. నాయకులు ప్రజలకు చెప్పే కబుర్లు కావచ్చు. అన్నెం పున్నెం

ఎరుగని ఆడపిల్లని ఇది చేస్తాను అది చేస్తాను అని చెప్పి వలలో వేసుకునే మాయగాడు కావచ్చు. ప్రధాని తెలుసు, ముఖ్యమంత్రి తెలుసు పెద్ద ఉద్యోగాలిప్పిస్తాననో, సినిమా ఛాన్సులిప్పిస్తాననో డబ్బు దండుకొని ఉడాయించేవారు కావచ్చు. అలాంటి సందర్భాల్లో ఈ మాట వాడతారు. మాటలు చెప్పి పబ్బం గడుపుకునేవారిని, చేతల కంటే మాటలు ఎక్కువ చెప్పేవారిని ఉద్దేశించి ఈ సామెత పుట్టింది.

అలిగి పుట్టింటికి-చెడి చెల్లెలింటికి....

ఇది తెలుగు జాతి సంప్రదాయపు స్పర్శ కలిగిన మాట. కుటుంబ జీవనంలో ముఖ్యంగా పెద్దలు చెప్పేమాట. ఆడపిల్లకు పెళ్లి చేసి అత్తవారింటికి పంపించిన తర్వాత చావైనా, బతుకైనా భర్తతోనే అనేవారు ఆనాడు. కష్టాలు కలిగితే ఆడపిల్ల తల్లిదండ్రులకు చెప్పుకోకూడదని కాదు కానీ, భర్తతోడిదే లోకం అన్న అర్థం. ఆడపడుచులు కూడా పుట్టింట్లో అమ్మానాన్నల పెద్దరికానికి గౌరవం తగ్గి అన్నావదినల మాట చెల్లుబాటవుతున్న కాలంలో ఏ ఆడపిల్లకైనా అత్తవారింటిలో అలిగి పుట్టింటికి వెళ్ళాలనుకోదు. అలా వెళ్ళడ మంటే తనకు గౌరవం కాదనుకుంటుంది. అలాగే చెడి చెల్లెలింటికి వెళ్ళడం కూడా గౌరవం కాదని పెద్దలు చెప్పారు.

ఆడదై పుట్టేకంటే అడవిలో మానైనా మేలు

ఈ లోకంలో ఆడదై పుడితే ఎన్ని కష్టాల్ని ఎదుర్కోవాల్సి వుంటుందో చెప్పేమాట ఇది. ఆడదాని కష్టాల గురించి చెప్తున్నప్పుడు అడవిలో మాను గురించే కాదు సీతమ్మవారికి వచ్చినన్ని కష్టాలు అని కూడా పోలిక చెప్తుంటారు. పురుషాధిక్యం సమాజంలో స్త్రీకి కష్టాలు ఈనాటికీ వున్నాయి. భ్రూణహత్యలు జరుగుతూనే వున్నాయి. కట్నాలు, వేధింపులు పోలేదు. పురుషుని సంపాదనకు లెక్కలు వుండవు. స్త్రీ సంపాదన మాత్రం తెచ్చి భర్త చేతి లో పోయాల్సిందే. గ్రామీణ స్త్రీల బతుకులు ఎంత దుర్భరంగా వున్నాయన్నది చెప్పనవసరమే లేదు. జీవితంలో కష్టాలు తప్ప ఏమీ మిగలని స్థితిలో అనంతమైన ఆవేదనతో స్త్రీ చెబుతున్న మాట ఇది.

ఇల్లు కట్టి చూడు-పెండ్లి చేసి చూడు

ఈ మాట జన వ్యవహారంలో, సాహిత్యంలో విస్తృత ప్రయోగంలో వుంది. పది లక్షల వుతుందనుకున్న ఖర్చు ఇల్లు పూర్తయ్యేసరికి అనూహ్యంగా పెరిగిపోతుంది. ఎక్కడెక్కడ నుంచి ఎంతెంత వస్తుందో తొలుత వేసుకున్న లెక్కలన్నీ మారిపోతాయి. అన్ని మార్గాల్లోనూ

తేవడం పూర్తయి ఇక సర్దేవారెవరూ లేక చివరికి ఇంట్లో ఏవో కొన్ని పనులను అసంపూర్తిగా వదిలే పరిస్థితి వస్తుంది. డబ్బుకు ఇబ్బంది ఒకటే కాదు. డబ్బులు తీసుకున్న పనివారు కూడా తమపని తాము చేయడానికి బాగా ఇబ్బంది పెడతారు.

పెండ్లి చేయడం కూడా ఒకవైపు డబ్బు సర్దుబాట్ల గురించీ, సమస్తమైన ఏర్పాట్ల గురించీ చాలా కష్టపడాల్సి వస్తుంది. సంపన్నుల సంగతి అలా వదిలేస్తే మధ్య తరగతి వారికీ, పేదలకు, ఆడపిల్ల పెళ్ళి చేయడమంటే కత్తిమీద సాము. ఆడపిల్లకు పెళ్ళి చేసి బాధ్యత నెరవేర్చుకున్నామన్న తృప్తి ముందు చిల్లర పైసలు కూడా మిగల్లేదన్న లోటు లెక్కలోని విషయం కాదు.

ఇంటిపేరు కస్తూరి వారు-ఇంట్లో గబ్బిలాల కంపు

'పేరు గొప్ప ఊరు దిబ్బ', 'పైన పటారం లోన లొటారం' ఇలాంటివే. తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి అన్నది కూడా కొంతవరకు ఈ సామెతకు సరిపోతుంది. పైకి గొప్పలు చెప్పుకుంటున్నా అస్సలు సరుకు అలా లేదు అన్న అర్థాన్ని స్తుంది. కనిపించేది వేరు వాస్తవం వేరు. వంశ ప్రతిష్ఠ వేరు వర్తమానంలో పరిస్థితులు, ఆ కుటుంబం ప్రస్తుతం పాటిస్తున్న విలువలు వేరు అనే అర్థంలో ఈ మాట వాడతారు.

ఈత చెట్టు కింద కూర్చుని పాలు తాగినా కల్లే అంటారు

మంచివాళ్ళం అని మనకు తెలుసు. లోకానికి తెలియదు. మన మంచితనం లోకానికి పంచిపెట్టినప్పుడే మంచివాళ్ళం కింద పరిగణన వస్తుంది. మా మంచి మాకు తెలుసు. దాన్ని చాటింపేసి చెప్పాల్సిన అవసరం లేదు అనేవారున్నారు. లోకం దృష్టిలో మనమే మిటనేది ముఖ్యం అని భావించాలి. సమాజం తరతరాలుగా కొన్ని కట్టుబాట్లు, కొన్ని ప్రవర్తన నియమాలను ఆమోదించింది. ఏదైనా మితిమీరకుండా ఉండాలి. ముక్కలు తిం టున్నామని బొక్కలు మెడలో వేసుకోము కదా! అన్నట్లు. ఆ వ్యక్తి స్నేహితులెవరో చెప్పండి అతనెలాంటివాడో చెప్తాను అన్నారట ఎవరో. తప్పు చేస్తున్నాం అని పరులు అనుకొనేందుకు ఆస్కారం ఇవ్వవద్దు. తాటి చెట్టు కింద కూర్చుని నేను పాలు తాగుతున్నాను అన్నా ఎవరూ నమ్మరు.

పొమ్మనలేక పొగ

ఇంటికి వచ్చిన చుట్టాన్ని ఇకచాలు దయచేయండి అని ముఖం మీద చెప్పలేక వారు భరించలేక తమంతట తామే వెళ్ళిపోయేందుకు పొగపెట్టారని దీనర్థం. ఇది చాలా

పాత సామెత. ఇళ్ళల్లో గ్యాస్ స్టౌ మీద వంట చేయడం అనేది లేని రోజుల్లో కట్టెలు, పిడకలతో వంట చేసుకొనే రోజుల్లో వచ్చిన చుట్టాలను సాగనంపేందుకు విపరీతంగా పొగవచ్చేలా చేసేవారు. ఈ సామెతకు అర్థం మారిపోయి ఇతర సందర్భాలకూ విరివిగా ప్రయో గిస్తున్నారు. ముఖ్యంగా ఒకానొక పార్టీలోని నాయకుడిపై అధిష్ఠానం ప్రత్యక్ష చర్య తీసు కోకుండా ఒంటరిని చేసి, అనేక ఇబ్బందులకు గురిచేసి తనంతట తనే వెళ్ళిపోయేలా చేయడాన్ని పొమ్మనలేక పొగబెట్టారని అనొచ్చు.

ఉగ్గుపాలతో రంగరించి...

శైశవంలో అమ్మ అలవాటు చేసేది ఉగ్గు. మెత్తగా ఉడికించిన అన్నంలో పాలు కలపడం, లేదా పాలతోనే ఉడికించిన అన్నాన్ని ఉగ్గు అంటారు. చిన్న పిల్లలకు ఈ ఉ గ్గుపాలతో రంగరించి పోయడం అనేక సందర్భాల్లో పత్రికా రచయితలు, సృజనాత్మక రచయితలు, ఉపన్యాసకర్తలు ప్రయోగిస్తుంటారు. తన తండ్రే తొలిగురువుగా ప్రాచీన కావ్యాలు, ఇతి హాసాలు, మహాభారత, భాగవత, రామాయణ కథలను బిడ్డకు ఉగ్గుపాలతో రంగ రించిపోశారు. అంటే చిన్నప్పుడే అన్నీ బోధించారని అర్థం. శివాజీకి తల్లి జిజియాబాయి బాల్యంలో ఉగ్గుపాలతో ధైర్యసాహసాలను నూరిపోసింది.

వెన్నతో పెట్టిన విద్య

ఉగ్గుపాలతో రంగరించిపోశారు లాంటిదే 'వెన్నతో పెట్టిన విద్య' అనే ప్రయోగం. చిన్నప్పుడు పిల్లలకు వెన్నముద్దలు తినిపిస్తారు. దీన్ని మంచికీ చెడుకీ వాడే అవకాశముంది. నమ్ముకున్నవారిని నట్టేట ముంచడం వానికి వెన్నతో పెట్టిన విద్య అని ప్రయోగించవచ్చు. అప్పటికే ఆ ఇల్లు స్వాతంత్ర్యోద్యమ వీరులకు నెలవు కావడం వల్ల ఇందిరకు స్వాతంత్ర్యేచ్ఛ వెన్నతోపెట్టిన విద్యగా అబ్బింది. ఎవరితోనైనా పదుగురికి మేలుచేసే దృష్టి, లేదా ఒకానొక నైపుణ్యం చిన్నప్పుడే అలవడి అది తరువాతి కాలంలో మరింత పెంపొందినప్పుడు ఫలానా గుణం వారికి వెన్నతో పెట్టిన విద్య అని అనవచ్చు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...

పాత్రికేయులు ఈ మాటను తరచూ వాడుతుంటారు. మంత్రులు ఏదైనా వాగ్దానం చేసి ఆ పని ప్రారంభమై ఏదో కారణంతో ఆగిపోతే ఫలానా కార్యక్రమం మూడేళ్ళయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అక్కడే అన్నట్లుగా వుంది అని రాస్తుంటారు. గొంగళి లేదా

గొంగడి అనేది అందరికీ తెలిసే వుండాలి. పల్లెల్లో గొర్రెల కాపర్లు ఎక్కువగా భుజం మీద వేసుకుంటారు. ఎండకు, వానకు, చలికి కప్పుకుంటారు. గొర్రె బొచ్చుతోనే నేస్తారు దీన్ని. సిసలైన ఉన్నితో చేసే శాలువాలా చాలా వెచ్చగా వుంటుందీ గొంగళి.

ఎంగిలి చేత్తో కాకిని కొట్టడు...

పిసినారిని గురించి చెప్పడానికి ఈ మాట అందరూ వాడతారు. ఎంగిలిచేత్తో కాకిని అదిలిస్తే చేతికి అంటుకున్న మెతుకులు రాలిపోతాయని కాకిని కూడా కొట్టడు అతను అంత పిసినారి అనడం కోసం చక్కగా సరిపోతుంది ఈ సామెత. చెప్పడానికి దాతృత్వాన్ని గురించీ, కష్టాల్లో వున్న తోటివారిని ఆదుకొనే విషయం గురించీ చాలా కబుర్లు చెప్తాడు. కాని వ్యక్తిగతంగా మాత్రం అమ్మో...

ఏ ఎండకాగొడుగు...

అవకాశవాదుల గురించి చెప్పడానికి ఈ మాట చాలా బాగా సరిపోతుంది. అతను ఏ ఎండకాగొడుగు పట్టే రకం అంటారు. అవతలివారికి అన్ని విధాలా వత్తాసు పలుకుతూ తమకు కావలసిన పనులను చక్కబెట్టుకుంటూ పోయేవాళ్ళను గురించి చెప్పడానికి ఈ మాట వాడతారు.

ఏరుదాటి తెప్ప తగలేసే రకం

స్వార్థపరులు తమ మేలు మాత్రమే చూసుకొని అది నెరవేరాక తమకు మేలు చేసేవారికే అపకారం చేసేవారిని ఈ విధంగా నిరాదరిస్తారు. తను ఎంతయినా లాభపడవచ్చు. తానే లాభం పొందాడో అది మరొకరికి లభించరాదనుకొనేవాడు. తను ఏరు దాటడానికి తెప్ప (నీటిపై తేలియాడేది) కావాలి. తానొక్కడూ దానిమీదుగా నడిచి ఏరు కాస్తా దాటాక ఇంకెవరికీ ఉపయోగపడకుండా చేసేవారిని చెప్పుకుంటాం.

ఐకమత్యమే మహా బలం

ఇది ఒక కుటుంబాన్ని, ఒక దేశాన్ని ఐక్యంగా ఉంచే హితవు మాట. మనం మనం ఐక్యంగా వుంటే వేరెవరూ మనల్ని ఏమీ చెయ్యలేరు. ఒక దేశంగా, ఒక జాతిగా కలసి మెలసి వుందాం. ఈ ఐకమత్యమే మనకు మహా బలం. ఐక్యత లేకపోతే తీరని నష్టం వాటిల్లుతుంది. అని చెప్పడానికి ఈ మాట ఉపయోగిస్తారు.

శత్రుశేషం... ఋణ శేషం

శత్రువులందర్నీ అంతం చేయకపోతే ఒక్కరు మిగిలినా ముందుముందు మనల్ని ఏమైనా చెయ్యవచ్చు. అలాగే తీసుకున్న ఋణాన్ని పూర్తిగా చెల్లించకపోతే మిగిలింది కాస్తా కొన్నేళ్ళకు కొండలా పెరుగుతుంది. అందుకే శత్రుశేషాన్ని, ఋణశేషాన్ని వుంచరాదు అని అర్థం.

అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలు

ఈ సామెతను చాలా ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. ఏమైనా సరే అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మంచిది అనుకుంటూ వుంటాం. మీరడిగింది చెయ్యలేం అని మొహమాటం లేకుండా చెప్పేస్తే అడిగిన వ్యక్తిని ఆదిలోనే బాధపెట్టినవాళ్ళమవుతాం. కానీ, చేస్తానని చెప్పి తీరా చెయ్యకపోతే చాలా బాధ పెట్టినవాళ్ళమవుతాం. ఎదుటివారు ఒక్క క్షణం బాధపడ్డా సరే. ఉన్నది ఉన్నట్లు ముందుగానే చెప్పడం మంచిది.

కాకిపిల్ల కాకికి ముద్దు

పిల్ల అనాకారి అయినా శారీరక, మానసిక వైకల్యం వున్నా తల్లి దూరం చేసుకోలేదు. ఎన్ని కష్టాలైనా సరే భరించి కడుపులో దాచుకుంటుంది. కాకిలాగే దాని పిల్ల కూడా నల్ల గానే వుంటుంది. ఏ జంతువూ కాకిపిల్లను ముచ్చట పడదు. మనుషులైనా అంతే. ఎవరి బిడ్డ వారికి ముద్దు.

కలకంఠి కంట కన్నీరొలికిన కరిగిపోవు సిరులు

కలకంఠి అంటే స్త్రీ. ఇల్లాలు. 'స్త్రీని బాధపెట్టిన ఇంట సంపద నిలవదు' అనే అర్థం వస్తుంది. ఇల్లాలు కంటనీరు పెట్టుకున్న ఇంటిలో సిరి నిలవదు. స్త్రీని గురించి స్త్రీల పట్ల సమాజ వైఖరి ముఖ్యంగా పురుషుల వైఖరి ఎలా వుండాలో చెప్పేందుకు ఈ హెచ్చరికలాంటి మాట ప్రయోగిస్తారు.

కష్టసుఖాలు కావడికుండలు

కావడి అంటే వెదురు బద్ద. పాతకాలంలో మంచినీటి కోసం కూడా ఎంతో దూరం వెళ్ళవలసి వచ్చేది. అలా నీళ్ళ కోసం వెళ్ళేవారు వెదురుబద్దను భుజం మీద వేసుకొని

రెండువైపులా కుదురు వేలాడదీసుకొని ఆ కుదురులో నీళ్ళకుండల్ని పెట్టుకొని మోసు కొచ్చేవారు. దేవదాసు చిత్రంలోని 'కలిమి లేములు కష్టసుఖాలు కావడిలో కుండలనే భయమేలోయి' పాటలో ఈ వేదాంతమే వుంది. మానవ జీవితంలో కష్టం, సుఖం కలిసే ఉంటాయి. కలిమి లేమి జీవితానికి రెండూ సహజం. కావడికి అటూ ఇటూ వున్న రెండు కుండల్లాంటివే కష్టసుఖాలు. కావడిలో ఒకే కుండ తీసుకుపోలేం. రెండు ఉండవలసిందే. జీవితానికీ అంతే.

కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా...

వికారం ఫలితంగా కక్కొచ్చినా ఆగదు. కాలం కలసివచ్చి పెళ్ళి కుదిరినా ఆగదు. జరిగిపోవలసిందే అనే అర్థంలో వాడతాం. ముఖ్యంగా పిల్లల పెళ్ళి కోసం ఎన్నో ప్రయత్నా లు చేసినా ఒక్కోసారి ఏదీ ఫలించదు. ఏదీ ఒక పట్టాన కుదరదు. ఏదో కలిసి వచ్చి కుదిరిందంటే ఎన్ని ఇబ్బందులైనా గడచి పెళ్ళి జరిగిపోతుంది. అందుకే పెళ్ళిళ్లు స్వర్గంలో నిర్ణయించబడతాయని అంటారు.

కీడెంచి మేలెంచు

ఏ పనైనా రాబోయే పరిణామాలను జాగ్రత్తగా అంచనావేసి చేయాలని అంటారు. ఎందుకైనా మంచిది మనం ఈ పని చేస్తే ఫలానా ప్రతిబంధకం రావచ్చు. రాబోయే ప్రతిబంధకాన్ని తొలగించుకోవడానికి ముందుగానే ఈ ఉపాయం ఆలోచించి దిగుదాం అనుకునేవారున్నారు. ఈ పనివల్ల మనకు పది రూపాయలే లాభం వస్తుందనో, లాభం రాకపోయే అవకాశం కూడా వుందనో భావించి పక్కాగా చెయ్యాలని అంటారు. ముందు జరగబోయే కీడును ఊహించి ఆ తర్వాతే మేలును గురించి ఆలోచిస్తే ఒకవేళ ప్రయత్నం విఫలమైనా నిస్పృహ ఆవరించదని చెప్పడమే ఈ సామెత ఉద్దేశం.

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు

ఎంతో శ్రమకోర్చి కొండంతా తవ్వి చివరికి ఎలుకను పట్టారని దీని అర్థం. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ఈ సామెతను చాలా సందర్భాల్లో వాడతారు. ముఖ్యంగా ఏవైనా పెద్ద సంఘటనలు, కుంభకోణాలు జరిగినప్పుడు ప్రభుత్వం కమిషన్లను వేయడం అందరికీ తెలిసిందే. ఆ కమిషన్లు ఏళ్ళ తరబడి సుదీర్ఘంగా విచారణ జరిపి చివరికి ఎటూ తేల్చకుం డానో, లేదా అప్రధానమైన అంశాలను వెలికితీసినప్పుడో ఈ మాటను ప్రయోగిస్తారు.

గంతకు తగ్గ బొంత

'ఏదో గంతకు తగ్గ బొంత' అంటారు. మన తాహతుకు తగ్గ పనిచేశాం. వున్న డబ్బుకు తగిన వస్తువు తెచ్చుకున్నాననో అనటానికి ఈ సామెత వాడతారు. వరకట్నపు బజారులో ఆడపిల్లలున్నవారు తాము ఎంత కట్నం ఇచ్చే శక్తి వుంటే అబ్బాయిని కూడా ఆ స్థాయి వారినే ఎన్నుకుంటారు. ఇల్లు కూడా అంతే. స్థోమతను బట్టి చిన్న గూడు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తారు. అందుకే 'ఏదో గంతకు తగ్గ బొంత' అంటారు.

గంజాయి వనంలో తులసిమొక్క

గంజాయి అపవిత్రం. దురలవాటుకు ఉపయోగించేది. తులసి పరమ పవిత్రం. పవి త్రమైన వారున్నచోట చెడ్డ పేరు అనడానికి గంజాయి వనంలో తులసిమొక్క అంటారు. అందరూ చెడ్డవాళ్ళే వున్న చోట ఒకరో ఇద్దరో మంచి వాళ్ళుంటే చెప్పే పోలిక.

చల్లకొచ్చి ముంత దాచినట్లు

చాలామటుకు మనకు ఎవరితోనో పనిబడితే తప్ప మాట్లాడం. అయితే పనిబడ్డప్పుడు సూటిగా మీతో ఈ పని వుంది. చేసి పెట్టగలరా అని అడగరు. ముందు మంచి మాటలు మాట్లాడి, యోగక్షేమాలడిగి అప్పుడు మెల్లగా అసలు విషయాన్ని ప్రస్తావిస్తారు. చల్ల కోసం అంటే మజ్జిగ కోసం పొరుగింటికి వెళ్ళి ముంత దాచుకొని ఏవో కబుర్లు చెప్పి ఆ పైన అసలు విషయం బయటపెట్టడానికి ఈ మాట పుట్టింది.

జగమెరిగిన బ్రాహ్మణునికి జందెమేల

ప్రపంచాన్నంతా ఎరిగిన బ్రాహ్మణునికి, జ్ఞాని అయిన వాడికి ఈ జంధ్యమెందుకు అని ప్రశ్నిస్తోందీ సామెత. తాము ప్రస్తావించే మనిషికి చాలా గొప్ప పేరుంది. ఆయన అందరికీ సుపరిచితులు. అలాంటి వ్యక్తిని వాళ్ళకు పరిచయం చేయడం ఎందుకు? అన్న అర్థంలో వాడతారు.

తడిబట్టతో గొంతులు కోసే రకం

పరోక్ష శత్రువును గురించి చెప్పే మాట. పైకి మిత్రుడిలా నటిస్తూ లోలోపల ఎంతకైనా తెగించే వాడు అని చెప్పడానికి ఈ సామెత ఉపయోగిస్తారు. నమ్మదగినవాడు

కాదని అర్థం. అంతకుముందు అతను చేసిన ఘోరాలను దృష్టిలో వుంచుకొని అమ్మో! ఇతడు సామాన్యుడు కాడు. తడిబట్టతో గొంతులు కోసే రకం అంటారు.

తల్లి దయ్యం-పెళ్ళాం బెల్లం

పెళ్ళి అయ్యేవరకు పిల్లలు తల్లిదండ్రులను ఎంతో గౌరవిస్తారు. అణిగిమణిగి వుంటారు. తల్లిని ఒక దేవతగా చూస్తారు. పెళ్ళయి భార్య కాపురానికి వస్తే అస్తమానం ఆమె కొంగే పట్టుకొని తిరుగుతారు. భార్యావిధేయుడయ్యాక తల్లి దెయ్యంలాగా, పెళ్ళాన్ని బెల్లంలాగా చూడడం సర్వసాధారణం. అందుకే ఈ సామెత పుట్టింది.

ధనమూలం ఇదం జగత్

లోకమంతా డబ్బు మయం అని చెప్పడానికి ఈ సామెత ఎక్కువగా వాడుకలో ఉంది. ఈ జగత్తు అంతా ధనం ఆధారంగానే నడుస్తోంది. డబ్బులేనివాడు డుబ్బుకైనా కొరగాడు అన్నమాట.

దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

దీపం వుండగానే ఇల్లంతా చక్కగా సర్దుకోవాలి. దీపం ఆరిపోయిందంటే అంతా చీకటే అన్న అర్థంలో వాడతారు. పరిస్థితి చేయి దాటకుండానే జాగ్రత్తపడమని అర్థం. అధికారపీఠంపై మనకు కావలసిన మనిషి ఉండగానే సాధించుకోవాల్సినవన్నీ సాధించుకోవాలి.

దున్నపోతు ఈనిందంటే దూడను కట్టెయ్యమన్నారట

నిజానికి దున్నపోతు ఈనింది అంటే దూడను కట్టెయ్యమని అనడం హాస్యాస్పదం. దున్నపోతు ఈనదు. గేదె ఈనుతుంది. అర్థం పర్థం లేని, ఏమాత్రం నిజంకాని గాలివార్తను ప్రచారంలో పెట్టేవారిని దృష్టిలో వుంచుకుని ఈ మాట పుట్టింది.

నోట్లో నువ్వుగింజ నానదు

మనసులో ఏ మాటా దాచుకోలేని వారినుద్దేశించి ప్రచారంలోకి వచ్చిన సామెత ఇది. ఏదైనా మాట చెప్పి దీన్ని రహస్యంగా ఉంచమన్నా సరే... నోటిలో అతి చిన్నదైన నువ్వుల గింజ వేసుకున్నా అది నానకముందే మరొకరికి చెప్పేసే రకం అన్నమాట.

పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది

ఆ ఇద్దరి మధ్య పచ్చ(చ్చి)గడ్డి వేస్తే భగ్గుమంటుంది అనే ప్రయోగం చాలా ఎక్కువగా ఉంది. ఇద్దరు వ్యక్తుల మధ్య తీవ్ర వైరాన్ని గురించి చెప్పడానికి ఈ మాట వాడతారు. పచ్చ(చ్చి)గడ్డి వేస్తే కూడా భగ్గున మండుతుంది అని వారిద్దరికి ఒకరంటే మరొకరికి వున్న కోపాగ్నిని పోల్చారు పెద్దలు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నది నిజం. అయితే ఈ నిజాన్ని వ్యక్తులకు ఆపా దించడమే ఈ ఆర్యోక్తి ఉద్దేశం. మహనీయుల గురించి చెబుతున్నప్పుడు వారు బాల్యదశలో వున్నప్పుడే వారిలోని గొప్పతనం వ్యక్తమైందని చెప్తారు.

బూడిదలో పోసిన పన్నీరు

శ్రమ వృథా అయినప్పుడు ఈ సామెతను వాడతారు. ఎంతో సువాసన కలిగిన, ఖరీదైన పన్నీరు బూడిదలో పోస్తే ఎలా వృథా అవుతుందో తెలిపేది. నిజానికి ఇది పోలికే గానీ వేరు కాదు. ఎంతో కష్టపడి మంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశాక ఆ పర్యటనే జరగకపోతే ఆ ఏర్పాట్లు వృథా. ఆ ఏర్పాట్ల కోసం ఖర్చు పెట్టిన ధనం బూడిదలో పోసిన పన్నీరయినట్లు లెక్క.

ముంజేతి కంకణానికి అద్దమెందుకు

ఇలా చూసుకుంటే కనిపించనిదాన్ని అద్దంలో చూసుకోవాలి. అంతేగాని మన ముంజేతికి కనిపించే కంకణాన్ని మళ్ళీ అద్దంలో చూసుకోవడమెందుకు? విషయం ముంజేతిది. కంకణానిది కాదు. మన మధ్య వున్న, మనందరికీ బాగా తెలిసిన వ్యక్తిని గురించి మళ్ళీ చెప్పుకోవడమెందుకు అన్న అర్థంలో వాడతారు.

మొక్కై వంగనిది మానై వంగునా

మొక్కగా వున్నప్పుడే దాన్ని కావలసిన విధంగా వంచగలం. అది మానయ్యాక వంచడం సాధ్యం కాదు కదా! అలాగే పిల్లలు చిన్న వాళ్ళుగా వున్నప్పుడే వాళ్ళను మంచి విద్య చెప్పి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా మలచుకోవడం సులభం. చిన్నవారుగా

వున్నప్పుడు నిర్లక్ష్యం చేస్తే పెద్దయ్యాక వారిని దారిలో పెట్టడం అసాధ్యం అని చెప్పేందుకు ఈ సామెతను ఉపయోగిస్తాం.

యథార్థవాది లోక విరోధి

నిజాన్ని నిక్కచ్చిగా చెప్పేవాళ్ళు ఎప్పుడూ లోక విరోధులే. ఎవరేమనుకున్నా నిజాన్ని చెప్పి తీరాలన్న దృష్టి వున్నవారు యథార్థవాదులు. అలాంటివారు లౌక్యంగా ఉండం, సున్నితంగా చెప్పదలచిన విషయాన్ని చెప్పడం వంటివి ఎరుగరు. అందుకే అలాంటి వారంటే ఎవరికీ గిట్టదు. కాని తర్వాత మాత్రం వాళ్ళు చెప్పింది నిజమే కదా! అని పశ్చాత్తాపపడతారు.

రెడ్డొచ్చె మొదలాడు

నాటకం సగమయ్యాక ఆ ఊరి పెద్ద వచ్చినా నాటకాన్ని మళ్ళీ మొదట్నుంచి ఆడమనే పద్ధతి వుండేది. రెడ్డివచ్చాడు మళ్ళీ మొదటి నుంచి ఆడు అన్న అర్థంలో వాడిన సామెత. చెప్పిన విషయాన్ని మళ్ళీ మొదటి నుంచీ చెప్పవలసిన వచ్చినా, కొంతవరకు జరిగిన పనిని రాజకీయ కారణాలతో మళ్ళీ చెయ్యవలసి వచ్చినా, రెడ్డొచ్చె మొదలాడు సామెతను అందరూ వల్లె వేస్తారు.

వడ్డించేది మనవాడైతే బంతి చివర కూర్చున్నా...

వడ్డించేవాడు మనవాడైతే చివరి వరుసలో కూర్చున్నా తృప్తికరమైన పదార్థాలే లభిస్తాయి. ఇది వడ్డించేవాడికీ, కడపటి పంక్తిలో కూర్చున్న వాడికీ పరిమితం కాలేదు. రాజకీయ నాయకులు, అధికారులు తమ అనుయాయులకు పదవులు, ప్రయోజనాలు కట్టబెట్టినప్పుడు కూడా ఈ సామెతను వాడతారు. 'వడ్డించేవాడు తనవాడైతే' అన్నట్లుగా తగిన అర్హతలు లేకపోయినా పదవిని ఇచ్చారనో, కాంట్రాక్టు కట్టబెట్టారనో రాస్తాం.

శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్

ఈ శరీరం ధర్మసాధనకే కదా వుంది అని దీని అర్థం. ప్రాచీన కాలం నాటి రంతిదేవుడు, బలి, శిబి, దధీచి, కర్ణుడు లాంటి మహాదాతలు, త్యాగమూర్తుల గురించి లేదా ఆధునిక కాలంలో అవయవాలను దానం చేసి మరొకరి ప్రాణం నిలబెట్టే పుణ్యాత్ముల గురించి మాట్లాడేటప్పుడు ఈ మాట వాడతాం.

క్షేమంగా వెళ్ళి లాభంగా రా

తెలుగు సంప్రదాయం ప్రకారం వెళ్ళేవారు వెళ్ళొస్తాను అంటారు. సాగనంపేవారు క్షేమంగా వెళ్ళి లాభంగా రా అని ఆశీస్సు పలుకుతారు. ఇదే కాదు అధిష్ఠానం వద్దకు మంత్రివర్గ విస్తరణ చర్చల కోసం ఢిల్లీ వెళ్ళే ముఖ్యమంత్రిని కూడా ఆయన అనుయాయులు, పదవిని ఆశిస్తున్నవారు క్షేమంగా వెళ్ళి మాకు లాభాల్ని తీసుకురమ్మని పుష్పగుచ్ఛాలిచ్చి వీడ్కోలు పలుకుతారు.

సామెతలు

అ

అగస్త్యుడు సముద్రాన్ని ఔపోసన పట్టినట్లు.

అగ్నిహోత్రుడికి వాయువు తోడైనాడట.

అడుసు తొక్కనేల కాలు కడగనేల.

అడుక్కు తినేవాడికి గోక్కుతినే వాడొకడు.

అత్తలేని కోడలు ఉత్తమురాలు, కోడలులేని అత్త గుణవంతురాలు.

అత్తగారి చెంగు తొలిగిందన్నా తప్పే, తొలగలేదన్నా తప్పే.

అత్తా ఒకింటి కోడలే మామా ఒకింటి అల్లుడే.

అత్త సొమ్ము అల్లుడు దానం చేశాడుట.

అత్తింటి కాపురం కత్తి మీద సాము.

అత్తకు లేక అటుకులు నాకుతుంటే అల్లుడొచ్చి దీపావళి పండుగన్నాడుట.

అతివృష్టికంటే అనావృష్టి మేలు.

అదృష్టవంతుని చెరిచేవాడు, దురదృష్టవంతుని బాగుచేసేవాడు లేరు.

అదృష్టం అందలమెక్కిస్తే బుద్ధి బురదలోకి లాగిందట.

అదృష్టం అందలమెక్కిస్తే గీత గాడిదనెక్కిందిట.

అదృష్టం కలిసి వస్తే నడిచి వచ్చే కొడుకు పుడతాడుట.

అనగా అనగా రాగం, తినగా తినగా రోగం.

అన్నీ వున్న విస్తరి అణిగే వుంటుంది, ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది.

అనుమానం పెనుభూతమన్నారు.

అన్నమంతా పట్టి చూడాలా.

అప్పిచ్చి వైరం తెచ్చుకున్నట్లు.

అబద్ధమాడినా అతికినట్లు వుండాలి.

అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారట.

అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గర పొగిడారుట.

అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కు తినానివ్వదు.

అయ్యవారికి అనుగ్రహమొచ్చినా, ఆగ్రహమొచ్చినా...

అయ్యవారిని చేయబోతే కోతి అయిందిట.

అయినవారికి ఆకులలోను, కానివారికి కంచాలలోను.

అయ్యోపాపం అంటే ఆరునెలల పాపం చుట్టుకుందిట.

అరిటాకు ముల్లుమీద పడ్డా, ముల్లు అరిటాకు మీద పడ్డా....

అరిచే కుక్క కరవదు, కరిచే కుక్క అరవదు.

అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు.

అర్థరాత్రి మద్దెల దరువని.

అరుంధతి నక్షత్రం కనుపించిందా, అంటే లేదు ఆరువేల అప్పు కనిపిస్తోంది...

అల్లుడు దశమ గ్రహమని.

అవ్వాకావాలి బువ్వా కావాలి

అవసరానికి అబద్ధమాడటం శుక్రనీతి.

అసలు కంటే వడ్డీ లావు.

అసలు లేనిదానికంటే ఉన్న కొసరు మేలు.

అష్ట ఐశ్వర్యాలు అరచేతిలో, అష్ట దరిద్రాలు అంగిట్లో.

ఆ

ఆ అంటే అశుద్ధం నారాయణ అంటే బూతుమాట.

ఆడది తిరిగి చెడ్డది, మొగాడు తిరక్క చెడ్డాడు.

ఆడలేక మద్దెల ఓడన్నది.

ఆడబోయిన తీర్థం ఎదురయిందిట.

ఆడపిల్ల రొమ్ము మీద కుంపటి.

ఆడదానికి ఆడదే శత్రువు.

ఆడదాని వయస్సు, మొగాడి జీతం...

ఆడింది ఆట, పాడింది పాట.

ఆ ఊరికి ఈ ఊరెంత దూరమో ఈ ఊరికి ఆ ఊరూ అంతే దూరం.

ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖం ఎరుగదు.

ఆకుకు అందకుండా పోకకు పొందకుండా.

ఆదిలోనే హంసపాదు.

ఆపదకు అడ్డంపడ్డ వాడే దేముడు.

ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారుట.

ఆలస్యం అమృతం విషం.

ఆలులేదు చూలు లేదు కొడుకుపేరు సోమలింగం.

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా.

ఆవులిస్తే పేగులు లెక్కపెడతారు.

ఆహారం దగ్గర పట్ల వ్యవహారం దగ్గర మొహమాటం పనికిరాదు.

ఇ

ఇల్లు కాలి ఒకడేడిస్తే ఒళ్లు కాలి ఒకడేడ్చాడుట.

ఇల్లు అలుకగానే పండుగ కాదు.

ఇల్లు కట్టి చూడు, పెండ్లి చేసి చూడు.

ఇంటి పేరు కస్తూరి వారు ఇంట్లో గబ్బిలాల కంపు.

తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు.

ఇంటికంటె గుడి పదిలం.

ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు.

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు.

ఇంట గెలువలేనమ్మ రచ్చ గెలుస్తానన్నదట.

లోగుట్టు పెరుమాళ్ళకెరుక.

ఇల్లు చూస్తేనే తెలుస్తుంది ఇల్లాలి చక్కదనం.

ఇల్లు చూసి ఇల్లాలిని చూడు.

ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోత.

ఇల్లు ఇరకటం, ఆలి మర్కటం.

ఇంట్లో ఇల్లాలి పోరు బయట బాకీల పోరు.

ఈ

ఈడు చూసి పిల్లనియ్యి, పిడి చూసి కొడవలి ఇయ్యి.

ఈనగాచి నక్కల పాలు.

ఈత చెట్టు కింద పాలు తాగినా కల్లే అంటారు.

ఉ

ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగురుతానందిట.

ఉండమనలేక ఊదర పొమ్మనలేక పొగ.

ఉగ్గు పాలతోనే రంగరించి పోశారు.

ఉన్న ఊరు కన్న తల్లి.

ఉన్నమాటంటే ఉలుకెక్కువ.

ఉన్నమ్మా ఉన్నమ్మకే పెడుతుంది, లేనమ్మా ఉన్నమ్మకే పెడుతుంది.

ఉన్నచోట పిల్లనియ్యి, లేనింటి పిల్లను తెచుచకో.

ఉభయ భ్రష్టత్వం ఉప్పర సన్యాసం

ఉయ్యాలలో బిడ్డనుంచుకుని ఊరంతా వెదికినట్లు.

ఉల్లిచేసే మేలు తల్లి కూడా చేయదట.

ఊ

ఊరక రారు మహాత్ములు.

ఊరకుక్కకు సింహానికి పోలికా.

ఊరంతా ఒకదారి ఉలిపికట్టెది మరోదారి.

ఊరికి సింహం ఇంట్లో మేక.

ఉరిమిఉరిమి మంగలం మీద పడినట్లు.

ఊరు పొమ్మంటోంది కాడు రమ్మంటోంది.

ఊరు గొప్ప పేరు దిబ్బ.

ఊళ్ళో పెళ్ళయితే కుక్కలకు హడావుడి.

ఎ

ఎక్కడయినా బావ కానీ, వంగతోట దగ్గర కాదు.

ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటే వున్నానందిట.

ఎదిగిన బిడ్డలు స్నేహితులతో సమానం.

ఎంత చెట్టుకు అంతగాలి.

ఎంగిలి చేత్తో కాకిని కూడా కొట్టడు.

ఎరగని ఊళ్ళో మొరగని కుక్క.

ఎలుకలున్నవని ఇంటికి నిప్పు పెట్టారుట.

ఏ దిక్కూ లేకపోతే అక్కమొగుడే దిక్కు.

ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు.

ఎవరికి పుట్టిన బిడ్డరా వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఎవరి పిచ్చి వారికానందం.

ఎవరికి వారే యమునా తీరే.

ఏ

ఏ ఎండకాగొడుగు పట్టమన్నారు.

ఏకు మేకయింది.

ఏపాటు తప్పినా సాపాటు తప్పదు.

ఏనుగు పోతుంటే కుక్కలు అరుస్తాయి.

ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకునేందుకు.

ఏరుదాటి తెప్ప తగలేశారుట.

ఏలేందుకు ఊళ్ళూ లేవు కానీ, ఎత్తుకునేందుకు అన్నీ ఊళ్ళే.

ఐ

ఐకమత్యమే మహా బలం.

ఋ

ఋణశేషం శత్రుశేషం ఉండకూడదు.

ఒ

ఒకటి రెండు అయితే కాని వైద్యుడు కాడు.

ఒక్కరోజు పెండ్లికి ఒళ్ళంతా పసుపు.

ఒక్క అబద్ధమాడితే వెయ్యి అబద్ధాలు ఆడాల్సి వస్తుంది.

ఓ

ఓడలు బళ్ళు బళ్లు ఓడలు.

ఓదార్చేవారుంటే దుఃఖం ఎక్కువవుతుంది.

అం

అంగట్లో అన్నీ వున్నా, అల్లుడి నోట్లో శని.

అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం మేలు.

అంగబలమా అర్థబలమా.

అంతా అందలమెక్కే వారయితే మోసేది ఎవరు.

అందితే జుట్టు అందకపోతే కాళ్ళు.

అందని ద్రాక్ష పుల్లన.

క

కడవంత గుమ్మడి కత్తిపీటకు లోకువ.

కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా.

కడుపు చించుకుంటే కాళ్ళమీద పడ్డదని –

కడుపు కక్కుర్తి ఏ పనైనా చేయిస్తుంది.

కడుపుతో వున్నమ్మ కనక మానుతుందా, వండుకున్నమ్మ తినకమానుతుందా.

కటికవానినే గొడ్డునమ్ముతుంది.

కతికితే అతకదు.

కత్తికి రెండు వైపులా పదును.

కత్తివేటుకు మొఖాన నెత్తురు చుక్క లేదు.

కట్టుకున్న పుణ్యానికి కాపురం చేయక తప్పుతుందా.

కన్నమ్మకు తెలుస్తుంది కడుపు తీపి.

కన్ను మనదే, వేలూ మనదే.

కనుమ నాడు కాకి అయినా బయలుదేరదు.

కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకి కోపం.

కరువులో అధికమాసం.

కలిసొచ్చే నాడు నడిచొచ్చే బిడ్డ పుడతాడుట.

కలిపి కొట్టరా కావేటిరంగా.

కసాయివాడినే మేక నమ్ముతుంది.

కష్టాలు మనుషులకు కాక మానులకా....

కష్టే ఫలి.

కళ్యాణమొచ్చినా కక్కు వచ్చినా....

కంచే చేను మేసిందిట.

కంచం చెడగొట్టి మట్టె చేయించారుట.

కంటికింపయితే కడుపుకింపవుతుంది.

కందకు లేని దురద కత్తిపీటకు.

కాకిపిల్లకేం తెలుసు వుండేలు దెబ్బ.

కాకి ముక్కుకు దొండపండు.

కాగలకార్యం గంధర్వులే తీర్చారు.

కాటికిపోయినా కాసు వుండాలి.

కాలుజారితే తీసుకోవచ్చు గాని నోరు జారితే...

కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనుపిస్తుంది.

కాళిదాసు కవిత్వం కొంత నా పైత్యం కొంత.

కీలెరిగి వాత పెట్టమని...

కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లు...

కుక్క కాటుకు చెప్పుదెబ్బ.

కుక్కలు చింపిన విస్తరి.

కుడితిలో పడ్డ ఎలకలా....

కుచేలుని సంతానంలా....

కుడిచేత్తో చేసింది ఎడమచేతికి తెలియదు.

కూటికి పేదయినా కులానికి కాదు.

కూతురికి కుండలలోను, కోడలికి గోడవతల.

కూచమ్మ కూడబెడితే మాచమ్మ మాయం చేసిందట.

కూర్చుని తింటే కొండలయినా తరుగుతయ్యి.

కూసేగాడిద వచ్చి మేసే గాడిదను చెరిచిందట.

కొండవీటి చాంతాడు.

కొండనాలికకు మందు వేస్తే వున్న నాలిక వూడిందిట.

కొత్తనీరొచ్చి పాతనీరు కొట్టుకుపోయిందిట.

కొబ్బరిచెట్టు ఎందుకెక్కావురా అంటే దూడ మేతకోసం....

కొరివితో తల గోక్కున్నట్లే....

కొత్తొక వింత పాతొక రోత.

క్రొత్త బిచ్చగాడు పొద్దెరగడు.

కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందిట.

కోటి విద్యలు కూటికొరకే.

కోరికలు గుఱ్ఱాలెక్కితే గీత గాడిద నెక్కిందిట.

గ

గడ్డం గీసుకునేందుకు వస్తే గుండు చేసి పంపారుట.

గతిలేనమ్మకు మతిలేని మొగుడు.

గాలిలో దీపం బెట్టి దేవుడా నీ మహిమేనని....

గుడిమింగే వాడొకడయితే గుళ్ళో లింగాన్ని మింగేవాడొకడు.

గుడ్డి ఎద్దు చేలో పడ్డట్టు.

గుడ్డిలో మెల్ల.

గుడ్డు వచ్చి పిల్ల నెక్కిరించిందిట.

గుమ్మడికాయల దొంగెవరంటే భుజాలు తడుముకున్నారుట.

గుప్పిట మూసి వున్నంతవరకే.

గురువిందగింజ తన క్రింద నలుపెరుగదుట.

గురువుకి పంగనామాలు.

గురువుకి తగిన శిష్యుడు.

గురువుగారు ఏంచేస్తున్నారంటే, చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు.

గూట్లో దీపం నోట్లో ముద్ద.

గుఱ్ఱం గుడ్డిదైనా దాణాకు తక్కువ లేదు.

గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ.

గొంగట్లో తింటూ వెంట్రుకలేరాడట

గొఱ్ఱెతోక బెత్తెడు.

గోటితో పోయేదానికి గొడ్డలి.

గోడకు చెవులుంటయ్యి.

గోడమీద పిల్లివాటం.

గోరుచుట్టుమీద రోకటిపోటు.

చ

చక్కనమ్మ చిక్కినా అందమే.

చచ్చినవాడి పెండ్లికి వచ్చిందే కట్నం.

చనువిస్తే చంకనెక్కారని...

చదవేస్తే వున్న మతిపోయిందిట.

చదువుకున్న వాడికంటే చాకలాడు మేలు.

చద్ది తిన్నమ్మ మొగుడాకలెరుగదు.

చాపకింద నీరులా...

చావగొట్టి చెవులు మూసారుట.

చావుకబురు చల్లగా చెప్పమన్నారు.

చావుతప్పి కన్నులొట్టపోయింది.

చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద.

చింత చచ్చినా పులుపు చావలేదు.

చింతగింజ వేసి పులుసు తాగారుట.

చినికిచినికి గాలివాన అయింది.

చిన్నపామునయినా పెద్ద కఱ్ఱతో కొట్టమన్నారు.

చుట్టమై వస్తే దయ్యమై వెంటబడినట్లు.

చూసి రమ్మంటే కాల్చి వచ్చాడుట.

చెట్టు నాటేది ఒకరు అనుభవించేది ఒకరు.

చెట్టుకు కాయ బరువా, తల్లికి బిడ్డ బరువా.

చెట్టులేనిచోట ఆముదపు చెట్టే మహావృక్షం.

చెప్పేవి శ్రీరంగనీతులు దూరేవి దొమ్మరి గుడిసెలు.

చెవిటివాని ముందు శంఖము వూదినట్లు.

చెప్పేవారికి వినేవారు లోకువట.

చెరపకురా చెడేవు.

చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నారని...

చేసిన తప్పు చెబితే పోతుంది.

చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా.

జ

జన్మానికో శివరాత్రి.

జయాపజయాలు దైవాధీనం.

పుర్రెకోబుద్ధి జిహ్వకో రుచి.

జీవితంలో అదృష్టం ఒక్కసారే తలుపు కొడుతుందిట.

జీవితం వడ్డించిన విస్తరి కాదు.

జీవితంలో ఆటుపోట్లు తప్పవు.

జీవితం నీటిబుడగలాంటిది.

జోగిజోగి రాసుకుంటే బూడిద రాలిందట.

డ

డబ్బిచ్చి తద్దినం కొనుకున్నట్లు...

త

తనకు దూర కంతలేదు మెడకో డోలు.

తగుదునమ్మాయని తగూతెచ్చాడు.

తనకు లేదని ఏడిస్తే ఒక కన్ను పోయిందిట, ఎదుటివాడికి వున్నదని ఏడిస్తే రెండు కళ్ళూ పోతాయి.

తన బంగారం మంచిదయితే, కంసాలి వానిననే పనేమిటి.

తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం.

తంతే బూర్ల బుట్టలో పడ్డట్టు.

తమలపాకుతో నువ్వొకటంటే తలుపు చెక్కతో నే రెండంటా.

తక్కువ నోము నోచి ఎక్కువ ఫలితం రమ్మంటే వస్తుందా.

తలలు బోడులైన తలపులు బోడులా

తలచినప్పుడే తాత పెళ్ళి.

తలదాచుకోనిస్తే కాళ్ళు జాపారుట.

తల్లి చస్తే తండ్రి పినతండ్రితో సమానం.

తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిందిట.

తాటిచెట్టు కింద పాలు తాగినా కల్లే అంటారు.

తాడి తన్నేవాడి తలదన్నేవాడొకడు.

తాడు బొంగరం లేని బ్రతుకు.

తాడిచెట్టు ఎందుకెక్కావురా అంటే దూడ మేత కోసం...

తాతల నాడు నేతులు తాగాము, మా మూతులు వాసన చూడమన్నారట.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది.

తామునిగింది గంగ తావలచింది రంభ.

తామరాకు మీద నీటిబొట్టు.

తాబట్టిన కుందేటికి మూడేకాళ్లు.

తాటాకు చప్పుళ్ళకు కుందేలు బెదురుతుందా.

తినే కూట్లో పారే నీట్లో ఉమ్మేసే రకం.

తినబోతూ రుచి అడిగారుట.

తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి.

తిండికి తిమ్మరాజు పనికి పోతురాజు.

తిమ్మిని బ్రహ్మి చేస్తారు.

తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోవు.

తిలా పాపం తలా పిడికెడు.

తీగ కదిలిస్తే డొంకంతా కదిలిందిట.

తుమ్మితే వున్న ముక్కు వూడిందిట.

తెగే దాక లాగారుట.

తెలిసి ముట్టుకున్నా తెలియక ముట్టుకున్నా నిప్పు కాలుతుంది.

తోక తొక్కిన తాచులా...

ద

దరిద్రుడు తల కడిగితే వడగళ్ళ వాన కురిసిందట.

దంపినమ్మకు బొక్కిందే కూలి.

దాగబోయిన చోటా దయ్యాలే.

దాచుకున్నమ్మకు దోచుకున్న వాడే దిక్కు.

దాసుని తప్పు దండంతో సరి.

దిక్కులేని వాడికి దేముడే దిక్కు.

దిగితే గాని లోతు తెలియదు.

దిన దినగండం నూరేళ్ళాయుష్షు.

దింపుడు కళ్లాల ఆశ.

దివిటీ ముందు దీపంలా.

దీపం మనదని ముద్దెట్టుకుంటే మూతి మీసం తెగకాలిందిట.

దీపం చుట్టూ పురుగులు చేరుతయ్యి.

దున్నపోతు మీద వాన కురిసినట్లే.

దూరపు కొండలు నునుపు.

దేముడు వరమిచ్చినా పూజారి వరమియ్యడు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు.

దొరికితే దొంగలు దొరక్కపోతే దొరలు.

దైవం మానుష రూపేణా.

న

నక్కను తొక్కి వచ్చాడు.

నక్క ఎక్కడ నాకలోకమెక్కడ.

నన్ను ముట్టకే నామాల కాకియని.

నందోరాజా భవిష్యతి.

నమ్మి చెడినవారు లేరు.

నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైందట.

నరంలేని నాలుక నాలుగు విధాల మాట్లాడుతుంది.

నరుడి దృష్టికి నల్లరాయి పగులుతుంది.

నలుగురితో పాటు నారాయణ, సభతో పాటు గోవింద.

నలుగురూ నడిచిందే బాట.

నవ్వీన నాపచేను పండదా.

నవ్వు నాలుగు విధాల చేటు.

నీ చేతి మాత్ర వైకుంఠ యాత్ర.

నానాటికీ తీసికట్టు నాగంభొట్లు.

నారుపోసిన వాడు నీరు పొయ్యడా.

నిండుకుండ తొణకదు.

నిండా మునిగిన వానికి చలేమిటి.

నిజమాడితే నిష్ఠూరం.

నిజం నిలకడ మీద తెలుస్తుంది.

నిప్పులేనిదే పొగ రాదు.

నివురుగప్పిన నిప్పు.

నీటిలో పడ్డవానికి గడ్డి పరకైనా...

నీరు పల్లమెరుగు నిజము దేముడెరుగు.

నేతిబీరకాయలో నేయి ఎంతో...

నోటితో మాట్లాడుతూ నొసలుతో వెక్కిరిస్తారు.

నోట్లో నువ్వు గింజ నానదు.

నోట్లో వేలు పెడితే కరవలేదు.

నోరు గలవాడిదే రాజ్యం.

నా నోరు ముయ్యగలవుకాని, లోకం నోరు ముయ్యగలవా.

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది.

ప

పక్కలో బల్లెం

పగటి మాటలు పనికి చేటు రాత్రి మాటలు నిద్రకు చేటు.

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు.

పండిత పుత్ర: పరమ శుంఠ:.

పడ్డవారెప్పుడు చెడ్డవారు కాదు.

పడిశం భారం పదిపెట్ల రోగం.

పందిరి గుంజకు పని చెప్పారుట.

పదుగురాడు మాట పాటియై ధరచెల్లు.

పరమానందయ్య శిష్యుల్లా...

పరనింద-ఆత్మస్తుతి.

పరుగెత్తి పాలుతాగే కంటే నిలుచుని నీళ్లు తాగమన్నారు.

పరోపకారార్థ ఇదం శరీరం.

పసిపిల్లలు దేమునితో సమానం.

పాడిందే పాదరా పాచిపళ్ళ దాసరి.

పాత్ర నెరిగి దానం చెయ్యాలి.

పానకంలో పుడకలా.

పాముకి పాలుపోసినా విషమే కక్కుతుంది.

పాముకు పాలు పోసి పెంచినట్లు.

పాపీ చిరాయుః

పిచ్చివాడికి లోకమంతా పిచ్చే.

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం.

పిట్ట కొంచెము కూత ఘనము.

పిడుక్కి బియ్యానికి ఒకటే మంత్రం.

పిండి కొద్దీ రొట్టె.

పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం.

పిల్లి కళ్ళు మూసుకుపాలు తాగుతూ తన్ను ఎవరూ చూడలేదందిట.

పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చిందిట.

పిల్లికి బిచ్చం పెట్టదు.

పిల్లికి ఎలుక సాక్షి.

పుణ్యానికి పోతే పాపం ఎదురయిందిట.

పుట్టెకు పుట్టిన బుద్ధి పుడుకలతో సరి.

పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు

పులి కడుపున మేక పుడుతుందా.

పూజకొద్దీ పురుషుడు దానంకొద్దీ బిడ్డలు.

పూలమ్మిన ఊర్లో కట్టెలమ్మారుట.

పెట్టనమ్మ పెట్టనే పెట్టదు – పెట్టేయమ్మకేం పెద్ద రోగం.

పెట్టిన చేయే నరికారుట.

పెడతారంటే ఆశ కొడతారంటే భయం.

పెద్దల మాట చద్దిమూట.

పెద్దవాళ్ళ చావు పెళ్లితో సమానం.

పెద్ద వాళ్ళ తిట్లు దీవెనతో సమానం.

పెళ్ళాం బెల్లం తల్లి దయ్యం.

పెళ్ళాం జేబులు వెతికితే, తల్లి కడుపు తడుముతుందిట.

పెళ్ళికెళ్తూ పిల్లిని చంకనెట్టుకెళ్లాడట.

పెరటి చెట్టు మందుకు పనికిరాదు.

పేదవాని కోపం పెదవికి చేటు.

పేనుకు పెత్తనమిస్తే తలంతా తెగ గొరిగిందిట.

పేరు గొప్ప ఊరు దిబ్బ.

పైన పటారం లోన లొటారం.

పొట్టివానికి పుట్టెడు బుద్ధులు.

పొరుగింటి పుల్లకూర రుచి.

పోయింది పొల్లు వున్నది గట్టి.
పోరు నష్టం పొందు లాభం.

బ

బాలవాక్కు బ్రహ్మవాక్కు.
బతికుంటె బలుసాకయినా తినవచ్చు.
బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు.
బ్రహ్మచారీ శతమర్కటః
బూడిదలో పోసిన పన్నీరు.
బుట్టలో పెట్టి సంతలో అమ్ముకొస్తుంది.
బెల్లం వున్న చోటే చీమలు.

మ

మనిషికొక మాట గొడ్డుకొక దెబ్బ.
మకుటం లేని మహారాజులా.
మంత్రసాని తనం ఒప్పుకున్న తరువాత బిడ్డయినా పట్టాలి గెడ్డయినా...
మంత్రాలకు చింతకాయలు రాలుతయ్యా.
మతి లేనమ్మకు గతిలేని మొగుడు.
మనసుంటె మార్గముండదా.
మన్ను తిన్న పాములా.
మా ఇంటికొస్తే ఏం తెస్తావు, మీ ఇంటికొస్తే ఏమిస్తావు.
మాటలు కోటలు దాటినా కాలు గడప దాటదు.
మాంసము తింటున్నామని బొమికలు మెడలో వేసుకుంటారా.
మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె.
మిన్ను విరిగి మీద పడ్డట్టు.
కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు.
ముచ్చట తీరింతరువాత మొగుడు ముండాకొడుకు.
ముందు నుయ్యి, వెనుక గొయ్యి.

ముందున్నది ముసళ్ళ పండుగ.

ముదిమికి ముచ్చటలావు.

ముందు వచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి.

ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించారు.

మూడు పూలు ఆరుకాయలు.

మూలిగే నక్కమీద తాటి పండు పడ్డదిట.

మెత్తని వాళ్ళను చూస్తే మొత్తబుద్ధి వేస్తుందని.

మెరిసేదంతా బంగారం కాదు.

మెచ్చి మేకతోలు కప్పుతారా.

మేక కసాయివానినే నమ్ముతుంది.

మేనత్త కొడుకూ ఒక మొగుడేనా...

మొగమాటానికి పోతే కడుపయిందిట.

మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కిందిట.

మొగుడు కొట్టినందుకు కాదు, తోటికోడలు నవ్వినందుకు.

మౌనం అఅర్థాంగీకారం.

య

యజమానికి బుద్ధి లేకపోతే, కుక్క కూడా పాఠాలు చెబుతుంది.

యథారాజా తథా ప్రజా.

యద్భావం తద్భవతి.

ర

రాచపీనుగు తోడు లేకుండా కదలదు.

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా.

రాజుల సొమ్ము రాళ్ళపాలు.

రామాయణంలో పిడకల వేట.

రామాయణమంతా విని రాముడు సీతకేమవుతాడు అన్నారుట.

రాసి పెడితే బ్రహ్మదేముడయినా తప్పించలేడు.

రాజుగారికి ఆగ్రహమొచ్చినా, అనుగ్రహమొచ్చినా...

రక్షించేవాడే భక్షించాడని...

రెక్కాడితే గాని డొక్కాడదు.

రెండింటికి చెడ్డ రేవడి.

రెండు చేతులు కలిస్తే గాని చప్పట్లు రావు.

రొట్టెల వాని పని కంటె ముక్కల వాని పని మేలు.

రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు.

రోగీ పాలేకోరాడు, వైద్యుడూ పాలే ఇమ్మన్నాడు.

రోజూ చచ్చేవాడికోసం ఏడ్చేదెవరు.

రోట్లో తలదూర్చి, రోకటి పోటుకు వెరిచినట్లు.

రోలు వెళ్లి మద్దెలతో మొరపెట్టుకుందిట.

రౌతు మెత్తని వాడయితే గుఱ్ఱము మూడుకాళ్ళమీద నడుస్తుందిట.

రౌతు కొద్దీ గుఱ్ఱం.

ల

లక్కవంటి తల్లి రాయంటి బిడ్డ.

లంఖణం పరమౌషధం.

లేడికి లేచిందే పరుగు.

లేనిదాతకంటె ఉన్న లోభి మేలు.

వ

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి.

వడ్లగింజలో బియ్యం గింజ

వ్రతం చెడ్డా ఫలం దక్కాలి.

వరదలో కొట్టుకుపోయేవాడికి, గడ్డిపోచ దొరికినా...

వసుదేవుడు గాడిద కాళ్లు పట్టుకున్నాడుట.

వాన రాకడ ప్రాణం పోకడ.

విగ్రహం పుష్టి విద్య నష్టి.

విఘ్నేశ్వరుడి పెండ్లికి వెయ్యి విఘ్నాలు.

వియ్యమయినా కయ్యమయినా సమంగా వుండాలి.

విసన్న చెప్పింది వేదం.

వివాహే విద్య నాశాయ.

ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చింది.

వెదకబోయిన తీగ కాళ్ళకు చుట్టుకుందిట.

వెన్నతో పెట్టిన విద్య.

వెయ్యిళ్ళ పూజారి.

వెయ్యి అబద్ధాలాడయినా ఒక పెళ్ళి చేయమన్నారు.

వెఱ్ఱి వేయి విధాలు.

శ

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

శంఖంలో పోస్తే కాని తీర్థం కాదు.

శుభస్య శీఘ్రం

శరీర మాద్యం ఖలు ధర్మసాధనం.

శివునాజ్ఞలేనిదే చీమయినా కుట్టదు.

స

సత్రం భోజనం మఠం నిద్ర

సంగీతానికి నేను, చక్కదనానికి మా బావ.

సంతోషం సగం బలం.

సరసానికయినా విరసానికయినా సమవుజ్జీ కావాలి.

సీతాపతి చాపే గతి.

సూక్ష్మంలో మోక్షం.

క్ష

క్షేమంగా పోయి లాభంగా రా.

రచయిత గురించి....

పాత్రికేయునిగా, అనువాదకునిగా, ఉత్తమ ప్రజాసంబంధాల అధికారిగా, ఆకాశవాణి న్యూస్ రీడర్‌గా చేపట్టిన అన్ని రంగాల్లో ప్రతిభావంతునిగా పేరుతెచ్చుకున్న డా.జె. చెన్నయ్య 1958 జనవరి 8న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కావేరమ్మపేటలో జన్మించారు. కష్టపడి చదువుకొని పైకి రావాలనుకున్న వారికి పేదరికం, గ్రామీణ నేపథ్యం వంటివేవీ అవరోధం కాదని నిరూపించిన వ్యక్తి. 'ఈనాడు' దినపత్రికలో పదేళ్ళపాటు విలేకరిగా పనిచేసి ఆ తర్వాత 1990 నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రజాసంబంధాల అధికారిగా పనిచేస్తున్నారు. పి.ఆర్.ఒ.గానే గాక విస్తరణ సేవా విభాగం ఇన్‌ఛార్జిగా, మ్యూజియం ఇన్‌ఛార్జిగా తనకు అప్పగించిన ప్రతి పనినీ శ్రద్ధాసక్తులతో నిర్వహించి తనదైన ముద్రవేశారు. సాహిత్య, సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన, శిల్ప కళలు, జానపద కళారంగాల్లోని తెలుగు ప్రముఖుల పరిచయ ప్రశంసలు రాయడంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. సుమారు 1000 మంది ప్రముఖుల పరిచయాలను రచించారు. 1980 నుంచి ఆకాశవాణిలో కవితలు, కథానికలు, రూపకాలు రాయడం, క్యాజువల్ ఎనౌన్సర్‌గా వాటిని చదవడం, రికార్డు చేయడం, ప్రసారం చేయడంలో అనుభవం గడించారు. 1992 నుంచి క్యాజువల్ న్యూస్ రీడర్‌గా ప్రాంతీయ, జాతీయ వార్తలను అనువదించడంలో, చదవడంలో సమానమైన ప్రజ్ఞను, తనదైన శైలినీ కనబరుస్తున్నారు. వార్తాపఠనంలో స్పష్టతకు పేరు పొందారు. అంతేగాక రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్‌ల ప్రసంగాలను ఆకాశవాణి కోసం అనువదించి చదవడంలో కూడా పేరు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., పిహెచ్.డి. చేశారు. 'తెలుగు దినపత్రికలు – భాషాసాహిత్య స్వరూపం' అనే పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.సి.జె., ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి అనువాదంలో పి.జి.డిప్లమా పూర్తి చేశారు. అనువాదకునిగా తమిళనాడు గవర్నర్ సుర్జిత్‌సింగ్ బర్నాల ఆంగ్లంలో రచించిన 'క్వెస్ట్ ఫర్ ఫ్రీడమ్ స్టోరీ ఆఫ్ ఎన్ ఎస్కేప్' అనే గ్రంథాన్ని 'స్వేచ్ఛకోసం

– ఒక విహంగయాత్ర' పేరిట తెలుగులోకి అనువదించారు. చల్లపల్లి రైతాంగ పోరాటయోధుడు కావూరి కుటుంబరావు జీవిత చరిత్ర రచించారు. 'హిందూ' దినపత్రిక డిప్యూటీ ఎడిటర్ ఆర్.జె.రాజేంద్రప్రసాద్ ఆంగ్లంలో రాసిన 'ఎమర్జెన్స్ ఆఫ్ తెలుగుదేశం' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి కోసం పంజాబీ రచయిత దలీప్ కౌర్ తివానా రచించిన 'ట్విలైట్' నవలికను 'సంధ్యారాగం' పేరుతోనూ, 'మార్క్ ఆఫ్ డైమండ్ నోస్ రింగ్'ను 'వజ్రపు ముక్కుపుడక' పేరుతోనూ తెలుగులోకి అనువదించారు. 'ఇన్ ది సర్వీస్ ఆఫ్ ది నేషన్ మెమైర్స్ ఆఫ్ జనరల్ కె.వి. కృష్ణారావు' అనే గ్రంథాన్ని 'దేశసేవలో... జనరల్ కె.వి.కృష్ణారావు జ్ఞాపకాలు' పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం తెలుగులోకి అనువదింపజేసి ముద్రించింది. దీన్ని అనువదించిన నలుగురు అనువాదకుల్లో డా.చెన్నయ్య ఒకరు. ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త కార్యదర్శిగా, ట్రస్టు సభ్యులుగా వున్నారు. సిలికానాంధ్ర కార్యదర్శిగా వున్నారు. సంస్థ అమెరికాలో నిర్వహించిన మొదటి 'అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం'లో వ్యాఖ్యాతగా పాల్గొన్నారు. వీరికి లభించిన గౌరవాల్లో చెప్పుకోదగినవి. 1.పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పి.ఆర్.ఎస్.ఐ) వారినుంచి డా॥ సి.వి.నరసింహారెడ్డి బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ అవార్డు 2.పి.ఆర్.ఎస్.ఐ. ఆలిండియా అవార్డు, 3.పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి స్మారక బెస్ట్ న్యూస్ రీడర్ అవార్డు 4.తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ అనువాద సాహితీ పురస్కారం 5.అధికార భాషా సంఘం పురస్కారం 6.ఆరాధన ఆకాశవాణి పురస్కారం 7.హృదయభారతి విశిష్ట పురస్కారం 8.శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ ఉత్తమ ప్రజా సంబంధాల అధికారి అవార్డు వంటివి.

చిన్మయుండు –వేత్త – చెన్నయ్య – మేధావి
చాటి చెప్ప నిజము జంకకుండ
గుర్తుపట్టు ప్రతిభ – గుండె పంపిన వ్యక్తి
ప్రగతిశీలి ఈ ప్రపంచమందు

– డా॥ నందూరి రామకృష్ణమాచార్య



GREAT REASONS TO SAVE WITH SBH

OPEN A SAVINGS BANK ACCOUNT AND GET THE SBH ADVANTAGE.

- FREE EMAIL ACCOUNT STATEMENT
- FREE SMS ALERTS
- FREE INTERNET BANKING
- FREE DEBIT/ATM CARD
- FREE MOBILE BANKING

and many more!

For details sms FEEDBACK to 9000 222 444

SBH
State Bank of Hyderabad

Modern
Innovative
Dependable

www.sbhyd.com Call: 1800 425 4055

*Conditions apply.

Earn more with
interest on daily